మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.7.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




ఝూన్సీ రణం




మాసపత్రిక, ఆగష్టు, 2025 ₹ 50/-

ISSN 2454–4329



బుద్ధం శరణం



సంఘం శరణం

# మిసిమి

మాసపత్రిక
**సంపుటి 36 సంచిక 8**

**ఆగష్టు - 2025**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

LCCN 91-903060

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com
Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఆగస్టు నెల సూచికలు...


బహుముఖ బెనారస్ పుస్తకావిష్కరణ : సి.ఎస్. రాంబాబు ... 3
జీవన మకరందం : డా. నార్ల వెంకటేశ్వర రావు ... 6
బలహీనతలే బ్రహ్మాస్త్రం : డా. అవధానం రఘుకుమార్ ... 8
బృహదారణ్యకోపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 13
లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 18
అజేయ శక్తి : ఆచార్య పి.ఆర్. హరినాథ్ ... 21
రాజాంప్రాంత శాసనాలు-శిల్పాలు : గార రంగనాథం ... 23
నాటక పితామహ - శ్రీ పతివాడ : **మిసిమి** ... 26
లండన్ నాటక శాలలు : టి.వి. ప్రసాద్ ... 33
పల్లె ఆటల ప్రశస్తి : ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు ... 42
ఆపరేషన్ సింధూర్ : వల్లభనేని అశ్వినీకుమార్ ... 49
పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీరు : వేలూరి కృష్ణమూర్తి ... 51
వయొలిన్ విద్వాన్-ద్వారం దుర్గాప్రసాద రావు : **మిసిమి** ... ... 53
బుచ్చిబాబు కథలు - భాష : భమిడిపాటి గౌరీశంకర్ ... 62
వానపిల్ల-మిషన్ అనువాదం : ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, డా.కె.రేవతి ... 64
ఇళయరస నేందల్ సంస్థానం : డా. సగిలి సుధారాణి ... 67
బుద్ధుని తాత్త్వికత : ఆలూరి ఉషారాణి ... 70
జంగాల శాస్త్రి : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల ... 73
అలవాటైపోతున్న : సమీక్ష ... 75
పల్లవించిన తెనుగు పాట : సమీక్ష ... 76
కథాహృదయం : వి. రాజారామమోహన రావు ... 78
చదవండి : **మిసిమి** ... 79




పతివాడ సూర్యనారాయణ



ద్వారం దుర్గాప్రసాద రావు

### అట్టమీది బొమ్మలు



సింధూరణం
.. 49


బుద్ధం శరణం


సంఘం శరణం


ఝాన్సీ రణం

# బహుముఖ బెనారస్ పుస్తకావిష్కరణ

**కొ**న్ని సందర్భాలు గుర్తుండిపోయేలా ఉంటాయి. జరిగిన ఆలస్యానికి జరిమానా చెల్లించినట్లు ఒక జ్ఞాపకాన్ని పదిలం చేస్తాయి. అలాంటి సందర్భమే కిల్లాడ సత్యనారాయణ గారి బహుముఖ బెనారస్ పుస్తకావిష్కరణ సభ. నిజానికి ఈ పుస్తకావిష్కరణ జనవరిలో జరగవలసి ఉన్నది. సత్యనారాయణగారు కుంభమేళా ఏర్పాట్లలో ఊపరి సలపనంత బిజీ అయిపోవడంతో వాయిదా పడింది.

అంతా మన మంచికే అన్నట్లు జూన్ 28వ తేదీన భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు గారి చేతుల మీదుగా హైదరాబాద్‌లోని దసపల్లా హొటల్లో కన్నుల పండువగా జరిగింది. ఆ ఆవిష్కరణ ఎంత బాగా జరిగిందంటే చాలా మంది ప్రముఖులు ఈ బహుముఖ బెనారస్ పుస్తకం ఎక్కడ దొరుకుతుందని అడగటం, మాకో కాపీ ఉంచుతారా అనేంతగా! అందుకే దేనికైనా సమయం సందర్భం రావాలంటారు.. అదిగో ఆ సందర్భం రానేవచ్చింది..


శ్రీమాన్ ముప్పవరపు వెంకయ్య నాయుడు

దారులన్నీ దసపల్లాకే అన్నట్టు పదకొండు గంటలకు సాహిత్యాభిమాను లందరూ సభాస్థలి దేవరాయ హాల్‌కు చేరుకోగా ముందుగా ప్రకటించినట్లు ఠంచనుగా 11గంటలకు అతిథులందరినీ వేదికపైకి ఆహ్వానించారు నిర్వాహకులు. అతిథులను సత్–శాలువతో–పుష్పగుచ్ఛంతో సత్కరించారు అశ్వినికుమార్. సి.యస్.రాంబాబు ఒకొక్కరి గురించి పరిచయ వాక్యాలు పలికిన అనంతరం రచయిత కిల్లాడ సత్యనారాయణ, బెనారస్ పుస్తకం రాయటానికి కలిగిన ప్రేరణను సభికులకు తెలియపరిచారు. ఆ కాశీ విశ్వనాథుడే తనను బెనారస్ గురించి రాయమని ఆజ్ఞాపించినట్లు భావించానని, అందుకోసం వీధి వీధి తిరిగి కాశీ గురించి ప్రత్యేకతలను తెలుగువారికి పరిచయం చేశానని, ఆ వ్యాసాలన్నీ **మిసిమి** నెలనెలా ప్రచురించి వాటికి నిండుదనం తెచ్చిందన్నారు.

సభాధ్యక్షులు, భారత ఉపరాష్ట్రపతి శ్రీమాన్ ముప్పవరపు వెంకయ్యానాయుడు గారి ప్రసంగం కోసం అందరూ ఎదురు చూస్తుండగా తన గంభీరమైన గళంతో ప్రసంగాన్ని మొదలుపెట్టారు వెంకయ్యానాయుడు గారు. బహుముఖ బెనారస్ పుస్తకం మనకు బహువిధాలుగా ప్రేరణ కలిగిస్తుందన్నారు. యావత్ ప్రపంచంలోనే కాశీ వంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మరొకటి లేదని, మనకు అనేక గొప్ప నగరాలున్నాయని, ఆ నగరాల మీద ఇటువంటి పుస్తకాలు రావలసి ఉందని ఉద్ఘాటించారు. బ్రిటిష్ వారు వక్రీకరించిన చరిత్రను ఇప్పటికి సరిదిద్దుకోగలుగుతున్నామని, భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని ఇప్పటి తరం అర్థం చేసుకోవాలని ఆకాంక్షించారు..



ఎ.కె ; రాంబాబు ; ప్రొ. పార్థసారథి ; కిల్లాడ ;
శ్రీ వెంకయ్య నాయుడు ; మృణాళిని, వోలేటి

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం అధ్యక్షులు డా.సి.మృణాళిని బహుముఖ బెనారస్ పుస్తకం ముఖ్య అంశాలను తనదైన శైలిలో విశ్లేషించి, కాశీ అన్ని

మతాల ఆనవాళ్ళను కలిగి ఉండటం ఈ నగర సంస్కృతిని మరింత పటిష్టపరిచిందన్నారు. తెలుగువారికి శ్రీనాధుని కాశీ ఖండం నుంచి, ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర వరకు ఏదో ఒక రూపంలో కాశీ చరిత్ర అందుతూనే వచ్చిందన్నారు.


దూరదర్శన్ పూర్వ కార్యక్రమ నిర్వహణాధికారి, వ్యాఖ్యాత శ్రీ వోలేటి పార్వతీశం మాటల్లో చెప్పాలంటే కాశీతో తెలుగువారికి విడదీయరాని బంధం ఉందని. బలిజేపల్లి వారి సత్య హరిశ్చంద్ర నాటక పద్యాల్లో 'భక్తియోగ పదన్యాసి వారణాసి' అనే పద్యం ప్రతి తెలుగువాడి గుండెల్లో నిలిచిపోయిందని గుర్తుచేశారు.



రచయిత శ్రీ కిల్లాడ సత్యనారాయణ

ప్రొఫెసర్ పార్థసారథి మనకు మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీ మజిలీ కథలున్నాయని, అందుకే అందరికన్నా ఎక్కువగా తెలుగువారికి కాశీతో అనుబంధం ఉన్నదన్నారు..

**మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ మాట్లాడుతూ బహుముఖ బెనారస్ పుస్తకం, వ్యాసాల రూపంలో ప్రచురింపబడినప్పుడే ఎంతో ఉత్కంఠతను రేపాయన్నారు. నలదమయంతుల వృత్తాంతాన్ని ప్రస్తావిస్తూ మహాభారత కాలం కన్నా ముందరనుంచి కాశీ నగరం తన ఉనికిని కలిగి ఉందన్నారు. కాశీ భారతదేశానికి ఆత్మ వంటిదని – మీరూ ఒక్కసారి వెళ్లిరండి – తేజోమతులవుతారని సభికులనుద్దేశించి అన్నారు.




కాశీ అని కాకుండా బహుముఖ బెనారస్ అని పేరెందుకు పెట్టారు ఈ పుస్తకానికి అని చాలామంది సందేహపడ్డారు ఆరోజున.. కాశీ అంటే ఒక ఆధ్యాత్మికత మాత్రమే గుర్తొస్తుందని, కాశీ యొక్క సాంస్కృతిక స్వరూపమే బెనారస్ అని పేర్కొన్నారు కిల్లాడ వారు. కాశీ నగరం నవరసాల సమ్మేళనం బెనారస్ అని, అందుకే ఆ పేరు ఎంచుకున్నానని విశదీకరించారు..

ఏమైనప్పటికీ కాశీ నగరం బహుముఖ పార్శ్వాలను బహుబాగుగా వివరించి భాషాభిమానులను, సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నారు ఆనాటి సభాధ్యక్షులు, భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు గారు, వారితో పాటు మిగిలిన వక్తలు..

**బహుముఖ బెనారస్** పుస్తకావిష్కరణ సభ ఇంత వైభవంగా జరగటానికి ముఖ్య కారణం రచయితలను ప్రోత్సహించటం అనే ఒరవడి సృష్టించిన **మిసిమి** వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ గారి సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న కళాజ్యోతి ప్రెస్ యాజమాన్యం తరపున ఆలపాటి బాపన్న గారు ఒకరైతే, రక్షణరంగానికై పరిశ్రమ నడుపుతున్న దొంతినేని విద్యాసాగర్ గారు మరొకరు. ఇరువురు కూడా తెరవెనుక ఉండి అంత ఘనంగా సభను ఏర్పాటు చేయటమే కాదు సభానంతరం సభికులందరికీ షడ్రసోపేతమైన విందును నిర్వహించి తమ ఆనందాన్ని తెలియజేసారు. అలా ఈ మధ్య జరిగిన సభల్లో ఓ కొత్త ఒరవడిని సృష్టించగలిగింది **మిసిమి** నిర్వహించిన **బహుముఖ బెనారస్** ఆవిష్కరణ సభ.

*- సి.యస్. రాంబాబు*

## క్యాబ్ కతలు

ఆరోజు కేబ్ రావటానికి ఆలస్యమవుతుందని ఆటో పిలిచాను – రాపిడోలో – ఇరవై ఏళ్లుంటాయేమో – ఇప్పుడు పేరు గుర్తు లేదు. కొంతదూరం వెళ్లిన తర్వాత గమనించాను – అతను చాలా బాధతో వున్నాడు – చేతులు ముందు అద్దానికి కొట్టుకుంటున్నాడు – పెద్దగా కేకల్లాంటివి పెడుతున్నాడు – ఆపమన్నాను. ఏమటని అడిగాను – ఎడమ చేయి లాగేస్తుందని – చాలా నొప్పిగా భరించలేకపోతున్నాను అన్నాడు – వెంటనే ఏదయినా ఆసుపత్రికి వెళ్లమన్నాను– డబ్బు లేకపోతే నేనిస్తాననీ చెప్పాను. అతను, మిమ్మల్ని దింపి వెళ్తానన్నాడు – కాని బాధతో మెలికలు తిరుగుతున్నాడు – మెట్రో స్టేషన్ దగ్గర దిగి – మళ్లీ చెప్పాను వెంటనే డాక్టర్ దగ్గరకి వెళ్లమని – అయిదు వందలిచ్చాను – అతనికి గుండెనొప్పి వచ్చిందని ఖచ్చితంగా చెప్పగలను.

– – – –

నిన్న కాబ్ ఎక్కాను – లాంకోహిల్స్ దగ్గర్నుంచి – ఆశ్రమానికి – నేను ఎప్పుడూ ముందు కూర్చుంటాను. కారులో ఎ.సి. లేదు ఓ.కె. – బైట చల్లగానే వుంది. అద్దాలు దింపాను – డ్రైవర్‌కి రెండు ఫోన్లు ఉన్నాయి – ఒకటి దారి చూపటానికి – రెండు మాట్లాడటానికి – 20 నిమిషాల రైడ్‌లో ఇరవయి నిమిషాలు మాట్లాడుతూనే వున్నాడు. ఏమి మాట్లాడుతున్నాడో శ్రద్ధగా విన్నాను – అతను ఆన్‌లైన్ క్లాసులు చెప్తున్నాడు – అవతలి ప్రశ్నలకు స్పష్టంగా సమాధానం రిపీట్ చేస్తున్నాడు – ఏదో కంప్యూటర్ సంబంధించింది – ఒకసారి పొయిట్రీ స్పష్టంగా చదువుతున్నాడు – ఒక్కసారి అవతలి స్టూడెంటుని మందలించి – రిపీట్ చేస్తున్నాడు – స్టడీ – ప్రాక్టీస్ అని అంటున్నాడు – అయితే ఈలోపు రెండు చిన్న ప్రమాదాలు తప్పినాయి. ఎక్కడా సిగ్నల్ జంప్ చేయలేదు – నేను దిగి – స్కాన్ చేసి ఫేర్ ఇస్తున్నా – ఫోన్ మాట్లాడుతూనే ఉన్నాడు – 'నీకు థాంక్స్ చెప్పను – రేటింగ్ ఇవ్వను – ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయటం నేరం – అయామ్ సారీ' అని ఖచ్చితంగా 209 మాత్రమే ఇచ్చి దిగిపోయాను.

– – – –

ఇది కూడా వినండి – నిన్న క్యాబ్ గంటకు పైగా రాలేదు – వచ్చినవాడు రమేష్ – డిజైర్ – ముందే కూర్చున్నాను – ఎ.సి. బాగానే ఉంది – ఓ.టి.పి. చెప్పాను – రూట్ పెట్టాడు – అతని ముఖం చూసాను – చాలా చిరాగ్గా ఉన్నాడు– సరే పావుగంటే కదా భరిద్దామనుకున్నాను – అతను నాకాశ్రమ తప్పించాడు – అతనికి ఫోన్ వచ్చింది– ఆ తరువాత కాస్త దూరం వెళ్లి కారు ఆపాడు – గేరు వేసి ముందుకు వెనక్కి – ఆ తరువాత బానెట్ తీసి, చూసి వచ్చి మళ్లీ అదే తంతు. నాకంతా తెలుస్తూనే ఉంది. సార్! కార్ ట్రబుల్ – ట్రిప్ క్లోజ్ చేస్తున్నా అన్నాడు – నేను ఎందుకు? ఏమిటి? అని అడగలేదు – దిగిపోయాను. అతను మామూలుగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయాడు. ఆ తరువాత హైటెక్ సిటీకి చేరాను – అతనికి వచ్చిన ఫోన్ ఎక్కడినుంచో? విషయమేమిటో? అయితే ఈ విధంగా ఎప్పుడూ జరుగలేదు – ఇలాంటి క్యాబ్ కథలు చాలానే ఉన్నాయి. మీకు కొన్నే చెప్తున్నాను.


---

**వెన్నెల గింజలు - కవితా సంపుటి - చిట్టిప్రోలు సుబ్బారావు :** ఇందులో అధికభాగం రచయిత లోనైన పరిస్థితులు, చూసిన సన్నివేశాలు, ప్రదేశాలు, ఆయన చదివిన పుస్తకాల్లో పాత్రల వలన కలిగిన కదలికలు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి – ఆ విధంగా రచయిత ఈ వచన కవితలు రాసి ప్రపంచం మీదకి వదిలారు. అయితే ఎవరనుభవం వారిది. ఇవి చదివితే ఆయన చెందిన అనుభూతిని మనం పొందాలని, పొందుతామని గ్యారంటీ ఏమీ లేదు.

*కుండీల్లో మొక్కల్లా*
*వామనీకృత అలంకారాల్లా*
*చూరుకు వేలాడుతున్నాయి*
*మనుషుల భావాలు*
*స్వేచ్ఛనివ్వండి వాటికి*
*నేలను నిలబెట్టే అరణ్యాలవుతాయి*

వచన కవిత్వం నిరాకార చిత్రం లాంటిది.
రంగులన్నీ ఉంటాయి, ఆకారమే ఉండదు.

*ఎన్నికల వేటలో*
*పులులే మేకల్ని ఎరవేస్తున్నాయి.*
*కుందేళ్ళు ఎగబడుఉన్నాయి*
*ఎగబడి ఎగబడీ*
*తోడేళ్ళుగా మారుతున్నాయి*



# జీవన మకరందం

- రాళ్లు, రాళ్లే – బురద బురదే – అది సౌందర్యం కానేరదు – రంగులు పూసి – క్రింద సంతకం ఎవరిది వున్నా – అది లీగర్, బ్రోకో లేదా పికాసో అయినా సరే – ఆధునిక అరూప చిత్రకళ – చిత్రకళకే అవమానం –
- ఫ్రాయిడ్ అన్నట్లు – మానవ మస్తిష్కంలో ఎన్నో వికారాలు వున్నట్లు చెత్తా చెదారం కూడా వుంటుంది. అందులో భాగమే ఆధునిక చిత్రకళ. (Abstract Art)
- పిచ్చివాళ్లు నిరాకార చిత్రకళ సృష్టిస్తారు – మూర్ఖులు దానిని మెచ్చుకుంటూ చప్పట్లు కొడతారు.
- సత్యాగ్రహం – గాంధీ జీవితకాలంలో కూడా, సత్యాగ్రహంలో సత్యం తక్కువ – ఆగ్రహం ఎక్కువ.
- అల్పులు ఈ ప్రపంచానికి ఏమీ చేయలేరు. గొప్పవారు – ఎంతో గొప్ప పనులు చేయగలరు – అలాగే ప్రపంచానికి విపరీతమైన హానీ చేయగలరు.
- స్వాతంత్ర్యానికి పూర్వం మన పాలకులు – సూటూ బూటూ వేసుకున్న నాగరక నిరంకుశులు – ఆ తర్వాత వచ్చిన వారు – వికృతమైన, అనాగరక నిరంకుశులు.
- గారాం చేసే తల్లిగాని – ఎక్కువగా ప్రేమించే తండ్రిగాని చాలా బలహీనమైన – పాలకులు – దేశానికి.
- నిన్నెవరైనా మోసం చేస్తే – నీవు పోగొట్టుకున్న దానికంటే – నీ అహం ఎక్కువ దెబ్బతింటుంది.
- పొగిడేవాడి నాలుక – కుక్కతోక లాంటిది.
- ఒకప్పటి ఖాదీ – స్వతంత్ర పోరాటానికి ఒక చిహ్నం. ఇప్పటి ఖాదీ – రాజకీయ వేషం – వారందరితో జాగ్రత్తగా ఉండాలి.
- కాలక్షేపానికి చదివే పుస్తకాలు – కాలాన్ని, నిన్ను హరిస్తాయి.
- ఇప్పటి ప్రభుత్వాలు తోడేళ్లు – నక్కల సహాయంతో గొర్రెల గుంపులను పాలిస్తున్నాయి.
- విశ్రాంతి అంటే – అర్ధవంతమైన – సమర్ధవంతమైన కర్మ ఆచరించటం.
- మతం కోరల్లో చిక్కుకున్న మనిషి – పూర్తి మనిషి కానేరడు.
- మతంలో విశ్వాసమే కాని హేతువు వుండదు.
- మతం నీకు శాశ్వతత్వాన్ని / అమరత్వాన్ని ఆశ, ప్రలోభ పెడుతుంది.
- అవినీతి – కరోనా కంటే త్వరగా వ్యాపించే అంటురోగం.
- అవినీతిమయమైన సమాజంలో న్యాయం నేతి బీరకాయలో నెయ్యి వంటిది.
- ఇప్పటి అవినీతిమయమైన సమాజంలో నిజాయితీ గల పౌరుడు ఒక మూర్ఖుడే.



నార్ల వేంకటేశ్వర రావు

- నీవు చేసిన కర్మ – అది విలువైనది అయితే అదే నీ ప్రమాణం – నీ మాటలు కాదు.
- ఈ జీవితానికి – ప్రపంచానికి చెడ్డవారు కొలమానం కాదు.
- నీకు ఎవరైనా హాని చేస్తే – వాడిగురించి ఎక్కువగా ఆలోచించి – నువ్వు వాడిలాగా మారిపోకు.
- అంతరించిపోతున్న జీవుల్లో – నిజాయితీ గల రాజకీయ నాయకులు కూడా వున్నారు.
- ప్రజాస్వామ్యం – నిజానికి నియంతృత్వాన్ని మించిపోయింది.

- గొప్ప పుస్తకాలు - మీకు గతాన్ని చూపుతాయి - వర్తమానంతో సహజీవనం చేయిస్తాయి - భవిష్యత్తును దర్శింపజేస్తాయి.
- హీరో వర్షిప్ - రాళ్లు రప్పలను పూజించడం కంటే దరిద్రమైనది - మనిషి - పూజింపబడడానికి అలవాటు పడితే - అన్ని రుగ్మతలు అంటుకుంటాయి - గర్వం - మోసం - లెక్కలేనితనం - మొరటు - దైవత్వం - అన్ని అలవర్చుకుని - తాను నిజంగానే దేవుడునని నమ్ముతాడు.
- సినిమాల్లో నేరప్రవృత్తి - హింస - సమాజానికి పాకుతుంది. దొంగగా, హంతకునిగా మారడం, ధర్మంగా జీవించడం కంటే తేలిక.
- ప్రేమరాహిత్యమైన దాంపత్యం విడాకుల తలుపు లేకపోతే ఎలుక బోనె అవుతుంది.
- మతం మనుష్యుల్ని విడదీస్తుంది - సంస్కృతి ఏకం చేస్తుంది.
- విజ్ఞానశాస్త్రం నిన్ను ముందుకు తీసుకెళ్తుంది. మతం గతంలోకి నెట్టివేస్తుంది.
- మతం అభివృద్ధిని వ్యతిరేకిస్తుంది - దాని మూలాలు గతంలో వుంటాయి కాబట్టి.
- మతం-మతపరమైన-సిద్ధాంతపరమైన-కులపరమైన గోడలు మనుష్యుల మధ్య నిర్మిస్తుంది. మానవవాదం-వీటన్నింటినీ కూలగొడుతుంది.
- మరణానంతరం జీవితం ఇంధనం లేని బండిలాంటిది.
- మతాలన్నీ స్వర్గ సుఖాల్ని ఆశపెట్టి కోట్లమందికి సాంత్వన చేకూరుస్తుంది.

***- ఆంగ్లం : డా. నార్ల వెంకటేశ్వర రావు*** ***- తెలుగు - అశ్వినికుమార్***


---

## కమ్మతెమ్మెర

జూన్ **మిసిమి** అందింది. ధన్యవాదాలు.

ముంగర జాషువా గారి అద్భుతమైన "మనిషి మనుగడ"తో మొదలుపెట్టి "పుస్తక స్వీకారం" వరకు ప్రతి అక్షరం చదివి పూర్తి చేశాను ఇప్పుడే. కడుపునిండా భోంచేసిన తృప్తి కలిగింది.

నిమ్మగడ్డ వారితో ఫ్రాన్స్ పర్యటన ఆహ్లాదకరంగా సాగింది. జయశ్రీ గారి తెలుగుసేత అమోఘం.



పాటిబండ్ల ఆనందరావు గారితో ఇంటర్వ్యూ బాగుంది. పడమటి గాలి నాటకం మూడు సార్లు చూశాను. తెలుగు నాటక రంగానికి అదొక మలుపు, కుదుపు. (మీరు రెండుమూడు సార్లు ప్రజా నాట్యమండలి గురించి ప్రస్తావించాల్సినంత scene లేదు దానికి).

లక్ష్మీరెడ్డి గారి ఇంటర్వ్యూ average. ముత్యాల సుబ్బయ్య టి. కృష్ణతో సినిమాలు తీశాడుగాని ఒంగోలులో చదవలేదనుకుంటాను. సుధారాణి గారు బోడినాయకనూరు తెలుగు వారిపై రాసిన వ్యాసం, టి.వి. ప్రసాద్ గారి "నిరసన కళ", నాగరత్న గారి 'విపశ్యన' వ్యాసాలు సమాచారభరితం.

బుచ్చికృష్ణమ్మ గారి గురించిన వివరాలు, జూకంటి జగన్నాథం గారి వేదన మనస్సును కదిలించాయి.

రాసాని నవలా సమీక్ష బాగుంది.

"స్వర్గ పులిహోర" ఏమిటో! ఈ మధురవాణి obsession కొందరికి..

61వ పేజీలో 'చదవండి' అని శీర్షిక పెట్టి, కవితా సంపుటి బాగులేదని చెప్పడం నవ్వు తెప్పించింది

*- ఎమ్.వి.ఎస్. ప్రసాద్, హైదరాబాద్.*



# బలహీనతలే బ్రహ్మాస్త్రం

**డా. అవధానం రఘుకుమార్**

అతనేమీ సర్వశాస్త్ర పారంగతుడు కాదు. అతనేమీ అనంత సైన్యం వున్న చక్రవర్తి కాదు. అతనేమి ఒక మతాధిపతియో, పీఠాధిపతియో కాదు. ఇంగ్లండ్‌లోనో, జర్మనిలోనో ఏ ఆర్థిక శాస్త్రంలోనో, ఏ సామాజిక శాస్త్రాలలోనో లోతుగా అధ్యయనం చేసి, పిహెచ్.డి చేసి, ప్రపంచాన్ని అర్థం చేసుకునే నూతన జ్ఞానాన్ని ఆవిష్కరించిన సిద్ధాంత కర్త కూడా కాదు. అపార అనుచరగణం గల తాత్త్వికుడు కాదు. గొప్ప వక్త కాదు. ప్రజలను ఉద్రేక పూరితమైన మాటలతో రెచ్చగొట్టే శక్తి లేదు. చిన్నగా మాట్లాడతాడు. బారిస్టర్ చేసి ముంబైలో ప్రాక్టీసు మొదలు పెట్టి, కోర్టులో జడ్జ్‌ని, తోటి న్యాయవాదుల వాక్పటిమను చూసి భయపడి, కాళ్ళు వణికి, గొంతు పెగలక ప్రాక్టీసు మానేసిన న్యాయవాది. ఉదర పోషణార్థం చివరికి ఒక చిన్న గుమాస్తా ఉద్యోగానికి రాజీ పడి, అబ్దుల్లా సేథ్ ఇచ్చిన దుబాసీ ఉద్యోగానికి ఆఫ్రికాకు పారిపోయిన అసమర్థుడు.

“నేనేమీ కొత్తవి చెప్పడం లేదు, నేను ప్రయోగాలు చేస్తున్న సత్యం, అహింసలు హిమాలయాలంత పురాతనం అయినవీ” అని వినయంగా చెప్పుకున్నవాడు. అవి కూడా నిరంతరంగా ప్రయోగ స్థాయిలో వున్నవే. జీవితపు చరమాంకంలోనూ “మీకు సత్యం దర్శనం అయ్యిందా?” అని అడిగితే “లేదు, కేవలం అలా క్షణికమైన మెరుపులా మెరిశాయే కానీ, స్పష్టమైన సాక్షాత్కారం కాలేదు” అని నిస్సిగ్గుగా చెప్పుకున్నవాడు. కొంతమంది ఇంగ్లీషు అధికారుల దృష్టిలో బోల్షేవిక్, అత్యంత ప్రమాదకర వ్యక్తి, కొంత మంది ఆ నాటి సాంప్రదాయ భారతీయ మేధావుల, కొంత మంది ఆధునిక రాజకీయ మేధావుల అంచనాలో అరాచక వాది. తనను తాను సనాతనుడిని అని ప్రకటించు కుంటే దాదాపు అందరు సనాతన వాదుల దృష్టిలో మాత్రం అతను సనాతన వ్యతిరేకి. ఆయన కమ్యూనిజం గురించి అవగాహన లేకుండా, అమాయకంగా మాట్లాడాడు అని కమ్యూనిస్టులకు కోపం, గ్రామాలు, చేతి వృత్తులూ అంటూ మాట్లాడాడని క్యాపిటలిస్టులకు కోపం. ఛాందసుడు అని ఆధునికులు, ఫకీర్ అని సాంప్రదాయ వాదులు...ఇంత మందికి ఇన్నిరకాలుగా కనబడ్డ ఈ వ్యక్తి - ఇంతకీ ఎవరీయన? ఈయన తాత్త్వికత ఏమిటి? అసలు ఈయనకు తాత్త్వికత అంటూ ఒకటి వుందా?

భారత దేశపు సాంప్రదాయంలో ఒక వ్యక్తి ఆత్మకథ రాసుకోవడం అనే అలవాటే చాలా తక్కువ. మహనీయుల జీవిత చరిత్రలు మరో వ్యక్తి రాయడం మనకు తెలిసిన సాంప్రదాయం. ఆత్మకథలు రాసుకోవడం ఎక్కువగా పాశ్చాత్యుల సాహిత్య ప్రక్రియ. నిజానికి గాంధీకి సంబంధించిన ఒక చిన్న జీవిత చిత్రం రెవెరెండ్ జోసెఫ్ డోక్ అనే ఒక క్రిస్టియన్ మిషనరీ గాంధీ సౌత్ ఆఫ్రికాలో వున్నప్పుడే 1909లోనే రాసి పాశ్చాత్య దేశాలకు గాంధీని ఒక కొత్త భారతీయ జీసస్‌గా చూపిస్తాడు. 1922లోనే రోమన్ రోలా అనే ఫ్రెంచ్ నాటక రచయిత, సాహిత్య కారుడు, నోబెల్ బహుమతి గ్రహీత గాంధీని తన పుస్తకం ద్వారా ఒక విశ్వమానవుడిగా పరిచయం చేస్తాడు. నిజానికి అప్పటికి రోలా గాంధీని కలవలేదు, కనీసం ఉత్తర ప్రత్యుత్తరాలూ లేవు. కానీ అప్పటికే తెలుగు సాహిత్యంలో ఒక నాటకం గాంధీ మీద ఉన్నట్టు ఈ మధ్య రామచంద్ర గుహ ఒక పుస్తకంలో రాశాడు. ఈ సమయంలోనే గాంధీ తన ఆత్మకథ, సత్యంతో ప్రయోగాలు రాయడం మొదలు పెడతాడు. అప్పటికి గాంధీ వయస్సు 53. 53 ఏళ్ల వయసు నుండి 55 ఏళ్ల మధ్య ఈ రచనా కాలం. మన దేశంలో దాన్ని గాంధీని అర్థం చేసుకోడంలో ఒక ప్రధాన రచనగా పరిగణిస్తారు, కానీ అనేక మంది తరువాతి చరిత్రకారులు, మానసిక నిపుణులు గాంధీ ఆత్మకథ గాంధీని అర్థం చేసుకోడంలో కొంతే ఉపయోగ పడుతుంది అంటారు. అంతే కాదు ఎరిక్ ఎరిక్సన్ లాంటి ఫ్రాయిడియన్ మానసిక

విశ్లేషణ నిపుణుడు గాంధీ రాసుకున్న ఆత్మకథ గాంధీని అర్థం చేసోవడానికి ఏ మాత్రం ఉపయోగపడదు అని కూడా అంటాడు.

నిజానికి గాంధీ "సత్యం" నిజమైన పరీక్షలకు గురి అయ్యింది 1924 తరువాతే! అంటే ఆయన ఆత్మకథ రాసుకున్న తరువాత. అది మార్చ్ 18, 1922! అంతకు కొద్ది నెలల ముందే తన "యంగ్ ఇండియా" పత్రికలో గాంధీ మూడు వ్యాసాలు రాశాడు. మొదటిది: "టెంపెరింగ్ విత్ లాయల్టీ", రెండవది: "ఏ పజెల్ అండ్ ఇట్స్ సొల్యూషన్", మూడవది : "షేకింగ్ ది మేన్స్". మూడింటి సారాంశం? మాకు ఈ ప్రభుత్వం మీద విశ్వాసం సన్నగిల్లింది, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రోత్సహించడం, దాని పర్యవసనాలైన శిక్షలు అనుభవించడం మా తక్షణ కర్తవ్యం అని సూచించిన వ్యాసాలు. దేశద్రోహం! అవును! సెషన్స్ కేసు నెంబర్ 45 చార్జి షీటు అదే అంటోంది. గాంధీతో పాటు ఆ పత్రిక ముద్రించిన వ్యక్తి, సంపాదకుడు బ్యాంకర్ అనే వ్యక్తి మరో నిందితుడు. విచారణ మొదలవడానికి ముందు జడ్జ్ రాబర్ట్ బ్రూమ్ ఫీల్డ్ కోర్టులోకి రాగానే ముద్దాయిని చూసి గౌరవ పూర్వకంగా తలవంచి గౌరవం తెలియచేయడం బహుశా బ్రిటిష్ న్యాయ చరిత్రలో అదే మొదటి సంఘటన ఏమో? ప్రాసిక్యూషన్ వారు అభియోగాలు వినిపించగానే ముద్దాయి కూడా అన్ని అభియోగాలను ఏ మాత్రం సంకోచం, సమర్థన లేకుండా సంపూర్తిగా అంగీకరించడం కూడా న్యాయ చరిత్రలో అరుదైన విషయం. ముఖ్యంగా రాజకీయ కేసుల చరిత్రల అప్పటిదాకా వున్న సాంప్రదాయం ఏమిటంటే చార్జి షీట్‌కు డిఫెన్సు పేరుతో తమ రాజకీయ ఆచారణకు సుదీర్ఘ వివరణ ఇవ్వడం లేదా ఆధునిక సాక్షి చట్టాల లొసుగుల ఆధారంగా, సాంకేతికంగా బయట పడడం. తీర్పు ఇస్తూ జడ్జ్ అంటాడు: గాంధీ నా పని సులభం చేశాడు. ఈ కేసులో నేరానికి తగ్గ శిక్ష విధించడం బహుశా కష్టమే. చట్టాలు వ్యక్తులను బట్టి గౌరవం ఇవ్వవు, అయినా మీరు ఒక విభిన్నమైన వ్యక్తి. ఇలాంటి వ్యక్తిని నేను ఎప్పుడూ ట్రయల్ చేయలేదు, బహుశా మళ్ళీ చేయలేనేమో! కోట్ల మంది నీ దేశ పౌరుల దృష్టిలో నీవు గొప్ప దేశ భక్తుడవు, నాయకుడవు. బాల గంగాధర్‌తిలక్‌కు కూడా గతంలో ఒక బ్రిటిష్ జడ్జ్ ఆరేళ్లు కఠిన కారాగారం శిక్ష విధించాడు. అదే శిక్ష మీకు వేస్తున్నాను" అలా శిక్ష నిర్ధారించాక మళ్ళీ సీట్‌లోనించి లేచి, గాంధీ వైపు చూసి గౌరవ పూర్వకంగా చూసి, తలవంచి నమస్కరిస్తూ వెళ్ళిపోతాడు. ఒక్క బ్రిటిష్ న్యాయ చరిత్రలోనే కాదు, ప్రపంచ న్యాయ చరిత్రలో ఇలా ఒక జడ్జ్ ఒక నేరారోపణ, అది కూడా దేశద్రోహ ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తికి శిరస్సు వంచి అభివాదం చేయడం ఎక్కడా లేదు!

రవీంద్ర నాథ్ ఠాగోర్ ఒక కవితలో భగవంతుడికి, బాలహీనుడికి ఉన్న అద్భుత సంబంధాన్ని ఇలా చెబుతాడు:

**"నీవు నన్ను అనంతంగా చేశావు: అది నీ లీల. ఈ చిన్న పాత్రను మళ్ళీ, మళ్ళీ ఖాళీ చేస్తావు, తిరిగి, తిరిగి నవ్య జీవనంతో నింపుతావు.**

**ఓ సన్నటి తీగ లాంటి ఈ చిన్న వేణువును గిరి శిఖరాలపైకి, లోయల లోతులలోకి నీతో తీసుకెళ్ళి, దీని అంతరాంతరాలలో అనంత మాధుర్య వాయువులు నింపుతావు.**

**నీ అమృత స్పర్శతో నా చిన్ని హృదయం తన ఆనందపు పరిమితులు మరచిపోతుంది, మాటలకందని సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది.**

**నీ అపరిమిత కానుకలతో ఈ చిన్ని హస్తాలను నింపుతావు. వేల యుగాలుగా నీవు నింపుతూనే వున్నావు, అయినా ఇంకా నా చేతులలో కాసింత ఖాళీలున్నాయి."**

బైబిల్‌లో గోస్పెల్ ఆఫ్ మాథ్యులో ఒక మాట వుంటుంది: ఆధ్యాత్మికంగా బలహీనుడైన వాడు ధన్యుడు: ఎందుకంటే స్వర్గ రాజ్యము వారిదే! అంటే ఎవరైతే స్పిరిచువల్‌గా బలహీనులో వారు భగవంతుడుపై ఆధారపడతారు. వారిని ఆయన కాపాడతాడు. స్వర్గాన్ని ఇస్తాడు. భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో భగవంతుడు ఎప్పుడూ బలహీనుల పక్షాన్నే వుంటాడు. అయితే ఇక్కడ భక్తుడు పాపి కాదు, నేరం చేసి భూమి పైకి విసరివేయబడ్డ వాడు కాదు. తన కర్మ ఫలాన్ని తానే మోస్తూ పునరపి జననం, పునరపీ మరణం అంటూ కాలనేమి విసరిన చక్రంలో పరిభ్రమిస్తూ వుంటాడు. తిరిగి తన కృషి ద్వారానే విముక్తుడు అవుతాడు.

గుజరాత్‌లోని ఓ సముద్ర తీరం, అక్కడ ఒక రేవు పట్టణం – పోర్బందర్. అది ఒక చిన్న రాజ్యంలో భాగం – దానిపేరు కథియవార్. పేరుకే రాజులు, రాజ్యం. ఒకటి రెండు తాలూకాల పరిధి దాటని చిన్న ప్రపంచం. జైన, వైష్ణవ, ముస్లిం సాంప్రదాయాలు కలసిపోయిన వింతైన ఆధ్యాత్మిక వాతావరణం. శ్రీ కృష్ణుడి స్నేహితుడు సుధామ పేరుతో సౌధామ పురి, తరువాతి కాలంలో బందరు కూడా కలసి, పోరుబందరుగా మారిన కథ. ప్రముఖ ఇండియన్

ఇంగ్లీషు రచయిత రాజారావు తాను గాంధీ మీద రాసిన "ది గ్రేట్ ఇండియన్ వే" లో ఈ కథ చాలా అందంగా చెబుతూ గాంధీని కృష్ణుడితో పోలుస్తాడు.

కానీ గాంధీ తన ఆత్మ కథలో తనని తాను ఒక పెద్దగా ప్రతిభ లేని విద్యార్థిగా, ఎక్కాల పుస్తకం కూడా కష్ట పడి నేర్చుకున్నట్టుగా, తక్కువ జ్ఞాపక శక్తి వున్న మందకొడి కుర్రాడిగానే చెప్పుకున్నాడు. చిన్నప్పటి నుండీ విపరీతమైన బిడియం, సిగ్గు కలిగి తోటి విద్యార్థుల సాహచర్యానికి కూడా పెద్దగా ఇష్టపడని, భయపడే కుర్రాణ్ణి అంటాడు. హరిశ్చంద్ర నాటకం, శ్రావణ కుమారుని కథలు, అమ్మ భక్తి శ్రద్దలు, ఉపవాసాలూ, దీక్షలతో ప్రభావితం అయిన వ్యక్తిగా వర్ణించుకుంటాడు. తండ్రి పట్ల భయంతో కూడిన గౌరవం వున్నా తన తండ్రి నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడని, అతనికి భౌతిక, శృంగార కోర్కెలు ఎక్కువ అని కూడా కోపంతో రాశాడు. చిన్నప్పుడే జరిగిన పెళ్లి పట్ల అతను ఇబ్బంది పడ్డట్టుగా, మొదట్లో భార్య ఒక ఆడుకునే, ఆట పట్టించే స్నేహితురాలిగానే కనపడింది అని, కానీ శారీరక కాంక్షలు ఆ తరువాత మొదలయ్యాయని రాసుకుంటాడు. తండ్రి మరణించిన రోజున, ఆ సమయంలో భార్యతో శృంగారంలో వున్నానన్న అపరాధ భావన ఈయన వైవాహిక జీవితాన్ని, భార్యతో సంబంధాలను బాగానే ప్రభావితం చేసినట్టు అర్థం అవుతుంది. అలాగే ఆ ఆత్మకథలో తాను చేసిన అనేక చిన్నచిన్న తప్పుల గురించి కూడా ప్రస్తావిస్తాడు.

ఆ నాటి భారతీయులలో ఒక భ్రమ వుండేది. అది ఒక్క గాంధీలోనే కాదు. అనేకమంది ఆ నాటి ప్రముఖ వ్యక్తుల జీవితాలు, వారి ప్రయత్నాలు గమనిస్తే అర్థం అవుతుంది. అది ఏమిటంటే: బ్రిటిష్ వాళ్ళు, యూరోపియన్‌లు శారీరకంగా ధృఢంగా వుండడం వల్ల, ఆ నాటి భారతదేశపు రాజుల, సైన్యాల దగ్గర వున్న ఆయుధాల కంటే బలమైన ఆయుధాలు వుండడం వల్లనే వారు భారత దేశాన్ని, ప్రపంచాన్ని జయించారు అనే నమ్మకం. నిజానికి వాళ్ళ దగ్గర వున్న ఉన్నతమైన ఆయుధాల కంటే దేశ ప్రజలలో సన్నగిల్లిన దేశం అనే భావన, యూరోపియన్‌లు, అంతకు ముందు ముస్లిం రాజుల పాలనలో కోల్పోయిన సృజనాత్మకత, విశ్వాసం, తాము ఒక ప్రత్యేకమైన విలువలు కలిగిన జాతీయతతో కూడిన జాతి అన్న భావన కోల్పోవడం ఎక్కువ కారణం అని అర్థం చేసుకోలేక పోవడం ఇందులో ప్రధాన సమస్య. ఈ బ్రిటిష్ రాజ్యపు వ్యాప్తి, అందులో ఆయుధాల, లేదా వారి శారీరక సామర్థ్యం గురించి తెలియాలి అంటే పండిట్ సుందరలాల్ రాసిన – "హౌ ఇండియా లాస్ట్ హర్ ఫ్రీడం" పుస్తకం చాలా విలువైనది. మూడుసార్లు బ్రిటిష్ ప్రభుత్వంతో నిషేదింపబడ్డ ఈ పుస్తకతోపాటు, ఈ మధ్యే జోన్ విల్సన్ "ఇండియా కాంకర్డ్" అనే పుస్తకం కూడా అనేక కొత్త కోణాలను చూపిస్తుంది. అసలు బ్రిటిష్ వాళ్ళు ఈ దేశంలో నిరంతరం ఒక మృత్యు భయంతో జీవించారని, ఆ భయంలో నుండే అవసరాన్ని మించిన హింసను వాడారని, అది స్వదేశంలో వారి స్వాభావికత కాదని వాదిస్తాడు విల్సన్.

మనకు గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, తెలుగు వాడు అయిన దర్శి చెంచయ్య జీవితం చదివినా, వినాయక దామోదర్ సావర్కార్, అరబిందో, గదర్ ఉద్యమ వీరులు సోహం సింగ్ భక్నా, లాలా హర్ దయాళ్, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, చంద్ర శేఖర్ ఆజాద్, ముజఫ్ఫార్ అహ్మెద్, ఏం. ఎన్. రాయ్, లాంటి మేధావుల, వీరుల జీవిత చరిత్రలు తిరగేసినా–ఆ నాటి ఇటు వామపక్ష, అటు మతాధారిత విప్లవ వీరుల జీవితాలు – ఏవి పరిశీలించినా ఈ ఆయుధాలపై అధిక విశ్వాసం, అధిక వ్యామోహం, శారీరక ధృఢత్వం గురించిన అత్యాసక్తి కనబడుతుంది. వారందరూ గొప్ప వారే! దేశం పట్ల ప్రేమ, ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వ దమన నీతిపై కోపం, అసహనం వున్నవారే, ఏదో చేయాలి, దేశానికి స్వాతంత్ర్యం కావాలి అని తపన పడ్డ వారే! అందుకే వారు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించే కంటే వ్యక్తిగత వీరత్వం, సాహసం, సాయుధ పోరాటాలు, హింస, మరణం, ఆత్మాహుతి, త్యాగం లాంటి ఆలోచనల చుట్టూ తిరగడం గమనిస్తాం.

కానీ ఒక భయస్తుడు, పెద్దగా సిద్ధాంతాలు తెలియని వాడు, శారీరకంగా బలహీనుడు, మధ్య తరగతి తెలివితేటలు, ఆలోచనలు వున్న వాడు, చిన్నప్పటి నుండీ దైవ భక్తి, ఉపవాసాలూ, దీక్షలు చూసిన వాడు, శ్రావణ కుమార, హరిశ్చంద్ర, ప్రహ్లాదుడి లాంటి కథలు చదివిన వాడు, ధర్మం, న్యాయం, నీతి, సత్యం .. లాంటి మాటల మధ్య పెరిగిన వాడు – ఒక సామాన్యుడు ఎలా ఆలోచిస్తాడు, ఏమి చేయగలడు? ఈ ప్రశ్నలు గాంధీకి సౌత్ ఆఫ్రికా వెళ్ళిన తొలి రెండు, మూడు సంవత్సరాలలోనే వచ్చాయి. ఈయనకు ఒక జైన గురువు వున్నాడు. 1892–93లలో ముంబైలో న్యాయవాది వృత్తిలో తన అశక్తతను, చేతగాని

తనాన్ని ప్రదర్శిస్తూ, మానసికంగా, వృత్తి పరంగా నలిగి పోతున్నప్పుడు ఈ జైన పండితుడు, వజ్రాల వ్యాపారి అయిన రాజ్‌చంద్ భాయితో తాత్విక చర్చాలలో ఉపశమనం పొందేవాడు గాంధీ. తనకు ఆఫ్రికాలో ఎదురైన చేదు అనుభావాలను చెప్పుకుంటూ "కిం కర్తవ్యం?" అని ఒక ఉత్తరంలో అడుగుతాడు. అంతేకాదు ఆ ఉత్తరంలో 27 ప్రశ్నలు–ఆత్మ, మోక్షం, పురుషార్థాలు, కర్తవ్యం .. ఇలా! గురువు గారు అంతే శ్రద్ధగా అన్నింటికీ జవాబు చెబుతూ "మనం ఆధ్యాత్మిక ప్రయాణంలో వున్నాము కనుక ఈ సమాజం, సమస్యలు, పరిష్కారాలు.. లాంటి భౌతిక విషయాలు వదలి, ఆత్మ సాక్షాత్కారం, మోక్షం గురించి ఆలోచించమని" చెబుతూ, మరింత అవగాహనకు వశిష్ట గీత, భగవద్ గీతా చదవమని సలహా ఇస్తాడు. గాంధీ గురువు గారి ఆజ్ఞ ప్రకారం ఆ రెండు పుస్తకాలు మళ్ళీ చదువుతాడు. కానీ అంతిమంగా సౌత్ ఆఫ్రికాలో అవమానాలు, వివక్ష ఎదుర్కొంటున్న భారతీయుల తరపున సంఘటిత ఉద్యమ నిర్మాణానికే మొగ్గు చూపుతాడు. ఆ సామూహిక జీవనమే ఆయన చేసిన నాలుగు ఆశ్రమ ప్రయోగాలు కూడా! ఇది ఎలా జరిగింది అనేదే గాంధీ జీవితంలో ఒక కీలక మలుపు, రహస్యం.

పాశ్చాత్య దేశాలలో అస్తిత్వ వాదానికి ఆద్యుడయిన సోరెన్ కీర్క్ గార్డ్ తన రచన "ఫియర్ అండ్ ట్రెంబ్లింగ్"లో భగవంతుడి వైపు భయంతో, వణుకుతూ ఎలా ప్రయాణం చేయవచ్చో ఆలోచిస్తాడు. అంటే ఈ భయంలో, వణకడంలో అది నిజానికి భయం కాదు, వణకడం కూడా కాదు. అంతరంగంలోని విశ్వాసం బాహ్య ప్రపంచంలోని అసంబద్ధతను ఎదుర్కొన్నప్పుడు విశ్వాసపు ఊగిసలాటలో నుండి వచ్చే మానసిక స్థితి. కార్యకారణాల పరిమితులు దాటిన సవాళ్ళు ఎదురైనప్పుడు విశ్వాసం, అసంబద్ధతల మధ్య జరిగే సంఘర్షణ. మన దేశపు పురాణ సాహిత్యం లోనూ మనకు ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. హిరణ్యకశపుడు లాంటి రాక్షస బలం ముందు ప్రహ్లాదుడు చిన్న పిల్లవాడు. భయంతో వణికి పోతాడు. కానీ విష్ణువుపై భక్తి అతని కార్యాచరణకు ఏకైక ఇంధనం. తండ్రి, దండనాధికారి ఒక్కటై భయపెడుతున్నప్పుడు విశ్వాసం ఒక్కటే ఆయుధం.

అలా 1894లో మొదలయిన ఒక ఆలోచన – మనిషికి వ్యక్తి గత మోక్షం లేదు అనే ఒక సూచన పాత్రమైన వ్యక్తీకరణ. అంటే మోక్షం అయినా, పతనం అయినా సామూహికమే, సాంఘీకమే! ఈ వ్యక్తీకరణలో గాంధీకి సంబంధించిన అన్నీ సహజమైన లోపాలు–భయం, పిరికితనం అన్నీ ఒక్కసారిగా పటాపంచలు అయిపోతాయి. ఇప్పుడు తాను ఒక వ్యక్తి కాదు, తాను శ్రమించేది తనకోసం కాదు. ఎదురుగా ఆయుధాలకు లొంగని ఒక బలమైన నిరంకుశ ప్రభువు,.. మరో వైపు నిస్సహాయంగా నైతిక పతనావస్థలో వున్న తన జనం. ఈ బలహీన జనం దేవుడికి ఇష్టమైన వాళ్ళు. వారు అనేక మంది కలిస్తే అదే ఏ శక్తి ఓడించలేని బలమైన ఆయుధం. ఇక్కడే గాంధీ తన భయాలను, శారీరక, మానసిక బలహీనతలను శక్తిగా మార్చుకుంటాడు. ఆ ప్రయత్నంలోనే సౌత్ ఆఫ్రికాలో తన సన్నిహితులతో చర్చిస్తూ కనుక్కున్న సాధనం "సత్యాగ్రహం". సత్యాగ్రహం అంటే ఏమిటి? సత్యాన్ని పట్టుకుని వేలాడడం. నమ్ముకోవడం. సత్యం మీద ఆధారపడితే, మనం నమ్ముకున్న సత్యం సత్యమే అయితే దాన్ని సాధించడానికి, నిలబెట్టడానికి ప్రత్యేకంగా ఆయుధం అక్కరలేదు. సత్యం ఆధారంగా భయాలను, బలహీనతలను అధిగమించడం అనేది ఇక్కడ పడ్డ బీజం. సత్యానికి హింసా మార్గం అక్కర లేదు. సత్యం తనను తాను నిలుపుకునే శక్తి కలది.

మహాభారతం శాంతి పర్వంలో "విశ్వాసం" గురించి చర్చ వుంటుదట. అందులో "విశ్వాసం" ఎక్కడి నుండి వస్తుంది?" అన్న ప్రశ్నకు సమాధానంగా "విశ్వాసం ప్రతి మనిషికి ఒక రక్షణ కవచం. విశ్వాసం నశిస్తే, భయంకరమైన వేదన వెంటాడుతుంది. అది మృత్యువుతో సమానం... నమ్మకం అనేక వృక్షాలతో నిండిన కొండ కంటే బలమైనది. బహుశా ఆకాశం కంటే పెద్దది. బహుశా దాని లోతులు కొలవడం సాధ్యం కాదు. విశ్వాసాన్ని అర్థం చేసుకోవడం అసాధ్యం, దానిపై విజయం సాధించడం కూడా అంతే కష్టం. .." అన్న జవాబు ఒకటి వుంటుంది. గాంధీ తన అన్నీ బలహీనతలను విశ్వాసంతో జయించాడు. ఆ విశ్వాసం సామూహికం, దాని మార్గం "సత్యాగ్రహం" అంటే సత్యాన్ని గట్టిగా పట్టుకోడం. అందుకే 1894 తరువాత ఆయన ప్రతి పనిలో ఒకే ప్రశ్న! నేనీ చేస్తున్నది సత్యంపై ఆధారపడి వుందా? లేదా? 1929 దాకా "భగవంతుడే సత్యం" అన్న గాంధీ ఆ తరువాత కాలంలో దాన్ని మార్చి "సత్యమే భగవంతుడు" అంటాడు. అంటే తన ప్రయత్నంలో భగవంతునికంటే సత్యానికే ఉన్నత స్థానం ఇచ్చాడు. ఈ

మార్పుకు అనేక కారణాలతో పాటు అంతకు ముందే జరిగిన గాంధీ – గోరా చర్చలే కారణం అంటారు కొందరు.

ఎరిక్ ఎరిక్సన్ తన **"గాంధీ'స్ ట్రూత్ – ఆన్ ది ఆరిజిన్స్ ఆఫ్ మిలిటన్ట్ నాన్ వయలెన్స్"** అనే పుస్తకంలో గాంధీని ఫ్రాయిడ్ మానసిక శాస్త్ర విశ్లేషణకు గురిచేస్తాడు. "భగవంతుడు భౌతిక శరీరంతో మన ముందుకు రాడు, మన కార్యాచరణలోనే సాక్షాత్కరిస్తాడు" అని గాంధీ భావించాడు. అయితే ఈ "సత్" అనే సంపూర్ణ సత్యం ఒక సాపేక్ష సత్యంగా మార్చి, ఒక నైతిక విలువగా, ఒక అహింసాత్మక కార్యాచరణగా మార్చగలిగే ప్రయత్నమే గాంధీ రాజకీయాలలో చేసింది. అందుకే అదే సమయంలో అనేక మంది సాధువులు, పరివ్రాజకులు, జ్ఞానులు, ఆత్మ సాక్షాత్కారం, మోక్షం కోరుకుంటూ ఆశ్రమాలకు వెళ్లిపోతే, గాంధీ ఆశ్రమాలను రాజకీయ ఆచారణకు క్షేత్రం చేశాడు. ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు అనే పురుషార్థాలకు నేటి ఆధునిక జీవితంలో కొత్త అర్థం, ఆధునిక విలువలు చేర్చాలి అంటాడు. ప్రాచీన అర్థ, కామాలలో 20 శతాబ్దపు రాజకీయ కార్యక్రమానికి సమన్వయం చేస్తూ, ఆధునిక కాలంలో రాజకీయాలలో క్రియాశీలత తీసుకోవడం ప్రతి పౌరుడూ, వ్యక్తి కర్తవ్యం అని పునర్నిర్వచించాడు.

మన దేశానికే చెందిన మరో సామాజిక మానసిక శాస్త్ర నిపుణుడు అశీస్ నంది తన "ఇంటిమేట్ ఎనిమీ" అనే రచనలో బ్రిటిష్ వలసవాద పాలనలో మనం మనల్ని ఎలా కోల్పోయామో, తిరిగి ఎలా తెచ్చుకున్నామో వివరిస్తాడు. ఆల్బర్ట్ క్యామును ఉదహరిస్తూ "మన కాలపు ప్రత్యేక బదలాయింపులో అమాయకుడు తనని తాను అమాయకుడని రుజువు చేసుకోవాలి" అంటాడు క్యాము. ఆధునిక వలస వాదం తన సైనిక, ఆయుధ సంపత్తి ఆధారంగా కాక, మానసిక, లౌకిక నిచ్చెనలను సృష్టించి కాలనీలను జయించింది అంటాడు. బలమైన అధికార సోపానాలు, ఇనుప చట్టాలు, చట్రాలు, తమ అన్యాయాన్ని న్యాయంగా చూపగలిగే శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పోలీసు, నిఘా వ్యవస్థలు .. ఇవి ఆధునిక వలసవాద ఆయుధాలు. అందుకే గాంధీ ఒక మేధావిగా కాక, ఒక సాధారణ వ్యక్తిగా, ఒక గృహస్థుడిగా, ఒక చిన్న రైతుగా, ఒక నేత కార్మికుడుగా, .. రాజ్యం అంటే భయం వున్న సాధారణ పౌరుడిగా, హిరణ్యకశపుడిని ఎదిరిస్తున్న భయపడుతూ ఎదుట నిల్చున్న ప్రహ్లాదుడిగా సత్యాన్ని పట్టుకుని, విశ్వాసాన్ని పట్టుకుని బ్రిటిష్ వారి న్యాయ సూత్రాలను వారికే చూపిస్తూ, వారిని ఒక పశ్చాత్తాప మనస్తత్వంలోకి నెట్టివేస్తూ చేసిన పోరాటం, విధానం ప్రపంచ వలస వాద ఉద్యమాలలో ఒక వింత ప్రయోగం అయ్యింది. బ్రిటిష్ ఆధిపత్యం ప్రాథమికంగా ఒక సాంస్కృతిక దాడి. బుద్ధి మీద, మనసు మీద, ఆత్మ మీద దాడి. ఒక సాంస్కృతిక దాడి. దానిని సవాలు చేసేది కూడా ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఆలోచనే. అదే గాంధీ చేసింది. అతని చిన్ననాటి బలహీనతలే, ఆ అమాయకత్వమే అతనిని సరికొత్త దేశీయ ప్రత్యామ్నాయం కోసం వెదికేలా చేసింది.

నాకు సినిమాలన్నా, సినిమా పాటలన్నా పెద్దగా ప్రేమ లేదు. కానీ సిరివెన్నెల సీతారామ శాస్త్రి ఒక సినిమా పాటలో గాంధీ చాలా చక్కగా చెబుతాడు:

**"గుప్పెడు ఉప్పును పోగేసి నిప్పుల ఉప్పెనగా చేసి**
**దండియాత్రనే దండయాత్రగా ముందుకు నడిపిన అధినేత.. ఆ సిసలైన జగజ్జేత...**
**చరకాయంత్రం చూపించి స్వదేశీ సూత్రం నేర్పించి..**
**నూలుపోగుతో మదపటేనుగుల బంధించాడుర జాతిపిత..ఆ సంకల్పబలం చేత...**
**ఇలాంటి నరుడొక డిలాతలంపై నడియాడిన ఈనాటి సంగతి**
**నమ్మరాదని నమ్మకముందే ముందుతరాలకి చెప్పండి"**

ఒక సాధారణమైన మనిషి, సాధారణ మనిషికి వున్న అన్ని బలహీనతలు, అశక్తతలూ ఉన్న మనిషి తనలోని అసాధారణమైన సత్యాన్ని ఆవిష్కరిస్తే, దానికి విశ్వాసం తోడైతే, తాను ఏకాకిని కాదు, సమస్త విశ్వం నాతో నడుస్తుంది అని నమ్మితే, సమస్త విశ్వం కోసం నేనూ నడుస్తాను, నా ముందు వున్న నిరంకుశాధికారి కంటే నా సంకల్పం, నా విశ్వాసం, నా సత్యం, నా ప్రజలు – గొప్పది, గొప్పవారు అనుకుంటే ఎంతటి పనులు చేయగలడో, ఎంతటి అద్భుతాలు సాధించగలడో గాంధీ ఒక ఉదాహరణ. మేధస్సు, సిద్ధాంతాలు, ఏదీ ఉన్నతమైన, సమగ్రమైన జ్ఞానం అనే చర్చల కంటే ముందు పని మొదలు పెడదాం, పని పాఠాలు నేర్పిస్తుంది, నేర్చుకుందాం, చేద్దాం అనడమే ఆయన బలం.

**డా. అవధానం రఘుకుమార్**
న్యాయవాది, రచయిత, ఫోన్ : 9441015709

# బృహదారణ్యకోపనిషత్తు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

**ఉ**పనిషత్తుల పరంగ వ్యాఖ్యానాలు వ్రాయబడుతున్న 10 నుండి 12 ఉపనిషత్తులలో ఇది కూడా ప్రధానమైనది. ఇది శుక్ల యజుర్వేదానికి చెందినది. బృహదారణ్యకం అంటే గొప్ప అడవి అని చెప్పుకోవచ్చు. ఈ ఉపనిషత్తును యజ్ఞవల్క్యుడనే ఋషి కూర్చినట్లుగా చెప్పబడుతున్నది. ఆ తరువాత దీనిని మరికొంతమంది మెరుగుపరచి ఉండవచ్చు. మొత్తంగా ఈ ఉపనిషత్తులో ఆరు అధ్యాయాలు ఉన్నాయి. ఈ ఉపనిషత్తు యొక్క విశేషమేమంటే మొదటి రెండు అధ్యాయాలు యాగ సంబంధమైన కర్మకాండలతో కూడి ఉన్నాయి. అందుచేత ఎక్కువమంది భాష్యకారులు ఉపనిషత్తు యొక్క ప్రధాన అంశాలు మూడవ అధ్యాయంతోనే మొదలు కావడం చేత, వాటిపైననే తమ దృష్టిని కేంద్రీకరించడం జరిగింది. ఇదే ఒక సంప్రదాయంగా కొనసాగుతున్నదని కూడా చెప్పుకోవచ్చు. దానిననుసరించి, ఈ వ్యాసంలో కూడా చర్చ మూడు నుండి ఆరు అధ్యాయాలలో పొందుపరచ బడిన విషయపరంగానే సాగుతుంది.

**విశ్వం యొక్క స్వరూపం :** ఈ ఉపనిషత్తులో విశ్వం యొక్క స్వరూపాన్ని యాగాశ్వంతో పోల్చడం జరిగింది. ఇక్కడ యాగాన్ని విశ్వంగాను, జీవుని యాగాశ్వంగాను పేర్కొన్నారు. దీనికి సంబంధించిన మంత్రం ఈ విధంగా ఉంది.

**"ఉషా వా అశ్వస్య మేధస్య శిరః।**
**సూర్యః చక్షుః వాతః ప్రాణో।**
**వ్యాత్తమ్ అగ్నిః – వైశ్వానరః –**
**సంవత్సర ఆత్మ।"**

విశ్వం అనే అశ్వమేధ యాగంలో శిరస్సు బ్రహ్మంగాను, ఉషస్సు, నేత్రములు సూర్యుడుగాను, యజ్ఞాశ్వము యొక్క ప్రాణములు వాయువుగాను, అశ్వం యొక్క తెరువబడిన నోరు వైశ్వానరాగ్నిగాను, సంవత్సరం ఆత్మగాను ఉన్నాయి. అట్లే యాగాశ్వము యొక్క పొట్ట అంతరిక్షంగాను, పాదాలు భూమిగాను, పార్శ్వములు దిక్కులుగాను, అంగములు ఋతువులుగాను, బొమికలు నక్షత్రములుగాను, నాడులు నదీనదములుగాను, మాంసము పర్వతములుగాను, వెంట్రుకలు ఓషధులుగాను ఉన్నాయి. సృష్టి అనే యాగాశ్వము సముద్రమునే జన్మస్థానముగా కలిగియున్నది. ఈ విధంగా సమస్త విశ్వము "అశ్వమేధయాగ ఉపాసన"గా చెప్పబడుతున్నది.

**విశ్వసృష్టి :** బృహదారణ్యకోపనిషత్తు ప్రకారం సృష్టి ప్రక్రియ ఈ విధంగా సాగింది. ప్రారంభంలో విశ్వం శూన్యంగా ఉంది. ఈ దశలో హిరణ్యగర్భగా ఉన్న విశ్వాత్మ, మనస్సును సృష్టించాడు. అటుపైన నీటిని, అగ్నిని ఉనికిలోనికి తెచ్చాడు. ఆ పైన తనను తాను మూడు సమభాగాలుగా విభజించుకొన్నాడు. ఒక భాగం అగ్ని (సూర్యుడు) గాను, రెండవ భాగం వాయువుగాను, ప్రాణాన్ని మూడవ భాగంగాను అవతరించాడు. ఈ త్రివిధ రూపాలనే ప్రాణ, అపాన, వ్యానములుగా ఋషులు ధ్యానము చేయుచున్నారు.

**"సత్రేధ ఆత్మానం వ్యకురుత ।**
**(అగ్ని) – ఆదిత్యం – ద్వే ।**
**వాయుం తృతీయగ్ం ।**
**స ఏష ప్రాణః త్రేధా విహితః।"**

ఈ విధంగా మూడు రూపాలు కలిగిన హిరణ్యగర్భ అన్ని దిక్కులకు భౌతిక రూపంలో వ్యాపించి ఉన్నది. హిరణ్యగర్భ నామాంకితుడైన ప్రజాపతి, తనకు రెండవ శరీరముగా జీవాత్మను, మనస్సు – వాక్కుల కలయికగా సృష్టించుకొన్నాడు. జీవాత్మనే హిరణ్యగర్భ తన పుత్రునిగా భావించాడు. అతని అజ్ఞానమును తొలగించుటకు వాక్కును, ఆహారాన్ని సృజించి యిచ్చాడు. విశ్వాన్ని సృష్టించిన అతనే తనకు తానుగా అనుభవరూపమై కూడా ఉన్నాడు. సమస్త జీవులలోను తానే అయి సర్వాత్మకుడుగా ప్రకాశించుచున్నాడు.

**"సో అకామయత భూయ సా**
**యజ్ఞేన భూయో యజే యేతి।"**

తాను జరిపిన సృష్టి కార్యాన్ని, తాను అనుభవించే క్రమంలో తాను మరల మరల సృష్టి యజ్ఞాన్ని నిర్వర్తిస్తున్నాడు. తరచి చూస్తే పరమాత్మయే, అసంఖ్యాక జీవాత్మలుగా ప్రదర్శితమవుతున్నాడు. అందుచేత జగత్తు యొక్క వాస్తవ స్వరూపము ఆత్మయే. ఇక్కడనే ఒక ఆసక్తికర మైన ప్రశ్న ఉదయిస్తుంది. జీవుడే బ్రహ్మమైనప్పుడు, బ్రహ్మంను తెలుసుకుంటున్నది ఎవరు?

**"బ్రహ్మవా ఇదమ్ అగ్ర ఆసీత్,**
**తత్ ఆత్మానమేవా వైతత్"**

సమస్తము బ్రహ్మం అయినప్పుడు, జీవుడు కూడా సమస్తంలో ఒక్కడు.

**పరబ్రహ్మ స్వరూపము - ఉపాసన :** పరబ్రహ్మ స్వరూపము ఎట్టిది, దానిని ఏ విధంగా ఉపాసించాలి అన్న విషయాలు ఈ ఉపనిషత్తు యొక్క చతుర్థ అధ్యాయంలో వివరించ బడ్డాయి. ఇది గార్గ్యముని, కాశీరాజుకు ఉపదేశించినట్లుగా ఉంటుంది. స్థూలంగా పరిశీలిస్తే, పరబ్రహ్మం వివిధ రూపాలలో ఉన్నట్లు చెప్పబడింది. అవి : సూర్యునిగాను, చంద్రునిగాను, ఆకాశముగాను, బుద్ధి సహితుడైన ఆత్మగాను నెలకొని ఉన్నాడు. సర్వప్రాణుల యొక్క సత్యస్వరూపము ఆత్మయే. ఈ ఆత్మయే జీవులందరిలోను నిక్షిప్తమై ఉన్నది. జాగృత ప్రపంచంలో కనిపించేదంతా మనస్సు యొక్క కల్పితకార్యము మాత్రమే. పరబ్రహ్మాన్ని గూర్చి తెలుసుకొనగోరే వ్యక్తికి ఈ విధమైన చేతన ఉండాలి. పరబ్రహ్మం యొక్క స్థితిని మరింత విపులంగా వివరిస్తూ, ఈ విధంగా చెప్పబడింది. జ్ఞానం తానే అని, జ్ఞానం స్వేచ్ఛను ప్రసాదిస్తుందని, అదే అంతర్గత శక్తిని కలుగ జేస్తుందని వ్యక్తి తెలుసుకొంటాడు. అన్నింటా విముక్తి పొందినవాడే బ్రహ్మం. అంటే నశింపులేని, బంధాలు లేని, నిర్బంధం లేని స్వేచ్ఛాజీవి అయి ఉన్నాడు.

**మృత్యువును గురించిన అవగాహన :** బృహదారణ్యకోప నిషత్తులో చర్చించబడిన మరొక ముఖ్యమైన అంశం ఇది. వాస్తవమేమంటే ప్రపంచంలోని వస్తు సముదాయమంతా మృత్యువుచే వ్యాపించబడి ఉన్నది. కర్మసాధనములన్ని మృత్యువు అధీనంలోనే ఉన్నాయి. ఈ సందర్భంలో మృత్యువును ఏ విధంగా అధిగమించగలం అన్నది ఆసక్తికరం. దానికిగాను చెప్పబడిన మార్గాలు.

**"హోత్రర్త్విజా అగ్నినా వాచా వాగ్వై యజ్ఞస్య"** వాక్కు చేత వ్యక్తి మృత్యువును అధిగమించగలడు. ఇక్కడ అగ్నియే వాక్కు రూపుడై ఉన్నాడు. అగ్నియే యజ్ఞమునకు యజమాని. ఆ విధంగా అగ్నిని ఉపాసిస్తూ అమృతత్వాన్ని చేరుకొంటాడు. అట్లే శుక్ల,కృష్ణ పక్షములలో బేధము లేదని, వాయువు, ప్రాణము, వాక్కు, చంద్రుడు, జలము అన్ని ఏకరూపమనే అవగాహనే మృత్యువును జయించే శక్తిని కలిగిస్తుంది.

**నిర్గుణ బ్రహ్మము :** ఇంతకుముందు చాందోగ్య ఉపనిషత్తులో సగుణ బ్రహ్మ, నిర్గుణ బ్రహ్మ ఉపాసనలను గూర్చి కొంత తెలుసుకున్నాము. ఈ ఉపనిషత్తులో నిర్గుణ బ్రహ్మం యొక్క స్వరూపాన్ని మరికొంత తెలుసుకుంటాము. గార్గి అనే విద్యార్థిని, యజ్ఞవల్క్యుని అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఈ వివరణ ఉంది. మొదటగా తెలుసుకోదగినది, ఈ బ్రహ్మాండమునకు ఊర్ధ్వంగా దేవతాలోకము, దిగువన భూలోకము ఉన్నాయి. ఈ మూడు లోకాలలోను అంతటా ప్రదర్శితమై ఉన్నటువంటిదే బ్రహ్మం. అదే అవ్యాకృత ఆకాశము నందు ఓతప్రోతమై ఉన్నది. అంటే పడుగు-పేకల వలె చిక్కబడి ఉన్నది. ఏ ఆత్మయందు ఈ మూడు లోకాలు మిళితమై ఉన్నాయో, అదే మానవులందరి స్వస్వ రూపమై ఉన్నది. ఈ దృశ్య జగత్తు అంతా ఆత్మకు భావనా రూపమే.

**"మాత్రా రూపం తత్ న భవతి ।**
**అమాత్రమ్ ఇతి భవతి ॥**
**తేన కించిత్ నమీయతే."**

అటువంటి ఆత్మ, దేనిని కొలవడానికి ఉపకరణం కాని, కొలవబడేది కాని కాదు. అట్లే మానవుని యొక్క దేహము, మనస్సు, బుద్ధి, అహంకారము, సంస్కారము, భావాలు వంటి ఇత్యాదులన్నింటికి కూడా వేరుగా ఉన్నది. ఏ విధంగానైతే స్వప్నము పొందువాడు, స్వప్నములో ఉండడో, అట్లే ఆత్మ కూడా దేహమునకు వేరుగా ఉన్నది. అక్షరమగు ఆత్మ, జీవుల రాకపోకలకు రంగస్థలముగా మారియున్నది.

**"అథ య ఏతత్ అక్షరం విదిత్వా, అస్మాత్**
**లోకాత్ ప్రైతి, స బ్రహ్మణః"**

ఎవరైతే ఈ దేహము నేలకూలకముందే తన స్వస్వరూపమును, సర్వజగత్ స్వరూపముగాను, సర్వలోక, సర్వాత్మకంగాను తెలుసుకుంటాడో, అతడు బ్రహ్మీభూతడుగు ముక్తుడగుచున్నాడు.కావున ఎవరైతే, స్వయముగా, సాక్షాత్

అపరోక్షమగు బ్రహ్మము వారిలోపలనే ఆత్మస్వరూపమై ఉన్నదని, సర్వసంసార ధర్మములకు అతీతమై ఉన్నదని, దృశ్య జగత్తు, మూడు లోకములు, అవ్యాకృత ఆకాశముగా వస్త్రములోని పడుగు-పేకల వలె వ్యాపించి ఉన్నాయని గ్రహిస్తారో వారు జ్ఞానము యొక్క ఫలమును ఆస్వాదించుటకు అర్హులై ఉన్నారు. దీనినే యోగ సిద్ధి అని లేదా భక్తి యొక్క పరాకాష్ఠ అని చెప్పవచ్చు.

**బ్రహ్మం యొక్క ఆరు రూపాలు :** బృహదారాణ్యకోపనిషత్తు యొక్క మరొక ముఖ్య విశేషము బ్రహ్మంను గూర్చిన సవివరణ. ఈ ఉపనిషత్తు బ్రహ్మం ఆరు రూపాలలో ఉన్నదని తెలియజేస్తుంది. వాటి విశ్లేషణ దిగువ ఇవ్వబడింది. మొదటగా, **"వాక్ వై బ్రహ్మేతి'.** వాక్కే బ్రహ్మమై ఉన్నది. మానవుని దేహమందు వాక్కు నాలుగింట ఒక భాగమై ఉన్నది. మిగిలిన మూడు మనోబుద్ధి, చిత్త, అహంకారములుగా అవ్యాకృత ఆకాశముగా నిలిచి ఉన్నాయి. ఈ విధమైన అవ్యాకృతాకాశమునకు, వాక్కు ప్రతిష్ఠగా ఉన్నది. బ్రహ్మమే వాక్కునకు ప్రజ్ఞ కలిగిస్తుంది. ఇది బ్రహ్మం యొక్క మొదటి రూపం. రెండవదిగా **'ప్రాణో వై బ్రహ్మేతి'** అని చెప్పబడింది. అంటే ప్రాణమే బ్రహ్మము. మానవునికి ప్రాణమే అత్యంత ప్రియమైనది. అయితే ఈ ప్రాణము ఉన్న స్థానము శరీరము. అయినప్పటికీ శరీరము ప్రాణము కాదు. ప్రాణమునకు 'శరీరి' అవ్యాకృత ఆకాశము. అదే బ్రహ్మ స్వరూపము. బ్రహ్మమే ప్రాణస్వరూపంగా ఉన్నది. కావున ప్రాణమును బ్రహ్మముగా ఉపాసించుట చెప్పదగినది.

మూడవ రూపంగా బ్రహ్మం కంటి చూపుగా ఉన్నది. **'చక్షుర్వై బ్రహ్మేతి'.** కంటి చూపు యొక్క అధిష్ఠాన దేవత సూర్యుడు లేదా ఆదిత్యుడు. కావున ఆదిత్యుడే బ్రహ్మంగా ఉన్నాడు. కంటి చూపురూపమున దేహంలో ఉన్నది బ్రహ్మమే. చూపుయే సత్‌స్వరూపమగు పరబ్రహ్మమని గ్రహించాలి. నాల్గవదిగా బ్రహ్మం వినికిడిశక్తి అయి ఉన్నది. **"శ్రోత్రం వై బ్రహ్మేతి".** వినికిడి శక్తిని దిక్కులన్నింటికి అధిష్ఠానదేవతగా భావించి, దానిని బ్రహ్మంగా స్వీకరించాలి. **"మనో వై బ్రహ్మేతి"** అన్నది బ్రహ్మం యొక్క ఐదవ రూపం. మనస్సే బ్రహ్మం అన్నది దీని అర్థం. ఇంద్రియములు తరువాత మానవునికి మనస్సు ప్రధానమైనది. ఎందుచేతనంటే సంకల్పబలం కలిగినది మనస్సు. అనుభూతి చెందేది కూడా మనస్సే. ఈ మనస్సే ఆత్మకు శరీరము. మానవుడు మనస్సుతోనే ఏదైనా కోరుకొని, అనుభవం లోనికి తెచ్చుకొని, ఆనందం పొందుతాడు. **"మనోయత్ కరోతి, తత్ కృతం భవతి"** అన్నది వాక్యము. మనస్సు తలచినదే జరుగుతుంది. కాబట్టి కోరిక కంటే ముందే, మనస్సు ఉన్నదన్నది సత్యము. ఈ విధంగా మనస్సును ఆత్మస్వరూపంగా భావించడం ఒక విధానం. **"హృదయం వై బ్రహ్మేతి"** అన్నసూక్తి ప్రకారం హృదయమే బ్రహ్మము. ఎందుచేతనంటే, హృదయమే సర్వభూత జాలములకు స్థితిస్థానము. సముద్రంలోని అలలు ఏ విధంగా జనించి, చలించి, సముద్రంలో కలిసిపోతాయో, అట్లే జగత్తు, జీవాత్మ, మనస్సు, చిత్త, అహంకాలములన్నీ హృదయంలోనే జనించి, ప్రవర్తించి లయమైపోతాయి. ఇవే బ్రహ్మం యొక్క వివిధ రూపాలు.

**జ్యోతిదర్శనములు :** జ్యోతి లేదా తేజస్సు యొక్క వివిధ రూపాలను తేటతెల్లం చేయడం ఈ ఉపనిషత్తు యొక్క మరొక ప్రత్యేకత. దీనికి మూలం **"జ్యోతియే బ్రహ్మమై"** ఉండడమే. ప్రకృతి సిద్ధమగు మానవుని శరీరము నిర్వర్తించే కార్యక్రమములన్నింటికి వెలుగే ప్రధానము. ఈ వెలుగుకు మూలం ఆదిత్యుడు. బ్రహ్మమే ఆదిత్యుని రూపంలో జగత్తంతా నిండి ఉన్నాడు. మానవుని ప్రతి చర్యకు, స్పందనకు ఈ వెలుగే ప్రధానకారణం. సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి తోడుగా మానవునికి సహాయపడు చున్నారు. వీరిద్దరి ప్రకాశం లేనప్పుడు అగ్ని, మానవుని భౌతిక క్రియలన్నింటికి సహకారిగా ఉంటున్నది. అగ్ని సహాయంతో మానవుడు నిలబడడం, కూర్చోవడం, మాట్లాడడం, స్పందించడం చేస్తాడు. ఆపైన మానవునికి 'వాక్కు' జ్యోతిస్వరూపమై ఉన్నది. వాక్కుయే మానవుని చైతన్యానికి ప్రతీక. శబ్దము ద్వారానే జీవుడు తన కర్మలను నిర్వర్తిస్తున్నాడు.

**"వాక్ జ్యోతిః సమామ్యహమ్।**
**అగ్ని జ్యోతిమ్ సమామ్యహమ్।**
**సకలేంద్రియ జ్యోతిర్నమామ్యహమ్।"**

వీటన్నింటికంటే ప్రతిభావంతమైనది, సూర్యచంద్రుల ప్రభావంను కూడా అధిగమించగలిగినటువంటిది 'ఆత్మజ్యోతి' అయి ఉన్నది.

**ఆత్మైవ అస్యజ్యోతిః - భవతి ఇతి।**
**ఆత్మనైవా ఆయం జ్యోతిషా అస్తే పల్యయతే।**
**కర్మకురుతే । పపత్యేతి-ఇతి?"**

మట్టి బొమ్మలన్నీ, మట్టితోనే తయారగు చందాన, జగత్తులోని సకల జీవరాశులు 'ఆత్మ' అనే పదార్థంతోనే తయారగుచున్నాయి. ఈ అవగాహననే ఆత్మజ్యోతి దర్శనంగా చెప్పవచ్చు. ఇంద్రియములకంటేను, సూర్య-చంద్రులకంటేను, అగ్ని-వాక్కులకంటేను వేరై ఉన్నది. స్వప్న-సుషుప్త, జాగ్రదావస్థలలో చైతన్యమై జ్యోతిర్మయ మగునట్టిది ఆత్మయే!" **జ్యోతిర్జ్యోతి స్వయంజ్యోతిః? ఆత్మజ్యోతిః?"** అన్నది సారవంతమైన వాక్యం. ఆత్మజ్యోతి స్వరూపుడగు పరమాత్మకు జనన-మరణములతో కొంచెం కూడ సంబంధం లేదు. ఈ విధమైన ఆత్మజ్యోతి సర్వదా స్వయం ప్రకాశితము.

**జీవన్ముక్తుడు అంటే ఎవరు?** :ఎవడైతే ప్రాపంచిక విషయములనందు అనాసక్తుడై, హృదయము నందు పరమాత్మను నిలిపి ఉంచుకుంటాడో అతడు దేహముతో సంబంధం లేకుండా ముక్తికి అర్హుడవుతాడు. అమృత రూపమగు పరమ తేజస్సే జీవన్ముక్తిగా చెప్పబడుతున్నది. 'ఆత్మయేవాహమ్' అన్న ఆత్మతత్వమును ఎవరికి వారే వివేకముతో అభ్యాసము చేయాలి. దృష్టి, సృష్టి, హృదయము లందు బ్రహ్మస్వరూపాన్ని ప్రతిష్టించుకొని ప్రకాశమానుడై ఉంటాడో అతడే జీవన్ముక్తుడుగా పరిగణించబడతాడు.

**"ఆత్మానం చేత్ విజానీయత్**
**'అయమ్ అస్మిః' ఇతిపూరుషః,**
**కిమ్ ఇచ్ఛత్, కస్య కామాయ శరీరమ్**
**అను సంజ్వరేత్?"**

"ఏదైతే ఆత్మ అని చెప్పబడుతున్నదో అది మరి ఎవ్వరో కాదు, ఎక్కడనో లేదు, అది నేనే అయి ఉన్నాను". ఎవరైతే సంశయరాహితంగా, చిత్తపూర్వకంగా, హృదయాంతర్గత స్వానుభవము కలిగి ఉంటాడో అట్టివాడు, తన దేహాన్ని ఏ విధంగాను కష్టపెట్టవలసిన పని లేదు. అట్లే దేని గురించి దుఃఖించవలసిన అవసరం లేదు. అటువంటి వానికి 'ఆత్మానం అహమస్మీతి' (ఆత్మయే నేను అయి ఉన్నాను) అన్న భావన కలుగుతుంది. అతడే అద్వితీయుడై వెలుగొందును. అట్టివాడు "ఆత్మన్యేవ ఆత్మానమ్ పశ్యతి", అంటే జగత్తు యొక్క దృశ్యమును మొత్తాన్ని ఆత్మయందే దర్శిస్తాడు.

**సత్యము యొక్క స్వరూపము :** మార్పు చెందనిది, సహజమైనది సత్యము. జగత్తు కంటే ముందే సత్యము ప్రకాశమై ఉన్నది. పంచభూతముల తేజో రూపము, ఆదిత్యుని తేజస్సు సత్యమై ఉన్నది. స్వీయ తేజస్సుతో, సత్యాత్మ స్వరూపుడై ఉన్నది పరమాత్మయే. 'మనోరూప పురుషకార కాంతి' అన్నది వాక్యము. హృదయము నందు సర్వమును ప్రకాశింప జేయునది సత్యమే. మనస్సునే బ్రహ్మంగా భావించిన వ్యక్తికి సమస్త లోకములు స్వీయ మనోరూపంగా గోచరమవుతాయి. ఆ విధముగా బ్రహ్మానందము స్వానుభవము కాగలదు.

**మరణము - పరలోకము :** బృహదారణ్యకోపనిషత్తు ద్వారా మరణము - పరలోకముల గురించి చేయబడిన చర్చ ఎంతో ఆసక్తికరమైనది. ఇందులో దిగువన ఇవ్వబడిన ఐదు ప్రశ్నలకు సమాధానాలు తెలియజెప్పే క్రమము ముఖ్యమైనది.

**ఆ ప్రశ్నలు ఏవనగా :**

- మరణించిన తరువాత జీవులందరు ఏ ఏ మార్గాలలో పరలోకమునకు వెళ్ళుచున్నారు?
- ఆ విధంగా మరణించినవారు ఏ ఏ త్రోవలలో ఈ లోకంలోనికి పునః ప్రవేశిస్తున్నారు?
- ఈ విధంగా మరణిస్తున్న జీవులతో పరలోకము ఎందుచేత నిండిపోవుట లేదు?
- ఎన్నవ ఆహుతి సమర్పించిన తరువాత, ఉదకము పురుష రూపము దాల్చి, వాక్కును పొంది, సంభాషిస్తోంది?
- ఏ ఏ కర్మల కారణంగా ఈ జీవులు దేవయాన, పితృయాన మార్గములు అనుసరిస్తున్నారు? వాటికి సంబంధించిన సాధన-సాధ్యములు ఏవి?

అనేక ఇంద్రియాలతో కూడిన భౌతిక దేహము నుండి ప్రాణశక్తి తొలగిపోయినప్పుడు దేహములోని అగ్ని, విశ్వములోని అగ్నితో ఏకమవుతుంది. ఏ విధంగానైతే జలము, వాక్కు కలసి పురుషుడుగా రూపుదిద్దుకున్నాయో, అదే మాదిరి, అవి వాటి వాటి నిజస్థానాలకు తిరిగి మళ్ళుతాయి. **'తస్మిన్ అగ్ని దేవ ఏతో పురుషం జుహ్వతి'.** దేహాగ్ని హోమముచే, కర్మ విశేషముల నుండి పరిశుద్ధుడై ప్రకాశిస్తాడు. మరణించిన తరువాత జీవుడు రెండు మార్గములు ద్వారా పయనిస్తాడు. ఒకటి, ఉత్తర మార్గము, నిష్కామ ఉపాసనల ఫలితముగా లభించే మార్గము. రెండు, దక్షిణ మార్గము, సకామ కర్మల ఫలితముగా లభించే

మార్గము. దీనినే 'పంచాగ్ని హోత్రోపాసన' అని కూడా పిలుస్తారు. ఆ అగ్నులు ఏవనగా : మొదటిది ద్యులోకాగ్ని (అంటే దేవ లోకం కోసం చేసే ప్రయత్నం), సూర్యాగ్ని ద్వారా పునీతం కావడం. రెండవది, పర్జన్యాగ్ని. అంటే మేఘములు ద్వారా ఏర్పడే అగ్ని, పిడుగులు, మెరుపులు ద్వారా జ్వలించే అగ్ని. మూడవది, లోకాగ్ని. పృథివిపై ఉన్న నదులు, పర్వతములు, సముద్రములు, జీవులు వృక్షములు ద్వారా ఏర్పడే అగ్ని నాల్గవది, పురుషాగ్ని. మానవుడే పురుషుడు. పురుషుని యొక్క తెరిచిన నోరే సమిధగా ఉంది. ఐదవది, స్త్రీ అగ్ని. స్త్రీ యందు రేతస్సును హోమం చేయడం ద్వారా సంతానం జనిస్తుంది. ఈ విధంగా భౌతిక దేహము, కాలగతిచే కర్మలను అనుసరించి మరణం పొందుతుంది. శరీర క్షయము విశ్వయజ్ఞంలో అంతర్భాగమై సాగుతుంది. ఆ విధంగా క్షయమైన వారు ఆకాశమును పొందుతారు. ఆ పైన వారు వాయువుగా, వాయువు నుండి వర్షముగా మరల భూమిని చేరుతారు. ఆ విధంగా సృష్టి కొనసాగుతుంది. ఎఱుక ఏమంటే జీవన సమరంలో దిక్కుతోచక ఉన్నటువంటి మానవుడు. బ్రహ్మజ్ఞానం ద్వారా ఆత్మయొక్క స్వరూపాన్ని తెలుసుకొని, దాని యొక్క సాక్షాత్కారాన్ని పొందుతాడో, అతడే విశ్వకర్తనుగా ఎరిగి ఏకమగుభావనను పొందుతాడు. దీనినే జీవన్ముక్తిగా చెప్పవచ్చు.


**"యస్య అనువిత్తః ప్రతిబుద్ధ ఆత్మా,**
**అస్మిన్ సన్దేహ్యే గహనే ప్రవిష్టః।**
**సవిశ్వకృత్।।**
**సహి సర్వస్య కర్తా**
**తస్య లోకః, సతులోక ఏవ।।"**

పైన చెప్పిన దానిని బట్టి నేనే ఆత్మను అని, సర్వకర్తను అని గుర్తింపు పొందుతాడో అతడు అద్వితీయుడుగా మారతాడు.

**ఆచార్య కోదాటి వియ్యన్నరావు**
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

## కమ్మతెమ్మెర

జూన్ **మిసిమి** లో 'ముసుగులో సొగసు', 'ముసుగే సొగసు' చిత్రాలు చూస్తూ ఓ దివ్యమైన అనుభూతి పొందాను. ఇతిహాసపు చీకటి కోణంలో అట్టడుగున కనిపించని కథలన్నీ కావాలిప్పుడు అంటారు శ్రీశ్రీ. అట్లాంటి పరిశోధనలు చేస్తున్నారు సుధారాణి గారు. బోడినాయకనూరు సంస్థానం వారి చరిత్ర శోధించి వ్రాశారు. స్వయంగా వెళ్ళి ఆనాటి కోటను, కోట ప్రాంగణంలోని తెలుగు మాతృభాష మాట్లాడే వారిని పలుకరించి వారి వారి ఆనాటి స్థితిగతులను – నేటి వర్తమానాన్ని పరిశీలించి చక్కని రచన ద్వారా పరిశోధనాపరమేశ్వరిని అనిపించుకున్నారు. సుధారాణి గారికి అభినందనలు.



కథలకు మారాజు మధురాంతకం రాజారాం గారి కథనం గుండెకు హత్తుకున్నట్లు చెప్పిన శ్రీ రామమోహన రావుగారి ప్రతిభకు నమస్కారం. గొప్ప కథలను మరీ మరీ అందంగా – అద్భుతంగా విశ్లేషించడంలో వారికొక ప్రత్యేకత వున్నదంటాను. యిక గురజాడ ఆరి మధురవాణిని మిసిమి వారు నిత్య సుమంగళిగా పాఠకులకు పరిచయం చేస్తున్నారు. విశ్వనాథం వారో – కృష్ణశాస్త్రిగారో – సామేవదం వారో మేఘుందేశం గురించి చెప్పడం కంటే – మధురవాణి మధురమధురంగా తనదైన హావభావాలుతో చెప్పడంతో ఎడిటర్ గారు ఆశ్చర్యచకితులవుతున్నారనిపించింది. రావెళ్లవారు మేఘసందేశాన్ని మధురవాణితో చెప్పించడంలోనే ఓ సొగసు – సౌందర్యమూ వున్నది. ముక్కుపొడం రంగు వెంకటగిరి జరీ చీర కట్టుకుని – అదేరంగు మేచింగు జాకెట్టు ధరించి – తాంబూలంతో ఎరుపెక్కిన అధరాలతో నడిచి వస్తుంటే – ఎడిటర్ గారు మగ్ధులయిపోయి వుంటారని నా భావన. విశ్వనాథ వారన్నట్లు దీనిదుంపతెగ – మధురవాణికి మరణం లేదు. మధురవాణి అలనాటి ఊర్వశి వసంతసేన కదా! ఆమె మాట–పాట–నాట్యం–నవ్వు అన్నీ అందానికే అందం. మంచి రచన. రావెళ్ల వారికి నా నమస్సులు.

"లేదలనాటి ఉజ్జయిని – లేదలకౌశ ప్రయాణ సమ్మోదయభారము. లేదప్రేమభర మగ్ధుడు నాటి గిరి ప్రవాసి" పద్యపాదాలు జ్ఞాపకం వస్తున్నవి. నెలలో మొదటివారం – పదిరోజులు "మిసిమి"తోనే గడిపేయడం మావంటి వారికి ఆనందకరం. ఆరోగ్య సౌభాగ్యం కూడాన్నూ!

*- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184*

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

### 15. పడవ నడపవోయ్

రచన : వింజమూరి శివరామారావు
సంగీతం : మంగళంపల్లి బాలమురళీకృష్ణ
గానం : పి.బి.శ్రీనివాస్

ఖరహరప్రియ–రూపకం (దాద్రా)

పడవ నడపవోయ్ పూల
పడవ నడపవోయ్ ॥పడ॥

1. చుట్టిన తెరచాపనెత్తి
గట్టిగ చుక్కాని పట్టి
ఒరగనీక,సురగనీక
తరగలపై తేలిపోవ ॥పడ॥

2. చక్కని రాయంచనంచు
చుక్కల తళుకెంచనెంచు
మిన్ను,మన్ను కలుపుచుండ
కన్నులలో దాగునంట
ఊరు దాటి ఏరు దాటి
కడలి దాపు కడలు దాటి
చీకుచింత లేని వింత
లోకానికి చేరునంట ॥పడ॥



పూలపడవ సాగిపోతున్న విధానాన్ని కవి గొప్ప భావనాత్మకంగా వర్ణిస్తున్న గీతం ఇది. మొదటి చరణంలో 'తెరచాప, చుక్కాని, తరగలు, తేలిపోవడం' అనేవి సహజసుందరవస్తువులుగానే కనిపిస్తాయి. కాని వాటి వెనుక తాత్త్వికతను ధ్వనింప జేశారనిపిస్తున్నది. రెండో చరణంలో కవి భావనాబలం మరింత గొప్పగా కనిపిస్తుంది.

రాజహంసలాగా ఒయ్యారపు నడకతో పడవ సాగుతూ ఉంటే, వంటికి ఎంత హాయి కలుగుతుందో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. అలా కిందికి, మీదికి ఊగుతూ వెళ్ళడం ఒక సుఖానుభూతి. రాత్రిపూట ప్రయాణ మంతా నక్షత్రాల ఉనికి ఆధారంగా సాగుతుందని సూచిస్తున్నారు. భూమి, ఆకాశాలకు చెలిమి కలిగించే జలప్రయాణమది. ఊరు, ఏరు, కడలి అలలు అన్నీ సవిలాసంగా దాటుకుని పోయి, నిర్విచారమైన ఒక వింత లోకానికి తీసుకువెళు తుందేమో అని అనిపించే పడవ ప్రయాణమది.

వింజమూరి శివరామారావుగారు (1908–1982) సుప్రసిద్ధగేయకవి. పిఠాపురం తాలూకా చంద్రపాళెం వాస్తవ్యులు. దేవులపల్లి కృష్ణశాస్త్రి వీరికి మేనమామ అంటారు. శివరామారావుగారు 'గౌతమి' అనే కలంపేరుతో ఎన్నో రచనలు చేశారు. విజయవాడ ఆకాశవాణిలో 20 ఏండ్లపాటు స్క్రిప్ట్‌రైటర్‌గా పనిచేశారు. జ్వాల, నవోదయ పత్రికలకు సహాయసంపాదకులుగా ఉన్నారు. 600 రేడియో నాటకాలు రచించారు. "అమరుకం, మొపాసా కథలు, గోర్కీ కథలు" అనేవి వీరి అనువాద రచనలు. 'కల్పవల్లి' అనే వీరి ఖండకావ్యం ఎంతో పేరుతెచ్చింది. "విజయపతాక, కళారాధన, రజకలక్ష్మి, కళోపాసన, కృష్ణదేవరాయలు, విశ్వామిత్ర" అనే వీరి నాటకాలు గొప్పగా ప్రశంసలు పొందాయి. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు వీరిని "కళాప్రపూర్ణ" బిరుదంతో ఘనంగా సత్కరించారు. ఈ పాటలోని చరణాలలో ప్రాసనియమాన్ని చక్కగా పాటించారు. మూలరచనలో మొత్తం మూడు చరణాలు ఉండగా బాలమురళిగారు 2,3 చరణాలను కలిపి రెండో చరణంగా రూపొందించి అందంగా బాణీ సమకూర్చారు.

శాస్త్రీయ సంగీత రంగంలో హిమాలయోన్నతులైన మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు ఈ పాటను ఖరహర ప్రియరాగం, రూపకతాళంలో బాణీ చేయగా సినీసంగీతరంగాన లబ్ధప్రతిష్ఠులైన పి.బి.శ్రీనివాస్ గారు సుశ్రావ్యంగా ఆలపించారు. వీరు ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యులవారి వంశపరంపరలోనివారు. పరమ విశుద్ధమైన సాంప్రదాయిక కుటుంబం నుంచి వచ్చినవారు. "ఓహో గులాబిబాలా, మనసులోని కోరిక, వెన్నెలకేలా, ఎవరికి ఎవరు కాపలా, బుజ్జి బుజ్జి పాపాయి" మొదలైన వేలాది చిత్రగీతాలను పాడి ప్రశంసలు పొందినవారు. సినిమాల్లో పాడుతున్న రోజుల కంటె విశ్రాంత జీవితంలోనే వారి కట్టూ బొట్టూ చాలా విశిష్టంగా దర్శనమిచ్చింది. సాధారణంగా పి.బి. గారి గొంతు ఒకటి శ్రుతి కంటె

హద్దులు దాటదు. కాని బాలమురళిగారు ఈ పడవ నడిపే పాటను మాత్రం వీరితో ఒకటిన్నర శ్రుతిలో పాడించడం గొప్ప విశేషం.

పాట ప్రారంభంలో వయొలిన్, వీణ, వేణువుల మీద 9 ఆవర్తాల బిట్టు నడిచాక పల్లవిని మధ్యమం నుండి సమంలో మొదలుపెట్టి రెండు సార్లు పాడారు. మొదటి చరణానికి ముందు ఆరు ఆవర్తాల బిట్టునిచ్చాక పంచమం నుండి 'చుట్టిన' ను అందుకున్నారు. రెండు పాదాలను కలిపి రెండు సార్లు పాడారు. అయితే, 'గట్టిగచూ....క్కాని పట్టి' అంటూ రెండు సార్లు కూడా బాణీకి ప్రాముఖ్యమిస్తూ పాడడం వల్ల 'చుక్కాని' మధ్యకు తెగిపోయింది. 'గట్టిగా చుక్కాని పట్టి' అని నిర్దిష్టంగా పలికే అవకాశముంది. కాని ఇక్కడ సంగతిపై వ్యామోహంతో 'చూ...క్కాని' అని పాడించారేమోననిపిస్తున్నది.

చరణంలోని రెండో భాగంలో 'ఒరగనీక' నుండి రెండు పాదాలను తారాస్థాయి రిషభగాంధారాలను స్పృశిస్తూ మనోహరమైన సంగతిని వినిపిస్తూ రెండు మార్లు మార్పు లేకుండా ఆలపించారు. అంతేకాక, "ఒరగనీక, సురగనీక" పదాల భావాలను సూచిస్తున్నట్టుగా స్వరాలను పైకి, కిందికి ఊపుతూ, ఆ రకమైన ఎగుడూ దిగుడూ చలనాలు లేకుండా పడవ సాగిందని ప్రకటించే తీరు ఎంతగానో మెచ్చదగినది. దీని తరువాత పల్లవిని ఒక అక్షరం జాగా వదిలి అందుకోవడం వల్ల పాటకు మంచి ఊపు వచ్చింది. మొదటి చరణం బిట్టు లాగానే రెండో చరణానిక్కూడా బిట్టును వినిపిస్తూ ఆరు ఆవర్తాలలో ముగించారు. వెంటనే 'చక్కని రాయంచ' ను దైవతం నుండి క్రొత్తగా అందుకుని 'శ్రీరంజని' రాగచ్ఛాయలలో చరణాన్ని ప్రారంభించారు. మూడవ పాదంలోని 'కలుపుచుండ' నుండి, నాలుగవ పాదాన్ని తారాస్థాయి పంచమం దాకా లాక్కుపోయి 'మన్ను మిన్ను' కలిపే భావాన్ని చక్కగా ఆవిష్కరించారు. వెంటనే రెండు ఆవర్తాలలో వీణ బిట్టును అందించగా, మళ్ళీ ఈ పై నాలుగు పాదాలను బాణీలో ఏ మార్పు లేకుండా పాడారు. తరువాతి రెండు పాదాలను 'ఊరుదాటి' నుంచి అదే తారాస్థాయిలో స్వరసంచారం చేస్తూ పడవ వేగంగా దాటుకుపోయే స్థలాలను నిరూపిస్తూ ఉద్వేగంగా రెండుసార్లు పాడారు. చివరి పాదాలను పాడుతూ 'లోకానికి' పదాన్ని చక్కని అనుస్వరంతో పాడి, పల్లవిని ఒక అక్షరం జాగా వదిలి అందుకున్నారు. కాని రెండోసారి మాత్రం సమంలో పాడారు. పేరుకు ఖరహరప్రియ రాగమే అయినా ఆ రాగజన్యాలైన అభేరి, శ్రీరంజని రాగచ్ఛాయలు కూడా అక్కడక్కడ వినిపించి మురిపించాయి.

### 16. ఆకసమున చిరుమబ్బుల

**రచన : బసవరాజు అప్పారావు**
**సంగీతం : ఎస్.రాజేశ్వరరావు**
**గానం : ఎం.బాలమురళీకృష్ణ**

**<u>కల్యాణి-ఏక</u>**

**ఆకసమున చిరుమబ్బుల చాటున**
**నడగి దాగుమూతలాడెదేలే**
**దాగుమూతలాడెదేలే ॥ఆక॥**



1. చినుకు చినుకులుగ తేనె తుంపురుల
జిలుకుచు చవులూరించెదవేలే
ఘనధారాపాతముగ నమృత మా
కాశవాహినీ! వర్షింపగదే ॥ఆక॥
2. కూను రాగముల దీయు నన్నిటుల
కొనిపోయెదవే వింత సీమలకు
మానిని యిచ్చట నొక్కింత నిలిచి
మదిలోని మాట చెప్పిపోగదే ॥ఆక॥

బసవరాజు వేంకట అప్పారావు గారు (1894-1933) కృష్ణాజిల్లా పటమటలో జన్మించారు. ఆంధ్రపత్రిక, భారతి పత్రికలకు సంపాదకుడుగా పనిచేశారు. కొంతకాలంపాటు న్యాయవాదిగా పనిచేస్తూనే కవిగా ప్రసిద్ధులయ్యారు. ముఖ్యంగా భావకవితాయుగ కవిగా మంచి పేరు సంపాదించుకున్నారు. "వాయు సందేశం, సెలయేటిగానం, ఆంధ్రకవిత్వచరిత్ర, అరేబియన్ నైట్స్ కథలు, ఆంధ్రరత్న గోపాలకృష్ణ చరితం, బసవరాజు అప్పారావు గీతాలు" అనేవి వీరి రచనలు. ఇది 'బసవరాజు అప్పారావు గీతాలు' అనే గ్రంథంలోని 'ఆదర్శము' అనే శీర్షిక క్రింద ఉన్న గేయం. మూలంలో ఉన్న 'నీ కల్యాణాకృతి' అనే అనుపల్లవిని గానానికి స్వీకరించలేదు. రెండవ చరణంలో 'నన్నిటు' కు 'ల' చేర్చారు.

'దాగుడుమూతలు' అని ప్రచారంలో ఉన్న పదాన్ని గమ్మత్తుగా 'దు' తొలగించి, ప్రయోగించారు. 'కూనిరాగం' అంటూ వ్యవహారంలో ఉన్న పదాన్ని అశుభం సూచిస్తుందనుకున్నారో ఏమో, మార్చి 'కూనురాగం' అని ప్రయోగించారు. ఇది ఆ ప్రాంతపు మాండలికం కూడా కావచ్చు. "అడగి, అణగి, అణిగి" అనేవి రూపాంతరాలు. ఈ పదం యతి అవసరం కోసం 'అడగి' అయివుంటుంది. ఇది లేకున్నా భావంలో,అర్థంలో తేడా అంతగా ఉండదు. 'ఏలే' పదాన్ని 'ఎందుకే' అనే అర్థంలో ప్రయోగించడం అన్నమయ్య కీర్తనల్లో కనిపిస్తుంది. "ఏలే ఏలే మరదలా" పాటను గమనిస్తే ఈ విషయం తెలుస్తుంది. బసవరాజు గారికి ఇది స్ఫూర్తి కలిగించి యుండవచ్చు.

ఈ పాటలో వర్ణించింది ప్రేయసిని కావచ్చు, మబ్బుల మాటున దాగిన వర్షాసుందరిని కావచ్చు. భావకవిత్వం కనుక ఏదైనా కావచ్చు. రాలుతున్న చినుకులను తేనె తుంపురులుగా సంభావిస్తూ, చినుకులుగా రాల్చి ఊరించడంలో ధారాపాతంగా అమృతాన్నే కురిపించమంటున్నారు. తేనె చినుకులలో తడిసిన భావుకుడు కూనురాగంలో పరవశిస్తూ ఉండగా ఆ సుందరి వింత లోకానికి తీసుకువెళ్ళిన మధురానుభూతి కలిగిందట. ప్రేమిస్తున్నానన్న మదిలోని మంచి మాటను చెప్పి పొమ్మంటున్నాడు. పల్లవిలో, చరణాలలో యతి నియమాన్ని ఖచ్చితంగా పాటిస్తూ మధుర భావనామృతాన్ని ఈ గేయం ద్వారా రసజ్ఞులకు పంచిపెట్టారు. ఏవో నాలుగైదు సంస్కృతపదాలు తప్ప మిగతా పాటంతా కమ్మని తెలుగు భాషతో అల్లుకుపోయింది.

ప్రారంభంలో వాద్యసంగీతం ఆరు ఆవర్తాలలో వినిపించి గాంధారం దగ్గర వదిలేయగా పల్లవిని ఒక అక్షరం జాగా వదిలి అదే గాంధారం నుంచి బాలమురళి గారు పాటను ప్రారంభించారు. పల్లవి మొత్తాన్ని రెండు సార్లు ఆలపించి 'దాగుమూతలాడెదేలే' ను రిపీట్ చేసి వదిలేశారు. వెంటనే ఒక ఆవర్తంలో బిట్టును వినిపించి తార షడ్జమం దగ్గర వదిలాక మొదటి చరణాన్ని గాంధారం నుంచి ఒక అక్షరం జాగా వదిలేసి ప్రారంభించి మొదటి రెండు పాదాలను రెండు సార్లు ఏ మార్పూ లేక పాడారు. వెంటనే ఒక ఆవర్తంలో మళ్ళీ బిట్టు వినిపించి తార షడ్జమంలో వదిలేయగా అక్కడినుంచే ఒక అక్షరం జాగా వదిలి 'ఘనధారాపాతముగ' అందుకున్నారు. చివరి రెండు పాదాలను కలిపి ఒక్కసారి ఆలపించి పల్లవిని అందుకున్నారు.

రెండో చరణానికి ముందు బిట్‌వర్క్ సమం నుండి ప్రారంభమై ద్రుతగతిలో ఒక ఆవర్తం దాకా సాగి, తార షడ్జమంలో వదిలేయగా అక్కడినుండే 'కూనురాగముల' అని ప్రారంభించారు. మొదటి రెండు పంక్తులను కలిపి రెండుసార్లు పాడుతూ 'దీయు' దగ్గర చక్కని అనుస్వరాన్ని వినిపించారు. వెంటనే ఒక ఆవర్తంలో బిట్టును ఇచ్చారు. తరువాతి రెండు పాదాలను రెండుసార్లు మార్పు లేకుండా పాడి పల్లవిని అందుకున్నారు. ఒకేసారి పల్లవిని పాడి మొత్తం పాటను ముగించారు.

**డా. ఎమ్. పురుషోత్తమాచార్య**
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

## కమ్మతెమ్మెర

12-6-2025

**మిసిమి** సంపాదకులు
శ్రీ వల్లభనేని అశ్వినీకుమార్ గారికి

మహాశయా,



పాల్కురికి సోమనాథుని గొప్పతనం గురించి వినడమే కాని వివరణ తెలియదు. జూన్ **మిసిమి**లో డా. రావి ప్రేమలత వ్రాసిన వ్యాసం ఆ లోటును తీర్చింది. భేష్! నాలాంటి సాధారణ పఠితకు అతని సేముషి విశేషాలను తెలియపరిచింది.

వ్రాసిన వారికీ, వేసిన వారికీ కృతజ్ఞతాభివందనాలు.

**- వి.ఎ.కె. రంగారావు, మద్రాసు**

# అజేయ శక్తి

– ఆచార్య పి. ఆర్. హరినాథ్

**వి**త్తనాన్ని సమాధి చేశాను అనుకోవడం వెర్రితనం. 'లోతుగా పాతిపెట్టాను – పైన మట్టి కప్పాను – ఇక దాని కథ అయిపోయింది – నాతోనా దాని తమాషాలు' అని అనుకుంటే అది చెల్లదు. ఆ విత్తనం రేపు భూమిని చీల్చుకుంటూ మొక్కై వస్తుంది. చెట్టై ఎదుగుతుంది. మానై నిలదొక్కుకుంటుంది. మేఘాలలోకి తలెత్తి మేరునగధీరంతో ధీమాగా చూస్తుంది. మహాప్రతిభావంతుల జీవితం కూడా అలాగే ఉంటుంది అధముడివని, అల్పుడివని తోసి పారేస్తే అద్భుతాలు చూపి అజేయులై నిలబడిన వారెందరో చరిత్రలో ఉన్నారు. మాసిన బట్టలతో ఉన్న వీడెవడు తోసి అవతల పారేయండి అని నందులు చాణక్యుని అవమానిస్తే ఆ తర్వాత చరిత్రను మార్చి చూపాడు ఆ మేధావి.

భర్తృహరి అంటున్నాడు :

**అధిగత పరమార్థాన్ పణ్డితాన్ మావమమ్ స్థా**
**స్తృణమివ లఘు లక్ష్మీర్నైవ తామ్ త్వమ్ రుణద్ధి**
**అభినవమద రేఖా శ్యామ గండస్థలానామ్ న**
**భవతి బిసతంతు ర్వారణమ్ వారణానామ్**

"రాజా, తత్వం తెలిసిన పండితులను తక్కువగా చూడకు. అవమానించకు. నీ సంపద, వైభవం వారిని ఏమాత్రమూ చలింప చేయదు. అది వారికి గడ్డిపరకతో సమానం. అది వాళ్ళను బంధింపజాలదు. అప్పుడప్పుడే కొత్తగా మదజలం స్రవించిన ఏనుగులు ఉంటాయి. వాటి చెక్కిళ్లపై ఆ మదజలంతో నల్లని చారికలు ఏర్పడి ఉంటాయి. కండబలంతో కొండలను పిండి చేసేలా ఉంటాయి. వాటిని తామర తూడుతో అడ్డగించడానికి వీలవుతుందా? ఇది అలాంటిదే. అపురూపమైన విద్యుత్తుతో, తార్కిక బలంతో, తాత్త్విక ఫలంతో ధగధగ లాడే మేధో సంపన్నులను నీ సంపదతో బంధించలేవు" – అని సారాంశం.

ఒక లోకోక్తి ఉంది. లక్ష్మీ సరస్వతులు ఒకచోట ఉండరు అని అంటారు. దాని అంతరార్థం వేరే ఉంది. విద్యార్జన పట్ల, తత్త్వం పట్ల స్పృహ ఉన్నవారికి సంపాదనపై మనసు పోదు. ఇంకా చదవాలి, ఇంకా నేర్చుకోవాలి – అనే తనివి తీరని తపనతో ముందుకు వెళ్లే తత్త్వం వారిది. ఇక లక్ష్మీ ప్రియులు ఉంటారు. వారికి ఇంకా సంపాదించాలి, ఇంకా కూడా పెట్టాలి, సంపదను మరింతగా పెంచుకోవాలి – అన్న దృష్టి ఉంటుంది. విద్యార్జనలో పడ్డవారికి ధనార్జనపై కన్నుండదు. ధనార్జనలో పడ్డవారికి విద్యార్జన పట్ల సమయమూ, మనసూ ఉండదు. లక్ష్మీ సరస్వతులు ఒక చోట ఉండరు అని చెప్పడంలో సంకేతార్థం ఇది.

కవి మాటల్లో ఇది స్పష్టంగా తెలుస్తూ ఉంది. పాండిత్యశౌర్యం ముందు ప్రభువుల వైభవం నిలవదు. దీనిని ఏనుగు లక్ష్మణ కవి తెలుగు చేస్తూ అన్నాడు –

**ప్రభులు పండితులగు వారి వలన గర్వ**
**కలన మానుడు వారు మీ కలిమి తృణము**
**లీల బోలింప లేమి మృణాళ గుణము**
**భూరి మద వారణములకు వారణంబె**

ఈ శ్లోకంలోనూ, పద్యంలోనూ వారణ అనే శబ్దాన్ని చతురంగా ప్రయోగించారు, వారణం అంటే ఏనుగు అని, అడ్డంకి అని – రెండు అర్థాలు ఉన్నాయి. ఆ మాటలను కవి ఇలా ప్రయోగించాడు. మరో దృష్టితో చూద్దాం. ఒకవేళ ఆ విద్వాంసునిపై మహారాజు పగబూని ఇబ్బందులు కలిగిస్తే? కవి అంటున్నాడు :

**అంభోజినీ వనవిహార విలాసమేవ**
**హంసస్య హంతి నితరాం కుపితో విధాతా**
**న త్వస్య దుగ్ధజలభేదవిధౌ ప్రసిద్ధామ్**
**వైదగ్ధ్యకీర్తి మపహర్తు మసౌ సమర్థః**

బ్రహ్మకు ఒకసారి ఏ కారణం చేతనో తన వాహనమైన హంసపై కోపం వచ్చింది. హాయిగా తామర తీగల మధ్య కొలనులో విలాసంగా తిరుగుతూ ఉంది హంస . బ్రహ్మ ఆ కొలనులో నీటిని ఎండిపోయేలా చేశాడు. దాని విహారాన్ని భంగపరచాడు. ఏమి చేసినా కూడా దాని విలాసాన్ని అడ్డుకున్నాడు తప్ప, పాలను నీళ్లను వేరు చేసే దాని గుణాన్ని పోగొట్టలేకపోయాడు. మహారాజైనా, అధికారి అయినా తన క్రింద పని చేసే వారిని తాత్కాలికంగా ఇబ్బంది పెట్టవచ్చు కానీ వారి ప్రతిభను ఏమీ చేయలేడు–

అని అంటాడు కవి. దీనిని అందమైన తెలుగులో అందించాడు ఏనుగు లక్ష్మణ కవి :

**వనజభవుండు గోపమున వాహనమైన మరాళ భర్తకున్**
**వనజ వనీ విహార కలనంబు దొలంగగ జేయు గాని గుం**
**భనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ**
**జనిత మహాయశోవిభవ సారము హంసకు మాన్పజాలునే!**


జీవితం చాలాసార్లు పెను సవాళ్లను విసురుతుంది. ఎదురీదలేనంతటి పెను ప్రళయమై ఎదుగుదలకు అడ్డు నిలబడుతుంది. దానికి క్రుంగిపోరాదు. బెదిరి పోరాదు. మనసు చెదిరిపోరాదు. ఈ రోజు నాది కాకపోవచ్చు. కానీ రేపు నాదే. నా శక్తి వృధా పోదూ అని ధైర్యంగా నిలిచిన వారే సాధించి చూపారు. చీకటి క్రమ్ముకున్నప్పుడు చిత్తం చెదిరిపోతే వేకువ అల్లుకున్నప్పుడు వెలుగుని చూడలేము. ఈ కవి ఇస్తున్న ధైర్యం అదే.

**దీనికి తార్కాణంగా నిలిచే గాథ ఇది :** బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన లియొనార్డో డావిన్సి తొలిరోజుల్లో ఎంతో తిరస్కారాన్ని చవి చూశాడు. ఆ సమయంలో లుడొవికో స్ఫోర్జా అనే వ్యక్తి మిలన్ రాజ్యానికి డ్యూక్‌గా ఉన్నాడు. డావిన్సి ఆయన వద్దకు వెళ్లాడు. తనకు ఏదైనా ఉద్యోగ మివ్వమని అభ్యర్థించాడు. 'నువ్వు ఏం చేయగలవని అంటే డావిన్సి తన అపూర్వ మేధస్సులో నిక్షిప్తమై ఉన్న అద్భుత ఆవిష్కరణల ప్రస్తావనలు చేశాడు. నమూనాలు గీచి చూపాడు. సైనికులకు అవసరమైన పరికరాల గురించి, యుద్ధ తంత్రాల గురించి, యంత్రాల గురించి డావిన్సి వివరించాడు. 'పిచ్చి బొమ్మలు గీచుకునేవాడికి విచ్చుకత్తుల యుద్ధవిద్యలేం తెలుస్తాయీ' అని తోసి పారేశాడు డ్యూక్. ఏ మాత్రమూ దీనిని పట్టించుకోలేదు. ఈ తిరస్కారాన్ని డావిన్సి గమనించాడు. తన సామర్థ్యాన్ని చూపాలనుకున్నాడు. 'వట్టిబొమ్మలు వేయడం కాదు, వజ్ర సదృశ ఆలొచననే చూపుతాను'–అనుకున్నాడు. ఈసారి యుద్ధ వ్యూహాలకు అవసరమైన నిర్మాణాలను రూపొందించాడు. కొత్త కొత్త పరికరాలని చేసి చూపాడు. ఆశ్చర్యం కలిగించేలా అత్యాధునిక యుద్ధ ట్యాంకుల నమూనాలను ఆనాడే మనసులో దర్శించి, ప్రదర్శించాడు. డ్యూక్ దీనిని చూశాడు. డావిన్సీలోని సాంకేతిక దార్శనిక శక్తికి సాగిలబడ్డాడు. ప్రజ్ఞకు పులకించిపోయాడు. ఊహావైశారద్యానికి ఉప్పొంగి పోయాడు. మేధో నైశిత్యానికి మేనువంచి నమస్కరించాడు. ఇంతటి అపురూప వ్యక్తిని తాను చిన్న చూపు చూశానని పశ్చాత్తాప పడ్డాడు. డావిన్సీ అంటే కేవలం ఒక చిత్రకారుడు మాత్రమే కాదనీ, ఒక మహాద్భుత తంత్ర నిర్మాణ చతురుడనీ గౌరవించాడు. ఈ ఘట్టాన్ని గమనిస్తే – డావిన్సీని తక్కువ చేసి చూపించగలిగాడే తప్ప అతనిలోని అంతర్గత శక్తులని అధికారి ఏమీ చేయలేక పోయాడు. చరిత్రలో ఎన్నోసార్లు ఈ సత్యం నిరూపణ అవుతూనే ఉంది.

**ఆచార్య పి. ఆర్.. హరినాథ్,**
మైసూర్, ఫోన్ : 9480443108

## ఇంతిహాసం

**ఇ(ం)తిహాసం - డా. సి. మృణాళిని :** "పురాణేతిహాసాలు పాత్ర ప్రధానాలు కావు. ధర్మాధర్మాల సంఘర్షణ, ఆదర్శ మానవ చిత్రీకరణ, మానవ జీవితాన్ని నడిపించే ఆధ్యాత్మిక భావనలు, భక్తిప్రబోధం వాటిలో ప్రధానాలు. వాటికి కథ ఒక నెపం; పాత్రలు చాలాసార్లు సంకేతాలు మాత్రమే. అందుకే కొన్ని పాత్రలు అసంపూర్ణంగా ఉన్నట్లు అనిపిస్తాయి. అవి విస్తృతమైన భూమికి నేపథ్యంగా నడిచే పురాణేతిహాసాల్లో పాత్రలన్నిటికీ ఎవరి కర్తవ్యాలు వారికుంటాయి. ఈ పరిధిలోంచి చూసినా వాటిలో ప్రత్యేక వ్యక్తిత్వం తళుకులీనుతూనే ఉంటుంది. అందుకే వాటిని సృష్టించిన కారణాన్ని, వారి వ్యక్తిత్వాన్నీ రెండిటినీ పరిగణనలోకి తీసుకునే అర్థం చేసుకోవాల్సి వుంటుంది. ఇంతుల విషయంలో ఇది మరీ నిజం. పురాణేతిహాసాల్లో మరో విలక్షణమైన అంశం ఆయా పాత్రలపై విమర్శ మనం చేయనక్కర్లేదు. ఇతర పాత్రలే ఆ పని కూడ చేసిపెడతాయి చాలాసార్లు. మనం చదివే తీరును బట్టి వుంటుంది ఈ వాచకాలను అర్థం చేసుకోవడం" అంటారు ఆచార్య మృణాళిని గారు.




*పేజీలు : 214, వెల : 200/–, ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, ఫోన్ : 040–24652387, 98490 65147*

# రాజాంప్రాంత శాసనాలు - అరుదైన శిల్పాలు

*- గార రంగనాథం*

'**జ**ననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని ఆదికవి వాల్మీకి తన రామాయణంలో చెప్పాడు. నాపుట్టుక మందరాడ. నా ఉద్యోగజీవనం దానికి సమీపంలోని చిన్న పట్టణం రాజాం. నాది సాహిత్య జీవనం. ఎందుకో గాని నాకు చరిత్ర అన్నా, భాషాచరిత్ర అన్నా తగని మక్కువ. ఈ నేపథ్యంలో రాజాంచరిత్ర రాయాలనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాను. చాలా గ్రంథాలు పరిశీలించాను. కళింగదేశ చరిత్ర, శ్రీకాకుళం జిల్లా చరిత్ర చదివాను. వాటిలో శ్రీకాకుళానికి తూర్పున ఉన్న చరిత్రే అంతాను. రాజాం ప్రాంతం గూర్చి అతి తక్కువ రాశారు. బొబ్బిలి, విజయనగర చరిత్రలపై కూడ టార్చ్ వేస్తే అక్కడక్కడ ఒకటో, అరో రాజాంప్రాంత అంశాలు గోచరించేవి. వాటిని ఒక ప్రక్క భద్రపరుస్తూ, ఐదు సంవత్సరాలపాటు ఈ ప్రాంతంలోని ప్రాచీన కోవెలలు. కొండలు, శిలా విగ్రహాలూ పరిశీలిస్తూ, ముఖ్యమైనవాటి ఫోటోలను పురాతత్త్వ శాస్త్రజ్ఞులకు పంపి, ఈప్రాంత చరిత్రను నిగ్గుతేలుస్తూ వచ్చాను. ఆ శాసనాలు, ప్రత్యేకమైన విగ్రహాలు చెబుతున్న చరిత్రను కాలనుగుణంగా, స్థలానుగుణంగా ఇక్కడ వివరిస్తాను. రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాలపై నేను ప్రధానంగా దృష్టిపెట్టగా, మరికొన్ని పరిసర మండలాలవి కూడ ఇందులో చోటుచేసుకున్నాయి.

రాజాంనుండి బొబ్బిలివెళ్ళే రోడ్డులో ఆరుకిలోమీటర్ల దూరంలో రాజియ్యపేట ఉంది. ఆ వూరికి దక్షిణానగల రాతిదిమ్మపై, రాతిని అరగ దీయగా ఏర్పడిన గోతుల్ని తొలిసారి నేను కనుగొన్నాను. అడుగు, అడుగున్నర పొడవు, ఆరు అంగుళాల వెడల్పు, అంగుళంలోతు కలిగిన రాతి గోతులు అవి. ఆరువేల ఏళ్ళనాటి ఆదిమమానవుల ఆనవాళ్ళు. కొత్తరాతియుగంలో మానవుడు నల్లశానపు రాళ్ళను సూదిగా అరగదీసి జంతువులను వేటాడడానికి ఉపయోగించేవాడని, అలా అరగదీయగా ఏర్పడిన గోతులని వాటిగూర్చి పురాతత్త్వశాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి వివరించారు. సంతవురిటి, సిరిపురం, మంతెన, హెూంజరాం, వాసుదేవపట్నం, కాకరాపల్లి గ్రామాలలో రాతిపాదాలను గ్రామదేవతలుగా ప్రజలు ఆరాధిస్తున్నారు. ఇవన్నీ క్రీస్తుశక ప్రారంభంలో, ఈ ప్రాంతంలో వ్యాపించిఉన్న బౌద్ధమత చిహ్నాలు. రెండు వేల ఏళ్ళనాటి బుద్ధుని పాదాలు. బౌద్ధం అంతరించిన తరువాత ఆయా బుద్ధవిగ్రహాలు శిథిలంకాగా, మిగిలిన పాదాలను ప్రజలు అమ్మవార్లుగా అర్చించుకుంటున్నారు.

మద్దువలస దగ్గరి పాండవుల పంచలోను, తాటిపాడు దరి రాతికొండపైన రోలుగోతులు ఉన్నాయి. గుళ్ళపాడు, తాటిపాడు జైన గ్రామాలు కాగా రోలు గోతులున్న కొండలు, గుహలు జైన బసదులు. మంతిన, సంగాం లలో కూడ చిన్న జైన విగ్రహాలను చూడగలం.

క్రీస్తుపూర్వం నుండీ క్రీస్తుశకం నాల్గవ శతాబ్దం వరకూ వచ్చిన శాసనాలు తొలి తరం శిలాశాసనాలు. అశోకుడు, ఖారవేలుడు తదితరులు రాతికొండలపైన, బండలపైన వేయించారు. బౌద్ధ, జైనమతాలకు చెందిన ఆరామాలకు, బసదులకు దానాలిచ్చిన శాసనాలు ఇవి. ప్రాకృతభాషలోనే వీటిని రాశారు. క్రీ.శ 4వ శతాబ్దంనుండి 11వ శతాబ్దం వరకు వేయించిన శాసనాలు తొలితరం తామ్రశాసనాలు. వీటికి ఉదాహరణ ధవళపేట, సిరిపురం శాసనాలు. సరళ సంస్కృతంలో రాగిపలకలపై చెక్కబడ్డాయి. ఇవి అగ్రహార దానాలు.

క్రీ.శ 11వ శతాబ్దం నుండివచ్చినవి చాలవరకు మలితరం శిలాశాసనాలు. మంతిన, వాసుదేవుపట్నం, తాళాడ, గలావల్లి లలో ఉన్నవి. ఆనాటి తెలుగులోనే తూర్పుగాంగులు వీటిని రాయించారు. క్రీ.శ 1139లో మంతిన శాసనం ప్రధాన వీథిలో మురుగుకాల్వపై మెట్టుగా వాడుతున్నారు. ఆ ఊరిలోని కమ్మటేశ్వర స్వామికి చేసిన దానం. ఇటీవల వరకూ వాడుకలో ఉన్న సిన్నం అనే నాణాన్ని ఇందులో వాడారు. క్రీ.శ 1148లో తాలాడ

శాసనం చెక్కించారు. దీనిలో పిన్నయ రట్టడి, కొమ్మిర రట్టడి, రన్నయ అనే వ్యక్తుల పేర్లు ఉన్నాయి. ఈ రెండుశాసనాలూ తొమ్మిదేళ్ళ తేడాతో తయారు కాగా, రెండింటిలోనూ 'అనంత వర్మదేవర విజయరాజ్య సంవత్సరములు' అని ఉండడం గమనార్హం.

వాసుదేవపట్నం శాసనం రాతికి నాలుగు వైపులా ఉంది. ఒకొక్కవైపు ఒకొక్కరు ఒకొక్క సంవత్సరంలో వేయించారు. ఒకటి క్రీ.శ 1128లోను, మరొకటి క్రీ.శ 1125 లోను వేయించినట్టు రాసిఉంది. అక్కడి కోవెలలోని దేవత దుర్గాదేవి. కోవెల రూపుమాసిపోగా వాయవ్యాన పొలాలమధ్య మట్టిదిబ్బమీద ఇది ఉంది. ఈ ఊరిని వైశ్యాగ్రహారమని పేర్కొన్నారు. వైశ్యులకు అగ్రహారాలు ఇవ్వడం కళింగానికే ప్రత్యేకం. ఈ శాసనాల్లో పహిమిడిపల్లి అనే ఊరు ఉంది. దీర్ఘాసి శాసనంలో పేర్కొన్న బణపతికి కూతురు కాపమ, సూరమ, వీరనాగమ కూతురు కామకోటి అనేపేర్లు ఉన్నాయి. గలావల్లి కోవెలలో రెండు శిలాశాసనాలు సంస్కృతభాషలో ఉన్నాయి. ఈ శాసనాలన్నీ, అప్పటి గుడులలోనే చెక్కించగా, దేవుడి అఖండ వర్తి (అఖండ దీపము) కోసం, పుట్టెడు భూమి, మాడలు అంటూ దానం చేయబడ్డాయి. తెర్లాం మండలం నందబలగలో దొరికిన క్రీ.శ 1059 నాటి నందబలగ శాసనాన్ని కూడ గాంగరాజులే వేయించగా, దానిని రాగిరేకులపై సరళ సంస్కృత భాషలో చెక్కారు. దీనిని మలితరం తామ్రశాసనంగా చెప్పవచ్చు. తామ్రశాసనాలు అన్నీ అగ్రహార దానాలే అని చెప్పవచ్చు. జి. సిగడాం మండలం ఎందువ, సంతవురిటి, పెంట, సంతకవిటి మండలం సిరిపురం, మంతిన, వాసుదేవుపట్నం, తాలాడ, గుళ్ళసీతారామ పురం, రాజాం మండలం పొగిరి, వంగర మండలం అరసాడ, మడ్డువలస, సంగాం, బలిజిపేట మండలం గలావల్లి లలో విగ్రహాలు, కోవెలలు ఉన్నాయి.

సిరిపురం పెద్ద చెరువు గట్టుమీద రెండు కంచెమ్మల విగ్రహాలున్నాయి. ఒక స్త్రీమూర్తి తలపై నాగుపాము శిరసులు ఐదు, మరో దానిమీద ఏడు ఉన్నాయి. ఇవి చెఱువులో దొరకగా ఇంకా మరికొన్ని విగ్రహాలు వాటి మ్రోల అమర్చి ఉన్నాయి. కంచెమ్మల విగ్రహాలను బౌద్ధానికి చెందిన నాగదేవతలని కొందరు, కాదు పద్మాక్షి అనే జైన దేవత విగ్రహాలని కొందరు విశ్లేషించి చెబుతున్నారు. ఈ ఊరిలో వల్లభనారాయణస్వామి ఆలయం ఉంది. దానిని కళింగ గాంగులు కట్టించారని అంటారు. రాళ్ళు మీదపడతాయేమో నన్నట్టుండే శిథిలాలయం అది. ఇటీవల ఆధునీకరించారు. క్రీ.శ 5వశతాబ్దం ప్రారంభంలో సిరిపురం, సంతవురిటి, ధవళపేట గ్రామాల పరిధిలో, మూడు కిలోమీటర్ల వ్యాసంలో వాసిష్ఠుల రాజధాని 'సునగరం' ఉండేది. శాలంకాయనులు పిఠాపురం మీద దాడిచేసి తరిమి వేయడం వల్ల, వాశిష్టీవంశీయులు తమ రాజ్యాన్ని శ్రీకాకుళం దగ్గర సింగుపురానికి, టెక్కలి సమీపంలో ఉన్న వర్ధమానపురానికి, పొందూరు సమీపంలో ఉన్న సిరిపురానికీ మార్చుకొన్నారు. – ఈ విషయం ఆదిభట్ల వేంకటరమణ రచించిన శ్రీకాకుళం జిల్లా చరిత్ర 25వ పుటలో ఉంది. అయితే ఈ ఆదిభట్ల ఈగ్రంథంలో ఎక్కడా ఏవిధమైన ఆధారాలూ ఇవ్వలేదు. విశాఖవర్మ వేయించిన శాసనం, సిరిపురం, ధవళపేటలలో దొరకిన తామ్రశాసనాల ఆధారంగా ఈ సిరిపురమే 'సు' నగరమని నిర్ధారణ చేశాను. కళింగంలోగల ఏ సిరిపురానికీ ఇన్ని శాసనాలూ, విగ్రహాలతో కూడిన చారిత్రక ఆధారాలు లేవు. కాబట్టి ఇక్కడి సిరిపురానికి రెండవేల ఏళ్ళ చరిత్ర ఉంది. జి.సిగడాం మండలం, ఎందువ లోగల తోటలో భైరవతాత పేరుతో ఓ విగ్రహం పూజ లందుకుంటోంది. ఊర్ధ్వలింగ భైరవ విగ్రహమది. అదే ఊరిలో వాయవ్య పొలంలో చిన్నవాగు పక్కనగల మడిలో మహిషాసురమర్దని విగ్రహం భూమిలో పాతుకొనిపోయి ఉంది. ఇదే మండలం పెంట గ్రామంలో పరశురాముని విగ్రహం ఉంది. మహిషాసురమర్దని విగ్రహాలు మంతిన, వాసుదేవుపట్నం, సంగాం, గలావల్లిలో ఉన్నాయి.

ఈ ప్రాంతంలో ఏ ఊరిలోనూ లేనన్ని విగ్రహాలు మంతినలో ఉన్నాయి. కిలోమీటరు వ్యాసంలో కనీసం ఐదుచోట్ల శిల్పాలు ఉన్నాయి. జైన, బౌద్ధ, శైవమతాలు ఈ ఊరిలో పరిఢవిల్లినట్టు ఇవి సాక్ష్యమిస్తాయి. తూర్పున గల పెద్దదైన వినాయకుని విగ్రహాన్ని చాలామంది దర్శిస్తుంటారు. ఉత్తర, వాయవ్య, పడమర దిశల్లో గల పొలాల్లో మూడు పెద్ద మట్టి దిబ్బలమీద అరుదైన విగ్రహాలున్నాయి. అందులో పిల్లల దిబ్బమీద వీరగల్లు ఉంది. ఒక వీరుడు స్త్రీజనంతో వెళ్ళి పందిని వేటాడుతున్న శిల్పం. కామార్ణవుడనే కళింగ గాంగరాజు వేయించిన శాసనం ఈ వూరిలో ఉందని చెప్పుకున్నాం. ఇక్కడ కమ్మటేశ్వరస్వామి ఆలయం అప్పట్లో ఉండేదని ఈశాసనం వల్ల, ఈ విగ్రహాలవల్ల మనకు విశదమౌతుంది.

వాసుదేవపట్నంలో కనుమరుగైన శివాలయం ఉన్నచోట కొత్తగా కట్టిన చిన్నగుడిలో శివలింగం, దానికి ముందర నందులు, లింగాలు ఉన్నాయి. ఆ గుడిలోనే విష్ణువు విగ్రహం ఉంది. వాయవ్యాన పొలాల్లో గల పందువారి తోటలో మహిషాసుర మర్దని ఉంది. వీటన్నిటి కంటే అరుదైన శిల్పం సతిశిల. సతీసహగమన శిల ఇది. రోడ్డుపక్కన గల శ్మశానంలో ఉంది. కళింగాంధ్రలో బొబ్బిలిలో భైరవసాగరం అనే చెరువులో మాత్రమే ఇలాంటి శిల ఉంది. సతిశిలలు నందాపురం (జయపురం) రాజుల కాలంలో వేయబడ్డాయి. అప్పటివే కళింగంలో బస్తర్ ప్రాంతంలో మరికొన్ని కనుగొన్నారు. తెలుగు నేలలో ఇంకెక్కడా లేని శిల్పం ఇది. ఇక్కడి శాసనాన్ని, శిల్పాలను పరిశీలిస్తే, రెండు కిలోమీటర్ల వ్యాసంలో వాసుదేవ పట్టణంగా గాంగరాజుల కాలంలో వెలసి, నందాపుర రాజులకాలం వరకూ విరాజిల్లిందని చెప్పవచ్చు. తాలాడగ్రామం పడమటిదిక్కున, రోడ్డుప్రక్కనే శిథిల శిలాశాసనం ఉంది. శాసనం విష్ణుకోవెలకు ఇచ్చిన దానం అని ఉండగా, దానిని అనుసరించి షష్టిశిల, శివలింగం, శిఖర శిల ఉన్నాయి. తొడమీద బాలుడ్ని పెట్టుకొని ఉన్న షష్టిశిల శైవానికి చిహ్నం కాగా, బౌద్ధంలోని హారీతికి పరిణామ రూపమని చరిత్రకారులు తెలియజేస్తున్నారు. గుళ్ళసీతారామపురంలో బొబ్బిలి రాజులు కట్టిన సీతారాముల ఆలయం ఈ ప్రాంతానికే అతిపెద్దది. ఇది క్రీ.శ 1700కి ముందర నిర్మించింది. బొబ్బిలి వేణుగోపాల స్వామి ఆలయం కంటే, కనీసం 120 సంవత్సరాల ముందర, రాజాం బొబ్బిలిరాజులు రాజధానిగా పాలిస్తున్న కాలంలో కట్టారు. ఇదే ఊరిలో దక్షిణానగల తోటలోగల శివాలయంలో వెయ్యేళ్ళ కిందటి వినాయకుడు, కాళికాదేవి తదితర విగ్రహాలు ఉన్నాయి.

వంగర మండలం అరసాడలో ఒకటి, మద్దువలస కూడలిలో మరొకటి వీరగల్లులు ఉన్నాయి. యుద్ధంలో మరణించిన వీరుల, లేదా శివుడికోసం ఆత్మార్పణ చేసుకొన్న భక్తుల జ్ఞాపకార్థం చెక్కించిన విగ్రహాలు ఇవి. ఐదుకిలోమీటర్ల దూరంలో రెండువీరగల్లులు. కాగా కళింగాంధ్రలో ఇవి అరుదుగాను, తెలంగాణ, రాయలసీమలలో విరివిగాను కనిపిస్తాయి.

మద్దువలస జలాశయ నిర్మాణ సమయంలో, తవ్వకాల్లో దొరికిన విగ్రహాలు, ఆ పరిసరాల్లో అక్కడక్కడా కనిపిస్తాయి. ఈ ప్రాజెక్టు దిగువన గల సంగమేశ్వరుని కోవెలలో చాలా విగ్రహాలు ఉన్నాయి. కోవెల గోడలమీద రెండు చోట్ల సప్తమాతృకల విగ్రహాలున్నాయి. పెద్ద ముక్కుగల గరుత్మంతుని విగ్రహం ఒకటుంది. విష్ణుకోవెలలో స్థంభానికి కిందిభాగంలో చెక్కిన విగ్రహం కావచ్చు. దీనితోపాటు ఈ ప్రాంతంలో దొరికిన సూర్య, విష్ణు విగ్రహాలు ఈ పరిసరాలలో విష్ణు ఆలయం ఉండేదని చెబుతుంటాయి. ఈ కోవెలలోను, గలావల్లి కోవెల, మంతిన గ్రామంలో శివభక్తుడైన లకుటీశ విగ్రహాలు ఉన్నాయి. ఇవి కూడ కళింగాంధ్రకు అరుదైనవి. రాయలసీమ తెలంగాణలలో విరివిగా కనిపిస్తాయి. బలిజిపేట మండలం గలావల్లిలో గాంగరాజులు కట్టిన కామలింగేశ్వరుని కోవెల ఉంది. దానిపై చాలా విగ్రహాలు ఉన్నాయి. కళింగాన్ని 950 సంవత్సరాలపాటు పాలించిన గాంగరాజులు మహేంద్రగిరులలోని గోకర్ణేశ్వర స్వామి భక్తులు. అందుచేతనే వారు కట్టిన శివాలయాలు, వందలకొద్దీ శైవమతసంబంధి విగ్రహాలు ఈప్రాంతంలో విరివిగా దర్శనమిస్తాయి. వీటికి భిన్నంగా రాజాం మండలం పొగిరిలో కాకతీయులనాటి శివాలయం(ఇటీవల ఆధునీకరించ బడింది), నందులు, సర్పశిల్పం ఉన్నాయి. రాజరాజేశ్వరీ దేవిగా పూజలందుకుంటున్న చాముండి విగ్రహం ఉంది. ఆమె పాదాలచెంత ముంగిస, నక్క చెక్కబడి ఉన్నాయి. కాకతీయుల ఇలవేల్పు కాకతియే చాముండేశ్వరి అని చరిత్ర. పదమూడవ శతాబ్దం ప్రారంభంలో కనీసం పది సంవత్సరాలపాటు ఓరుగల్లు ప్రభువులైన కాకతీయులు ఈ కళింగంలోని వంశధార నదివరకూ తమ సామ్రాజ్యాన్ని విస్తరించింది. అదే సమయంలో కళింగాంధ్రలో వీరశైవం విజృంభించింది. ఆకారణంగానే వీరశైవ, శాక్తేయాలకు చెందిన చాముండేశ్వరి, భైరవుడు, మహిషాసుర మర్దని, వీరగల్లులు, కాళిక, లకుటీశుడు ఈ ప్రాంతంలో స్థానం పొందారు.

రాజాం ప్రాంతంలో లభించిన ఆనవాళ్ళ ఆధారంగా పురాతత్త్వశాఖ పరిశోధనలు చేయిస్తే మరింత చరిత్ర వెలుగులోకి వస్తుందన్నది నిఖార్సయిన సత్యం. కృషితో నాస్తి దుర్భిక్షం. ఇంకొన్ని వివరాలకు త్వరలో ముద్రణ కానున్న నా 'రాజాం చరిత్ర – సంస్కృతి' గ్రంథాన్ని చదవగలరు.

గార రంగనాథం
రాజాం (విజయనగరం జిల్లా), ఫోన్ : 98857 58123




- మిసిమి



పతివాడ సూర్యనారాయణ

*పతివాడ సూర్యనారాయణ గారు తొంభయవపడిలో ఉన్నారు ప్రస్తుతం. కమర్షియల్ టాక్స్ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన వారు, గొప్ప సాహిత్య పిపాసి. నాటకాలపై అథారిటీగా భావిస్తారు వారిని. **మిసిమి** బృందం వారిని కలిసి పలకరించినప్పుడు, రాజమండ్రిలో ప్రవహించే గోదారి అలల చప్పుడై, జ్ఞాపకాల్లోకి ప్రవహించారు. ఆయన తూర్పు ప్రాంతం నుంచి వచ్చి రాజమండ్రిలో మేనమామల దగ్గరుండి చదువుకున్నారు. ఆనాటి ఎందరో ప్రముఖులతో వారికి సంబంధ బాంధవ్యాలు ఉండేవి. ముఖ్యంగా వారు ఆంధ్ర నేతాజీగా పేరొందిన మద్దూరి అన్నపూర్ణయ్య గారి శిష్యులు.. **మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ వారి హృదయాన్ని తట్టి లేపారు. వారిరువురి సంభాషణలో ఎగసిపడిన సూర్యనారాయణ గారి జ్ఞాపకాల ప్రవాహాన్ని చూసివద్దాం రండి.*

***మిసిమి*** : **నమస్కారం సూర్యనారాయణ గారు. మిమ్మల్ని కలుసుకోవటం చాలా సంతోషంగా ఉంది. మీకు నాటకపితామహులన్న పేరుంది. మీరో నడిచే జ్ఞాపకాల సంపద.. ఆ సంపదలోంచి కొన్ని మా *మిసిమి* పాఠకులకు పంచండి.**

**పతివాడ :** మా తండ్రిగారు, గుంటూరు మునిసిపాలిటీ ఛైర్మన్‌గా చేసిన ప్రకాశం పంతులు గారి సహచరుడు. నడింపల్లి నరసింహారావు గారి వియ్యంకుడి వ్యవసాయ భూములు ఆలనా పాలనా చూస్తుండేవారు. రాజమండ్రి సమీపంలో ఉండేవి ఆ భూములు.. అక్కడ బోర్డు స్కూల్‌లో ఎనిమిదవ తరగతి వరకే ఉండేది. ఆ తర్వాత చదవాలంటే రాజమండ్రి అన్నా వెళ్ళాలి. పోలవరమన్నా వెళ్ళాలి. మా ఊళ్ళో మాకో రాములవారి గుడుండేది. అక్కడ వైష్ణవులు పురాణం చెబుతుండేవారు. నేను అక్కడే కూచుంటూ ఉండేవాడిని. అక్కడే పిల్లలు ఆటలవీ ఆడుతుండేవారు. నేను ఆటలు జోలికి పోయేవాడిని కాను. ఆ రోజుల్లో దాకల్లో వంట చేస్తుండేవారు. నేను ఎప్పుడూ ఇంట్లో అలా చేయటం చూసిన పిల్లలు నన్ను దాకలోడు అని పిలిచేవారు. ఆరోజుల్లో టీచర్స్ ఎంత బాగా శ్రద్ధగా చెప్పేవారో. మాకు పాడి ఉంది కదా, పాలో పెరుగో తీసుకెళుతూ ఉండేవాడిని. మాస్టారు కూచోబెట్టి పాఠం శ్రద్ధగా చెప్పేవారు. రాజమండ్రిలో రత్నాంగి, చిత్రాంగి అని రెండు బళ్ళుండేవి. రత్నాంగి ఆడపిల్లల బండి. చిత్రాంగి మగపిల్లల బడి. మా నాయనగారు బ్రాహ్మల పిల్లలు, వైశ్యుల పిల్లలు చదువుకోవటం చూసి నన్ను చదివించాలని భావించారు. అలా నన్ను చదివిస్తుండగానే, రాజమండ్రి మునిసిపాలిటీలో మా చుట్టమొకాయన పనిచేస్తుండేవాడు. నన్ను ఆయన దగ్గర ట్యూషన్‌కు పెట్టాడు. నాతోపాటు ఇంకో పది, పదిహేను మంది ఉండేవారు. నాకు ఎక్కాలవీ బాగా రావటంతో వాళ్ళని నామీద వదిలేస్తుండేవాడు మా చుట్టాలాయన అప్పుడు ఫస్ట్ ఫార్మ్‌లో చేరటానికి ఎంట్రెన్స్ పరీక్ష ఉండేది. అది రాసి నేను పాసయ్యాను.

కొత్తగా పల్లెటూరి నుంచి వచ్చాను కదా. అంతా కొత్తగా ఉండేది. పిల్లలు ఆటలాడుతుంటే నాకు బెరుకుగా ఉండేది. కల్చరల్ ప్రోగ్రాములు జరుగుతుండేవి వాటిని చూసేవాడిని. అక్కడ కలగ కృష్ణమూర్తి గారనే టీచర్ ఉండేవారు. ఆయన నాటకాలవీ కండక్ట్ చేస్తుండేవారు. ఆ రోజుల్లో ప్రతిదీ రికార్డు చేసేవారు. నా ఎస్సెల్సీ రిజిస్టర్‌లో plays when compelled అని రిమార్క్ ఉండేది. ఇప్పుడలాంటివి ఊహించగలమా? నాటకాలు రిహార్సల్స్ చూస్తుండటం అలవాటయ్యింది. నాకేదైనా పాత్ర ఇస్తే బావుణ్ణు అనుకునేవాడిని. మా మాస్టర్లు నేనంటే కొంచెం sympathetic గా ఉండేవారు. నువ్వు కొత్తగా వచ్చావు. టైం పడుతుంది. ఈలోగా ప్రతిరోజూ వచ్చి చూస్తుండు. కొంచెం కొంచెం బోధపడుతుంది అన్నారు. పాతనటి కృష్ణవేణి మా ఇంటి పక్కనే ఉండేది.

మళ్ళీ నాటకం దగ్గరికి వేస్తే, ఒకరోజు నాటకంలో రాజు గారి డైలాగ్ ఉంది. ఎవరక్కడ అంటే చిత్తం ప్రభూ అని సైడ్ వింగ్‌లో చెప్పాలి. మాస్టారినడిగి ఆ డైలాగ్ చెప్పాను. నా తపన నచ్చి ఆయన తులాభారంలో నళిని, వసంతకుడు పాత్రలుంటాయి కదా. అందులో నళిని పాత్ర నేను వేశాను. విజయకుమార్ అనేవాడు కృష్ణవేణి దగ్గరుండేవాడు. వాడు సత్యభామ. కృష్ణుడు వైవి వెంకటేశ్వరరావు అని తర్వాత కాలంలో ఆదాయపన్ను శాఖ బెంగుళూరులో పనిచేశాడు. ఆ కాలంలో మైకులు లేవు.. పెట్రో మాక్స్ లైట్లు ఉండేవి. ఇంతకీ ఆ నాటకాన్ని మా నాన్న చూశాడు. ఎంత ఆనంద పడిపోయాడో.. దానివలన నా చదువుకు ఇంక ఆటంకం ఏర్పడలేదు. ఎస్సెల్సీకి వచ్చేసరికి చాలా నాటకాల్లో ఆడవేషాలు వేశాను. వరవిక్రయంలో సుభద్ర వేషం వేశాను. ఊళ్ళో ఆచార్లు గారనే ఆయనకు నాటకాల కంపెనీ ఉండేది. ఆయన నాకు వారి ట్రూప్‌లో వేసే అవకాశం కల్పించారు. అక్కడ కూడా ఎక్కువ ఆడవేషాలే వేశాను. నేను కొంచెం ఎర్రగా, బుర్రగా ఉండటంతో ఎక్కువగా ఆడవేషాలు వేయాల్సి వచ్చేది. చాలామంది మగ నటులే ఆడవేషాలు వేస్తుండేవారు.

**మిసిమి :** **మీరు ఒకవిధంగా నాటకానికి పితామహులే. అయితే నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు అప్పట్లో అన్నీ పద్యనాటకాలేకదా?**

**పతివాడ :** నాటకం ప్రారంభమైంది రాజమండ్రి నుంచే అని చెప్పాలి. నెల్లూరులో కూడా ఎక్కువగా ఆడేవారు. ఎక్కడ ఆదరణ ఉంటే అక్కడ ఆడేవారు. నేను నాటక రంగంపై the cradle of Telugu Stage అని ఇండియన్ ఎక్స్ప్రెస్ వారడిగితే రాజమండ్రి గురించి ఒక వ్యాసం రాశాను. అంతకుముందు తూర్పుగోదావరి జిల్లా నాటక రంగంపై ఒక పుస్తకం వెలువరించాను. రాజమండ్రి నాటకానికి చాలా ఫేమస్ అని చెప్పుకోవాలి. ఆరోజుల్లో గున్నేశ్వరరావుగారి కంపెనీ, ఇంకా ఇతర నాటక సమాజాలు రాజమండ్రిలో ఉండేవి. గున్నేశ్వరరావుగారు, ఆయన బావమరిది కలిసి ఈ నాటక సమాజాన్ని నడిపించే వారు. వీరు ఎక్కువగా పౌరాణిక నాటకాలు ఆడేవారు. జాషువా గారు కొంతకాలం ఇక్కడ ఒక స్కూల్లో పనిచేశారు. ఆ సమయంలో ఆయనకు ఉన్న నాటకాభిరుచి వలన గున్నేశ్వరరావుగారిని కలిశారు. ఈ ఉదంతం అంతా వారి "నాకథ"లో మనం చూడొచ్చు. ఆయనకు గునేశ్వరరావు కంటే చిలకమర్తి బాగా దగ్గర.

**మిసిమి :** **అప్పుడు శ్రీపాద ఉన్నారా.. ఇక్కడ..?**

**పతివాడ :** కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కొంచెం రాజమండ్రికి దూరంగా ఉండేవారు. నాకు మాత్రం ఇక్కడికి వచ్చాక శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రితో పరిచయం ఏర్పడింది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు "బొబ్బిలి యుద్ధం" అనే నాటకం రాశారు. అది ప్రదర్శించేవారు. ఆరోజుల్లో నాటక రచయిత ఎన్.ఆర్. నంది భార్య తాతగారు ముప్పిడి జగ్గరాజు గారని చాలా ప్రాచుర్యం కలిగిన నటులు. ఆయన ఆడపాత్రలు ఎక్కువగా ధరించేవారు.

**మిసిమి :** **మీ వయసెంత! మీ ఆరోగ్య రహస్యం ఏమిటి?**

**పతివాడ :** నాకు ఇప్పుడు తొంభై ఆరు నడుస్తోంది. ఈ ఆగస్టులో తొంభై ఏడులో ప్రవేశిస్తాను. నా ఆరోగ్య రహస్యం ఏమిటంటే మద్యం, పొగాకుకు దూరంగా ఉంటాను. భోజనం బాగా చేస్తాను కానీ, నాకు నిజమైన ఆహారం పుస్తకాలే. చదువుకోవటంలోనూ, రాసుకోవటంలోను సమయం గడిపేస్తాను. ఎప్పుడైనా మీలాంటి

సన్మిత్రులొస్తే , సాహిత్య కాలక్షేపం అవుతుంది. అలవాటయ్యే అవకాశం ఉన్నా దూరంగా ఉన్నాను. నేను సి.టి.ఓ.గా పనిచేసినప్పుడు ILTD కంపెనీ అక్కౌంట్స్ తనిఖీ చేసినప్పుడు ముందరే మావాళ్ళ చేత చెప్పించేవాడిని. అన్నీ దూరంగా ఉంచేవాడిని. ఆరోజుల్లో గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్లు టిన్స్ రూపంలో వచ్చేవి. రామచంద్రపురంలో మా మామగారు ఉండేవారు. ఆ సిగిరెట్లు తేవచ్చు కదా అని మా మామగారు అడుగుతుండేవారు (నవ్వు). ఇలాగే ఇక్కడ తోళ్ళ వ్యాపారస్తులుండేవారు. కానీ వాళ్ళ రికార్డులు మద్రాసులో ఉండేవి. అవన్నీ తీసుకురాలేక మమ్మల్ని తీసుకెళ్ళేవారు. అక్కడ కూడా ఈ మర్యాదలకు దూరంగా ఉండేవాడిని. నేను మాత్రం జగ్గయ్య ఇంట్లో ఉండేవాడిని.

**మిసిమి :** **మీకు జగ్గయ్య ఎలా పరిచయం?**

**పతివాడ :** మీకు మద్దూరి అన్నపూర్ణయ్య గారు తెలుసు కదా. ఆంధ్రనేతాజీ అనేవారు. ఆయన పదహారేళ్లు జైలు జీవితం గడిపిన నిస్వార్థజీవి. ఆయనంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని తరచూ కలుస్తుండేవాడిని. ఆయన 1925లోనే జయభారత్ అనే పేపర్ పెట్టాడు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు కన్నా ముందే పెట్టాడు. అప్పటికే అన్నపూర్ణయ్య గారు "కాంగ్రెస్" అనే పత్రికకు ఎడిటర్. క్రొవ్విడి లింగరాజు సబ్ ఎడిటర్‌గా ఉండేవాడు. ఇక్కడో విషయం చెప్పాలి. అల్లూరి సీతారామరాజు, అన్నపూర్ణయ్య గారి క్లాస్మేట్. ఇద్దరూ కాకినాడ పి.ఆర్.కాలేజీ హైస్కూల్లో కలిసి చదువుకున్నారు. జయభారత్‌లో ఎప్పుడూ అల్లూరి సీతారామరాజు గురించే రాసేవారు. నాకు ఆ సంగతులు చెబుతుండేవారు. నేను కూడా విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా ఉండేవాడిని. స్టూడెంట్ కాంగ్రెస్‌లో ఉండేవాడిని. ఏయస్ ఆర్ కృష్ణ అని సెక్రటరీ. ఇంకా ఎన్వీయస్ ప్రసాదరావు, బలుసు రామకృష్ణ రావు, భూపతి కోటేశ్వరరావు.. వీరందరూ ఆరితేరిన వక్తలు. మేమంతా సోషలిస్టులం. మాకు గురువు అన్నపూర్ణయ్య గారు. ఇంకో గ్రూప్ ఉండేది. అది "రాంగేయులు" గ్రూప్. రాంగేయులు అంటే ఎన్.జి.రంగా ఫాలోయర్స్. ఈ రాంగేయులు ఎవరంటే ఏ.యస్.ఆర్.కృష్ణ, వీరాచారి. వీళ్ళొక స్కూల్ పెట్టారు లెండి. ఆ స్కూల్ రాజకీయ పాఠాలు నేర్పేది. సరిసెట్టి ఇన్నయ్య గారి తమ్ముడు కూడా వీరితో ఉండేవాడు. తర్వాత మేము విడిపోయాము. అప్పుడే కృష్ణ అటు వెళ్ళిపోయాడు. గాంధీ గారు విద్యార్థులు రాజకీయాల్లో ఉండకూడదంటే, స్టూడెంట్స్ కాంగ్రెస్ రద్దు చేశారు. నేను కరుటూరి సత్యనారాయణ సోషలిస్టు పార్టీలో చేరిపోయాం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు సత్యనారాయణ ముఖ్యపాత్ర పోషించాడు.ఆరోజుల్లో నేను సత్యనారాయణ యంగ్ సోషలిస్టు లీగ్ మొదలుపెట్టాం.. అలా అయితే స్టూడెంట్స్‌కు సంబంధం ఉండదు కదా అని ఆ పేరు పెట్టాం. ఆ సమయంలో స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థుల్లో బాగా వెళ్ళింది. ఇంకో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. దాన్ని ఎదుర్కోవటానికి మేమంతా కలిసి డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ పెట్టాం. ఇందులో రాంకుమార్ సిన్హా మాకు తోడ్పడ్డాడు. అతను తర్వాత కేంద్రంలో మంత్రయ్యాడు. అప్పటికి ఏబికె చైతన్య ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతున్నాడు. వారిని ప్రెసిడెంట్ చేశాం. నేను సోషలిస్టు లీగ్ కార్యదర్శి. కమ్యూనిస్టులను ఇలా ఫేస్ చేశాం. ఈ సమావేశాల్లోనే జగ్గయ్య కలిసేవాడు. అతను, ఏయస్‌ఆర్ కృష్ణ క్లాస్మేట్స్. జగ్గయ్య తెనాలివాడే కదా. జగ్గయ్య కూడా చక్రపాణి, యడ్లపాటి వెంకట్రావు వాళ్ళ తరపునే ఉండేవాడు. అందరూ సోషలిస్టులే కదా. జగ్గయ్య మంచి వక్త. నేను మద్రాసులో కొంతకాలం అక్కౌంటెంట్ జనరల్ (పోస్టల్) కార్యాలయంలో పనిచేశాను. అప్పుడు జగ్గయ్య ఇంట్లో ఉండటం జరిగింది. అది కాకుండా మద్రాసు ఎప్పుడు వెళ్ళినా వాళ్ళింట్లోనే దిగేవాడిని.

**మిసిమి :** **మళ్ళీ నాటకాల దగ్గరికి వద్దాం.. పద్య నాటకాల తర్వాత సాంఘిక నాటకాల్లో చింతామణి, వరవిక్రయం వంటివి చాలా పేరొందాయి కదా..**

**పతివాడ :** ప్రహసనాలు వచ్చాయి. భమిడిపాటి కామేశ్వరరావు గారు మొయిలేర్‌ని అనువాదం చేసేవారు.

**మిసిమి :** **సబ్జెక్టు ఏమిటి?**

**పతివాడ :** "పెళ్లి ట్రైనింగ్" అనే ప్రహసనంలో నేను యాక్ట్ చేశాను. నాకు మంచి పేరొచ్చింది. మరో ప్రహసనం "ఎప్పుడూ ఇంతే". ఆయన ఎక్కువగా మొయిలేర్‌ను అనువాదం చేశారు. వారబ్బాయి భమిడిపాటి

రాధాకృష్ణ కూడా నటించేవాడు. నేను మగవేషాలు వేయటం మొదలుపెట్టింది కామేశ్వరరావు గారి ప్రహసనాలు తోటే. తనుకూడా నాటకాలు రాయటం మొదలుపెట్టాడు. "భజంత్రీలు" అని ఒక నాటకం రాశాడు. అది నేను ఇంటర్మీడియెట్‌లో వేశాను. ఇక్కడో విషయం చెప్పాలి. ఇంటర్మీడియెట్ తర్వాత బి.ఏ.లో నాకు సీటివ్వలేదు. దానికి కారణం నా పెళ్లి. నా భార్య, నేను ఇంటర్మీడియెట్ క్లాస్మేట్స్. ఇద్దరం ఇష్టపడ్డాం. మా గురువుగారు అన్నపూర్ణయ్య గారికి చెప్పాను. ఆయన నన్ను కేకలేశాడు. అప్పుడే పెళ్ళేంటని.

**మిసిమి :** **అప్పుడు మీ వయసు ఎంత?**

**పతివాడ :** డింకీలు కొట్టా కదా.. ఇరవైమూడేళ్ళు అప్పుడు నాకు. నా వైఫ్, మా వదిన గారు వచ్చారు. నా వైఫ్, గురువు గారిని అడిగింది. గురువుగారు, మీరు పూనుకుని మా వైపుండి మా పెళ్ళి చేయాలి. మా నాన్నగారు చేయరు అని బతిమాలింది. అప్పటికే ఆయన చంద్ర రాజేశ్వరరావు, భాట్టం శ్రీరామమూర్తి పెళ్ళిళ్ళు చేశాడు. శ్రీరామమూర్తి గారిది కులాంతర వివాహం. రాజేశ్వరరావు గారిది అదే కులం కానీ, కమ్యూనిస్టని ఆడపిల్ల ఇంట్లో వాళ్ళు వ్యతిరేకంగా ఉండేవారు. అప్పుడు కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలిసే ఉండేవారు. అప్పట్లో జైభారత్ పత్రిక ఆయనే పెట్టారని చెప్పా కదా. ప్రజాశక్తి కూడా ఆయనే పెట్టారు. ఆయనే ఎడిటర్. అన్నపూర్ణయ్య గారు, నేను నాటకాలపై చిన్న చిన్న వ్యాసాలు రాస్తే వేసేవారు. అలాగే ఆంధ్రజ్యోతిలో రాసేవాడిని. నండూరి రామమోహనరావు, నేను కలిసి నాటకాలు వేసేవాళ్ళం. తను నాకు రాజమండ్రి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నాకు జూనియర్. ఆరోజుల్లో ఎన్టీఆర్ వాళ్ళు కరువు, కాటకం వస్తే నాటకం వేసేవారు కదా. దానికి "కాటకానికో నాటకం" అని వ్యంగ్యంగా వ్యాసం రాశాను.

**మిసిమి :** **ఆ రోజుల్లో ప్రహసనాలు ఇంకా ఎవరు వేసేవారు?**

**పతివాడ :** మేమే వేసేవారం. రాధాకృష్ణ నాటకాలకు వెళ్ళిపోయాడు. ఒకసారి భమిడిపాటి రాధాకృష్ణకు రమణయ్య రాజా సన్మానం చేస్తే నేను వక్తగా మాట్లాడుతూ ఒక్కమాట అన్నాను. ఈ తండ్రీకొడుకులు (భమిడిపాటి కామేశ్వరరావు, రాధాకృష్ణ) ప్రహసనాన్ని నాటకంగాను, నాటకాన్ని ప్రహసనంగాను మార్చిన ఘనత కలిగినవారు అన్నాను. సమావేశం అవగానే గొల్లపూడి మారుతీరావు నాదగ్గరకు వచ్చి, అద్భుతమైన విషయాన్ని చెప్పావయ్యా, మాకెవరికీ తట్టని విషయం చెప్పావని మెచ్చుకున్నాడు.

**మిసిమి :** **కామేశ్వరరావు గారిది రాజమండ్రియేనా?**

**పతివాడ :** ఆయనిది ఆకివీడు. రాజమండ్రిలో చదువుకుని వీరేశలింగం పంతులు గారి హైస్కూల్లో లెక్కలు మాస్టారిగా పనిచేశారు. నా వైఫ్ ఆయన స్టూడెంట్. నేను కాదు. నేను గవర్నమెంట్ హైస్కూల్లో చదివాను. ఆయన నా వైఫ్‌కు టీచర్. కామేశ్వరరావు గారు ఎవరినీ పొగడడు. ఆయన కొడుకెళ్ళి, నాన్నా ..నా కీర్తిశేషులు నాటకానికి ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని చెబితే, ఇంతకంటే వెధవ నాటకాలు పోటీకి చాలానే వచ్చాయన్న మాట అన్నాడాయన.

**మిసిమి :** **మీరు చింతామణి నాటకం ఆడారా ఎప్పుడయినా?**

**పతివాడ :** నేను అందులో చిత్ర కేరక్టర్ వేశాను. ఈ నాటకంలో సుబ్బిశెట్టి వేషానికి గొప్ప పేరు తీసుకొచ్చినవారు ఘండికోట జోగినాథం గారు. వారిది కాకినాడ. వారి శిష్యుడే రేలంగి వెంకట్రామయ్య. ఆతను కూడా సుబ్బిశెట్టి పాత్ర వేశారు. తరవాత ఆ నాటకంపై రాజకీయాలొచ్చేశాయనుకోండి.

**మిసిమి :** **వరవిక్రయం సంగతేమిటి?**

**పతివాడ :** ఇదికూడా కాళ్ళకూరి నారాయణరావు గారి రచనే. ఇందులో కూడా నేను వేశాను. దాంట్లో సుభద్ర వేషం నాది. సింగరాజు లింగరాజు భార్య ఈ సుభద్ర. ఇదే సినిమా తీసినప్పుడు భానుమతి, పుష్పలత వేశారు.

**మిసిమి :** **ఎప్పుడైనా కన్యాశుల్కం నాటకం వేశారా స్టేజ్ మీద ఎవరు ఎక్కువ వేశారు. అంతకుముందు స్టేజ్ మీద వేయటానికి వీలుగా ఉండేది కాదు. అబ్బూరి రామకృష్ణరావు పూనుకుని స్టేజ్‌కు అనుగుణంగా మార్చారు కదా. అడాప్ట్ చేసిన తర్వాత వేయి ప్రదర్శనలిప్పించారు కదా.**

**పతివాడ :** కన్యాశుల్కం నాటకం నూరేళ్ళ సందర్భంగా నేను విజయనగరం వెళ్ళాను. ఆరోజు ఆ నాటక ప్రదర్శనతో తెల్లవారిపోయింది. రెండో తరంలో రమణమూర్తి, సోమయాజులు ఆ నాటకాన్ని చాలా popularise చేశారు.

*మిసిమి :* **కన్యాశుల్కం ప్రదర్శన కన్నా చదువుకోవటానికి వీలుండే నాటకం. ఆ తర్వాత ప్రజానాట్యమండలి వచ్చింది కదా.**

**పతివాడ :** అవును. వారి కళాకారులు ఎంతో నిబద్ధతతో ఉండేవారు.

*మిసిమి :* **గరికిపాటి రాజారావు వలన ప్రజానాట్యమండలి లాభపడిందా?**

**పతివాడ :** రాజారావు రాజమండ్రిలో ప్రాక్టీస్ పెట్టాడు. నాటకాలంటే ఇష్టముండటం వలన ఆయన కూడా ఒక నాటక సమాజం పెట్టాడు. చాలామంది నాటకాలు ఆయన శిష్యరికంలో ప్రదర్శించారు. నేను చెప్పాను కదా ఆచారి గారనే వైష్ణవుడి సమాజంలో ఉంటూ నాటకాల్లో వేస్తుండేవాడిని. ఒకసారి తమ సమాజంలో నాటకం వేయమని రాజారావు గారు కబురు పెట్టాడు. నేను ఆ వార్త తెచ్చి నాయనకు చెప్పాను. నాకు ఆచారి గారు మంచి పాత్రలిస్తున్నారు, కాబట్టి వేయలేనని.. కానీ నేను రాజారావు గారి నాటకాలు చూస్తున్నాను అని చెప్పాను. ఆరోజుల్లో యుద్ధం జరుగుతున్నప్పుడు నేషనల్ వార్ ఫ్రంట్ అనుండేది. కమ్యూనిస్టులు దాన్ని పీపుల్స్ వార్ అన్నారు.

రాజారావు గోదారి నదిలో రెండు బోట్లను జాయిన్ చేసి దానిమీద డాన్సాడాడు. ఆయన చుట్టాలిక్కడ ఉండేవారు. అందుకు ఆయన ఇక్కడికి వచ్చాడు. నేను ఆయన నాటకాల్లో వేయనన్నానని నొచ్చుకున్నాడు. ఒకసారి కలిసినప్పుడు నువు బాపనోళ్ళ నాటకంలో వేస్తావు కానీ, మాదగ్గరెందుకేస్తావు అన్నాడు. ప్రజానాట్యమండలిలో మంచి మంచి నాటకాలు వేయించాడు రాజారావు. పెద్దపెద్దవాళ్ళను పిలిపించి లెక్చర్లిప్పించేవాడు. గొప్ప కృషి చేశాడు. ఎందరినో నాటకరంగం కోసం తయారుచేశాడు..

*మిసిమి :* **కీర్తిశేషులు నాటకం ప్రజానాట్యమండలికి అడ్డుకట్ట వేసిందా?**

**పతివాడ :** అలా అని చెప్పలేం కానీ, చాలామందిని నాటకరంగం వైపు ఆ నాటకం మళ్ళించింది. ఆ నాటకానికి వచ్చిన బహుమతులు మరే నాటకానికి వచ్చి ఉండవు. ఒక ఒరవడి సృష్టించింది ఆ నాటకం. రాధాకృష్ణ నా శిష్యుడు.. రాజమండ్రిలో నాకు పెద్ద సన్మానం చేశాడు. ఆ సన్మానానికి ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ కూర్మ వేణుగోపాల స్వామి వచ్చాడు. అలాగే రావుగోపాలరావు మరో శిష్యుడు. నేను కాకినాడ కాలేజీలో చదివేటప్పుడు అతన్ని నాటకాల్లో ప్రవేశపెట్టాను. తను కూడా "నా గురువు పతివాడ" అని ఒక వ్యాసం రాశాడు.

*మిసిమి :* **మొదట్లో మీ పెళ్ళి గురించి కొంత చెప్పారు.. తర్వాత ఏమయింది?.**

**పతివాడ :** మా గురువుగారు మద్దూరి అన్నపూర్ణయ్య గారిని అడిగాను కదా. మా మామగారు పేరున్న అడ్వొకేట్. ఆయన మా పెళ్ళికి ఒప్పుకోలేదు. ఆ విషయం చెప్పాను. అందుకని అన్నపూర్ణయ్య గారు మమ్మల్ని విజయవాడ తీసుకెళ్ళారు. అక్కడ విజయవాడలో సోషలిస్టు పార్టీ ఆఫీసు ఉండేది. అందుకని ఇక్కడ మా పెళ్లి చేశారు. అది 1951, 52 ప్రాంతంలో అనుకుంటాను. మాది కులాంతర వివాహం. మా మామగారికి కోపం తగ్గాక, ఆయనే వచ్చారు. నువ్వు తెలివైనవాడివి. నీ కెరీర్ చూసుకో.. రాజకీయాల్లో వలలో చిక్కుకోకు అని తీసికెళ్ళారు. నేను చేసిన పనికి కోపంతో రాజమండ్రి కాలేజీ ప్రిన్సిపాల్ నాకు సీటు ఇవ్వలేదని కాకినాడలో డిగ్రీలో చేరాను.

*మిసిమి :* **చలం గారిని కలిశారా ఎప్పుడైనా?**

**పతివాడ :** విజయవాడలో తర్వాత కొంతకాలం ఉన్నప్పుడు చలం గారు డా.రంగనాయకమ్మగారి హాస్పిటల్‌కు వస్తూ ఉండేవారు. అలా కలిసి మాట్లాడాను.ఆయన రాజమండ్రిలో బి.ఎడ్.చదివారు, పనిచేశారేమో.. అప్పుడు పరిచయం లేదు.

*మిసిమి :* **పడమటి గాలి నాటకం చూశారా?**

**పతివాడ :** చూశాను, కానీ గుర్తులేదు.

**మిసిమి** : **తెలుగు నాటకం అక్కడితో ఆగిపోయింది.**

**పతివాడ :** నాటకం అంటే ఒకటి గుర్తొస్తోంది..మా కాలంలో "చిచ్చరపిడుగు" అనే నాటకాన్ని నిషేధించారు. నిషేధించిన ఆ నాటకాన్ని మా గురువుగారు తన జయభారత్ పత్రికలో ప్రచురించారు. దానికి బ్రిటిష్ ప్రభుత్వం వారు రచయితను అరెస్టు చేయబూనితే అన్నపూర్ణయ్య గారు, పత్రిక ఎడిటర్‌గా తనదే బాధ్యత అని అరెస్టు చేయమన్నారు. ఆ రచయిత వెంకటప్ప అని, అతనూ తనని అరెస్టు చేయమన్నాడు. అన్నపూర్ణయ్య గారు అతనితో నువు చిన్నవాడివి, నీ కెరీర్ నాశనం అవుతుందని ఆయనే జైలుకు వెళ్ళారు. అంతగొప్ప మనిషి ఆయన. అన్నపూర్ణయ్య గారి భార్య కూడా జైలుకు వెళ్ళింది. ఆ జైలులోనే మరణించారావిడ.

**మిసిమి** : **మీకు నాటకానుభవం ఉంది. నాటకాలు వేసేవారితో అనుబంధం ఉంది. రాజమండ్రితో కూడా మీకు బాగా సంబంధముంది. మీ పరిచయస్తులలో బాగా ఎదిగిన వారు ఎవరు?**

**పతివాడ :** మానాపురం సత్యనారాయణ అని ఓ మిత్రుడు అమరనాథ్ అని పేరు మార్చుకుని సినిమాల్లోకి వెళ్ళాడు. వాడు బాగా పాటలు పాడేవాడు. మానాపురం అప్పారావు పట్నాయక్ అని అమర్నాథ్ అన్నయ్య .. పెంకిపిల్ల అనే సినిమా డైరెక్ట్ చేశాడు. కానీ ఆ సినిమా ఆడలేదు. నేను భీమవరంలో వర్క్ చేస్తున్నప్పుడు అమర్‌నాథ్ చింతామణి నాటకం వేద్దామంటూ వచ్చాడు. నేను బిల్వ మంగళుడు పాత్ర వేస్తున్నాను, భవానీ శంకరంగా మాధవపెద్ది సత్యం వేస్తున్నాడని చెప్పి, ఆర్థిక సాయం కోరాడు ..అదొక జ్ఞాపకం. అప్పుడే నేను అకౌంటెంట్ జనరల్ ఆఫీస్ ఉద్యోగం రాజీనామా చేసి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి రాజమండ్రిలో చేరాను. మా కో బ్రదర్ కొంచెం పలుకుబడి ఉన్నవాడు కావటంతో హైదరాబాద్‌కు ట్రాన్స్ఫర్ పెట్టుకున్నాను. అక్కడే త్రిపురనేని గోపీచంద్ గారితో పరిచయం ఏర్పడింది. నేను నైట్ కాలేజీలో లా కోర్సులో చేరాను. మా ఆవిడ దే కాలేజీ లా కోర్సులో చేరింది. ఆవిడ, వి.యస్.రమాదేవి గారు కలిసి చదివారు. రమాదేవిగారు తర్వాత గవర్నర్‌గా చేశారు.

మాతోపాటే ప్రముఖ రాజకీయ నాయకులు ఎస్.జయపాల్ రెడ్డి కూడా చదివారు. సంగీత దర్శకులు కీరవాణి గారి బాబాయ్ కాశీ కూడా మా బ్యాచ్ వాడే. వక్తృత్వం పోటీల్లో నాకు, కాశీకి పోటీ ఉండేది. అప్పటికింకా రాజధాని కర్నూలు నుంచి హైదరాబాద్‌కు మారలేదు. మేమందరం "లలిత కళానికేతన్" అని ఒక సంఘం పెట్టాం. బాబుల్ రెడ్డి అధ్యక్షతన మొదలుపెట్టాం. నేను సెక్రటరీని. సి.ధర్మారావు జాయింట్ సెక్రటరీ. మరో జాయింట్ సెక్రటరీ వీరయ్య చౌదరి. తాపీ చాణక్య, ఉండేలు మాలకొండారెడ్డి వైస్ ప్రెసిడెంట్లు. పి.యస్.ఆర్.అప్పారావు గారు, జగ్గయ్య గారు, గోపీచంద్ గారు, తాపీ ధర్మారావు గారు అడ్వైజరీ కమిటీలో ఉండేవారు. విముక్తుడు అనే నాటకం ప్రదర్శించాము. చాణక్య డైరెక్షన్. పి.యస్.ఆర్.అప్పారావుగారు మేము రాజమండ్రిలో చదువుకునేప్పుడు మాకు తెలుగు లెక్చరర్. నాటకాలకు ఇన్చార్జి. ఆయనే ఆంధ్ర యూనివర్సిటీలో మాచేత నాటకాలు వేయించేవారు.

**మిసిమి** : **మీకు బాగా పరిచయమైన సినిమా నటులెవరు?**

**పతివాడ :** గుమ్మడి.. జగ్గయ్య నేను బావా బావమరుదుళ్ళా ఉండేవాళ్ళం. మా మనవుడి పెళ్ళికి వారమ్మాయి వచ్చింది. ఆయన అల్లుడు అచ్యుతరామయ్య డాక్టర్. చలం చిన్నప్పటి నుంచి పరిచయం.. చలంకు ఆంధ్రా దిలీప్ కుమార్ అని బిరుదునిచ్చిన పృథ్వీరాజ్ కపూర్‌ను మేమే పిలిచాము.

**మిసిమి** : **ఎస్వీ రంగారావు పరిచయమా ?**

**పతివాడ :** డైరెక్ట్ పరిచయం లేదు కానీ ఆయన వరూధిని అనే నాటకం వేస్తున్నప్పుడు రిహార్సల్స్‌లో చూశాను. ఒక గుళ్ళో రిహార్సల్స్ వేస్తుండేవారు. మిగిలిన వారిలో సోమయాజులు, రమణమూర్తితో బాగా పరిచయం ఉండేది. నటీమణుల్లో కృష్ణవేణి బాగా తెలుసు. నూరేళ్ళు బతికింది కదా. అంజలీదేవి పరిచయం. ఆవిడకోసారి ఒక సమస్య వస్తే జగ్గయ్య పార్లమెంటు మెంబర్ కావటంతో పరిష్కరించ గలిగాడు. జయప్రద బాగా తెలుసు. చిన్నప్పటి నుంచి మామయ్యా అని పిలిచేది. దర్శకులలో వి.మధుసూదనరావు, ఆయన భార్య సరోజినీ బాగా తెలుసు.

దేశవిభజన సమయంలో ఆడవాళ్ళు చాలా ఇబ్బందుల్లోకి నెట్టివేయబడ్డారు.ఆ దృష్టాంతాలను వర్ణిస్తూ నేనో నవల రాశాను. దానిపేరు "అపహృత" మొదట కథగా రాసి తర్వాత నవలగా విస్తరించాను. ఆ కథను మా గురువుగారు జయభారత్ పత్రికలో వేశారు.. శరణార్థిగా వచ్చిన స్త్రీని నార్ల వెంకటేశ్వరరావు గారు "అపహృత" గా పిలిచారు. నార్ల వారికి పుస్తకం ఇవ్వటం కోసం వెళ్ళినప్పుడు ఈ పేరు ఎలా పెట్టారని అడిగారు. మీరు సూచించిన పేరే అనగానే నవ్వేశారు. ఈ నవలను మా గురువుగారు మద్దూరి అన్నపూర్ణయ్య గారు పరిచయం చేశారు.

**మిసిమి :** **చాలా చాలా కృతజ్ఞతలు పతివాడ సూర్యనారాయణ గారు.. ఇంకా మీ కబుర్లు వినాలనుంది. ఇప్పటికే రెండు గంటలు పైగా మాట్లాడారు. మీ భోజనం సమయం దాటిపోతోందని మాకు మీ సహాయకులు తెలియచేస్తున్నారు. ఇక ఇక్కడితో చాలిస్తున్నాం**

**పతివాడ :** మీతో మాట్లాడిన ఈ రెండు గంటలు నా ఆకలి తీర్చేశాయంటే నమ్మండి. రోజు నాలుగు మెతుకులు తిని, రెండు పేజీలు చదువుకునే నన్ను నా పాత ప్రపంచంలోకి తీసుకెళ్ళారు. నా పాతవారినందరినీ స్మరించుకునే అవకాశం కలిగించారు. మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

---

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

---

## కమ్మతెమ్మెర

మాన్యులు అశ్విన్ కుమార్ గారికి,

**మిసిమి** ఇమెయిల్ రూపంలో అందుతోంది. కానీ ఇక్కడి పోస్టల్ వారి అసమర్థతా సౌజన్యంతో పుస్తకరూపంలో లభ్యత ఈ మధ్య అరుదు అయిపోతోంది. మే, జూన్ సంచికలు ఈ మధ్యే అందాయి. జూలై సంచిక ఎప్పుడు అందుతుందో ఆ పెరుమాళ్ళకే ఎరుక. మీ జూలై **మిసిమి** సంచిక సాఫ్టు కాపీ తృప్తితో అందుకున్నాను. ఎప్పటివలె, ఇమెయిల్ రూపంలో పంపుతూ, మూడునెలల కొకసారి రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ ద్వారా **మిసిమి** పంపించడానికి వీలవుతుందా? సాధ్యాసాధ్యాలు పరిశీలించమని మనవి. వాతావారణంలో అనిశ్చిత అధికంగా ఉండటంతో చిన్ని చిన్ని అనారోగ్య చికాకులు చిరాకు పరిచాయి. పఠన/రచనలపై ధ్యాస కొంత సన్నగిల్లి మళ్ళీ నెమ్మదిగా పుంజుకుంటోంది. **మిసిమి** పఠనం మానసోల్లసానికి సాటిలేని దివ్యౌషధం. మరొక మరువరాని మలుపు ఏమిటంటే ఈ జూన్ 2025తో నా **మిసిమి** పఠనం ఒక దశాబ్దం పూర్తి అవుతుంది. ఇది నా జీవనగమనంలో ఒక మైలురాయి. **మిసిమి**తో ఉన్న ఈ ఋణానుబంధం నాకు భగవదనుగ్రహం.

యువ దశ నుంచి నాకు తారసపడిన ఇంటర్వ్యూలను వదలకుండా చదవడం నాకు తృప్తి ఇచ్చిన అలవాటు. ప్రముఖ తెలుగు వ్యక్తులతో మీరు చేసిన ఇంటర్వ్యూలు తన్మయత్వంతో చదివి ఆసక్తికర విషయాలు తెలుసుకో గలుగుతున్నాను. మీ అనుమతి లేకుండా మీ ఇంటర్వ్యూలలో పరోక్షంగా ఆశీనుడును అవుతున్నాను. వ్యక్తుల ప్రతిభాపాటవాలను ఆవిష్కరించడమే కాకుండా వారి ఆలోచనా పరిణామాన్ని మీరు పాఠకుల దృష్టికి తెచ్చే తీరు బహు ప్రశంసనీయం. మీ నిబద్ధత, పారదర్శకత నేటి పాత్రికేయులకు ఆదర్శం. ముఖ్యంగా మాన్యులు వి వి న మూర్తి గారితో మీ సంభాషణ నన్నెంతో ఆకర్షించింది. మీ నిశిత ప్రశ్నలకు వారి సమాధానాలు మేధకు పదును. ఆయన వృత్తి రీత్యా సైంటిస్ట్ కావడంతో ఆ ప్రభావం తెలుగు భాష పోకడలకు సంబంధించిన విశ్లేషణలలో ప్రస్ఫుటం. నాలాంటి సాధారణ భాషా ప్రియులకు నిజమయిన కనువిప్పు. రెండు మూడుసార్లు చదివితే గాని వారి రచనల అంతరార్థంపై పట్టురాదు. కాలేజీ రోజుల్లో వారి పేరు చూసి కథలు చదివి ఆనందించాను, ఎంతోకొంత ప్రభావితుడనయ్యాను. **మిసిమి** సంప్రదాయాలపై నాకున్న అవగాహన దృష్ట్యా ఈ ఇంటర్వ్యూలను పుస్తకరూపంలో మీరు లభింపచేస్తారని భావిస్తున్నాను. మారుతున్న సామాజిక పరిస్థితుల ప్రభావాల గురించి, తెలుగు మేధావుల యొక్క విశ్లేషణలు, ఆలోచనా సరళి నేటి సమాజానికి అత్యంత అవసరం. మీకు ఇటువంటి సూచన చెయ్యడం, సూర్యునికి దీపం చూపించడం లాంటి సాహసం.

మాన్యులు శ్రీ వి వి న మూర్తి గారికి, మీకు సవినయ అభివందనం. శుభాకాంక్షలతో

***- రాయవరపు సత్యనారాయణ, ముంబయి, ఫోన్ : 9391429717***

# లండన్ నాటక శాలలు

**– టి.వి. ప్రసాద్**

బ్రిటిష్ దేశస్థులు నాటకాన్ని బాగా ఇష్ట పడతారు. ఒకప్పుడు వారి కాలక్షేపానికి వినోద సాధనంగా ఉన్న నాటకం ఇప్పుడు వారి జీవనశైలితో పెనవేసుకుపోయి వారి సంస్కృతిలో భాగమైపోయింది. దేశ రాజధాని లండన్ నగరం పేరు గాంచిన నాటకశాలలకు ప్రసిద్ధి. ముఖ్యమైన థియేటర్లు (నాటకశాలలు) చాలావరకు నగరకేంద్రం వెస్టెండ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంటాయి. ఫ్రాన్స్, జపాన్ లాంటి దేశాల్లో నాటకశాలలు చాలా ఉన్నప్పటికీ లండన్‌కు మాత్రమే ప్రపంచ నాటకశాల రాజధాని అన్న గౌరవం దక్కింది. లండన్ థియేటర్ సొసైటీ లెక్క ప్రకారం లండన్‌లో 240 థియేటర్లు ఉన్నాయి. కానీ అవి 240-300ల మధ్య ఉంటాయి. సినిమాహౌస్‌లు 108 ఉన్నా వాటిలో మొత్తంపై 566 (screens) సినిమాలు ప్రదర్శించబడతాయి. అక్కడ నాటకశాలను థియేటర్ అనీ, సినిమా ప్రదర్శనశాలను సినిమా థియేటర్ అనీ అంటారు. యూరప్‌లో అధిక సంఖ్యలో సినిమా థియేటర్లు (2041) ఉన్న దేశం ఫ్రాన్సు, పారిస్‌లో ప్రతి నిత్యం 400 తెరలమీద వేయికి పైగా సినిమాలు ప్రదర్శించ బడుతుంటాయి.

లండన్ థియేటర్లు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత గలవీ, సుదీర్ఘ నాటకాలకు పేరుగాంచినవీ, ప్రపంచ ప్రఖ్యాత షేక్స్‌పియర్ నాటకాలకూ నిలయాలు కావడం వాటి ప్రత్యేకత. నాటకాలతోపాటు మ్యూజికల్స్, ఒపెరాలు, బాలేలు (Ballets) వివిధ అభిరుచుల వారికి అనుగుణంగా ప్రదర్శించబడతాయి. వీటిలో గ్లోబ్ థియేటర్ షేక్స్‌పియర్ నాటకాలకూ, సెంట్ మార్టిన్ థియేటర్ ప్రపంచ ప్రసిద్ధ మౌస్ ట్రాప్ నాటక ప్రదర్శనకూ (1952లో మొదటి ప్రదర్శనలో మొదలై నేటివరకూ 73 సంవత్సరాలుగా ప్రదర్శించబడడం ఈ నాటక విశేషం. రాయల్ థియేటర్ మ్యూజికల్స్‌కు ప్రసిద్ధికెక్కితే, లండన్ కొలీజియం అత్యధిక (2359) ప్రేక్షక సామర్థ్యం ఉన్న థియేటర్‌గా ప్రసిద్ధిగాంచింది. చైనా బీజింగ్‌లోని **గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్** పదివేల ప్రేక్షక సామర్థ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద థియేటర్‌గా పేరు గడించింది.

**ప్రపంచ సినిమా రాజధాని:** హాలీవుడ్ సినిమాలకు లాస్ ఏంజిలీస్ రాజధాని అని అధికారికంగా చెప్పుకున్నా మన ముంబాయిని అనధికార సినిమా రాజధాని నగరంగా, మన దేశాన్ని ప్రపంచ సినిమా రాజధానిగా చెప్పుకోవచ్చు. జైపూర్‌లోని రాజ్ మందిర్ సినిమా థియేటర్ నగర వాస్తు సంపదకు నిలయంగా ప్రసిద్ధి కెక్కింది.

**లండన్ వాసులు డ్రామాలను ఇష్టపడటానికి కారణాలు :** నాటకాలు అందుబాటులో ఉండటం, వాటి కథాంశాలు నిత్యజీవితంతో ముడిపడి వుండటం, కథ చెప్పే విధానంలో నేర్పు, వైవిధ్యం ఉండడం, నాటకాల నిడివి తక్కువగా ఉండి అవి వారి భావోద్రేకాలను తృప్తిపరచడం; ఇంకొంచెం వివరంగా పరిశీలిస్తే నాటకాల్లోని పాత్రలు, చిక్కుముడులు, సమస్యలు వారి జీవితాలకు దగ్గరగా ఉండి, సంభాషణలు వారి నిజ జీవిత ప్రతిధ్వనులుగా ఉండడం అని కాటలిస్ట్ పేర్కొంది. మానవ ప్రకృతికి, భావప్రకటనకు, వాస్తవ సన్నివేశాలు, సంఘటనలకు దగ్గరగా ఉండే నాటకాలు (Soaps), అవీ సులభంగా చేరుకోవడానికి, రెండుమూడు గంటల వ్యవధిలో చూడటానికి వీలైనవీ కావడం ప్రథమ కారణం. బస్ ట్యూబ్ సౌకర్యం ఉండటం రెండో కారణం. బ్రిటిష్ వారి సంస్కృతిని ప్రతిబింబించే చారిత్రక ప్రశాంత పల్లె జీవితం, దృఢమైన పాత్రలు, చారిత్రక నేపథ్యం మొదలైనవన్నీ వైవిధ్యభరితమైన నాటకాల్లో ప్రదర్శించబడుతుంటాయి. నాటకాలే కాకుండా సంగీత రూపకాలూ, సంగీతం, పాటలు ప్రధానమైన ఒపెరాలూ, నాట్యం ప్రధానంగా కథను చెప్పే బాలేలు వారు యిష్టపడే సరదా కాలక్షేపాలు.

చైనా, భారత దేశాల్లో అధిక జనాభా వల్ల సినిమా ప్రదర్శనలు కూడా ఎక్కువే. రోజూ చైనాలో 90,000 ప్రదర్శనలు జరిగితే మన దేశంలో 30,000 ప్రదర్శనలు


జరుగుతాయి. చారిత్రక నేపథ్యం వల్ల జపాన్‌లో ఎక్కువ సంఖ్యలో నాటక ప్రదర్శనలు జరిగినా, లండన్‌కే ప్రపంచ నాటక రాజధాని గౌరవం దక్కింది. నాటకాల్లో నటించడం ఇంగ్లండ్‌లో గౌరవప్రదమైన వృత్తిగా పరిగణించ బడుతుంది. స్త్రీ పాత్రలు ధరించడానికి మహిళలు ముందుకు రావడంతో నాటకం పట్ల అభిరుచి విస్తృతంగా పెరిగింది. ఒకప్పుడు నాటకానికి వున్న లార్డ్ ఛాంబర్లీన్ పరిమితులు తొలగిపోవడం (1843) తో నాటకం బాగా అభివృద్ధి చెందింది. సినిమాప్రభావం వల్ల డ్రామాలు కూడా ఆధునిక సాంకేతికతతో ప్రగతిని సాధించాయి.

స్టేజీ (రంగస్థల) సైజులో, లైటింగ్‌లో, సెట్టింగులలో వైవిధ్యం, ఆధునికత కన్పిస్తుంది. క్షణాల్లో సెట్టింగులతో సహా స్టేజీ రూపం మారిపోతుంది. ఆహార్యంలో, సంభాషణల, ఉచ్చారణలో, నటనలో, నాటక సమర్పణలో వైవిధ్యం, పరిపక్వత కన్పిస్తుంది. నాటకశాల నిర్మాణం కూడా పై విషయాలకు ప్రాధాన్యత నిస్తూ ఆధునికంగా తయారైంది. మంచి థియేటర్లో నాటకం చూడడం గొప్ప అనుభవంగా మిగిలి పోతుంది.

**లండన్ నాటక అభివృద్ధి – చరిత్ర** : వి & ఎ థియేటర్ లండన్ నాటకశాల చరిత్ర మీద ఆసక్తి కలిగించే విషయాలను సేకరించి పెట్టింది. మధ్య యుగాల నుండి నేటిదాకా లండన్ నాటకశాల అభివృద్ధికి చెందిన సమాచారం ఆ నాటకవికాస అవగాహనకు ఉపకరిస్తుంది.

మొదట్లో నాటక రూపం అంతా అద్భుత సంఘటనలు, మహిమల గాథలతో, రాజకొలువుల్లో మత ప్రాధాన్యతా ఇతివృత్తాలతో నిండి ఉండేవి. 20వ శతాబ్దం నాటికి కథా ప్రాధాన్యతా నాటకాల స్థానంలో In Your Face నాటకాలు అంటే కథా ప్రాముఖ్యత లేని ప్రయోగాత్మక ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. మధ్యలో 1940 ప్రాంతాల్లో యుద్ధకాలపు కాలక్షేప నాటకాలు ప్రదర్శించబడినాయి. అదే కాలంలో లండన్ ఆర్ట్స్ కౌన్సిల్, నేషనల్ థియేటర్ స్థాపించబడ్డాయి.

తొలినాళ్ళ నాటకశాల చర్చి నుండి. (10, 11 శ) అభివృద్ధి చెందింది. మతాధికారుల ప్రోత్సాహంతో 1350 నాటికి నాటకం జనరంజకంగా రూపుదిద్దుకుంది. బైబిల్ కథలు, మహిమల గాథలు ముడిసరుకుగా అంతవరకూ



ద థియేటర్' లండన్

లాటిన్ భాషలో ప్రదర్శించబడే నాటకాలు సామాన్య జనానికి అర్థమయ్యేలా ఆంగ్లంలో ప్రదర్శించ బడినాయి. మత విశ్వాసాలను, నైతిక విలువలను పెంచడం వీటి ఉద్దేశం. ఊరూరా తిరిగే కారవాన్‌లు ( Pageant Wagons) వీధి కూడళ్ళలో నాటకాలు ప్రదర్శించేవి. వీటి లక్ష్యం ముందుగా ఎంచుకున్న వీధులు, వీధి కూడళ్ళలలో ప్రదర్శించి ప్రజల్లో మత చైతన్యం కలిగించడం. క్రమంగా పట్టణాల్లోని కీలక ప్రాంతాలలో నాటకశాలల నిర్మాణం మొదలైంది. రోమన్ కాథలిక్ (ప్యూరిటన్) చర్చి 16వ శతాబ్దంలో నాటకాన్ని నిషేధించింది. హెన్రీ viii సంస్కరణల వల్ల (Reformation) నాటక సంస్థలకు నాటకాలు నేర్చుకోవడానికి, బహిరంగ ప్రదర్శనలకు అనుమతి లభించింది. అదికూడా కులీనుల (నోబుల్‌మన్) అండదండలు, పోషకత్వం ఉన్నవాటికే దక్కేది. నాటకరంగం ఆ తర్వాత మత సంబంధిత నాటకాల నుండి బయటపడి లౌకిక నాటకాల వైపు మరలింది. బ్రిటన్‌లో మొట్టమొదటి నాటకశాల **"ద థియేటర్"** లండన్ ఫిన్స్ బరీ ఫీల్డ్స్‌లో 1576 న నిర్మించబడింది. దీన్ని లీస్టర్ నాటక కంపెనీ నిర్మించింది. లీస్టర్ ఉన్నత వంశీయుడు (Earl)కు అక్కడి జనం సహరించడంతో థియేటర్ నిర్మాణం జరిగింది. సాధారణ శకానికి (ce) ముందే గ్రీక్, రోమ్‌లలో నాటకాలు ప్రదర్శించబడేవి. నాటక ప్రదర్శనాస్థలానికి గ్రీక్ భాషలో థియేట్రన్ అని పేరు. అదే ఇంగ్లీష్ థియేటర్‌గా మారిపోయింది. సాధారణంగా పాశ్చాత్య దేశాల్లో నాటకశాలలను థియేటర్ అని, సినిమా ప్రదర్శనశాలలను సినిమా అని, లేదా సినిమా థియేటర్ అని అంటారు. ప్రాచ్యదేశాల్లో థియేటర్ మాటను



షేక్స్పియర్ గ్లోబ్ థియేటర్" లండన్

నాటకశాలకు, సినిమాహాలుకు రెంటికీ వాడుతారు. ఆంగ్లంలో థియేటర్ ఉచ్చారణ ఒకటే ఐనా స్పెల్లింగ్‌లో తేడా కన్పిస్తుంది. ఇంగ్లీష్ వాళ్లు Theatre అని రాస్తే అమెరికన్లు Theater అని రాస్తారు.

**లౌకిక నాటకాభివృద్ధి – వికాసం :** 16, 17 శతాబ్దాల్లో ఆరుబయలు నాటక శాలల నిర్మాణం నాటక చరిత్రలో కొత్త మలుపు. చుట్టూ గుండ్రని స్థలం మధ్యలో రంగస్థలం, స్టేజీ చుట్టు ప్రేక్షకులు కూర్చుని చూసే సౌకర్యంతో కొత్త నాటక ప్రదర్శనలకూ, కొత్త నాటకాలకూ డిమాండు పెరిగింది. అడ్మిరల్ మెన్, ఛాంబర్లీన్ మన్ కంపెనీల మధ్య వున్న తీవ్రమైన పోటీ ప్రతి సంవత్సరం కొత్త నాటక రచనకు, ప్రదర్శనకు తెరలేపింది. విలియం షేక్స్పియర్ (1564- 1616) ప్రవేశంతో నాటకకళ బాగా వికసించింది. షేక్స్పియర్ స్ట్రాట్‌ఫర్డ్ అపాన్ ఏవన్, (వార్విక్ షైర్) లో జన్మించి, లండన్ చేరి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 38 నాటకాలను, ఎన్నెన్నో సానెట్లను రాశాడు. ఇతని రచనలు ఇతివృత్తంలో వైవిధ్యత, ఆలోచనల గాఢత, లోతు, భాషలో కొత్త కొత్త పదాలు, పదబంధాలతో సౌందర్య వంతంగా, విశ్వజనీన లక్షణాలతో ప్రపంచ దేశాల నాటక ప్రియుల్ని, భాషాభిమానుల్ని ఆకర్షించాయి. 1594లో షేక్స్పియర్ లార్డు ఛాంబర్లీన్ బృందంలో చేరడం, గ్లోబ్ థియేటర్ నిర్మాణం జరగడం, గ్లోబ్ కొరకే షేక్స్పియర్ నాటకాలు రాసి ప్రదర్శించడం నాటకచరిత్రలో ముఖ్య ఘట్టాలు. తొలినాళ్ళ నాటకం 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' 1594లో ప్రదర్శించబడింది. నాటకశాల లీజు 1599లో అయిపోవడంతో నాటిక కంపెనీ పాత థియేటర్‌ను నిర్మూలించి థేమ్సనది దక్షిణ దరిలో గ్లోబ్ నూతన థియేటర్‌ను నిర్మించింది. తర్వాత అది కేవలం షేక్స్పియర్ నాటకాలకే పరిమితమైపోయింది.

**రాజ కొలువు – హాస్యవాటికలు** : రాజ కొలువులోని పరివారాన్ని ఆనందింపజేయడం కోసం హాస్యప్రధానంగా నాటికలు ప్రదర్శించబడేవి. సామాన్య జనానికి నాటకశాలల్లో ప్రదర్శించే నాటకాలు ఎలాగో, రాజకొలువు పరివారానికి మాస్కలు అలాంటివి. 1642 నాటికి ప్యూరిటన్ల ప్రాబల్యం పెరిగిపోవడంతో ప్యూరిటన్ పార్ల మెంటు నాటకాలను నిషేధించింది. వారి దృష్టిలో నాటి లండన్ నాటక దశ జాతికి అవమానకరం అని, స్టేజి నాటకాలు తేలికపాటి నాసిరకం, అశ్లీల ఆనందాన్ని కలిగిస్తాయని అభివర్ణించి లండన్‌లోని అన్ని థియేటర్లను నిరవధికంగా మూసివేసింది. ఐరోపా దేశాలకే ఆదర్శంగా నిలిచిన బ్రిటన్‌లో నాటకాన్ని మూసివేయడం ఊహకందని విషయం. ఆలివర్ క్రామ్‌వెల్ నుండి ప్లేగ్ మహమ్మారి (16, 17 శ) వరకు యుద్ధాల బాంబు దాడులలో లండన్ నాటక రంగం బాగా నష్టపోయింది. ప్లేగ్ వ్యాధి తగ్గిపోవడం, అంతర్యుద్ధం వెనకబడి పోవడంతో ఇంగ్లండ్ రాణీ క్వీన్ ఎలిజబెత్ ప్రోత్సాహంతో నాటకరంగం మళ్ళీ పుంజుకుంది. తొలినాళ్ళలో నాటకప్రదర్శనా ప్రవేశరుసుం ఒక పెన్నీ ఉండేది. గ్లోబ్ థియేటర్లో సంపన్నులు గాలరీలలో కూర్చుని నాటకాలను తిలకిస్తే, సామాన్యులు స్టేజికి గాలరీలకు మధ్య వున్న ఖాళీప్రదేశంలో నిలబడి చూసేవారు. వారిని గ్రౌండ్లింగ్స్ అనేవారు. వీరి ప్రవేశరుసుం తక్కువ ధరలో ఉండేది. ఆ ఆచారం ఇంకా గ్లోబ్ థియేటర్లో ఇంకో రూపంలో కొనసాగుతోంది. గాలరీ టికెట్స్ దొరకని వారు, బయటినుండి వచ్చిన సందర్శకులు అప్పటికప్పుడు గ్లోబ్‌లో నాటకం చూడటానికి 5–7 పౌండ్ల టికెట్ కొనుక్కుని నిలబడి చూస్తారు. వీరికి కూర్చుని చూడడానికి అనుమతి ఉండదు. సుదీర్ఘంగా ప్రదర్శించబడుతున్న నాటకాలు, ఓపెరాలు, బాలేలు, మ్యూజికల్స్ అన్నీ లండన్ నగర మంతటా వ్యాపించి వున్న నాటకశాలల్లో నిరంతరం ప్రదర్శించబడుతుంటాయి. అలాంటి వాటిల్లో కొన్నింటిని చూద్దాం.


**మౌస్ ట్రాప్ నాటకం, సెంట్ మార్టిన్స్ థియేటర్** : ఇది లండన్ వెస్టెండ్ థియేటర్లో 1974 నుండి నిరవధికంగా

(కరోనా సమయంలో తప్ప) ప్రదర్శించబడుతోంది. అత్యంత దీర్ఘకాలంగా ఒకే థియేటర్‌లో ప్రదర్శితమౌతున్న నాటకంగా దీనిది ప్రపంచ రికార్డు. సెంట్ మార్టిన్ థియేటర్‌కు ముందు ఈ నాటకం 1952 నుండి 1974 వరకు అంబాసిడర్ థియేటర్‌లో ప్రదర్శించబడి ఆ తర్వాత సీటింగ్ కెపాసిటీ చాలకపోవడంతో సెంట్ మార్టిన్స్‌కు మార్చబడింది. 70 సంవత్సరాలకు పైగా ఒక నాటకం ప్రదర్శించబడడం ప్రపంచపు వింత. లండన్ నాటక చరిత్రలోనే కాదు, ప్రపంచ నాటక చరిత్రకే గర్వకారణం. ఇది ఆగథా క్రిస్టీ అపూర్వ సృష్టి. ఈ క్రైమ్ సస్పెన్స్, మర్డర్ మిస్టరీలో హత్య జరుగుతుంది. హంతకుడు ఎవరో చివరి నిముషం వరకు ఊహకందని విషయం. చివరి అంకంలో 'హంతకుడు మనలోనే వున్నాడు' అని పోలీస్ ఆఫీసర్ మాటలతో ఉత్కంఠ మరీ పెరిగిపోతుంది. ఈ నాటకం పుస్తక రూపంలో దొరుకుతుంది. కానీ 70వ వార్షిక ప్రచురణ ధర 1300 రూపాయలకు పైగా వుంటుంది. దీన్ని సినిమాగా తీయడానికి ఆగథాక్రిస్టీ ఒప్పుకోలేదు. ఆమె వారసులు కూడా ఒప్పుకోరు. ఇది రెండున్నర గంటల నాటకం. మధ్యలో అరగంట విరామం పోతే సరిగా రెండు గంటల నాటకం. ఎనిమిది పాత్రలతో నడిచే నాటకంలో సర్ రిచర్డ్ అటన్ బరో (గాంధీ సినిమా నిర్మాత, దర్శకుడు) అతని భార్య షీలాలు పాత్రధారులు. వీరిరువురూ మేజర్‌మెట్ కాఫ్, అతని భార్య మిస్ బోయెల్‌గా పదకొండు సంవత్సరాలు నటించడం, వందల సంఖ్యలో నటీనటులు, దర్శకులు పనిచేయడం, వేలసంఖ్యలో ప్రదర్శించబడడం, (2022 నాటికి 27,500, త్వరలో 30,000 ప్రదర్శనలు పూర్తి చేసుకుంటుంది) లక్షల్లో ప్రేక్షకులు చూడడం, ఇంకెంత కాలం ఈ నాటకం నడుస్తుందో చెప్పలేక పోవడం ఈ నాటకం సాధించిన గొప్పతనానికి నిదర్శనాలు.

**నాటకాంత అభ్యర్థన:** నాటకం పూర్తి అవగానే పాత్రధారుల్లో ఒకరు ముందుకు వచ్చి ప్రేక్షకుల నుద్దేశించి 'ఇప్పుడు మీరూ నేర ప్రపంచంలో భాగస్తులయ్యారు. సాంప్రదాయకంగా కొనసాగుతున్న హంతకుడెవరు? అన్న రహస్యాన్ని మీ గుండెల్లోనే దాచుకోండి; ఎవరికీ చెప్పకండి' అని అభ్యర్థిస్తాడు. బ్రిటిష్ నాటకాలలో చాలా తెలివైన మర్డర్ మిస్టరీ, మౌస్ ట్రాప్ నాటకం ఎప్పటికీ ప్రదర్శించ బడుతుంది– అని డెయిలీ టెలిగ్రాఫ్ ఈ నాటకాన్ని కొనియాడింది.

**మార్టిన్స్ థియేటర్ :** ఇది లండన్ గుండె అని చెప్పుకునే వెస్టెండ్, న్యూషాఫ్ట్సుబరి అవెన్యూలో ఉంటుంది. నాటకాన్ని వారంలో మూడురోజులు సోమ, బుధ, శుక్ర వారాల్లో రోజూ ఒక ప్రదర్శన, మంగళ, గురు, శని వారాల్లో రోజూ రెండు సార్లు ప్రదర్శిస్తుంది. లార్డ్ విలోబి కుటుంబ సభ్యుల యాజమాన్యంలో నడుస్తుంది. మూడంతస్తుల వృత్తాకార నిర్మాణంలో 550 సీట్ల సామర్థ్యం కలిగి వుంటుంది. ప్రవేశరుసుము 30 పౌండ్ల నుండి మారుతుంటుంది. థియేటర్ ఏ సీట్ నుండైనా నాటకాన్ని నిరాటంకంగా చూడవచ్చు. టికెట్లను ముందుగా బుక్ చేసుకోవచ్చు.

**షేక్స్‌పియర్ గ్లోబ్:** ఇది మొదటి సారి 1599లో నిర్మించబడింది. 1613లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోగా 1614లో తిరిగి నిర్మించబడింది. 1642లో మూతపడేవరకు బెన్‌జాన్‌సన్, థామస్ డెకర్, జాన్ ఫ్లెచర్ల మొదలైన నాటకకర్తల నాటకాలు ఇందులో ప్రదర్శంచబడేవి. 1997లో పాత థియేటర్ సమీపంలో థేమ్స్‌నది దక్షిణాన షేక్స్‌పియర్ గ్లోబ్ ఆధునిక నిర్మాణం జరిగింది. ఇది పాక్షికంగా పైకప్పు లేని వృత్తాకార, ముందుకు చొచ్చుకు వచ్చిన స్టేజితో, స్టేజి చుట్టూ ప్రేక్షకుల గాలరీలతో నిర్మించబడింది. గాలరీల మెట్లు మెట్లుగా వున్న చెక్క బెంచీల మీద 875 మంది కూర్చుని నాటకం చూడవచ్చు. స్టేజీమీద పెద్ద పెద్ద స్థంభాల మీద పైకప్పు ఉంటుంది. ముందుకు వచ్చిన ఐదు అడుగుల ఎత్తు స్టేజీకి గాలరీలకు మధ్యన చుట్టూ వున్న ఖాళీస్థలంలో ఆకాశం కింద ప్రేక్షకులు నిలబడి చూడవచ్చు . వీరికి 5–7 పౌండ్ల టికెట్



సెంట్ మార్టిన్స్ థియేటర్" లండన్

వుంటుంది. అవసర మైతే స్టేజీ మధ్యలో వున్న చెక్క తలుపు ద్వారా స్టేజీ కింద వున్న సెల్లార్‌లో నుండి నటీనటులు స్టేజీపైకి రాగలుగుతారు. స్టేజీవెనక పై అంతస్తులో బాల్కనీలో ఆర్కెస్ట్రా వుంటుంది. బాల్కనీ కింద మూడు ద్వారాల నుండి నటీనటుల ప్రవేశ - నిర్గమనాలకు వీలవుతుంది. స్టేజీ వెనక అన్ని సదుపాయాలతో విశ్రాంతిగదులు, మేకప్‌రూమ్‌లు, గ్రీన్ రూములుంటాయి.

షేక్స్‌పియర్ గ్లోబ్ ట్రస్ట్ నిర్వహణలో నడుస్తున్న ఈ థియేటర్ ఏ రకమైన ప్రభుత్వసాయం లేకుండానే మిలియన్ పౌండ్ల వార్షిక ఆదాయాన్ని గడిస్తుంది. మేక్‌బెత్, రోమియో జూలియట్ నాటకాలను కుటుంబ సభ్యులతో కలిసి గాలరీలో కూర్చిని చూడటం, హామ్లెట్ నాటకాన్ని వందల్లో ఒకడిగా నిలబడి చూడటం (గాలరీ టికెట్ దొరక్క) సెంట్ మార్టిన్స్ లో మూడవ అంతస్తునుండి మౌస్ నాటకం చూడడం గొప్ప అనుభవాలు.

గ్లోబ్ థియేటర్ ఆవరణలో షేక్స్‌పియర్ సాహిత్యం, గిఫ్ట్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, టికెట్ బుకింగ్ కౌంటర్లు ఉంటాయి. థియేటర్ కాంపౌండుకు వెలుపల ఆరు నెలల నాటక వివరాలు ప్రదర్శించబడతాయి. గ్లోబ్ పక్కనే టేట్ మోడరన్ (మ్యూజియం), ఎదురుగా థేమ్స్‌నది, సమీపంలో నది మీద మిలినియం బ్రిడ్జి, సౌత్ వార్క్ బ్రిడ్జి ఉంటాయి. సాయంకాలపు విద్యుద్దీపాల కాంతిలో నగర అందాలను తిలకిస్తూ, నదినుండి వీచే చల్లగాలిని ఆస్వాదిస్తూ కాలక్షేపం కోసం వచ్చే సందర్శకులతో ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. థియేటర్‌లో వేసవిలో ఆడే నాటకాలే కాకుండా చలికాలపు - వింటర్ ప్రోగ్రాలు - విద్యావిషయక కార్యక్రమాలు, గైడెడ్ టూర్లు, క్రిస్మస్ వేడుకలు చేపడుతూ ఏడాది పొడవునా బిజీగా వుంటుంది. నటనలో ప్రయోగాలు చేస్తూ శిక్షణా కార్యక్రమాలు కూడా చేపడుతుంది. ఇది ప్రపంచస్థాయి ప్రదర్శనాకళలకు నిలయం.(సెంట్ మార్టిన్స్, గ్లోబ్ థియేటర్లను గురించిన మరిన్ని వివరాలకు ఈ వ్యాస రచయితదే 'లండన్ వింతలు-విశేషాలు' పుస్తకం చూడగలరు)

**లండన్‌లో సుదీర్ఘకాలంగా ప్రదర్శించబడుతున్న మ్యూజికల్స్, ఓపెరాలు, బాలేలు :** బ్రిటిష్ ప్రజల అభిరుచి నాటకాలకే పరిమితం కాలేదు. నాటకేతర కళలు - సంగీత రూపకాలు (మ్యూజికల్స్) ఓపెరాలు, బాలేలు, సంగీతోత్సవాలు కూడా వారి జీవితాలతో పెనవేసుకుపోయాయి. డజన్ల కొలది ఓపెరా హౌజ్‌లు, బాలే థియేటర్లు, నాటక థియేటర్లకు దీటుగా వినూత్న కళాప్రక్రియలతో వారిని అలరిస్తాయి. లండన్‌లో ప్రదర్శించబడుతున్న సుదీర్ఘ ఓపెరాలు, బాలేలను, సంగీత రూపకాల్లో సుమారు ఇరవై వరకు సంగీత రూపకాలు 50 సంవత్సరాలకు పైబడిన వేల ప్రదర్శనలతో లండన్ నగరంలో ఏదో ఒక థియేటర్‌లో ప్రదర్శించబడుతుంటాయి. వీటికోసమే ప్రత్యేకంగా థియేటర్లు నిర్మించబడటం వీటికి గల ఆదరణను తెలియజేస్తుంది.

**మ్యూజికల్స్ - సంగీత రూపకాలు :** పాట, అభినయం, సంభాషణలు, నాట్యం, సంగీతం లాంటి అన్నీ కలగలిసిన కథా కథన ప్రక్రియ. పాపులర్ మ్యూజిక్‌కు ప్రాధాన్యత వుంటుంది.

**బాలే (Ballet)** : కథను చెప్పడంలో నాట్యానికి ప్రాధాన్యత ఉంటుంది. శరీర కదలికలు ముఖ్యం. సంభాషణలు, పాటలు ఉండవు. క్లాసికల్ సంగీత నేపథ్యంలో కథ నడుస్తుంది. క్లాసికల్ బాలే ఫ్రెంచిశైలీ రొమాంటిక్ (ప్రేమ) విషాదాంత లేక సుఖాంత కథ. ఇటలీలో అభివృద్ధి చెంది రష్యా జానపద, సాంప్రదాయక కథలతో, ఫ్రాన్స్ బాలేతో పరిణతి సాధించి ఇంగ్లండ్‌లో గౌరవప్రదమైన ప్రదర్శనలతో మన్ననలు పొందుతోంది. బాలే డాన్సర్లు రాజ కుటుంబ సభ్యులతో సమానంగా గౌరవించబడేవారు. ఇంగ్లండ్‌లో బాగా స్థిరపడి ప్రజాదరణ పొందిన కంపెనీ రాయల్ బాలే 1931లో స్థాపించబడింది.

**ఓపెరా:** ఇది పాటల రూపంలో చెప్పబడే కథాంశం. ఓపెరాకు సంగీతం, సాహిత్యం రెండూ ప్రధానాంగాలు. నటీనటులకు సంభాషణలు చెప్పే, పాటలు పాడే అవసరం ఉండదు. సంగీతం, పాటల నేపథ్యంలో కథా వివరణ ఉంటుంది. కళ్ళు చెదిరే ఖరీదైన సెట్టింగులు స్టేజీమీద క్షణాల్లో ప్రత్యక్షమై మారిపోతాయి.

**సంగీత సమ్మేళనం-విభావరి** : అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సంగీత శాస్త్రజ్ఞుల ప్రదర్శనలు తరచుగా బహిరంగ ప్రదేశాలు - ట్రఫాల్గర్ స్క్వేర్, హైడ్‌పార్క్ లాంటి చోట్ల, సంగీత నాటకశాలల్లో జరుగుతుంటాయి.

**జీసస్ క్రైస్ట్ (మ్యూజికల్) సంగీత రూపకం :** ఇది ఆగస్ట్9, పాలెస్ థియేటర్‌లో 1972లో మొదలై 53 సంవత్సరాలుగా ప్రదర్శించబడుతున్న విజయవంతమైన మ్యూజికల్. అనేక మార్పులు, చేర్పులతో రీజెంట్ పార్క్ థియేటర్ తర్వాత బార్బికన్ థియేటర్లలో ప్రదర్శించబడుతోంది. టామ్‌లైస్ రచన, ఆండ్రూలాయిడ్ సంగీతం సమకూర్చిన ఈ క్లాసికల్ రూపకం ప్రపంచ అద్భుతంగా, దశాబ్దాలుగా ప్రేక్షకులని ఉర్రూతలూగిస్తోంది. అందరికీ తెలిసిన సంఘటనలనే అహార్యంగా, జీసస్‌ను సూపర్ స్టార్‌గా, జుడాస్ దృక్కోణం నుండి చూపించే సంగీత రూపకం. అలాగే ఇంకో పది మ్యూజికల్స్, ఎవియా, కాట్స్ మొదలైనవి మూడువేలకు పైగా ప్రదర్శనలతో చరిత్ర కెక్కాయి. మ్యూజికల్స్, ద ఫాంటమ్ ఆఫ్ ది ఒపెరా మొదలైనవి ఇరవై ఐదు సంత్సరాలుగా లండన్ థియేటర్లలో ప్రదర్శించబడుతున్న వాటిలో కొన్ని..

**లేమిజరబ్లే** : ఫ్రెంచి రచయిత విక్టర్ హ్యూగో లేమిజరబ్లే నవలకు సంగీతరూపకం. జానపదబ్రహ్మ విఠలాచార్య దీన్ని 'బీదలపాట్లు' గా తెలుగులో సినిమాగా నిర్మించాడు. లయన్ కింగ్ అన్ని దేశాల్లో ఏదో ఓ రూపంలో ప్రదర్శించ బడుతోంది. వాల్ట్ డిస్నీ దీన్ని 1919లో ఒకసారి, తిరిగి 2024లో 250-260 మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి తీసిన గొప్ప చిత్రం. ఈ అమెరికన్ మ్యూజికల్ డ్రామా 1.6 బిలియన్ డాలర్లు ఆర్జించి బాక్స్ ఆఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. ఇప్పటికి రెండు భాగాలుగా వచ్చిన లయన్ కింగ్ మూడవ భాగం కూడా త్వరలో రాబోతోంది. లండన్‌లో బ్రాడ్‌వే మ్యూజికల్‌గా, లైకమ్ థియేటర్లో అక్టోబర్ 1999 నుండి నిరాటంకంగా ప్రదర్శించబడుతోంది. పారిస్ డిస్నీలాండ్‌లో 2012 ప్రాంతాల్లో లయన్ కింగ్ చూడటం మరపురాని అనుభవం. చాలా పెద్ద నాటకశాలలో తొలి దృశ్యాలు దట్టమైన అడవిలో పారే జలపాతాలు, ఆకాశంలో ఎగిరే పక్షులు, అడవి జంతువులు అన్నీ ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతిని కలిగిస్తాయి. రంగస్థలం ఇరువైపులా నటీనటుల, టెక్నీషియన్ల పేర్లు కనిపిస్తుంటాయి, నాటకరంగ, సినిమారంగ సాంకేతికతల మిశ్రమం ఈ ప్రదర్శన. ద లయన్ కింగ్ టీవీ సీరీస్‌గా కూడా చూడవచ్చు. ఈ రెండూ ప్రేక్షకుల అభిమాన మ్యూజికల్స్

**ఫాంటమ్ ఆఫ్ ది ఒపెరా, మామామియా :** రెండూ ప్రేక్షకుల అభిమాన మ్యూజికల్స్‌గా 15 వేలకు పైగా ప్రదర్శనలతో వారిని మంత్రముద్దుల్ని చేస్తున్నాయి. ఈ రెండూ మరికొన్ని మ్యూజికల్స్ లండన్ వివిధ థియేటర్లలో, వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించబడుతుంటాయి.

**రాయల్ థియేటర్ – ఒపెరా హౌజ్ :** ఇది 1663లో డ్రుయరీ లేన్‌లో నిర్మించబడ్డ వినోద కార్యక్రమాల వేదిక. థియేటర్ డిస్ట్రిక్ట్‌గా లండన్ కేంద్రంలో కోవెంట్ గార్డెన్‌లో వున్న గ్రేడ్ 1, ఘనమైన పురాతన, చారిత్రక భవనం. నిర్మాణం తర్వాత రెండు శతాబ్దాల వరకు లండన్ ప్రముఖ థియేటర్లలో ఒకటిగా వెలుగొందింది. చట్టబద్ధమైన ఒపెరాలు, డాన్స్ ప్రోగ్రాములు, సంగీతకచేరీలు, మ్యూజికల్స్ నిర్వహణ, ప్రదర్శనాహక్కును కలిగివున్న థియేటర్లలో ఇదీ ఒకటి. ఈనాలుగు దశాబ్దాల కాలంలో మూడు నాలుగు సార్లు నిర్మించబడి కరోనా టైంలో చివరగా ఆధునీకరించబడింది.

2017-18 సంవత్సరాల్లో ఇందులో ప్రపంచ ప్రఖ్యాత ఆయిదా ఒపెరాను చూశాము. ఇరువైపులా వున్న బాల్కనీల్లో కుడిప్రక్క బాల్కనీ నుండి థియేటర్ సీటింగ్ అరేంజ్‌మెంటును, మూడంతస్తుల ప్రేక్షకుల గాలరీలను, థియేటర్ సౌందర్యాన్ని చూడగలిగాము. థియేటర్ తొలినాళ్ళలో నటులు ఇందులో నివసించేవారట. రెండో ప్రపంచ యుద్ధానం తరం ఇది సుదీర్ఘ సంగీత నాటకాలకు నిలయంగా పేరుపొందింది. ఓక్లహోమా, మైఫెయిర్ లేడీ, 42 స్ట్రీట్ లాంటి మ్యూజికల్స్, కోవిడ్ పునరుద్ధరణ తర్వాత 2021 డిస్నీ వారి ఫ్రోజెన్ వెస్టెండ్‌లోని రాయల్ థియేటర్‌లో మొదటి సారిగా ప్రదర్శించబడింది. 2,196 సీట్లు కలిగిన పెద్ద థియేటర్ ఇది.

**ఆయిదా ఒపెరా :** ఇదొక విషాదాంత ప్రేమకథ. ప్రాచీన ఈజిప్ట్ అమర ప్రేమ గాథ. యుద్ధ నేపథ్యంలో జరిగే ప్రేమ, మోసం ఇతివృత్తంతో భావోద్రేకాల ప్రదర్శన ఇది. వెర్డి సంగీతం ఈ ఒపెరాకు ఆయువుపట్టు. ఇథియోపియా యువరాణి ఆయిదా. ఈజిప్ట్‌లో యుద్ధ ఖైదీగా పట్టుబడుతుంది. ఈజిప్ట్ యోధుడు (తర్వాత సేనాని) రాడామస్ ఆయిదాలు ప్రేమలో పడతారు. ఈజిప్ట్ ఫారో కూతురు అమ్నెరిస్ రాడామస్‌ను ప్రేమిస్తుంది. ఆయిదా

పట్ల అసూయను పెంచుకుం టుంది. చివరకు ఆమ్నెరిస్ చేసిన మోసంతో రాడమస్ సజీవ సమాధి చేయబడతాడు. అప్పటికే అయిదా రహస్యంగా సమాధిలో దాగి వుంటుంది. ఇద్దరూ అమర ప్రేమికులుగా చరిత్రలో మిగిలిపోతారు. లైలా ముజ్నూ కథను గుర్తు చేస్తుందీ ఓపెరా.

**లండన్‌లో ప్రదర్శింపబడుతున్న ప్రసిద్ధ ఓపెరాలు** :- కార్మెన్, లా టాలియటా, లా బౌఎం వీటిలో బౌ ఎం ఓపెరా కూడా రాయల్ థియేటర్‌లో ప్రదర్శించబడిందే. యోమన్ ఆఫ్ ద గార్డ్, ద బెగ్గర్స్ ఓపెరాలు లండన్ వారి అభిమాన ఓపెరాలు. వాటిని వారి పౌరసత్వ సంపదగా భావిస్తారు. ఆలీస్ అడ్వెంచర్స్ ఇన్ వండర్ లాండ్, ఫాస్ట్ లు ఇతర ప్రసిద్ధ ఓపెరాలు. ఇంగ్లీష్ నేషనల్ ఓపెరా వైవిధ్య భరితమైన ఓపెరాల పెన్నిధి. ఉత్తమస్థాయి సమకాలీన కథాంశాలను కలిగి వుండడం వీటి విశేషం. లండన్ కొలీజియం, రాయల్ ఆల్బర్ట్ హాల్, సవాయ్ థియేటర్లు కూడా తరచుగా ఓపెరాలను ప్రదర్శిస్తుంటాయి.

**బాలేలు (Ballets) :** లండన్‌లో ఓపెరాల తర్వాత అంతగా ప్రజాదరణ పొందిన ప్రక్రియ బాలే. ఓపెరాకు పూర్తి విరుద్ధంగా నాట్యరూపంలో చెప్పబడే కథ. పాటలు, సంభాషణలు తక్కువ. నిర్దిష్ట పాదవిన్యాసం, సరియైన నాట్య భంగిమలు, వంకలేని ఆంగిక అభినయంతో కథ అర్థమౌతుంది. ఇది సుఖాంత, విషాదాంత బాలేగా రెండురకాలు. రెంటికీ సంగీత సమేత నాట్యభంగిమలే ప్రాణం. అనుభవం, మనోహర, సుకుమార నాట్య భంగిమలు. గాలిలో తేలిపోతున్నట్లుండే కదలికలు ఆధునిక నాట్యరీతుల, పాప్‌మ్యూజిక్‌ల మిశ్రమ ప్రదర్శన బాలే.

**ఇంగ్లీష్ నేషనల్ బాలే :** ఇది లండన్ క్లాసికల్ బాలే కంపెనీ. గ్రేట్ బ్రిటన్‌లో వున్న ఐదు ప్రసిద్ధ బాలే కంపెనీలలో ఒకటి. లండన్ కొలీజియం థియేటర్‌లో బాలే సీజన్‌ను నిర్వహిస్తుంది; ప్రపంచస్థాయి బాలేలను నిర్మించి ప్రదర్శిస్తుంది. **ద స్లీపింగ్ బ్యూటీ, స్వాన్ లేక్, ద నట్ క్రేకర్** మొదలైన బాలేలను ప్రదర్శిస్తుంది. బాలే డాన్సర్‌ను బాల రీనా అనీ డాన్స్యూజ్ అనీ అంటారు. **స్వాన్ లేక్ జిసెల్లీ, రోమియో జూలియట్‌లు** ప్రేక్షకుల నుర్రూతలూగించే బాలేలు. స్వాన్ లేక్ అమర ప్రేమికుల విషాదాంత బాలే.

దుష్ట మాంత్రికుడి శాపం వల్ల ఓడెటా యువరాణి పగలు హంసలాగా రాత్రికి యువరాణి రూపంలోకి మారిపోతుంది. ప్రిన్స్ సీగ్ ఫ్రీడ్ ఓడెటాలు ఇరువురూ గాఢంగా ప్రేమించుకుంటారు. నిజమైన, నమ్మకమైన ప్రేమ మంత్ర శక్తికి విరుగుడు. చివరకు ప్రేమికుల ఒకరికొరకు ఒకరి ప్రాణత్యాగంతో కథ ముగిసిపోతుంది. బాలేలో మలుపులు, ప్రేమ, మోసం, దుష్టశక్తి ప్రభావం, నిజమైన ప్రేమ శక్తి ముందు అన్నీ ఓడిపోవడం అంతా కలిపి అమర ప్రేమ కథగా, బాలేగా రూపొందింది. ఈ జర్మనీ జానపద కథకు ఛైకోలిస్కీ సంగీతం సమకూర్చాడు.

ఇటలీలో పుట్టి, ఫ్రాన్స్ మీదుగా ఇంగ్లండ్ చేరిన బాలే లండన్ వాసులకు ప్రీతిపాత్రమయింది. స్వాన్‌లేక్ బాలేను యూట్యూబ్‌లో చూడవచ్చు. అలాగే బాలరీనా ఏనిమేటెడ్ ఫిల్మ్ (2016) గొప్ప కథ. 19వ శతాబ్దం ఫ్రాన్స్ పారిస్‌ల నేపథ్యంలో సాగే కథను పిల్లలూ పెద్దలూ అందరూ యిష్టపడతారు. దీన్నీ యూట్యూబ్‌లో చూడవచ్చు.

**అసంబద్ధ నాటకం :** రెండో ప్రపంచయుద్ధ ఫలితం సాహిత్య, చిత్రకళల్లో పెనుమార్పులకు కారణమయింది. ఇతివృత్తాల ఎంపికలో, శైలుల్లో, భావప్రకటనలో కొత్తదనానికి తెరలేపింది. సాహిత్యంలో అస్తిత్వవాదం, అసంబద్ధత చోటుచేసుకున్నాయి. అలా పుట్టిందే అబ్సర్డ్ థియేటర్ అంటే అసంబద్ధ నాటకం. 20వ శతాబ్దపు మధ్యలో వచ్చిన నాటకాలు అస్తిత్వవాదానికి పెద్దపీట వేశాయి. జీవితం సహజంగానే అర్థరహితం, దానికి అర్థాన్ని వెదకడం వృథా ప్రయాస, వెదికే కొద్దీ జీవితంలోని అసంబద్ధత, పరాయీకరణ ఎక్కువౌతుంది. ఈ నాటక లక్షణాలు – అసంబద్ధ ఇతివృత్తాలు, ఒక దానికొకటి సంబంధంలేని సంభాషణలు, అర్థంకాని పాత్రలు, అర్థరహిత సందర్భాల్లో బందీలై వుంటాయి. కథ ఎక్కడ జరిగేదీ ఇదమిద్ధంగా తెలియదు. సాంప్రదాయక భాషపై చిన్నచూపు. సాంప్రదాయ పద్ధతిలో నాటకం ముందుకు సాగదు. ఇటువంటి నాటకాలు శామ్యూల్ బెకెట్ – **వెయిటింగ్ ఫర్ గోడో** యూజీన్ అయొనెస్కో – **దబాల్ట్ సోప్రనో**, జీన్ పాల్ సార్త్ర్ – **ది ఎక్జిస్ట్**, హెరాల్డ్ పింటర్ – **హోం కమింగ్** మొదలైనవి. అసంబద్ధ నాటకాన్ని anti dramaగా, యాజోన్ అయొనెస్కోను ఈ నాటక పితామహుడిగా చెప్పుకుంటారు. అల్బర్ట్ కామూ రాసిన ప్రసిద్ధ వ్యాసం **ద మిత్ ఆఫ్ సిఫిలిస్** అసంబద్ధ నాటకం పుట్టుకకు దారితీసింది. తెలుగులో త్రిపుర కథ భగవంతం పైన వెయిటింగ్ ఫర్ గోడో నాటక ప్రభావం కన్పిస్తుంది.

అసంబద్ధ నాటకాలు లండన్‌లోని వివిధ థియేటర్లలో 'అల్ బరీ' థియేటర్లో ఎండ్‌గేమ్ (2004), ఆరెంజ్‌ట్రీ థియేటర్‌లో, రాయల్ కోర్ట్ థియేటర్‌లో కూడా ప్రదర్శించ బడింది. **'వెయిటింగ్ ఫర్ గోడో'** నాటకం బ్రిటిష్ రాయల్ నేషనల్ థియేటర్‌లో 1998, 1999ల్లో ప్రదర్శించబడింది. ఇది 20వ శతాబ్దపు మేటి ఆంగ్ల నాటకంగా ఎన్నిక కాబడింది.

**రాయల్ ఆల్బర్ట్ థియేటర్ :** సంగీత కచేరీల కొరకే ప్రత్యేకంగా నిర్మించబడిన భవనం. లండన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మక భవనాల్లో ఇదీ ఒకటి. సంవత్సరం పొడవునా ఏదో ఒక జాతీయ, అంతర్జాతీయ సంగీత సమ్మేళనం, సగీతకచేరీలు జరిగే భవనం, 1871లో క్వీన్ విక్టోరియా చేత ప్రారంభించబడింది. చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత గల భవనం. దీనిలో వివిధ లెవెల్స్‌లో ప్రేక్షకుల గాలరీలు ఉంటాయి. రెండతస్తుల బేస్‌మెంట్‌లో ఎనిమిది వేలనుంది కూర్చుని చూచేలా నిర్మించారు. కానీ ప్రస్తుతం ఐదు వేల మూడు వందల వరకు ప్రేక్షకులు కూర్చుని చూచే వీలుంది. అంతర్జాతీయ స్థాయి సంగీత (విద్వాంసుల) కచేరీలకు నిలయం. ప్రతిరాత్రీ విశిష్ట సంగీత ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయి. భారత కోకిల లతామంగేష్కర్ ఇందులో సంగీత విభావరి (1974లో) నిర్వహించిన తొలి భారతీయ గాయని. మ్యూజిక్ మేస్ట్రో ఇళయ రాజా కూడా క్లాసికల్ సంగీత కచేరీ వేలియంట్ సింఫనీ తొలి భాగం, ఈవెంటిమ్ అపోలో థియేటర్‌లో నిర్వహించాడు. మే 11, 2025 తెలుగు సినిమా RRR కు లండన్ ఫిల్ హార్మోనిక్ ఆర్కెస్ట్రా అభినందన సభ నిర్వహించిన సందర్భంగా RRR



రాయల్ ఆల్బర్ట్ థియేటర్

సినిమా ప్రదర్శించబడడం, అందులో దర్శకుడు, నటులు పాల్గొనడం గొప్ప విశేషం.

**లండన్ నాటక శాలల సొసైటీ :** 1908లో స్థాపించబడిన సంస్థ బ్రిటిష్ ట్రేడ్ అసోషియేషన్, వెస్టెండ్ నాటక శాలల యజమానుల సంఘం, లాభాపేక్షలేని ప్రైవేట్ కంపెనీ, తర్వాత ఇది 1975లో వెస్టెండ్ థియేటర్‌గా మారింది. లండన్ థియేటర్ యజమానుల, నిర్మాతల, ఇతర వాణిజ్య/ వ్యాపార నాటకశాలల యజమానుల సంఘటిత వ్యవస్థ, వివిధ కార్యక్రమాలను చేపడుతూ నాటకరంగాన్ని ప్రోత్సహిస్తుంది. లారెన్స్ ఆలివర్ అవార్డులు, టికెట్ బూత్‌లు నిర్వహిస్తూ, లండన్ నాటక వివరాలను తెలిపే పక్ష పత్రికను (bulletin) ప్రచురిస్తుంది. ప్రేక్షకుల సంక్షేమ కార్యక్రమాలు, బాలవారోత్సవాలు, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నాటక టెక్కెట్ల అమ్మకం లాంటి కార్యక్రమాలూ, తెరవెనక స్క్రీన్ ఫెయిర్స్ (సినిమాతెరోత్సవాలు), సినిమా కళ మీద అవగాహనా తరగతులు నిర్వహిస్తుంది. థియేటర్లు చేపట్టే ధార్మిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ నాటకరంగానికి విశేష సేవలందిస్తుంది.

**లండన్ థియేటర్ వీక్ :** లండన్ నాటకవారోత్సవ నిర్వహణ ఏడానికి రెండు సార్లు జరుగుతుంది. ఫిబ్రవరి, ఆగస్ట్ నెలల్లో నాటక టిక్కెట్లను తక్కువ రేట్లకు అందించే కార్యక్రమాలు చేపడుతుంది. ప్రేక్షకులు మెచ్చిన పాపులర్ షోలు, మ్యూజికల్స్, నాటకాలకు తగ్గింపు ధరల్లో -15 పౌండ్ల నుండి 35 పౌండ్లకు టిక్కెట్లను అందిస్తుంది. సాధారణంగా లండన్ నాటక టిక్కెట్లు 20 పౌండ్ల నుండి వంద వరకూ ఉండే, మ్యూజికల్స్‌కు ఇంకా ఎక్కువ రేటు 300 పౌండ్ల వరకు ఉంటుంది. ఈ వారోత్సవాలకు పరిశ్రమగా గుర్తింపు లభించడం వల్ల 70కి పైగా సంచలనాత్మకంగా దీర్ఘకాలంగా ప్రద్శించబడుతున్న ప్రదర్శనలను చౌకగా చూసే అసాధారణ అవకాశాన్ని కల్పిస్తుంది. హారీపోటర్, ద కర్స్‌డ్ చైల్డ్, ద లయన్ కింగ్ లాంటి ప్రజాదరణ పొందిన మ్యూజికల్స్‌ను, థియేటర్ ఈవెంట్లను, కన్సర్ట్‌లను మామూలు జనం చూడగలిగే సువర్ణావకాశం లండన్ థియేటర్ వీక్ వల్ల సాధ్యమౌతుంది.

**బీటిల్స్ రాక్ బేండ్ మ్యూజిక్ బృందం** : లివర్ పూల్‌లో 1960లో పుట్టిన రాక్ బేండ్ ఇంగ్లండును ఉద్రూతలూగించి ప్రపంచ సంగీత చరిత్రలో ఒక ఉప్పెనలా విరుచుకు పడింది. బీటిల్స్ బృందంలో జాన్ లెన్నెన్, పాల్ మెకార్త్ , జార్జి హారిసన్, రింగోస్టార్– నలుగురు సంగీత మిత్ర బృందంగా సాంప్రదాయ సంగీతం, పాప్ మ్యూజిక్‌లను కలిపి శాస్త్రీయ సంగీతం, భారతీయ సంగీత శైలుల్ని రంగరించి, రాక్ మ్యూజిక్‌ను సృష్టించారు. 1960ల నాటి సంగీత ఉపసంస్కృతి పుట్టుకకు కారకులయ్యారు. సైకడలిక్, హార్డ్ రాక్ సంగీతాన్ని సృష్టించారు. వీరి సంగీత ప్రదర్శనలకు ఇంగ్లండ్ ప్రజలు వెర్రెత్తిపోగా ప్రపంచ దేశాలు వేలం వెర్రిగా లక్షలాది సిడీలను కొనుక్కుని ఆనందించాయి.

**హారీ పోటర్ నవలలు** : 1995– 2015 ల మధ్య లండన్ సంచలనం హారీ పోటర్ నవలలు. 7 పుస్తకాల్లో వ్యాపించిన స్వైర కల్పితకథ నాటి బాల బాలికల తరం హారీపోటర్ నవలలు, సినిమా, వీడియో షోల్లో పుట్టి పెరిగింది. హారీ పోటర్ కథ గ్రీక్, రోమన్ పౌరాణిక, ఇంగ్లండ్ జానపద, చారిత్రక, మాంత్రిక, వాస్తవ, స్వైర కల్పనల సమ్మేళనం. మన బాలబాలికల్ని చందమామ మాసపత్రిక మూడు నాలుగు దశాబ్దాలు ఆకట్టుకున్నట్లు, హారీపోటర్ నవలలు ఇంగ్లీష్ బాలబాలికల్నే కాదు పెద్దల్ని కూడా అలరించాయి. హారీ పోటర్ నవలలు, సినిమాలు, సిడిలు, వీడియోగేమ్స్, టీవీ సీరియల్స్, ఏనిమేటెడ్ ఫిల్మ్స్ ఇంగ్లండ్‌లో వెల్లువెత్తాయి. రచయిత్రి జెకె రౌలింగ్ నవలలు 600 మిలియన్ కాపీలు అమ్ముడుపోయి ఇంగ్లండ్ రాణీకన్నా అధిక సంపన్నురాలుగా రౌలింగ్ ఎదిగిపోయింది. ఈమె పుస్తకాలు (హారీపోటర్) 85 భాషల్లోకి అనువదించబడ్డాయి. హారీపోటర్ సినిమాలో నటించిన నటీనటులు పేరు ప్రఖ్యాతులతోపాటు సంపన్నులైపోయారు. ముఖ్య పాత్రధారి డేనియల్ రాడిష్ మిలియనీర్ నటుడు కాగా, ఎమ్మవాట్సన్ హాలీవుడ్ హీరోయిన్‌గా, బ్యూటీ అండ్ ద బీస్ట్ వంటి ప్రతిష్టాత్మక సినిమాలో నాయికగా నటించి పేరు ప్రఖ్యాతులు గడించింది. హారీపోటర్ సాధించిన ఘనవిజయం చరిత్రలో 'న భూతో నభవిష్యతి' గా నిలిచిపోతుంది. సినిమా కథాంశం అంతా అభూత కల్పనే ఐనా ఇంగ్లీష్ వారు దీన్ని, చిరంజీవిని చేశారు.


బ్రిటిష్‌వారి ఆదరాభిమానాలతో నాటకకళ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతి నాటకాంశంలో స్టేజీ మొదలుకుని ఆహార్యం, సెట్టింగులు, సంభాషణలు, లైటింగ్, శబ్దగ్రహణం మొదలైన అన్ని అంశాలలో వైవిధ్యం సాధించింది. సినిమా సాంకేతిక నాటకకళ మరింత ఆకర్షణీయ సమగ్ర ప్రదర్శనాకళగా మారడానికి దోహదం చేసింది. నాటకంతో మొదలైన వారి అభిరుచి నాటకకళతో సంబంధం కలిగిన అన్ని ప్రక్రియలకూ విస్తరించింది. నాటక కళ వారి జీవితంలోని అంతర్భాగంలో పెనవేసుకుపోయింది. లండన్‌వాసులకు రాత్రివేళలలో ఆరోగ్యకరమైన నాటకం, నాట్యం సంగీతం మొదలైన కళా ప్రాధాన్య కార్యక్రమాలతో గడిచిపోతాయి. నాటకం వారి సామాజిక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదగా వర్ధిల్లడంలో ఆశ్చర్యం ఏమిలేదు. ఉన్న ఒక్క సురభి నాటకం కంపెనీని బతికించుకోలేని దుస్థితి మనది. ప్రత్యేకంగా నాటకశాలలు లేవు. ఉన్నవి టౌన్‌హాల్స్ లేకపోతే ఆడిటోరియాలు. నాటక వారోత్సవాలు, నాటక, నాటికల పోటీలు కనుమరుగైపోతున్నాయి. ఏకపాత్రాభినయాలు, హరికథలు, బుర్రకథలు మృగ్యమైపోయాయి. నాటి చింతామణి, రక్త కన్నీరు నాటకాలెక్కడ? తోలుబొమ్మలాటలు నేటి తరానికి తెలుసా?

ఒకప్పుడు రవీంద్రభారతిలో ప్రదర్శించబడిన నాటకాలు ఇప్పుడెందుకు మాయమైపోయాయి. అమిత ప్రేక్షకాదరణ పొందిన బబ్బన్ ఖాన్ అదరఖ్‌కే వంజే రెండు గంటల పాటు ఒకే పాత్రతో నడిచే హాస్యకార్యక్రమం లాంటివి కనుమరుగయ్యాయి. మన యువత ఎంతకూ సినిమా వెర్రి, వ్యామోహంలోనో లేదా క్రికెట్ పిచ్చిలోనో పడి మన సంస్కృతికి దూరమవుతున్నది. సినిమాకి తోడు టీవీసెట్లు, సెల్ ఫోన్లు వచ్చి చదవడం, రాయడం అలవాట్లను మింగేశాయి. గృహిణులకు, వృద్ధులకు టీవీయే లోకంగా మారిపోయింది. విజ్ఞులు, ఔత్సాహికులు ప్రభుత్వ సాయంతో నాటకాన్ని బతికించుకోలేకపోతే నాటక ప్రక్రియే మరుగున పడిపోయే ప్రమాదం ఉంది.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# ప్రాచీన కావ్యాల్లో పల్లె ఆటల ప్రశస్తి

– ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు



బొంగరాలాట

*(క్రిందటి సంచిక తరువాయి)*

**5. బొంగరాలాట :**

**"పిన్నవారముగాన ప్రియమంది మాకు**
**ప్రొద్దు పోవుటకునై బొంగరాలాట**
**సెలవిచ్చి పంపుము చిత్తంబులలర"** అని, బాల చంద్రుడు, తల్లిని అర్థించినట్లుగా శ్రీనాధుని పల్నాటివీర చరిత్ర వివరిస్తుంది. బొంగరాల ఆటను పిల్లలు పొద్దు పోయేందుకు (కాలక్షేపానికి) ఆడుకున్నా వారికి తెలియ కుండానే ఎన్నో విజ్ఞాన సంబంధమైన విషయాలు ఈ ఆట ద్వారా బోధింపబడుతున్నాయి. గ్రామాల్లో బొంగరం కావాలంటే దుకాణంలో డబ్బుతో సులభంగా కొనుక్కునే వస్తువు కాదు – బొంగరాన్ని చెక్కించుకునేందుకు వడ్రంగి వద్దకు పోవాలి. అప్పుడాతడు గట్టి కర్ర భాగాన్ని గోపురం వలె చెక్కుతాడు. దానిపై 'సంగడి' పోస్తాడు (తాడు అల్లేందుకు అనుకూలంగా మెట్లు మెట్లుగా తీర్చిదిద్దడం). ఆ చెక్కిన బొంగరానికి కింద భాగంలో ఇనుపముల్లును కమ్మరి వేస్తాడు. తర్వాత బొంగరానికి అల్లేందుకు (చుట్టేందుకు) తాడు కావాలి. దీనిని దారాలతో పేని, రెండు వరుసలుగా చేసి జడవలె అల్లుతారు. ఆ తాడును 'జాలె' అంటారు. అందుకొరకు 'సాలె' ఇంటికి పోవాలి. ఇలా ఒక్క బొంగరం కోసం వడ్రంగి, కమ్మరి, సాలె అనే వృత్తి కళాకారుల ఇళ్లను పిల్లలు ఆశ్రయించాల్సి వస్తుంది. దీని ద్వారా వృత్తి పనులను తెలుసుకోవడమే కాదు, స్వయంగా వారి పనితనాన్ని చూసే అవకాశం కల్గుతుంది. ఈవిధంగా వృత్తి కళాకారుల ఇల్లు వారికి విద్యాలయాల్లోని ప్రయోగశాలలవలె తోడ్పడి వారిలో విజ్ఞానాన్ని రేకెత్తిస్తాయి.

పర్వతాన్ని బొంగరంతో, సర్పరాజును జాలెతో పోల్చి–

**"కనక నగంబు బొమ్మరముగా**
**భుజగేంద్రుడు జాలెగా నమర్చి"** (1–2) అని, తన కాలపు బొంగరాలాట ప్రాచుర్యాన్ని జక్కన కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) విక్రమార్క చరిత్రలో వివరిస్తాడు. బొంగరాన్ని ఆడేందుకు ఉపయోగించే తాడును 'జాలె' అనడం మాండలిక పదం. అది నేటికీ వ్యవహారంలో అలాగే ఉంది. కోస్తా ప్రాంతంలో దానిని 'జాటీ' అని వ్యవహరిస్తారు. ద్విపద పరమయోగి విలాసంలో (క్రీ.శ. 1498–1561)–

**".....బొమ్మరముల**
**కొనల నీలపు ములుకులు దాచినట్లు"** (3–148) అని, బొంగరం నేలపై తిరిగేందుకు ఉపయోగపడే ముల్లును తాళ్లపాక చిన్నన్న వర్ణిస్తాడు. బొంగరాలాటకు స్థలం ఏదైనా నేల చదునుగా ఉండడం అవసరం. నేలపై చిన్న వృత్తాన్ని గీసి అందులో ఓడిన వ్యక్తి బొంగరాన్ని ఉంచుతారు. అపుడు ఆటలోని మిగతావారు ఒక్కొక్కరు తమ బొంగరాన్ని నేలపై ఉన్న బొంగరానికి తగిలేవిధంగా విడుస్తారు. అపుడు బొంగరం ముల్లు ధాటికి నేలపై ఉన్న బొంగరం దెబ్బ తినడమో, ఒక్కొక్కసారి చెక్కలుగా పగిలిపోవడమో జరుగుతుంది. దీనినే 'పోతన చరిత్ర' అనే కావ్యంలో–

**"....కచ్చగట్టి బొం**
**గరమును వేయ వ్రేటుకొక కాయ పటుక్కను...."** (1–128) అని, వానమామలై వరదాచార్యులు వర్ణిస్తాడు. ఈవిధంగా కవులెందరో తమ కావ్యాల్లో ఈ ఆటతీరును సందర్భవశాత్తు తెల్పితే శ్రీనాధకవి దీనిని ఇంకా విపులీకరించి ఈ ఆటకు ప్రాముఖ్యతను కల్పించాడు.

**"బొంగరం బరచేత బూనుకయుండి**
**తిరిగింతు చేతిలో దీటులేనట్లు"** (పల్నాటి వీర చరిత్ర

2-39) అని పల్కడం, బొంగరాలాటలోని వైవిధ్యాన్ని తెల్పుతుంది. జాలెను బొంగరానికి పేనిన తర్వాత బొంగరాన్ని భూమిపై విడిచే బదులు, గాలిలోకి ఎగరవేసి దానిని అరచేతిలోకి దించే విధానం పైన తెల్పబడింది. ఇది బొంగరాలాటలో కొంత అనుభవాన్ని గడిస్తే తప్ప లభ్యంకాని విద్య. ఆటాడుకునే పిల్లలు ఆట లోకంలోనే ఉండి మన లోకంలోకి రారు, అనే పెద్దల దృక్పథం పొరపాటని పల్నాటి వీర చరిత్ర కావ్యంలోని బాలచంద్రుని బొంగరాల ఆట తెలియజేస్తుంది. బాలచంద్రుని బొంగరం కోమటి అండమ్మకు తగలడం, ఆమెతో అతడు తిట్లు తినడం -

**"బాలుల కాటలు పథ్యంబు గనుక**

**ఆడితి బొంగరం బది నిన్ను తాకె"** అని, ఆమెను క్షమించుమని కోరడం, ఆ తర్వాత వీధిలోని ఆటల్ని యుద్ధరంగంలోకి మల్పి, శత్రువుల ప్రాణాలతో అతడు చెలగాటమాడటం, ఒకదాని తర్వాత ఒకటి దృశ్యాలుగా మార్పు చెందుతాయి. పిల్లల్లో ఉండే అంతర్గతమైన శక్తి సమయాన్ని బట్టి బయట పడుతుందనే విషయానికి ఈ సంఘటన మచ్చుతునక. బాలలకు పిన్న వయసునుండే శక్తి, యుక్తులను ఒక తల్లిగా, గురువుగా బోధించే అంతర్గత శక్తి ఆటలకు ఉంది. ఇవి భవిష్యత్తులో వారి అభివృద్ధికి బలాన్నిస్తాయి. అందుకు పిల్లలకు కావల్సింది పెద్దల ప్రోద్భలం మాత్రమే.

**6. గాలిపటం :** గాలి పటానికి నేటి వ్యవహార రూపం 'పతంగి'. ప్రాచీనరూపం 'గాలిపడగ'. ఆకాశంలో గాలి వాటాన్ని అనుసరిస్తూ గాలి ఈలల ధ్వనులు నాగస్వరం వలె విన్పించగా, అందుకు అనుగుణంగా గాలిలో నాట్యం చేస్తాయి - గాలిపడగలు. చతురస్రాకారంగా ఉండే కాగితం పాము పడగవలె కన్పిస్తే, కాగితానికి ఒక మూల అతికించబడి అంగుళం వెడల్పు కల్గిన పొడవైన కాగితం, పాము మిగతా శరీరాకృతిని పోలి, గాలిలో మెలికలు తిరుగుతూ ఆడుతూ ఉంటుంది.

'పటం' అంటే చిత్రం లేదా బొమ్మ. గోడకు మేకు కొట్టి వేలాడ దీసిన దేవుని చిత్రాన్ని దేవునిపటం అని పిలవడం వాడుకలో ఉంది. ఈ విధంగానే ఆకాశపు కప్పు కింద గాలి అనే గోడకు వేలాడ దీసినట్లున్న చిత్రమే గాలిపటం. ప్రపంచంలో మొట్టమొదటి గాలి పటాలను మేమే ఎగురవేశామని చైనా, గ్రీకు దేశాలు చెప్తుంటాయి. ఐతే, ఎవరు ముందు ఎగురవేసినా, మానవుడు గద్దను చూసే గాలిపటం తయారుచేసి ఎగురవేశాడని మాత్రం ఒప్పుకోవాలి. ఇంతగా ప్రసిద్ధి పొందిన గాలిపడిన క్రీ.శ. 14వ శతాబ్ది వరకే తెలుగునాట అత్యంత ప్రచారంలో ఉన్నట్లుగా నాచన సోముని, ఉత్తర హరివంశ కావ్యం వల్ల విదితం అవుతోంది.

**"ఆలవాలంబు నీరిలో నాడు జాడ**

**గాలిపడగ యాకసమున గ్రాలు త్రోవ"** (5-108) తనకు కలలో కన్పించిన మన్మధాకారుని గూర్చి తాను ఏమియు తెల్పలేను, అని ఉష తన చెలికత్తె చిత్రరేఖతో పలుకుతుంది.

**"....నభ స్థలంబునం బిశాచకిశోరంబులు**

**విడిచిన గాలిపడగల కైవడి నాడాడ..."** (5-38) అని వర్ణించి వరాహ పురాణకర్తలైన నందిమల్లయ, ఘంట సింగనలు (క్రీ.శ. 15వ శతాబ్దం ఉత్తరార్థం) ఈ ఆటపట్ల పిల్లలకు గల మక్కువను తెలియజేశారు. అత్యంత వినోదాన్ని, కాలక్షేపాన్ని, విజ్ఞానాన్ని సమకూర్చే ఈ గాలిపటాల ఆటల్లో పోటీలు సైతం నడుస్తాయి. గాలివాటం ఈ ఆటకు ముఖ్యం. సంక్రాంతి పండుగరోజుల వాతావరణపు గాలులకు ఈ ఆట అనుకూలం. అందువల్ల నగరాల్లో సంక్రాంతి పండుగ 'పతంగుల పండుగ'గా వ్యవహారంలో ప్రసిద్ధమైంది. అందానికీ, దర్పానికీ, నేర్పుకూ ప్రతీకలుగా నిల్చే గాలిపటాలను అదుపు చేయడం నిజానికి సామర్థ్యంతో కూడిన పని - ఒక డ్రైవర్ తన వాహనాన్ని, ఒక యజమాని తన కుటుంబ సభ్యులను, ఒక అధికారి తన కింది సిబ్బందిని సామరస్య ధోరణిలో అదుపులో ఉంచుకోవాల్సిన వైనాన్ని, గాలిపటాల ఆట తాత్త్వికంగా బోధపరుస్తుంది.

**7. బొమ్మరిళ్లు :** బొమ్మరిళ్ళు ఆటలో మగపిల్లలు కన్పించినా, ఈ ఆటను ఆడపిల్లలే ప్రధానంగా ఆడుకుంటారు. ఇంటితో స్త్రీకున్న అవినాభావ సంబంధం దీనికి కారణం కావచ్చు. గృహలక్ష్మి అనే మాటలోని అంతరార్థాన్ని ఈ ఆట సూచిస్తుంది. తమ ఆలనా, పాలనా, ముద్దూ, మురిపెం చూసేందుకు తమకు తల్లులున్నట్లే, తాము ఆడుకునే బొమ్మలకూ ఒక తల్లి ఉండాలని కోరుకోవటం, ఆ తల్లి స్థానాన్ని తామే

స్వీకరించటం మనకు బాలికలు ఆడుకునే బొమ్మలాటలో కన్పించే దృశ్యం. అదేవిధంగా తాము నివసించేందుకు తమకు ఇల్లు ఏవిధంగా ఉందో, తమ బొమ్మలకు కూడా ఒక ఇల్లు ఉండాలని కోరుకొని, తమ ఆలోచనలకు రూపకల్పన నివ్వడమే పిల్లల బొమ్మరిండ్ల నిర్మాణంగా పేర్కొనవచ్చు. బాల్యదశలో మట్టి, ఇసుకతో కట్టుకునే బొమ్మరిండ్లు వారిలోని వాస్తు కళకు సంబంధించిన సృజనాత్మకతకు దర్పణం పట్టడమే కాదు, వారి భావి జీవితంలోని గృహనిర్వాహణా బాధ్యతలకు అంకురం తొడుగుతాయి. అందుకే ప్రాచీన కవులుసైతం తమ కావ్యాల్లోని నాయికలచే బాల్య జీవితంలోనే, ఆటల పేరుతో బొమ్మరిళ్ల నిర్మాణాన్ని చేయించారు. ఇది వారి భావి జీవితపు గృహిణీత్వపు సఫలతకు ఒక అంశంగా కవులు అనుసరించిన విధానాన్ని సూచిస్తుంది. అది ఏవిధంగానంటే - ఒక స్త్రీ ఇంటిని ప్రత్యక్షంగా కోరుకుంటోంది అంటే, పెళ్లి పట్ల పరోక్షంగా తన ఆసక్తిని కనబరచినట్లే (ఒక ఇంటిది కావాలనుకోవడం), వయసుతో పాటు మనసు ఎదుగుదలను సూచించే అంశమిది. ఇది మానసిక శాస్త్రజ్ఞులు చెప్పే అంతర్గతమైన కోరిక (ఇన్నర్ ఇన్‌స్టింక్ట్)కు సంబంధించింది. ఇది ఆమె స్వతంత్రమైన వ్యక్తిత్వానికి ప్రతీక కూడా. అందుకే శివుని పట్ల మక్కువ గల పార్వతీదేవి విషయంలో నన్నెచోడకవి (క్రీ.శ. 12వ శతాబ్దం ప్రారంభం) తన కుమార సంభవ కావ్యంలో పార్వతీదేవి క్రీడా విశేషాలను వర్ణిస్తూ -

**"......బొమ్మరిండ్ల జేయనగు...."** (3-36) అని, ఆమె నిర్మించుకున్న బొమ్మరింటిని గూర్చి తెల్పుతాడు. ఆమె శివుని వలచి వలపించుకొని తన ఇంటి వానిగా చేసుకొన్న విషయం జగద్విదితమే. తాళ్లపాక తిమ్మక్క (క్రీ.శ. 15వ శతాబ్దం) సుభద్రా కళ్యాణం అనే ద్విపద కావ్యంలో మేన బావపైనే మరలు గొన్న సుభద్రాదేవి క్రీడల్ని వర్ణించింది. వాటిలో - **"పొలుపైన రత్నాల బొమ్మరింటికిని - తళుకైన పగడాల దారబందములు / పచ్చల తలుపులు ....."** అంటూ ఆమె నిర్మించుకున్న బొమ్మరింటిని గూర్చి కొంత వివరంగానే తెలియజేసింది. వసురాజును వలచిన గిరికాదేవి కట్టుకున్న బొమ్మరిల్లు ఆమె ఉద్యాన వన క్రీడను తెలియజేసేదిగా ఉంది. అందుకే, ఆమె బొమ్మరింటిని గూర్చి,

**"....కోమల కల్పక పుష్పధూళి చే**
**ధరసుత బొమ్మరిల్ నిలిపి....."** (3-30) అని, రామరాజ భూషణకవి (క్రీ.శ. 16వ శతాబ్దం) తన వసుచరిత్ర కావ్యంలో వర్ణించి నవ్యతను తీసుకు వచ్చాడు. ఈవిధంగా ప్రాచీన కవులు వర్ణించిన బాలామణుల బొమ్మరిండ్లు బాల్యక్రీడల పట్ల వారికి గల ఆసక్తి, అభిరుచులను తెలియజేస్తాయి. అంతేకాక, తామూ నిర్మించుకున్న బొమ్మరిండ్లు తాము కోరుకున్న వరునితో చేసే కాపురాల కలలు సౌధాలు మాత్రమే కావు, అవి తమ భవిష్యత్ గృహనిర్మాణాలు అనే విషయాన్ని నిరూపించాయి. ఈవిధంగా బొమ్మరిండ్లు కావ్యనాయికల కాపురాలకూ, జానపద గ్రామీణ బాలికలు గృహ నిర్వహణలో చూపించే శ్రద్ధాసక్తులకు దర్పణం పడుతాయి.

**8. బొమ్మలాట :** పిల్లల పరిశీలనాత్మక దృష్టి, అనుకరణ గుణం బొమ్మలాట ద్వారా ప్రధానంగా వ్యక్తమయ్యే అంశాలు. తాము పెద్దవాళ్లమైపోతే ఎవరూ కొట్టరు - తిట్టరు - ఆడుకునేందుకు పోయినా, స్నేహితులతో బయట తిరిగినా ఏమీ అనరు, అని పిల్లలు తమ గూర్చి తాము ఆలోచిస్తారు. ఈ ఆలోచనల్లో తాము కోరుకునేది - తమకు దొరకనిదీ స్వేచ్ఛ అనే విషయం మనకు అర్థమౌతుంది. స్వేచ్ఛ కోసమైనా తాము పెద్దవాళ్లం అయిపోతే బాగుండుననే అంతర్గతమైన కోరిక పిల్లల బొమ్మలాట ద్వారా వ్యక్తమౌతుంది.

ఒక చిన్నారి 'బొమ్మ'ను తీసుకుంటుంది. ఆ బొమ్మను తన బిడ్డగా ఊహించుకొంటుంది. బొమ్మకు స్నానం చేయిస్తుంది. బట్టలు తొడుగుతుంది, తినిపిస్తుంది. కథలు చెప్తుంది. కొడుతుంది కూడా - మరి అనవసరంగా అల్లరి చేస్తావా, అలా వస్తువులను పాడు చేయొచ్చా! అని తాను కొట్టిన కారణాలను తెలియజేసి, తన హృదయం పశ్చాత్తాపంతో ఉప్పొంగగా మళ్లీ లాలిస్తుంది - ఇలా తల్లి వలన తాను దెబ్బలు తిని, ఏర్పరచుకొన్న మానసికోద్వేగాన్ని తన నుండి తానే పారదోలుకుంటుంది. పిల్లలు ఆటల ద్వారా తమ ఉద్దేశాలను స్వేచ్ఛగా ప్రకటిస్తారు. ఆధునిక పరిశోధనలలో ఆటలు రోగ నిర్ధారణకు (డయాగ్నొసిస్) చికిత్సా విధానానికి ఉపయోగ పడుతున్నాయి. ఉదా : 2,3 సంవత్సరాల పిల్లలకు తమ్ముడో, చెల్లెలో పుట్టినపుడు, తల్లిదండ్రుల దృష్టి పుట్టిన

పిల్లల మీద ఉంటుంది. అపుడు చిన్నారులకు కొత్తగా పుట్టిన పిల్లల మీద అసూయ జనించవచ్చు. దీనిని సహోదర స్పర్ధ (సిబ్లింగ్ రైవల్రీ) అంటారు. పిల్లలు నర్సరీ పాఠశాలలో గాని, ఇంట్లో గాని ఏకాంతంగా బొమ్మలతో ఆడుకునేటప్పుడు సహోదర స్పర్ధను బొమ్మల మీద చూపుతారు. పిల్లలు బొమ్మలను నేలకు వేసికొట్టడం, వాటితో ద్వేషంగా మాట్లాడటం మొదలైన చర్యలను గమనించవచ్చు. ఇట్లా కొన్ని సన్నివేశాల ద్వారా బొమ్మలాటలలో పిల్లల మనోవైకల్యాలు వెల్లడవుతాయి. అటువంటి ఆటలను నిర్ణీత పద్ధతులలో గమనించి, ఆటలో పిల్లల ప్రవర్తనకు గల కారణాలు విశ్లేషించి, తగిన రీతిగా పిల్లల తల్లిదండ్రులతో సంప్రదించి, పిల్లల మూర్తిమత్వం దెబ్బ తినకుండా తగిన సలహాలు తల్లిదండ్రులకివ్వాలి, అని బాల మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనికి సునిశితమైన పరిశీలన, సహనం అవసరం. ఈ విషయాల్ని తల్లిదండ్రులే పరిశీలించి తెలుసుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం. తాము పరిశీలించి తెల్సుకున్న విషయాన్ని తిరిగి ఆచరణలో పెట్టేందుకు వారిలో ఎంతో దూరదృష్టి, ఔన్నత్యం ఉండాలి.

బొమ్మల్లో - రంగురంగుల పేలికల నుపయోగించి చేసే బట్ట బొమ్మలు, బంకమట్టితో చేసే మట్టి బొమ్మలు, చెక్కతో తయారు చేయించిన బొమ్మలు - ఇలా పిల్లలు వారికి తోచినవిధంగా వారే తయారుచేసుకోవటం, ఇతరులు తయారుచేసి అమ్మిన వాటి నుండి ఇష్టమైనవి కొనుక్కోవడం - వీటివల్ల పిల్లల్లో సృజనాత్మక, కళాత్మక శక్తులు బయటకు వస్తాయి. అవి పిల్లల భావిజీవితంలో హస్తకళానైపుణ్యానికి కూడా దారితీయవచ్చు. పార్వతీదేవి బాల్యంలో ఆడిన ఆట బొమ్మల ద్వారా నన్నెచోడుని (క్రీ.శ. 12వ శతాబ్దం ప్రారంభం) కాలపు దంతం, గాజు, చెక్క బొమ్మల తయారీ మనకు అవగత మౌతుంది.

**''.......చిల్క బొమ్మలును దంతపు బొమ్మలు మేలిగాజు బన్నరులును/ మ్రాని చొప్పికలు....''** (కుమార సంభవం - 3-36) మొదలైన బొమ్మలను పార్వతీదేవి అందంగా నలుదిక్కులా పేర్చి శివార్చన చేసేది. ఇదంతా కూడా ఆమె శైశవ క్రీడా వినోదమే. శివునిపట్ల తనకు గల మక్కువ, మనోభీష్టాలను చిన్ననాటి నుండే ఆమె బొమ్మలాట ద్వారా వ్యక్తపరిచేది. పెరిగి యుక్తవయసు వచ్చిన తర్వాత శివునితో ఆమెకు పెళ్లి సంబంధం కుదిరే సమయంలో, తల్లిదండ్రులు చిన్ననాటి నుండి ఆమెకు శివునిపట్ల గల ఆరాధనను గుర్తించే వివాహాన్ని మిక్కిలి సులభంగా ఒప్పందం చేసుకొని ఉంటారు - దాదాపు ఇదే స్థితి తిక్కన (క్రీ.శ. 1210-90) వ్రాసిన మహాభారత విరాటపర్వంలో రాకుమారి ఉత్తర వ్యక్తపరుస్తుంది. ఈమె పార్వతీదేవిలా శైశవ క్రీడలు ఆడుకోలేదు - ఈమెది యుక్తవయసు. వీరుని భర్తగా పొందాలనే అభిలాష అంతర్గతంగా ఉన్న ఈమెలో చిలిపి చేష్టలు కూడా ఇంకా తొలగిపోలేదు. అందుకే, ఉత్తర గోగ్రహణానికి పోతున్న సారథి బృహన్నలతో - కురువీరులను గెలిచి, వారి వస్త్రాలలోని మంచి అందమైన రంగులతో ఉన్న వస్త్రాల నుండి ఎంపిక చేసి కనులకు విందుగోల్పే-

**“.....బొమ్మ పొత్తికలకుం దెండీ”** (4-47) అని, విన్నవించుకుంటుంది. దీనివల్ల 13వ శతాబ్దంలోనే అందమైన రంగు వస్త్రాలతో చేసే బొమ్మల తయారీ, బాలికలే బొమ్మల కొరకు వస్త్రాలను సేకరించుకొనే విధానం అవగతమౌతున్నాయి. బొమ్మలాటలో బొమ్మలు సంతానమైతే - బొమ్మలాటను ఆడుకునే ఆడపిల్లలే ఆ సంతానానికి తల్లులు. ఈ విధంగా - తల్లీ పిల్లల అనుబంధాన్ని పిల్లలే ఆట ద్వారా వ్యక్తీకరించడం ఈ ఆటలోని ప్రత్యేకత. ఆడపిల్లల భావిజీవితపు గృహిణీత్వానికి ఈ బొమ్మలాట ఇలా... అంకురం అవుతుంది.

**9. బొమ్మల పెండ్లి :** 'బొమ్మరిల్లు' కట్టుకోవటం, అందులో బొమ్మలను ఉంచి “బొమ్మలాట” ఆడుకోవటం - అనేవి బాల్యదశ సూచకాలు. 'బొమ్మలకు పెండ్లి' చేయటం అనేది తర్వాతి పరిణతి దశ. బొమ్మల పెళ్లిలో పెద్దరికం చేయడం - పిల్లల్లో వేడుకను కల్గించే విషయం. పెళ్లిసందడి ప్రధానంగా కన్పించే ఈ ఆటలో అధిక సంఖ్యలో పిల్లల సమూహం ఉంటుంది. అంతసేపూ ఒకే సమూహంగా కలిసి ఆడుకున్న పిల్లలు ఈ ఆటలో మాత్రం రెండు జట్లుగా ఏర్పడుతారు. ఒక జట్టు పెళ్ళికూతురు వారు - ఇంకొక జట్టు పెళ్లి కొడుకు వారు.

ఈ ఆట సామాన్యంగా పాటతో మొదలవుతుంది. పాటల రూపంలోనే మాటలు. పాటల రూపంలోనే తంతు - “గుజగుజ రేకుల పిలగాడున్నాడా - గుజ్జారేకుల పిలగాడున్నాడా'' అని వధువు తరపు వారి ప్రశ్న.

''గుజగుజరేకుల పిలగాడున్నాడు - గుజ్జారేకుల పిలగాడున్నాడు" అని వరుని పక్షం వారి సమాధానం. తమ ఇంట్లోనో, తమ ఊళ్లోనో, తమ బంధువుల పెళ్లో దర్శించి తెచ్చుకున్న అనుభవాన్నంతా పిల్లలు బొమ్మలపెళ్లి ఆటలో ప్రదర్శిస్తారు. ఈ ఆట పిల్లల పరిశీలనకూ, అనుకరణకూ పట్టం కట్టేదే. బొమ్మల పెళ్లి (ఆట)ని ఒకసారి ఆడిం తర్వాత, తాము చూడబోయే నిజమైన పెళ్లిని పిల్లలు అత్యంత ఆసక్తితో దర్శిస్తారు. తదనంతరం తాము ఆడే బొమ్మల పెళ్లికి మరింత రూపకల్పన చేసుకుంటారు. దీనివల్ల చిన్న నాటనే వారికి పెళ్లి పేరుతో గృహాలంకరణ, వస్తువుల కొనుగోలు, వధూవరుల అలంకరణ వంటి విషయాలతో పాటు - వివాహ సంప్రదాయాలు, వధువు తల్లిదండ్రుల సాధక బాధకాలు కొంతవరకు తెలిసే అవకాశం ఉంది. ఒకవిధంగా కుటుంబ పరిస్థితిని కూలంకషంగా అర్థం చేసుకునే అవకాశం కూడా ఉంది.

పిల్లలకు తమతోటి వారిపట్లనే కాదు - తమ కళ్లముందు కదలాడుతూ తమపై ఆనందాన్ని కురిపించే సాధు జంతువులూ, క్రిమికీటకాల పట్ల కూడా ఎంతో ఆసక్తి ఉంటుంది. అందుకే ఈమారు వాటినే పాత్రలుగా చేసి, బొమ్మలపెళ్లి జరిపించి, తమకు వాటిపట్ల గల ఆదరణను వ్యక్త పరుస్తున్నారు-

''చిలకమ్మ పెండ్లికి శృంగార ముంచిరి / సాలెపురుగులు సాపలు తెచ్చిరి / సీతాకోక చిలుకలూ, చీరెలు కట్టిరి / మండ్రు కప్పలూ బెకబెకలు కొట్టిరి / కాకుల మూకలు కేకలు వేసిరి / వాకిటా కోళ్లు బాకులాడే / పందిట పిచ్చికలు సందడి చేసే / కోకిలలూ కూర్చుండి పాటలు పాడే / నెమలి సానులూ నృత్యమూ లాడిరే / చిలుకమ్మ మొగుడంత.... / చిరునవ్వు నవ్వుతూ కూర్చుండె" ప్రకృతి పరిసరాల్లో జీవించి, తాదాత్మ్యం చెందే జానపద పిల్లలు జంతువులను పరిశీలించి వాటి స్వభావాన్ని జీర్ణించు కోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ బొమ్మల పెండ్లి పాట జంతుశాస్త్రాన్ని ఆపోశన పట్టిందనడంలో అతిశయోక్తి లేదు. స్త్రీకైనా, పురుషునికైనా జీవితం - పెళ్లితోనే ప్రారంభమౌతుంది. ఈ సత్యాన్ని ప్రాచీన కవులు తమతమ కావ్యాల్లో సందర్భవశాత్తు నర్మగర్భంగానైనా పేర్కొన్నారు. పార్వతీదేవి శైశవక్రీడా వినోదాలను వర్ణిస్తూ నన్నెచోడకవి (క్రీ.శ. 12వ శత్యాం ప్రారంభం) కుమార సంభవ కావ్యంలో

**".......బొమ్మపెండ్లి/మానరముగ జేసి యాడ నగజాత..."** (3-36) అని వర్ణించాడు. ఇదే అంశాన్ని హరవిలాస కావ్యంలో తెల్పిన మహాకవి శ్రీనాధుడు (క్రీ.శ. 1370-1450)- పార్వతీదేవి నీలకంఠుని స్తోత్రాలను నియతితో కూర్చిన విషయాన్ని వివరిస్తూ - ఆమె, **"బొమ్మ పెండిలి పాట బ్రొద్దుపుచ్చు"** (4-11) అని పాటల ద్వారా తన కాలంలో జరిగే బొమ్మ పెళ్లిళ్ల గూర్చి తెలియజేశాడు. రుక్మిణీ దేవి బాల్యంలో **"...బొమ్మల పెండ్లిండ్లు సేయుచు నబలలతోడ వియ్యంబులందు''** (దశమస్కంధం - పూర్వభాగం - 1687) అని, పోతన మహాకవి (క్రీ.శ. 1400-50) తన భాగవత కావ్యంలో తెల్పుతాడు. పొన్నిగంటి తెలగన (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్ధం) యయాతి చరిత్ర కావ్యంలో,

**"తన యీడువారైన తలిరాకు బోంట్లతో**

**సిరిబొమ్మ పెండ్లిండ్లు సేయకదలి"** (3-152) అని దేవయాని తనతోటి చెలులతో బొమ్మ పెళ్లిళ్ల ఆటలోని మాధుర్యాన్ని చవిచూసినట్లుగా రాస్తాడు. మధురలాలస చెలికత్తెలతో కలిసి ఆడిన ఆటల్లో - "దినముల్ కొన్ని చనంగనంత, కడు వర్ధిన్ బొమ్మ పెండ్లిండ్లు..." (6-202) చేర్చబడిన విషయాన్ని పింగళి సూరన (క్రీ.శ. 16వ శతాబ్దం) కళాపూర్ణోదయ కావ్యం వివరించింది. "బొమ్మ పెండ్లిండ్లకు పోనొల్ల నను బాల రణరంగమున కెట్లు రాదలంచె" (దశమస్కంధం 180) అని, పోతన (క్రీ.శ. 1400-50) భాగవత కావ్యంలో వర్ణించి తనకాలంలో బొమ్మలపెళ్లిళ్లు ప్రచారంలో ఉన్న విషయాన్ని తెలియజేస్తాడు. ఇలా - ఈ కావ్యాల్లోని నాయికలంతా బొమ్మల పెళ్లిళ్లలోని వధువుల స్థానాలలో తమనూ, వరుని స్థానాల్లో తాము కోరుకున్న పురుషులనూ ఊహించుకొని, వారిని మధుర భక్తి మార్గంలోనో, మధురాను భూతిలోనో స్తుతిస్తూ మనోలోకాల్లో తేలిపోయారు, అనే విషయాన్ని ప్రత్యేకంగా తెలుపవలసిన పనిలేదు. ఏదేట్లున్నా - 'బొమ్మలకు తాము పెళ్లి జరిపిస్తే, బొమ్మలు తమకు పెళ్లి జరిపిస్తాయి' అనే నమ్మకం ఇటు కావ్యనాయికలకూ, అటు జానపద బాలబాలికలకూ అంతర్గతంగా మనసులో తప్పకుండా ఉండే ఉంటుంది.

**10. గుజ్జెనగూళ్లు :** పిల్లల ఆటల్లోని ప్రతి ఆటనూ కేవలం ఆటగానే భావించక మానవుని జీవన విధానంలోని భౌతిక,



గుజ్జనగూళ్లు ఆట

మానసిక సంబంధమైన ఏదో ఒక దశతో సరిపోల్చి చూడాలి. బొమ్మరిండ్లు - మానవుని స్థిరనివాసాన్ని, బొమ్మలాట - మానవుని మనుగడను, బొమ్మలపెండ్లి - మానవజాతి ఉత్పత్తికి మూలాన్ని సూచిస్తే, గుజ్జనగూళ్లు- మానవ జీవితానికి సంబంధించి నిత్యావసరమై, అత్యంత ప్రధానమైన ఆహారపు అవసరాన్ని తెలియజేస్తాయి. అంతేకాదు - వివాహానంతరం ముఖ్యమైన వేడుకగా జరిపే పెళ్లి భోజనాన్ని విశదపరుస్తాయి.

వివాహ వేడుకకు సంబంధించిన పలు దశలను పరిశీలిస్తే, ఇరు జీవితాలను ఒకటిగా ముడివేసే మూడు ముళ్లకు ఎంత ప్రాధాన్యం ఉందో, వివాహానంతరం జరిపే పెళ్లి భోజనానికీ అంతే ప్రాధాన్యం ఉందని తెలుస్తుంది. అందుకే, పెళ్లి సందర్భంగా - వధువు తండ్రి వరుని వంశానికి, వధువు తల్లి వరుని బుద్ధికి, వధువు వరుని అందానికి ప్రాముఖ్యతనిస్తే, అనేక సంఖ్యాకులైన బంధువులూ, స్నేహితులూ - పెళ్లి భోజనం పట్లనే ఎక్కువ మక్కువను చూపిస్తారు, అనేది లోకంలో ఉన్న వాడుక. పెళ్లి జరిగింతర్వాత ఆహ్వానితులందరూ పెళ్లిభోజనం చేసి పోవడం అనేది సాంప్రదాయం. పెళ్లికెదిగిన పిల్ల ఇంట్లో ఉన్నప్పుడు కావలసినవారే కాక, పరిచయస్తులు కూడా 'మీ అమ్మాయికి పెళ్లి కుదిరిందా' 'పెళ్లి సంబంధాలు చూస్తున్నారా' అని అడగడం పరిపాటి. మరికొందరు లౌక్యంగా 'పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తారు' అని ప్రేమ పూర్వకంగా నవ్వుతూ అడుగుతారు.

ఈవిధంగా పెళ్లికీ, పెళ్లి భోజనానికీ అవినాభావ సంబంధం ఉంది. పెళ్లి భోజనానికి కల్గిన ఈ ప్రచారమే పిల్లల్లో 'గుజ్జనగూళ్లు' ఆటగా రూపుదిద్దుకుంది. అందుకే కవులు బొమ్మల పెళ్లిని వర్ణించిన తర్వాత దానికి అనుగుణంగా ఈ ఆటను గూర్చి తెలిపారు. పూర్వకాలం నుండీ ప్రాశస్త్యాన్ని కల్గి ఉన్న ఈ ఆటకు "బాలికలు గురుగులతో వండిన వంటకం" అనే అర్థాన్ని శబ్ద రత్నాకరం తెలియజేస్తోంది. తమ అక్కాచెల్లెళ్లతో ఇరుగు పొరుగుతో కలిసి నేడు మగపిల్లలు కూడా ఉత్సాహంతో ప్రదర్శిస్తున్న ఈ ఆట, ప్రాచీన కావ్యాల్లో బాలికలకు సంబంధించిన ఆటగానే వర్ణింపబడింది.

పార్వతీదేవి బాల్య జీవితాన్ని వర్ణిస్తూ ఆమె ఆడిన ఆటల్లో - **".....కూళ్లను వండుచు....."** (3-36) అని, ఈ ఆట ప్రసక్తిని నన్నెచోడుడు (క్రీ.శ. 12వ శతాబ్దం ప్రారంభం) కుమార సంభవ కావ్యంలో తీసుకు వచ్చాడు. రుక్మిణీదేవి బాల్య దశలోని ఆటలను వర్ణిస్తూ "గుజ్జన గూళ్లను కొమరొప్ప వండించి చెలులకు బెట్టించు చెలువు మెరయ" (శ్రీ మహాభాగవతం - దశమస్కంధం - పూర్వభాగం) అని, పోతన (క్రీ.శ. 1400-50) వివరించినాడు. "పాపమేపరి పచ్చ పన్నారు లోపుల కులుకు గుజ్జన గూళ్లు కుడుచుటుడుగి" (3-151) అని, పొన్నికంటి తెలగన (క్రీ.శ. 15వ శతాబ్దం పూర్వార్ధం) యయాతి చరిత్ర కావ్యం వివరించింది. దేవయాని మరియు ఆమె చెలుల బృందం గురుగుల్లోని గుజ్జన గూళ్లను కుడిచే సందర్భంలోని వర్ణన అది.

అల్లసాని పెద్దన మనుచరిత్ర కావ్యంలో (క్రీ.శ. 15-16 శతాబ్దాల నడిమికాలం) వరూధిని చెలులతో కూడి చేసే వన విహారాన్ని వర్ణిస్తూ, "చిఱుదేంట్ల కొసగె గుజ్జన గూళ్లు" (3-84) అని, గుజ్జనగూళ్ల ప్రసక్తిని తుమ్మెదల పరంగా తెలిపి నవ్యతను కొని తెచ్చాడు. ఈవిధంగా - ప్రాచీన కవులు తమ కావ్యాల్లో నాయికల బాల్య దశను వర్ణిస్తూనో, బాల్యదశ వీడినా ఆటల రుచి మరవని యవ్వన దశను సూచిస్తోనో, తమ కాలంలోని పెక్కు ఆటల పేర్లను నామమాత్రంగానైనా తెల్పగల్గారు. విశేషమేమంటే ఈ ఆటలు వారి మనోవికాసాన్నే కాక, వారి భావిజీవన వైభవాన్ని కూడా సూచించాయి. గుజ్జనగూళ్ల ఆటలో తెల్పబడిన నాయికలంతా తాము కోరిన పురుషుని స్తుతిస్తూ, అతనితో తమ వివాహం తద్వారా తమ కుటుంబ జీవనాన్ని ఊహించుకున్నవారే! జీవన చక్రంలోని సమస్యల వలయంలో తిరుగాడుతున్న వ్యక్తులకు, బాల్య జీవితంలోని ఈ ఆటలు కొద్దిక్షణాలైనా మనో ఫలకంపై మధురోహలను నిల్పి ఊరట కలిగిస్తా యనడంలో సందేహం లేదు. సీత వివాహానంతరం ఆమెను

అత్తవారింటికి పంపుతూ, ఆమె సమక్షంలోనే ఆమె ఆడుకున్న ఆటలను తలచుకొని, సీతాదేవి తల్లి దుఃఖించే విషయం వినేవారి గుండెలను పిండేలా చేస్తుంది. జానపదులు పాడుకున్న ఆ పాటను ఈ సందర్భంలో పేర్కొంటాను - **"బొమ్మరిండ్లు గట్టి బొమ్మలను బెట్టి - ఆట యెనరాడెదరమ్మ మాయింట, ఇంట గుజ్జెన గూళ్లు అట్టె వండుచును - అట్లెవ్వ రొండెదరమ్మ అమ్మ మాయింట"** (సీత అప్పగింతలపాట- కృష్ణశ్రీ స్త్రీల రామాయణపు పాటలు గ్రంథం నుండి) ఈ పాటలో సీత ఆటలను గాక పసితనాన్ని వీడని సీత మనసును జానపదులు దర్పణం పట్టినారు. గుజ్జెన గూళ్లు అనే పేరుతో కాకున్నా, ఈ ఆట నేటికీ ప్రచారంలో ఉన్నది - ప్లాస్టిక్‌వో, అల్యూమినియంతో చేసినవో అయిన చిన్న చిన్న ఆట గిన్నెలు, వాటికి మూతలు అమర్చటం, ఇంటి నుండి తెచ్చుకున్న ఏవైనా ఉపాహారాలను గిన్నెల్లో ఉంచటం, వాటిని పొయ్యి రాళ్ల పైకి ఎక్కించటం, వంట వండినట్లుగా అభినయించడం, ఆ వంటను ఆకుల్లోనో చిన్న చిన్న మూతల్లోనో కొసరి కొసరి వడ్డించడం, వంట రుచులను అడిగి తెలుసుకోవటం లాంటి దశలన్నీ ఈ గుజ్జెన గూళు ఆటలో కన్పిస్తాయి. ఈ విధంగా ఆట ద్వారా తమ తల్లినో, ఇంట్లోని ఇతర పెద్దలనో అనుకరించి, తమలో తామే పెద్దలను దర్శింప జేసుకోవటం ఈ ఆటలో కన్పిస్తుంది. గుజ్జెనగూళ్లు పిల్లల ఆటే ఐనా ఈ ఆట వంట వండుకునే విధానాన్ని, ఆ వంటను తమ వారితో కలిసి భుజించడాన్ని గురించి తెలియజేస్తుంది. బాలికలకు ఎక్కువ మక్కువగొల్పే ఈ ఆట, పెళ్లికి ముందే వంటా వార్పూ నేర్చుకోవాలనే విషయాన్ని వారిలో ప్రబోధిస్తుంది. ఈ విధంగా ఈ ఆట వారి భావి సాంసారిక జీవితానికి ప్రతీకగా నిలుస్తుంది.

*(ఇంకా ఉంది)*


**ఆచార్య తంగెడ కిషన్ రావు**
పూర్వ వైస్ ఛాన్స్‌లర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100


## కమ్మతెమ్మెర

**మే మిసిమి** సంచికలో (బుద్ధ పూర్ణిమ) (బుద్ధఘోష్) అన్నపురెడ్డి గారి స్మరణతో "జ్ఞాన సాధన"తో ప్రథమ వ్యాసం ప్రచురించారు. అభినందనీయము. పెద్దలు శ్రీ పెద్ది సత్యనారాయణ గారి (90+) అనుభవాలు, పుస్తక ప్రేమికుడు శ్రీ లంకా సూర్యనారాయణ గారిని గురించి పరిచయం చాలా సంతోషం కలిగించినది. గత సంచికలలో ఎందరో ప్రముఖులు, పూజ్యులు, సాహితీవేత్తలను గురించి పరిచయాలు వారి అనుభవాలను గురించి తెలుసుకునే అవకాశాన్ని శ్రీ అశ్వనికుమార్ గారు కలిగించినందుకు ధన్యవాదాలు. వారందరిని కలుసుకునే అవకాశం అందరికి కలగదు గదా! అశ్విని గారి శ్రమ ఫలితం. శ్రీ బి.వి. నరసింహారావు గారి వ్యాసం "వ్రాయడం ఒక కళ" - వ్రాయని వాళ్ళు చదివి సంతోషించుటకు మంచి అవకాశం. (చాలామంది వ్రాయడానికి బద్దకిస్తారు) పుస్తక పఠనం లోపిస్తే ఎంత నష్టం కలుగునో ఈతరం వారు గుర్తించడం లేదు (చరవాణి ప్రపంచం!). అందరూ అన్నిదేశాలు తిరగలేరు, చూడలేరు. చూసినా రాయలేరు. కాని లండన్‌లో స్థిరపడిన వైద్యులు నిమ్మగడ్డ శేషగిరి రావు గారి విదేశాల పర్యటన విశేషాలు (చారిత్రక, సాంస్కృతిక) తెలుసుకోవడం ఎంతో సంతోషము. మాలతీచందూర్ గారి సాహితీసేవ - గుడ్‌ఎర్త్ ప్రియర్స్‌బక్ నవల సంక్షిప్తం. వారి నవల "హృదయనేత్రి" పరిచయం (నవలలు చదవనందుకు) ద్వారా వాటిని గురించి తెలుసుకునే అవకాశం **మిసిమి** ద్వారా కలిగినది. చలం గారి గురించి ఈ తరం వారికి తెలియదు. వారిని గురించి "నేటికీ ఓ శేషప్రశ్న!" ద్వారా తెలియజేశారు (జూన్ 2024). డిసెంబర్ 2024 **మిసిమి**లో శ్రీ ఐ.వి. రామరాజు గారి "సిమెంటు తయారు మంట" సిమెంటు లేనిచో కొత్త భవనాలు, ఆనకట్టలు నిర్మించలేరు. నిరంతర గనుల తవ్వకంతో ఖనిజాన్వేషణతో మానవాభివృద్ధి (ఆధునిక అభివృద్ధి) ఆగదు. పర్యావరణానికి ఎంతో ముప్పు కలిగిస్తున్నా ఆగని అభివృద్ధి చేతితో చరవాణి తయారీకి ఎన్నో మూల పదార్థాలు అవసరం (బంగారం, సిల్వరు, కాపర్ మొదలైనవి). అవన్నీ ఖనిజాల నుండి వచ్చేవే! మానవ సుఖసంతోషాలకు చరవాణి, దూరదర్శన్‌లే గదా!




*- పి.వి. శేషారావు, హైదరాబాద్*

# పేరులోనే అంతా వుంది - ఆపరేషన్ సింధూర్

– వల్లభనేని అశ్వినీకుమార్

దీనికి పూర్వాపరాలు విరివిగా ప్రచారం పొందినవే – కాశ్మీర్ అందాలను కుటుంబ సభ్యులతో కలిసి తిలకించి పులకించాలని దేశప్రజలు ఆశించడంలో ఏమాత్రం తప్పులేదు. కాని తప్పు ఎక్కడ జరిగింది? ఎవ్వరు చేశారనేదే ఈ ఆపరేషన్ సింధూర్‌కి నాంది!

పెహల్గాంకు – ప్రకృతి అందాలు – మంచు పర్వతాలు – దేవదారు వృక్షాలు – చిక్కటి పచ్చటి మైదానాలు – పూలు కప్పుకున్న గొర్రెలు – నిద్దరీ నదీ ప్రవాహం చిన్న చిన్న గుర్రాల సవ్వారీ – ఇవన్నీ పర్యాటకుల్ని ఎంతగానో ఆకర్షిస్తాయి – అలరిస్తాయి. అలాంటి ప్రదేశం చూడకుండా కాశ్మీర్ యాత్ర పూర్తికాదంటారు. ఆరోజు కూడా యాత్రికులతో సందడిగా వున్న ఆ మైదానాన్ని రక్తంతో తడిపాయి – ఉగ్రవాదుల కాల్పులు! – 26మంది అమాయకులు – కొత్త దంపతులు – కుటుంబ సభ్యులు – ప్రాణాలు కోల్పోయారు. దేశమంతా నివ్వెరపోయింది. రేపోమాపో కాశ్మీర్ వెళ్లదలచుకున్నవారు – ఉలిక్కిపడ్డారు – నిన్నో మొన్నో వెళ్లినవారు – భయంతో వణికిపోయారు. ఈ బాధ – దేశప్రజలను బలంగా కమ్ముకుంది – అయితే అప్పటినుండి పదిరోజుల్లో ఒక ప్రకటన అదే దేశప్రజలకు ఒక విశ్వాసాన్ని – ధైర్యాన్ని – గగుర్పాటును కల్గించింది. అదే ఆపరేషన్ సింధూర్ – పేరులోనే అంతా వుంది అన్నాం కదా– ఆ పేరు పెట్టిన వ్యక్తి దేశప్రధాని – నరేంద్రమోదీ – అశ్వమేధాన్ని వదిలినట్టు ఆపరేషన్ సింధూర్‌ని త్రివిధ దళాలకు అప్పగించారు. మన వాయుసేన, నౌకాయాన సేన, సైనికసేన తర్వాత ఏమి చేశారో మనకు తెలియంది కాదు–

అయితే మనం మాధ్యమాల్లో చదివినట్టూ – టీవీలో చూసినట్టూ ఇది అంత తేలిక విషయం కాదు – త్రివిధ దళాలు – ప్రణాళిక రచించటానికి – మూడు రోజులు కూడా పట్టి వుండదు. అమలు పర్చటానికి వారం రోజులు సరిపోతుంది. శత్రువుల నడ్డి విరచటానికి – కాళ్ల బేరానికి రావటానికి పదిరోజులు సరిపోతుంది, అని ఎవ్వరూ వూహించి వుండరు! అయితే ఇక్కడ జరిగింది ఏమిటి – ఉగ్రవాదుల స్థావరాల్ని నేలమట్టం చేయటం – వారికి దన్నుగా వున్నవారి వెన్ను విరవటం – వాటన్నిటికి మూలమైన పాకిస్థాన్ మిలటరీ నేతల నమ్మకాలను బుగ్గిపాలు చేయడం – వీటన్నిటికీ సూత్రధారి మన ప్రధాని. దేశప్రజలు – పెహల్గాం దాడులకు భయపడి – నివ్వెరపోయారు – అదే దేశప్రజలకు ఆత్మవిశ్వాసం కలిగించింది – దేశాన్ని – ప్రజలను కాపాడగల నాయకుడున్నాడు – సైన్యం వుంది – ప్రాణాలర్పించే సైనికులున్నారని నిరూపించింది ఆపరేషన్ సింధూర్.

ఇందులో ముఖ్యమైన అంశాలు కొన్ని గుర్తు చేస్తాను. పి.ఒ.కె.లో వున్న 13 ఉగ్రవాద స్థావరాల్ని అగ్గిపాలు చేశారు. కరాచీ – రేవుని కకావికలు చేశారు. కిరానా కొండల్ని పిండి చేసి వదిలారు – పాకిస్థాన్ ప్రధాని నివాసానికి 10 కిలోమీటర్ల దూరంలో బాంబుల దాడి చేసి భయభ్రాంతుల్ని చేశారు. ఇవన్నీ కూడా – ఒక్క నష్టం – ఒక్క ప్రాణం పోకుండా చేయటానికి ఎంతటి ప్రణాళికలు అవసరమో మనలాంటి సామాన్యులకు అవగాహనకు రాదు. దురదృష్టవశాత్తు – వార్తా మాధ్యమాలు కూడా – నిజాలకంటే ఊహాగానాలే ఎక్కువగా చూపుతున్నాయి. అయితే ఒకసారి కాల్పుల విరమణ – అనేసరికి అదే ప్రజలు ఒకరకమైన నిస్తేజానికి గురి అయ్యారని చెప్పాలి– చాలదు వారిని ఇంకా శిక్షించాలి– మా కోపం చల్లారలేదు– అన్నట్లు భావించారు – కాని తర్వాత రోజుల్లో ప్రధాని ప్రసంగాలు – వివరణ ఇచ్చిన తర్వాత వారి కోపం మెల్లగా చల్లారిపోయింది – శత్రువు కాళ్ల బేరానికి వచ్చినట్లు తెలిసి తమని తాము సముదాయించుకున్నారు.

అయితే ఆపరేషన్ సింధూర్ ఇక్కడితో ఆగిపోలేదు – ఇది ఉగ్రవాదులకు – వారిని ప్రోత్సహించే దేశానికి ఒకరోజు హెచ్చరిక కాదు – వారు ఎప్పుడు తప్పుడు ఆలోచన చేసినా 'ఆపరేషన్ సింధూర్' పేరు గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. క్షేత్రంలో విజయంతో ఆగిపోలేదు – ప్రభుత్వం – 75 మంది దౌత్యవేత్తలను పిలిచి – వారికి జరిగినదేమిటో ఉగ్రవాదుల్ని ఎవరు పెంచి

పోషిస్తున్నారో – వారి భరతం భారత ప్రభుత్వం ఎలా పట్టిందో విజయాలతో సహా వివరించారు. ఇంత గెలిచి రచ్చ గెలవటమంటే ఇదే కదా. కాని ప్రధానికి ఇదికూడా చాలదనిపించింది. అన్ని ప్రజాస్వామిక పార్టీల లోక్‌సభ సభ్యులతో బృందాలను ఏర్పరచి ముఖ్యమైన దేశాలకు పంపిస్తున్నారు – ఆ దేశాధినేతలకు – భారత్ ఐక్యంగా వుంది. ఎటువంటి భిన్నాభిప్రాయాలకు తావులేదు. ఉగ్రవాదుల విషయంలో – దేశమంతా ఒకేత్రాటి మీద వున్నదని వివరించటానికి – దౌత్యపరంగా విజయం సాధించటానికి ఇది చాలా ముందు చూపు – ఇదికూడా 'ఆపరేషన్ సింధూర్'లో భాగంగానే ప్రధాని చెప్తున్నారు– దేశప్రజలకు విశ్వాసాన్ని అన్నివిధాలా ఇనుమడింప చేశారు. ఇప్పుడు ప్రజలు మళ్లీ క్రికెట్ ఆడుకుంటున్నారు ఫ్లడ్‌లైట్లలో – సమర్థుడైన పాలకుడు – ముందు చూపున్న నాయకుడు తమకున్నాడనే నమ్మకంతో.

ఇంతకు పూర్వం జరిగిన మూడు సంఘటనలు గుర్తు చేసుకోవాలి – కార్గిల్ యుద్ధం – అది పాకిస్థాన్ ప్రేరేపిత యుద్ధమే – ఎటువంటి సందేహం లేకుండా భారత జవాన్లు విజయం సాధించి – పాకిస్థాన్‌ని మట్టి కరిపించారు. తర్వాత పుల్వారా – సంఘటనలో ఉగ్రవాదుల కాల్పుల్లో జవాన్లు చనిపోవడం మరికొన్ని దురదృష్ట ఘటనలు – అయితే దీనికి – ప్రతీకారం – సర్జికల్ స్ట్రైక్స్ పేరుతో ఉగ్రవాద స్థావరాలను – నాశనం చేశారు– మూడోది పెహల్గాం పైశాచిక దాడితో 26 మంది అమాయకులైన భారతపౌరులు నెత్తుటి మడుగులో ప్రాణాలు కోల్పోవటం –

మొదటి కార్గిల్ యుద్ధం – ఎల్.ఒ.సి. దగ్గరే జరిగింది – రెండోది పి.ఒ.కెలో చేశారు.

ఇప్పటి ఆపరేషన్ సింధూర్ – పాకిస్థాన్ నడిబొడ్డున విధ్వంసం సృష్టించింది. ఎప్పుడు ఏది అవసరమో అలాగే బుద్ధి చెపుతున్నారు – అయినా మూర్ఖుని మనస్సు రంజింపచేయడం ఎంత కష్టమో కదా!

*(ఆకాశవాణి సౌజన్యంతో)*

## కమ్మతెమ్మెర

**అయ్యా! ఇది తత్త్వమసి రామకృష్ణ గారి సంభాషణకు స్పందన.**

సర్ బుద్ధుని కాలనిర్ణయం ప్రధానంగా క్రీ.పూ. లేదా సా.శ.పూ 543 అని లెక్క కట్టారు. 2500 బి.సి. ముందే ఉన్నారని **మిసిమి**లో రాసారు. దాని రిఫరెన్స్ ఏమిటో చెప్పండి. నేను చాలా వెతికాను. బౌద్ధ కాలగణన అనగా బుద్ధుని పారినిర్వాణ సంవత్సరాన్ని ఆధారంగా తీసుకుని ఆ తర్వాతి సంవత్సరాలను గణించే పద్ధతి. ఇది ప్రధానంగా థెరవాద బౌద్ధ దేశాల్లో కాలనిర్ధారణ కోసం ఉపయోగించబడుతుంది. చాలామంది అంగీకరించిన సంగతి ప్రపంచంలో సుమారు 500 సంవత్సరాల పరిధిలో అప్పటికి అధికారంలో ఉన్న భావాల మీద తిరుగుబాటు జరిగింది. యూరప్‌లో క్రైస్తు భారతదేశంలో బుద్ధుడు, చైనాలో కన్ఫూజియస్ పుట్టారని తెలుస్తోంది. ప్రధాన గణనా ప్రక్రియ పారినిర్వాణ ఆధారంగా ఈశాపూర్వ 543లో (సంస్కృతంలో 543 BCE) బుద్ధుడు పారినిర్వాణం పొందారని నమ్మకం. పారినిర్వాణాన్ని 0 కావడంతో తర్వాతి సంవత్సరాలు బౌద్ధ సంబంధిత ఈరాలో లెక్కించబడతాయి. కొన్ని దేశాల వేరియంట్లు మయన్మార్ (బర్మా) గణనలో పారినిర్వాణం 544 BCEగా భావిస్తారు.

శ్రీలంక, థైల్యాండ్, కంబోడియా, లావోస్‌లో ప్రధానంగా 543 BCE వర్షం ఆధారంగా ఉంటుంది. ఆధునిక గ్రెగోరియన్‌తో సమ్మేళనం ది గ్రెగోరియన్ సంవత్సరానికి 543ని జోడిస్తే (థెరవాదా గణన ప్రకారం) బౌద్ధ ఈరా సంఖ్య దొరుకుతుంది. ఉదాహరణ: 2025+543 = 2568 బౌద్ధ ఏరా మయన్మార్ వేరియంట్లో 2025+544= 2569 బౌద్ధ ఏరా లూనిసోలార్ నిర్మాణం ప్రతి12 మాసాలుగా ఉంటుంది. దినదిన వ్యత్యాసాన్ని తీర కొరకు ప్రతి కొన్ని సంవత్సరాలకు ఒక ఇంకా మాసాన్ని (ఇంటర్‌కాలరీ) చేర్చుతారు. ఈ ఫెస్టివల్ తేదీలు, ఆనందపూర్ణ మీనాటిండ్లు లాంటి ప్రధాన బౌద్ధ వేడుకలు ఈ నెలల గడచిన మీద ఆధారపడి నిర్ణయిస్తారు. ఆసక్తికర అంశాలు భారతీయ శకసంవత్ (శక ఏరా) 78 CE లో ప్రారంభమవుతుంది. ఇది బౌద్ధ కాలగణనకు కాకుండా సంస్కృత శాసన కాలానికి చెందినది. సరిగా దేనిని ఉపయోగించాలో దేశీయ సంప్రదాయం, అర్చక పరిణామాలు, చరిత్ర పరిశోధనలు నిర్ణయిస్తాయి. ఇది ఎఐ చెప్పినది.

***మిసిమి : అయ్యో మీరేదో చెప్తున్నారు. ఇది బుద్ధుని 2569 జయంతి సం. Ai కి అన్నీ తెలుసను కోవటం మన భ్రమ. బీసీ అని అనటం పొరపాటే. వేదాలు అయిదువేల నాటివని, తర్వాత ఉపనిషత్తులని, ఆ తర్వాతే బుద్ధుడని చెప్పటం నా ఉద్దేశం.. క్రీస్తు పూర్వం అనేది ఒక బ్లాక్.. మీరు బాగాచదివారు.. ధన్యవాదములు.***

**- వివినమూర్తి, బెంగుళూరు**

# పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీరు

– వేలూరి కృష్ణమూర్తి


భారత దేశానికి శిఖరప్రాయంగా వుంటున్న ఇంతకు ముందున్న కాశ్మీర్ రాజ్యం లేదా ఇప్పటి కేంద్ర పాలిత ప్రదేశాలైన జమ్ము, కాశ్మీర్ మరియు లడాఖ్, పూర్తిగా భారతదేశం అధీనంలో లేవు. సుమారుగా 96,000 చదరపు కి.మీ. విస్తీర్ణమున్న ప్రదేశం ప్రస్తుతం పాకిస్తాన్ అధీనంలో వున్నది. ఇదే కాక సుమారుగా 38,000 చ.కి.మీ. విస్తీర్ణపు భూభాగం ఆక్సాయ్ చిన్ చైనా అధీనంలో వున్నది. దీనికి తోడుగా చైనా దేశానికి పాకిస్తాన్ ఒప్పచెప్పిన 5,200 చ.కి.మీ. విస్తీర్ణమున్న శక్సమ్ కనుమ కూడ చైనా అధీనంలో వున్నది. ప్రస్తుతం నిజంగా మన అధీనంలో వున్నది కేవలం 42,241 చ.కి.మీ విస్తీర్ణమున్న జమ్ము, కాశ్మీర్ మరియు 59,146 చ.కి.మీ విస్తీర్ణమున్న లడాఖ్ కేంద్ర పాలిత ప్రదేశం మాత్రమే. భారత్–పాకిస్తాన్ల మధ్య 1947–48లో జరిగిన యుద్ధంలోను, అనంతరం 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో చైనాకు మనం పోగొట్టుకొన్నది సుమారుగా 1,39,000 చ.కి.మీ. విస్తీర్ణమున్న భూభాగం. నిజ స్థితిలో పాకిస్తాన్ అధీనంలోవున్న మన భూ ప్రదేశాలపై న్యాయరీత్యా ఆ దేశానికి ఎలాంటి హక్కూ లేదు. మనం పి ఓ కె (POK) లేక పిఓజెకె (POJK) అని పిలుస్తున్న ప్రదేశాన్ని పాకిస్తాన్ రెండు రాజకీయ వలయాలుగా రూపించుకొన్నది. మన జమ్మూ కాశ్మీర్ మరియు పాకిస్తాన్ ప్రాంత్యపు పంజాబ్ మధ్య చిక్కుకొని, ఒక వొంచిన చేతి వ్రేలు ఆకారంలా వున్న, కేవలం 13,297 చ.కి.మీ విస్తీర్ణపు ప్రదేశం భారత్–పాకిస్తాన్ల మధ్య 1947–48లో జరిగిన యుద్ధంలో భారతదేశం నుండి తాను విముక్తి చేశామని చెప్పుకొనే పాకిస్తాన్, మొదలు ఆ ప్రదేశానికి 'ఆజాద్ కాశ్మీర్' అంటే స్వతంత్ర కాశ్మీర్ అని పేరు పెట్టి అక్కడొక కృత్రిమ పాలనా వ్యవస్థను సృష్టించింది. కాని, అక్టోబర్ 26, 1947న మహారాజ హరి సింగ్ అధికృతంగా చేవ్రాలు చేసిన అధీన పత్రం (Instrument of Accession) ప్రకారం ఆ ప్రదేశం భారత దేశానికి చేరినది. తథాకథిక ఆజాద్ కాశ్మీర్ మరియు మన జమ్ము కాశ్మీర్ రాజ్యానికి ఉత్తర భాగంలో వున్న, పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్ (POK) అని మనం పిలిచే గిల్గిట్–బాల్టిస్తాన్ ప్రదేశాలను మనం పి.ఓ.కె (POK) అని చెప్పుకొనే భాగంకాక అవి తమ దేశానికి అధికృతంగా చెందిన భూభాగమని పాకిస్తాన్ చెప్పుకొంటుంది. ఈ విషయానికి సంబంధించిన ఒక కుట్రతో కూడిన కృత్రిమ కథ యిలా వున్నది: పామీర్ పీఠభూమికి ఆవల రష్యన్ల చర్యలను గమనించడానికి అపుడు భారత దేశానికి వలసలుగా వచ్చి అధికారం స్థాపించుకొన్న బ్రిటిష్ ప్రభుత్వం, మహారాజ హరిసింగ్‌కు చెందిన జమ్ము కాశ్మీర్ సంస్థానపు వాయువ్య భాగంలో గిల్గిట్ పట్టణం మరియు దాని చుట్టుప్రక్కల వున్న ఒక చిన్న ప్రదేశాన్ని తన సైన్యం అధీనంలోనికి తీసుకొని గిల్గిట్ స్కౌట్స్ (Gilgit Scouts) అన్న తన సైన్యపు ఒక భాగాన్ని అక్కడ వుంచింది. కాని, రాజకీయంగా ఆ ప్రదేశం మహారాజ హరిసింగ్ సంస్థానానికి చెందినదై వుండేది. ఆగస్ట్ 15, 1947న భారత ఉప–ఖండంలో బ్రిటిష్ వలస ప్రభుత్వం పరిపాలన అంతమొందిన వెంటనే గిల్గిట్ ప్రదేశం మీద బ్రిటిష్ సైన్యానికి వున్న అధికారం కూడ అంతమొందినది. కాని, భారతదేశం మరియు పాకిస్తాన్ మధ్య అక్టోబర్ 27, 1947న జరిగిన యుద్ధం ప్రారంభమైనపుడు గిల్గిట్ స్కౌట్స్ ముఖ్యాధికారి విలియం ఎ. బ్రౌన్ గిల్గిట్లో పాకిస్తాన్ పతాకాన్ని ఎగురవేశాడు. అలా చేయడానికి అతనికి

న్యాయపరంగా ఎలాంటి అధికారం వుండేది కాదు. కాని లండన్లో వున్న బ్రిటిష్ వలస ప్రభుత్వం ఆదేశం మేరకు అతడు అలా చేశాడు.

రష్యన్లు అరబ్బి సముద్రంతో సంపర్కం పొందడాన్ని అడ్డుకొనే ఉద్దేశంతో బ్రిటిష్ వారు 20వ శతాబ్దం ప్రారంభంలోనే పాకిస్తాన్ సృష్టికి ఒక కుట్రను పన్నారు. ఆఫ్ఘనిస్తాన్ మరియు అరబ్బి సముద్రం మధ్య తమ మాటలు వినే ఒక చిన్న రాజ్యం అస్తిత్వంలో వున్నట్టయితే అక్కడ తమ సైనిక ప్రభావాన్ని నిర్మించుకొని రష్యన్లు ఇటువైపు రాకుండునట్టు అడ్డుకోవచ్చునని బ్రిటిష్ ప్రభుత్వం తలచింది. ఆ విధంగా పాకిస్తాన్ సృష్టింప బడింది. కాని, కాశ్మీరు ప్రత్యేకంగా భారతదేశం అధీనం లోనికి వెడితే ఆఫ్ఘనిస్తానపు 'తెలు వాఖాన్ కారిడార్' ద్వారా అప్పటి సోవియట్ యూనియన్ మరియు స్వతంత్ర భారత దేశం మధ్య దగ్గరి సంపర్కం ఏర్పడవచ్చునని అనుమానించిన బ్రిటిష్ ప్రభుత్వం, దీనిని అడ్డుకోవడానికి గిల్గిట్‌ను పాకిస్తాన్‌కు యివ్వాలని తర్కించి, ఆ విధంగా గిల్గిట్‌లో 1947 నవంబర్ 2న పాకిస్తాన్ దేశ పతాకం ఎగిరేలా చేసింది. అనంతరం 14 నెలల కాలం జరిగిన ప్రథమ కాశ్మీర్ యుద్ధంలో (1947-48) గిల్గిట్‌కు తూరుపులో వున్న బాల్టిస్తాన్, మరియు హుంఝా, దక్షిణం వైపున్న పార్వతీ కొండల వరుస, స్కారదు పట్టణం, నీలం కనుమ మరియు కార్గిల్ ఉన్నత ప్రదేశాలను (upper reaches) పాకిస్తాన్ ఆక్రమించుకొని వాటినన్నిటినీ గిల్గిట్‌తో కలిపి అవి తమకు అధికృతంగా లభించిన ప్రదేశాలని చెప్పుకోసాగింది.

ఆ సమయంలో భారతీయ సేన ఉద్దేశించిన ప్రకారం కిశన్ గంగా నదిమీద వున్న ఒక వారధిని నాశనం చేయడానికి విడిచివున్నట్టైతే పాకిస్తాన్ సేనలు పైన చెప్పిన ప్రదేశాలు ప్రవేశించడానికి సాధ్యమయ్యేది కాదు. కాని, మన సేనాధికారుల వ్యూహాలకు అడ్డుపడి నిలబడ్డ జవహర్లాల్ నెహ్రూ కిశన్ గంగా వారధి నాశనం చేయకూడదని, అది అలాగే నిలిచివుండాలని నిర్దేశించడంతో, దాని పర్యవసానంగా పాక్ సేనలు సునాయాసంగా ఇటువైపు రావడానికి సాధ్యమయ్యేలా చేసినది మన దేశ దౌర్భాగ్యం. అలా పాకిస్తాన్ ఆక్రమించుకొన్న ప్రదేశాలలో కార్గిల్ ఉన్నత ప్రదేశాలను (upper reaches) మాత్రం 1971లో మన సేన మరల వశపరచుకొన్నది. మిగిలిన అన్ని ప్రదేశాలను పాకిస్తాన్ మొదలు 'నార్తర్న్ టెరిటరీస్' అని పేరు పెట్టింది. ఈ శతాబ్దం మొదటి దశాబ్దంలో ఆ పేరును 'గిల్గిట్-బాల్టిస్తాన్' అని మార్చుచేసి ఆ ప్రదేశాలు అధికృతంగా తమవేనని పాకిస్తాన్ చెప్పినదాన్ని ఆ దేశం సర్వోత్తమ న్యాయాలయం తిరస్కరించి, ఆ ప్రదేశాలు కాశ్మీర్‌కు చెందినవని తీర్పు యిచ్చింది. దీని అర్థం, మన దేశ వాదానికి బలం వచ్చినట్టయింది.

ఇపుడు మనకు మన దేశ హితం ప్రాముఖ్యత యిచ్చే ప్రభుత్వం అధికారంలో వున్నది. మనం ఇంతకు మునుపు పోగొట్టుకొన్న భూ ప్రదేశాలను మన దేశంతో కలిపే సంకల్పం చేసి ముందుకు అడుగులు వేస్తున్నది.




అరబ్బి సముద్రానికి రష్యన్లు రావడాన్ని ఆపాలని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం పాకిస్తాన్‌ను సృష్టించింది. కాని ఈనాడు ఈ వలయంలో బ్రిటిష్ మాయమై అమెరికా ఇక్కడ ప్రముఖ సేనా శక్తిగా నెలకొన్నది.

దీని అర్థం ఇంతకు మునుపు బ్రిటిష్ ఎదుర్కొన్న సమస్యే ఇంకొక రూపంలో అమెరికా ఎదుట లేచి నిల్చుకొన్నది. పాకిస్తాన్ ద్వారా చైనా అరబ్బి సముద్రం వైపు మార్గం వెదుక్కొన్నది! గిల్గిట్-బాల్టిస్తాన్‌తోపాటు మొత్తం పాక్ ఆక్రమించిన కాశ్మీర్‌ను మన వశంలోనికి తీసుకొంటె, చైనా మరియు పాకిస్తాన్ల మధ్య భూసంపర్కం లేనట్టు కత్తరించబడుతుంది. అరబ్బి సముద్రం చైనా నుండి దూర దూరాలకు వెళ్ళిపోతుంది!

**వేలూరి కృష్ణమూర్తి**
మైసూర్, ఫోన్ : 9448977877

# వయొలిన్ విద్వాన్ ద్వారం దుర్గా ప్రసాద రావు

– మిసిమి



మిసిమిలో ద్వారం

*"జీవాళి" పుస్తకంతో సంగీత ప్రపంచంలో కొత్త ద్వారాలు తెరిచారు ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం దుర్గా ప్రసాదరావు గారు. పచ్చగా దబ్బపండులా మెరిసిపోతూ కర్నాటక సంగీతం గురించి, వయొలిన్ వాద్యం గురించి ఆయన మాట్లాడుతుంటే ఓ మెరుపు వీణ జావళీలా సాక్షాత్కరిస్తుంది. చినతాతగారు ద్వారం వెంకటస్వామి గారి వారసుడిగా కన్నా, తమ తాతగారు ద్వారం వెంకట కృష్ణయ్య గారు తమ్ముడు వెంకటస్వామి నాయుడు గారి కోసం పడ్డ శ్రమను చాలా ప్రేమగా పంచుకోవటమే ఆయనకు ఇష్టం... నిజానికి ఆయనకున్న ప్రతిభకు రావలసిన పేరు రాలేదాయనకు. అందుకు పెద్ద బాధలేకపోవటం విచిత్రమనిపించింది. ఆయన అభిప్రాయాలు కొంచెం రాడికల్‌గా ఉంటాయి. మా సంభాషణలో ఆయన గుంభనగా నవ్విన ప్రతిసారీ ఎన్నో అర్థాలు గోచరించాయి.. మ్యూజిక్ ఫీల్డ్‌లో ఈ రోజుకీ వివక్ష ఉందని కొంచెం బలంగానే చెప్పటం వెనుక దాగిన బాధా ఆయనలో అణచివేసిన లావాను తలపించింది. **మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్‌తో 'కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత' ద్వారం దుర్గా ప్రసాదరావు గారి సుదీర్ఘ సంభాషణ నిజానికి ఒక ఐ ఓపనర్.. ఆ సంభాషణా భాగాలు రెండు భాగాలుగా అందిస్తున్నాం"*

***మిసిమి*** : **ద్వారం దుర్గా ప్రసాద్ గారు నమస్కారం *మిసిమి* పత్రికకు స్వాగతం .. మీరు గొప్ప వయొలిన్ విద్వాంసులు.. ఎంతో గొప్ప వారసత్వం కలిగినవారు అయితే కర్నాటక సంగీతానికి వయొలిన్‌ని పరిచయం చేసిన వారెవరు .. ఎందుకంటే కర్నాటక సంగీతానికి డిజైన్ చేయబడిన వాయిద్యం కాదది.**

**ద్వారం:** అవును... కాదు.. అది కర్నాటక సంగీతం కోసం రూపొందించిన ఇన్‌స్ట్రుమెంట్ కాదు. దానిని వయొలిన్ ఫ్యామిలీ అంటాము. అంటే వయొలిన్, వయోలా తదితరాలన్నీ అందులోకి వస్తాయి.. పదిహేనవ శతాబ్దానికి ముందు ఏవైతే వాద్యాలకు ఆ వాద్యధర్మాలు మిగిలి ఉన్నాయో, ఇప్పుడా వాద్యధర్మాలు వయొలిన్‌కే మిగిలి ఉన్నాయి కర్నాటక సంగీతంలో. హిందూస్తానీలో అయితే సారంగి వాయిద్యాన్ని చెప్పుకోవాలి. దేశీయ సంగీతంలో bowed instruments లేనే లేవు. జానపద సంగీతంలో కొంత మేర ఉన్నాయి కానీ.. సంగీత రత్నాకరంలో జానపద సంగీతంకు సంబంధించిన అంశాలకు చోటు తక్కువ. జాపపదులు కూడా పట్టించుకోరు. పట్టించుకుంటే వారు తమ ఉనికిని కొనసాగించలేరు.. కాబట్టి ఎవరి ఎగ్జిస్టెన్స్ వారిదే.

***మిసిమి*** : **కొంచెం డీవియేట్ అవుతున్నాం. మళ్ళీ నా ప్రశ్నకు తిరిగి వస్తాను.. కర్నాటక సంగీతానికి వయోలిన్ పరిచయం చేసిన ఆద్యులు ఎవరు?**

**ద్వారం :** ఆ విషయానికే వస్తున్నాను..పదిహేడు వందల చిల్లర కాలంలో త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి అప్పుడున్న పరిస్థితుల్లో సంగీతానికి త్రిమూర్తులయ్యారు. ఎవరి శైలి వారిది. కానీ ఒకటే ప్రాంతంలో ఉండేవారు.. అదే తిరువయ్యారు. అక్కడుండే జమీందారులో, రాజవంశం వారో తెలుగువారే అందువలన తెలుగులోనే కంపోజ్ చేసేవారు. ముత్తుస్వామి దీక్షితులు తండ్రి రామస్వామి దీక్షితులు కూడా సంగీత విద్వాంసులే.. ఆయన రాజాస్థానంలో ఉండేవారు. వీరిలో ముత్తుస్వామి దీక్షితార్ ఒక్కరే ఉత్తరాదికి వెళ్ళారు. ఆయన బెనారస్‌లో హిందూస్తానీ సంగీతం నేర్చుకుని అక్కడి పద్ధతులు కొన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. అప్పుడు సంగీతం ఉచ్ఛస్థాయిలో ఉండేది. మళ్ళీ సంగీతత్రయంలో త్యాగరాజస్వామి 1847లో కాలం చేశారు. అప్పుడెలా ఉండేది.. మద్రాసులో సెయింట్ ఫోర్ట్ జార్జ్‌లో బ్రిటిష్ వారి అధికారం ఉండేది. ఇక్కడ మధురై, తంజావూరులో తెలుగు రాజులండేవారు.లేదంటే మహారాష్ట్రులుండేవారు. అప్పట్లో దేశాటనం ఎక్కువగా చేసేవారు ప్రజలు దేవాలయ దర్శనం కోసం.. కంపోజర్లు భక్తి పాటలు రచించేవారు అలాగే ముత్తుస్వామి దీక్షితార్ వారు మద్రాసు వెళ్ళి, ఫోర్ట్ జార్జ్‌కు వెళ్ళారు. అక్కడ బ్యాండ్ చూశారు. బ్యాండంటే అనేక వాయిద్యాల సమ్మేళనం. వాళ్ళు ప్లే చేసిన పాటలకు నొటేషన్ రాశారు. ఆ నొటేషన్‌కు సాహిత్యం సంస్కృతంలో రాసి అవి ప్రచారం చేశారు. ఇవి ఇంగ్లీష్ ట్యూన్స్ అని తెలియజెప్పారు. అందుకే త్యాగరాజస్వామి వారి కొన్ని కీర్తనలు ఇంగ్లీష్ ట్యూన్స్‌లా అనిపిస్తాయి. వాటికి సంగీతమే ఇంకొక రూపంలో కనిపిస్తుంది. ఏ కళా రూపంలో అయినా వివిధ దృక్పథాలుంటాయి . కౌశల్యాలుంటాయి.. వారు దేనినైనా ఆహ్వానిస్తారు. మామూలు మానవులు కారు వారు. ఇంటలెక్చ్యుయల్ గాను, ఈస్థటికల్ ఒక పెర్ఫెక్షన్‌లోకి వెళ్ళగలిగారు. ఎలా వెళ్ళగలిగారు వారు అంటే వారికో గురు పరంపర ఉండటం వలన. త్యాగరాజస్వామి మొదటి గొప్ప విద్వాంసుడేమీ కాదు కదా.. వారి గురువు ఎంతో గొప్పవారని ఆయనే చెప్పుకున్నాడు.. ముత్తుస్వామి దీక్షితార్ గారి గొప్పదనమేమిటంటే, మన సంగీతానికి ఇది బావుంటుందని ఆయన గమనించగలిగాడు. అయితే వాళ్ళ పద్ధతి వేరుగా ఉంటుంది. అంటే ఏమిటంటే శ్రుతి ఆధారమని చెబుతారు. శ్రుయంతాః శ్రుతి.. శ్రుతి ఆధారమని చెబుతారు. శ్రుతి అంటే వేదసూక్తి అనే దృక్పథం ఉంటుంది. విద్ అంటే తెలుసుకోవడం. మీరు వయొలిన్ గురించి అడిగారు కదా.. ముత్తుస్వామి దీక్షితార్ గారు ఈ వయొలిన్‌ని వీళ్ళు ఏ పద్ధతిలో వాడుతున్నారు అని గమనించి ఉంటారు. ఆ పద్ధతిని మనం మార్చగలమా, మనకేమన్నా ఉపయోగమా అని గమనిస్తారు పెద్దవాళ్ళు. పాశ్చాత్య సంగీతంలో యూనివర్సల్ టానిక్ అనే కాన్సెప్ట్ ఉంటుంది. దానినే హార్మోనీ మ్యూజిక్ అంటారు.. అది సమ్మేళన శైలి.. పియానో కానీ, హార్ప్ కానీ, ఫ్లూట్ కానీ వీటన్నిటికీ శ్రుతి పంపకం ఒక్కటేగా ఉండేటట్లు స్టాండరైజ్డ్ చేస్తారు. పదిమంది కలిసి ఉండాలంటే ఒకటే ప్రిన్సిపల్ ఉండాలి.. లేకపోతే అందులోంచి ఈస్తటిక్ వ్యాల్యూ ఏమీ రాదు.. వాళ్ళు సమ్మేళన సంగీతం కావాలనుకున్నారు. ఎందుకనుకున్నారంటే వాళ్ళ ఫిలాసఫీ వేరు. వాళ్ళది కాంగ్రిగేషనల్ ఫిలాసఫీ.. రెలిజియన్ కూడా వాళ్ళది అలాగే ఉంటుంది.. మనమందరం కలిసి ఆలోచిద్దామంటారు.. దానిలో నుంచి వచ్చి ఉండొచ్చు ఈ హార్మోనీ మ్యూజిక్.. ముత్తుస్వామి దీక్షితార్ గారు అందరూ ఒకేలా వాయిస్తున్నారే అని గమనించారు. మొదట ఆ శ్రుతి పద్ధతి మార్చేశాడు. మనకు తగ్గట్టుగా అమర్చేశాడు. మనది ఇండివిడ్యువల్ కాన్సెప్ట్.. సరే తపస్సు అన్నారు. అందుకని ప్రామాణిక శ్రుతి లేదు. అది కావాలంటే మన ఆలోచనా విధానం ఒక సంయమనంతో కూడి ఉండాలి. పదిమందిని రక్షించే విధంగా ఉండాలి. దాన్నే ఇప్పుడు ఫ్రీడం అంటున్నారనుకోండి. ఇంతకీ ఈ శ్రుతి విధానాన్ని లేదంటే స్వర పద్ధతిని టెంపర్‌మెంట్ అంటారు పాశ్చాత్య సంగీతకారులు.. ప్రతి ప్రాంతానికి ఒక టెంపర్‌మెంట్ ఉంటుంది. ఇది ఈస్టర్న్ టెంపర్ మెంట్ అంటున్నారు. వెస్టర్న్ టెంపర్ మెంట్ వేరే.. అదెందుకు వచ్చిందంటే వాతావరణం అయిండొచ్చండీ.. ముత్తుస్వామి దీక్షితార్ సోదరులు బాలు స్వామి దీక్షితార్, చిన్న స్వామి దీక్షితార్.. ఆ చిన్నతన్ని వయొలిన్ ఇలా అభ్యాసం చేయని ఉపదేశించారు.వారి సోదరులు కూడా కూడా పేరున్న కళాకారులే, గొప్ప కంపోజర్సే..

**మిసిమి :** **నేర్పించారంటే ఎంత కాలం పట్టి ఉండొచ్చు?**

**ద్వారం :** వాళ్ళు వారం రోజులు సాధన చేస్తే చాలండీ. అంత గొప్పవారు.అందులో ముత్తుస్వామి దీక్షితార్ కాశీలో పది, పదిహేనేళ్ళు ఉండొచ్చారేమో ఆయన దృక్పథం చాలా గొప్పది. వాళ్ళకి span of time ఒక్కలాగే కనిపిస్తుంది అంటే భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలను ఒకే సమయంలో చూడగలిగిన శక్తి వారిది. ఇప్పటికీ సంగీతం నేర్పించినప్పుడు మేము కూడా పాటతో నేర్పిస్తాము. అన్నిటి కన్నా గొప్పది పాట. పాటంటే మాట యొక్క form అన్నమాట. పాటంటే పదాలు కూడా ఉంటాయి. అన్నమయ్య పదాలు, క్షేత్రయ్య పదాలు.. అయితే పాట వేరు.. పదం వేరు..“ఓరోరి బండివాడా” వంటి లల్లాయి పాటలున్నాయి. అవి పాటలు.. అందుకే వారిని పాటక జనం అనేశారు వారిని (నవ్వు). మళ్ళీ వెనక్కి వస్తే ఆ ముగ్గురు సోదరులు రాజాస్థానంలో ఉన్నారు. శాస్త్రమంతా తెలిసినవారు. అలాగే త్యాగరాజస్వామి వారు ఏ ఆస్థానానికి వెళ్ళకపోయినా వారి గురువుగారు తంజావూరు ఆస్థానంలో ఉండేవారు. సంగీతం అప్పట్లో ఇక్కడ మన ప్రాంతంలో లేదా అంటే ఇక్కడా ఉండేది. సంగీతం ఒక జీవనది. ఒకప్పుడు కొంచెం నీరే ఉండొచ్చు. మరొకప్పుడు ప్రవాహంలా పారొచ్చు.

**మిసిమి :** **అయితే అప్పటికి ఇంకా వయొలిన్ ఆంధ్రదేశానికి రాలేదా ?**

**ద్వారం :** ఎలా వస్తుందండీ. అప్పటికింకా త్యాగరాజస్వామి వారికి వయొలిన్ తెలియదు. ముత్తుస్వామి దీక్షితార్ గారికో శిష్యుడు ఉండేవాడు. అతని పేరు వడివేలు. అతని స్వాతి తిరునాళ్ ఆస్థానంలో వాయిస్తుండేవాడు. ఆయన వడివేలును త్యాగరాజస్వామి వారి దగ్గరికి పంపించాడు. వడివేలుని వయొలిన్ వాయించి, ఆయన్ని అబ్బురపరిచి, మన ఆస్థానానికి తీసుకురా అని పంపించాడనేది ఐతిహ్యం. మనుషులకు సంబంధించిన ఐతిహ్యాలపై మనం ఎలాగోలా నమ్మకాన్ని కుదుర్చుకోవచ్చు. ఇప్పుడు కూడా మన దేశంలో కొన్ని వేల ఐతిహ్యాలు జరుగుతుంటాయి. వాటి గుణమూ, effect వంద సంవత్సరాల తర్వాత కానీ తెలీదు. ఇంతకీ వడివేలు త్యాగరాజస్వామి వారి దగ్గరికి వచ్చాడు. వయొలిన్ వాయించి వినిపించాడు. త్యాగరాజస్వామి వారు విని ఆశ్చర్యపోయారు. ఇదేమిటి మనిషి పాడుతున్నట్టు ఉంది అని అనుకున్నారు. అది పూర్తిగా చేతితో చేసిన వాయిద్యం. చక్కటి ఫ్రెంచి పాట విని ఉంటారాయన with full perfection. వయొలిన్ తీగలు పేగులతో చేసేవారు ఆరోజుల్లో. కమాన్ ఉంటుంది కదా. దాన్ని గుర్రపు హెయిర్‌తో చేసేవారు. ముత్తుస్వామి దీక్షితార్ గారు విశాల దృక్పథం ఉన్నవారు కాబట్టి accept చేశారు. చాలామంది దాన్ని చాలా కాలం ముట్టుకోలేదు. మోడ్రన్ డేస్‌లో కూడా పిల్లిపేగుల వాయిద్యం అని పక్కన పెట్టేసేవారు. .అదెవరన్నారు, ఎవరు పక్కన పెట్టేశారు అన్నది మాకు తెలుసును కానీ, బయటకు చెప్పం .. ఈ ఒక్కటి తప్పిస్తే వాళ్ళు చాలా ఉత్తములు. కొన్ని విషయాల్లో ఇలాంటి అభిప్రాయాలు ఉంటాయి. అవి ఆనాటి సామాజిక పరిస్థితులు. వాళ్ళ తప్పులు కావు. ఆ వయొలిన్ నాదాలు బావున్నాయి.. కానీ అందరూ పక్కన పెట్టేయటం వలన అవి ఇక్కడ కూడా లేవు. మా తాతలు బెంగుళూరు బ్యాండ్‌లలో పెరిగారు. కాబట్టి వాళ్ళు చూశారు. చూశారంటే వాళ్ళు మిలిటరీలో ఉండేవారు. వారు ఎక్కువ విన్నది మిలటరీ బ్యాండ్. మిలటరీ బ్యాండ్‌లో చేరిపోవటం ఈజీ. ఆ బ్యాండ్ వాయిద్యాలలో మీటలు ఎక్కువ ఉంటాయి. క్లారినెట్, ట్రంపెట్స్, డ్రమ్స్ ఇలాంటివే ఎక్కువ. ఆరుద్ర గారు ఎక్కడా ఉద్యోగం దొరక్కపోతే మిలటరీలో బ్యాండ్‌లో చేరాడు. ఆ బ్యాండ్‌లో ఏం నేర్చుకున్నాడు.. క్లారినెట్.. ఎందుకంటే అది చాలా సులభం ప్లే చేయటం. ఇదంతా ఆయనే ఎక్కడో చెప్పారు. కాబట్టి వయొలిన్ ఈ ప్రాంతంలో రావటానికి టైం పట్టింది కానీ, ఆ ప్రాంతంలో ఉండే కొంతమంది విద్వాంసులు కానీ అక్కడే ఉన్న మా తాతగార్లు కానీ ఈ వయొలిన్ వాయిద్యాన్ని ముందే అడాప్ట్ చేసి ఉన్నారు. కొత్తదనం వ్యాపించడానికి ఎక్కువ సమయం పట్టదండీ. ఎంత సంప్రదాయమూ, తపస్సు అడ్డుకోలేవు. మార్పు ఒక వేవ్‌లా వచ్చినప్పుడు ఏదీ ఆగదు. సముద్ర గర్భంలో అగ్ని ఉంటుందంటారు. అది ప్రకోపించినపప్పుడు ఉప్పెనలొస్తాయని అంటారు.

**మిసిమి :** **ఆద్యులు మీ తాతగారని చెప్పొచ్చా?**

**ద్వారం :** కాదు.. కాదు.. అంతకుముందే ప్రచారంలోకి వచ్చింది. మా తాతలంటే మా ముత్తాతలు. వాళ్ళు 1855నుంచి అడాప్ట్ చేసి ఉండొచ్చు. వాళ్ళకు గురువులు ఎవరూ లేరు. తమ జీవిత పద్ధతి మార్చుకోవడం కోసం విన్నారు. వారు విన్నది పాశ్చాత్య సంప్రదాయం. ఒక ఆఫీసర్ దగ్గర వయొలిన్ ప్లేయర్ ఉన్నా వాడిని ఈ ఆఫీసర్లు కలుపుకోరు. వాళ్ళకి ఎక్కువ దగ్గరైందేమో ఆంగ్లో ఇండియన్స్. వాళ్ళలో మన రక్తం ఉంటుంది కదా. అడాప్ట్ చేయగలిగిన గుణం ఉంటుంది. వీళ్ళ దగ్గర మా ముత్తాతలు కొంత ఫండమెంటల్స్ నేర్చుకుని ఉండవచ్చు. నేర్చుకుంటే లాభమేమిటని మీరనొచ్చు. ఎక్కడోచోట పెర్ఫార్మెన్స్ ఇవ్వొచ్చు. మిలటరీ బ్యాండ్‌లో కానీ, పోలీసు బ్యాండ్‌లో కానీ చాలా మటుకు బ్రాహ్మణేతర కులాలే వారే ఉండేవారు. అందులో మళ్ళీ దిగువ తరగతి వారుంటారు. మేము కూడా దిగువతరగతి వారమే. అయితే నా పాయింటేమిటంటే ప్రతి మిలిటరీ కేంపస్‌లోను రామమందిరం కట్టుకుంటారు. ఒక గేరిసన్ బెంగుళూరులో ఉంటే అందులో మూడు వేలమంది సోల్జర్స్ ఫామిలీస్‌తో ఉంటారు. వాళ్ళ ఫ్రీడం ఆఫ్ ఎక్స్ప్రెషన్ ట్రెడిషనల్ గానూ ఉండాలి. అబ్జెక్షన్ ఉండకూడదు. బ్రిటిష్ వారికి బోధపడకూడదు. ఇవన్నీ ఉంటాయి కదా. దానికి బెస్ట్ వే ఏమిటంటే ఓ మందిరం కట్టుకోవడం. రోజూ వారిని భజనలు చేయనివ్వరు. వారానికోసారి చేస్తుంటారు. ఏం పాడేవారు.. రామదాసు భజన కీర్తనలో, మహారాష్ట్ర భజన కీర్తనలో పాడేవారు, అక్కడ కర్నాటక దగ్గర కాబట్టి, అదో పీరియడ్ అండీ.ఆ పీరియడ్‌లో ఒకరకమయిన సంగీతం అభివృద్ధి చెందింది. అది సెకండ్ గ్రేడ్ అనుకుంటాం కానీ అదే అప్పుడు ఆ కాలానికి ఫస్ట్ గ్రేడ్. అంటే మన ఈస్థటిక్స్‌కి. త్యాగరాజస్వామి వారు దీన్నొక ఆర్ట్ మ్యూజిక్ కింద తీర్చిదిద్దారు. మనవాళ్ళు సముద్రం దాటకూడదని నియమం విధించారు. మేడల్లాంటి నౌకలు వచ్చి చేరుతున్నాయి. ఇవన్నీ ప్రభావం చూపకుండా ఉంటాయా అండీ. ఇప్పుడున్నన్ని వాహనాలు లేకపోయినా, మిలిటరీ అంటే కొన్ని వెహికల్స్ అవీ ఉంటాయి. దానితోపాటు గన్స్ ఉంటాయి. ఈ పద్ధతి నెమ్మదిగా జమీందార్లకు విస్తరించింది.. సామాన్య జీవితానికి మనకు ఏమీ సంబంధం ఉన్నట్టు లేదే అని కంపోజర్లనుకున్నారు.. వాళ్ళు దీన్ని ఆర్ట్ మ్యూజిక్‌గా చేయటానికి ఇదో కారణం. మనలో మనం విందాం చాలు అనుకున్నారు. కానీ అదే సమయంలో ఇంకో సెక్షన్ ఆఫ్ సొసైటీ ఉంది. వారికి స్వేచ్ఛ బాగా ఉంది. వాళ్ళకి అడాప్ట్ చేయగలిగిన గుణం ఉంది. సమాజంలో డామినెంట్‌గా ఉండేవారు. వాళ్ళకి సమాజంలోని వివిధ వర్గాల వారి ఎకనామిక్ స్థాయి తెలుసు. వారే కళావంతులు. అడ్వాన్స్డ్ థింకింగ్‌లో ఉండేవారు వాళ్ళు. వారి జీవిక కోసం తమకున్న జ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసు వారికి.. ఒకవిధంగా ఎక్స్ప్లాయిట్ చేయటమే అదికూడాను.. వీళ్ళెలా (బ్రాహ్మణులు) ఎలా ఎక్స్ప్లాయిట్ చేసి ఒక సెక్షన్‌ని డెవలప్ చేసుకున్నారో, కళావంతులు వీళ్ళని కూడా అట్రాక్ట్ చేసే గుణం కలిగుండేవారు. గుణం అంటే ఏమిటన్న మాట.. సమర్పణ భావన వీరిలో ఉండేది. వీళ్ళు దేహాన్నీ కూడా సమర్పిస్తారు ఒక్కొక్కప్పుడు. వాళ్ళకు నచ్చిన సంగీతం పాడేవారిలో గొప్ప స్కాలర్ ఉన్నాడనుకోండి, వారికి దేహాన్ని కూడా ఇచ్చి నేర్చుకుంటారు.. ఆ గుణం ఎవరి దగ్గరా ఉండదు కదండీ. అలా వాళ్ళదో అడ్వాన్స్డ్ సెక్షన్ ఆఫ్ ది సొసైటీ తయారైంది. అయితే వాళ్ళు బయటపడరు. బయటపడరు అంటే ఏమిటి.. వాళ్ళ విద్యలో కానీ, స్వరాలలో కానీ, రాగాలలో కానీ, భావవ్యక్తీకరణలో కానీ బయటపడరు.. సీల్డ్ కంటైనర్‌లా ఉంటారు. కొంత ఈస్థటిక్స్‌ని దూరం పెడతారు. ఈస్థటిక్స్ దూరం పెట్టడమేమిటి ఎక్కడ మంచి ఉంటే అక్కడ తీసుకోవాలి కదా..అందరూ ఇలానే ఉంటారని కాదు.ఆ కమ్యూనిటీ నుంచి ముత్తుస్వామి దీక్షితార్‌కి కూడా శిష్యులున్నారు. త్యాగరాజస్వామి ఈ పద్ధతిని అంగీకరించారు ఒక సందర్భంలో అని కథలున్నాయనుకోండి.. అసలు ముందు సంగీతంలో కోర్ కమ్యూనిటీగా చెప్పబడేవారు వారు వయోలిన్‌నే ద్వేషించారు. కానీ కళావంతుల కమ్యూనిటీ వయొలిన్‌ను ఆహ్వానించింది. వాళ్ళు పక్క వాయిద్యంగా వయోలిన్‌ని ఉపయోగించుకున్నారు. మేళాల్లో రోడ్డు మీద కూడా వయొలిన్ వాయించే వారు. ఇవన్నీ అప్పటి సాంఘిక జీవనాన్ని చూపుతాయి. ఇప్పుడు వెంకట స్వామినాయుడు గారున్నారు. 1893 ఆయన జన్మ సంవత్సరం 1919లో విజయనగరం సంగీత కళాశాలలో ఆయన్ని ప్రొఫెసర్‌గా నియామకం చేశారు. ఆయనకి ఎవరూ పిల్లనిచ్చేవారుకాదు. కారణమేమిటో తెలుసా!

ఫిడేలు వాయిస్తున్నాడు సాని వాళ్ళలాగా అని. ఏ రకమైన పర్పస్ లేకుండా ఏదో ఒకటి చేస్తుండటమే ఫిడిలింగ్. అందులోంచి వచ్చిందే ఫిడేల్ పదం. యూరోప్‌లో జిప్సీ లెక్కువగా వాడతారు ఈ వాయిద్యాన్ని.. వాళ్ళు అనేక ప్రాంతాలు తిరుగుతుంటారు. వీళ్ళు (కళావంతులు) వ్యక్తులతో తిరుగుతారు. మళ్ళీ మనం నాయుడు గారి దగ్గరకు వస్తే చివరికి ఆయన అక్క కూతురునే చేసుకున్నారనుకోండి. అది గొప్ప అదృష్టం అనుకోండి ఆయనకి. అందుకని చెప్పొచ్చేదిమిటంటే చాలా లిమిటెడ్ స్కోపండీ మాది.

**మిసిమి :** **చివరికి మీ ముత్తాతల వలనే మనకొచ్చిందా వయోలిన్?**

**ద్వారం :** లేదు లేదు.. మా ముత్తాతలకు సమకాలీనుడైన కృష్ణయ్యర్ అని గొప్ప విద్వాంసుడు ఉండేవాడు. మనకు సంగీతంలో త్రిమూర్తులు అంటే అంటే త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కదా. వీరిలో శ్యామశాస్త్రి, త్యాగరాజస్వామి వారి కన్నా పెద్ద. ఆయన కొడుకునే వీరి వద్దకు పంపించారు, శిష్యుడివి కమ్మని. ఆ కొడుకు కూడా వయోలిన్ వాయించేవాడు. వయోలిన్ గొప్పదనాన్ని గుర్తించి గౌరవించింది ఆయనే. అసలు మొదటి గొప్ప వయొలినిస్ట్ అని మనం ఎవరినైనా చెప్పుకోవాలంటే ఆ వ్యక్తి తిరుక్కోవిల్ కృష్ణయ్యర్. అతన్ని నాయుడు గారు కూడా వినలేదు. మా తాతగారు కృష్ణయ్యర్ ఆతని వయొలిన్ విన్నారు. ఎక్కడ విన్నారంటే కశింకోటలో ఆ జమీందారు కాశీం, కృష్ణయ్యర్ గారి సంగీత సభ ఏర్పాటు చేశారు. కాశిం గారు సంగీతాభిమాని. మా తాతగారు ద్వారం దగ్గర నిలబడి కృష్ణయ్యర్ గారి వయొలిన్ వాదన విన్నారని మావాళ్ళు చెబుతుండేవారు. మా తాతగారు వెంకట కృష్ణయ్యగారు రైల్వేలో టెలిగ్రాఫిస్ట్. ఆయన చదువుకున్నారు. వాళ్ళ సోదరులలో ఆఖరివారు వెంకటస్వామి నాయుడు గారు. ఆయన ఐదో తరగతి వరకే చదువుకున్నారు. ఆయనకు కనిపించక పోవటం అనే సమస్యతో చదువుకోలేకపోయారు. వాళ్ళ అన్నగార్లు ఆయన్ని సంగీతం వైపు మళ్లించి రక్షించారు. వెంకటకృష్ణయ్య గారి దగ్గరకు వచ్చేటప్పటికి, ఆయన మా తాతగారు.. ఎస్సెల్సీ వరకు చదువుకున్నారు. అప్పట్లో రైల్వేలో స్టేషన్ మాష్టర్ పోస్టంటే ఆంగ్లో ఇండియన్సే ఉండేవారు. అగ్రకులాల వారు ఎక్కువగా క్రిస్టియానిటీలోకి మారుతుండేవారు. ఆరోజుల్లో మతం వేరే, సంస్కృతి వేరే అన్నట్టుగానే ఉండేది. మతం వ్యక్తిగతం కింద లెక్క. మా తాతగారికి సంగీతం అంటే భజనలు,కీర్తనలే కాదు, ఇంకేదో ఉందని నమ్మారు. దానికి ఆయన ఆంగ్లో ఇండియన్స్ కింద పనిచేయడంతో, ఆయన చెవి వారి ఉచ్ఛారణకు అలవాటు పడింది. దానితోపాటు వారి ఇనస్ట్రక్షన్స్ నుంచి ఆతని మోర్స్ కోడ్‌తో పంపించాలి. అలాంటి సమయంలో వయొలిన్ తెలిసిన ఆంగ్లో ఇండియన్ స్టేషన్ మాష్టర్ ఒకాయన వచ్చారు. ఆయన వెస్ట్రన్ స్టైల్‌లో వయొలిన్ వాయించేవారు. ఈయన ఆయన దగ్గర శిష్యరికం లాంటిది చేసి, పాశ్చాత్య సంగీతం నొటేషన్, టెక్నిక్ ఈయన నేర్చుకున్నారు. అదే టైములో కృష్ణయ్యర్ వయొలిన్ విన్నారాయన. కృష్ణయ్యర్ గొప్ప టెక్నీషియనే కాదు, ఈస్థటిక్స్ తెలిసినవాడు. అది ఈయనకో మార్గం చూపెట్టింది. వయొలిన్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ నేర్పేందుకు ఎక్కువ మంది వయొలినిస్టులు లేరప్పుడు.. అది చిన్న సంస్థానం. అలా కశింకోట ఆస్థానంలో ఇతనికి ఆశ్రయమిచ్చినవారు నందిగామ వెంకయ్య పంతులు.. ఆయన పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ శిష్యుడు. ఒరిజినల్‌గా వాసా వారి శిష్యులు.. వాసా వారు బొబ్బిలి వీణ సంప్రదాయానికి పెట్టింది పేరు. నలభై ఏళ్ళు వచ్చాక తంజావూరు ప్రాంతంలో మరింత లోతైన సంగీతం ఉందని తెలిసింది ఎలాగోలా ఆయనకు.. ఎందుకంటే విజయనగరం సంస్థానం ఒక గొప్ప సోర్స్ వీటన్నిటికీ. పద్మనాభ యుద్ధంలో రాజుగారి తరఫు వారు అందరూ చనిపోతే ఒక్క నారాయణ గజపతి మిగులుతాడు. పది, పదకొండేళ్ల వాడు. బంధువులు అతన్ని కాశీ పట్టుకు పోతారు. సర్ విజయ అదే విజ్జీ అంటారు. ఆయన అక్కడే ఉన్నాడు. ఆయన ఇక్కడి వాడే. వాళ్ళకో సంస్థానం ఉంది. అక్కడికి తీసుకు వెళ్ళారు ఈయనను. ఈయన చదువు కోసం గోదావరి జిల్లాల నుంచి పండితులను తీసుకు వెళ్ళారు. కాశీ సంగీతం, సంస్కృతి వంటబట్టాయి. అతనికి ఇరవై ఏళ్లు వచ్చాక మళ్ళీ వెనక్కి తీసుకొచ్చారు. అంతవరకూ బ్రిటిష్ వారు తమ ఏజెంట్ లేదా కమీషనర్ తో పాలన సాగించారు. ఆతను కాశీలో ఉండొచ్చాడు కదా ..ఏదో చేయాలని ఉంది.. ఎందుకంటే అతను అక్కడి ఇంటలెక్చువల్ సోర్సెస్‌ని

ఎక్స్పీరియన్స్ చేశాడు.. అవి ఇక్కడి వారికి పరిచయం చేయాలని కోరిక అతనికి.. ఇక్కడ పండితులకు ఒకటే కోరిక ఉండేది. కాశీకి వెళ్ళి ఆ విశ్వనాథుని దర్శనం. చేసుకోవాలి.. అక్కడ మన విద్య ప్రదర్శించాలి. అక్కడి వారితో శాలువా కప్పించుకుని స్టాంప్ వేయించుకోవాలి.. రాజావారికి మాత్రం ఇక్కడేదో చేయాలని ఉండేది. ఆయన ఏం చేశారంటే, త్యాగరాజస్వామి వారితో పరిచయం ఉన్న పెదగురురాయాచార్యులు అనే ఆయన్ని రప్పించుకున్నారు. ఆయన తంజావూరు వీణ సంప్రదాయ విద్వాంసులు. ఇక్కడ బొబ్బిలి వీణా సంప్రదాయం ఉండేది. దానితో పాటు ఇక్కడ తంజావూరు సంప్రదాయం కూడా నెలకొల్పాలని అనుకున్నారు. అప్పటికి సంగీత సభల సంప్రదాయం లేదు. జమీందారుల దగ్గరో, ఐదు రోజుల పెళ్ళిళ్ళలోనో వీణ కచేరీలు ఉండేవి. తమిళనాడులో బ్రిటిష్ కాలంలో మొదట మిడిల్ క్లాస్ బాగా ఎస్టాబ్లిష్ అయింది.. దుబాసీలుగా ఉండి అధికార పీఠానికి దగ్గరయ్యారు. ఇదెప్పుడంటే 1910నుంచి. అప్పటినుంచి జనంలో కచేరీలు మొదలయ్యాయి. వీళ్ళలో అయ్యర్లు, అయ్యంగార్లు ఉండేవారు. వారిలో కొంత కాన్ఫ్లిక్ట్ కూడా ఉండేది. కానీ సంగీతం బతికింది.

**మిసిమి :** **రాజావారు తంజావూరు నుంచి ఒకాయన్ని తీసుకొచ్చారు కదా..ఆ తర్వాత ఏమయింది?**

**ద్వారం :** వెంకన్న గారి పాటా, వీణా చాలా ప్రసిద్ధి చెందాయి. తంజావూరు సంప్రదాయం, బొబ్బిలి సంప్రదాయం ఒకేలా ఉన్నా, తంజావూరు ముందుగా అభివృద్ధి చెంది, కచేరీలు స్థాయికి చేరుకుంది. వెంకన్న గారు యాభై ఏళ్ళొచ్చాక దీనిని అధ్యయనం చేసే ప్రయత్నం చేశారు. త్యాగరాజస్వామి కాలం నుంచి ఉన్న కర్నాటక సంగీతానికి కచేరీ స్థాయి మోడల్‌గా రూపకల్పన చేసింది పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ అని చెప్పుకునేవారు. ఈయన అక్కడకు వెళ్ళి పది సంవత్సరాలు నేర్చుకున్నాడు. ఆయనకు తిరిగి రాగానే ఇంగ్లాండ్ నుంచి వచ్చినంత ఘనస్వాగతం పలికారు. ఆరోజుల్లో మద్రాసు అన్నింటికీ గొప్ప కేంద్రంగా ఉండేది. ఈయన దగ్గర మా తాతగారు నేర్చుకున్నారు. మీరు పెదగురురాజయాచార్యులును ఎందుకు పిలిపించారు అని అడిగారు. ఆయన రాకవలన స్థానికంగా ఉండే సంగీత విద్వాంసులకు ఉత్సాహం కలుగుతుందని ఒక కారణం.. పోషణ తగ్గుతోందని అనుకుంటున్న వేళ ఇలాంటివి ఉపయోగకరంగా ఉంటాయి. ఆయన ఇంకా చాలా చోట్ల కొత్తవారిని తీసుకొచ్చాడు. వయొలిన్‌తో వెస్ట్రన్ బ్యాండ్ ప్రవేశపెట్టాడు. మిలిటరీ బ్యాండ్ తీసుకొచ్చాడు. ఈ రాజు గారి ముందున్న ఆనంద గజపతి రాజు గురించి అందరికీ తెలిసిందే. గొప్ప వితరణశీలి. గురజాడ వ్యవహార భాష ఉద్యమానికి నిలబడ్డాడు. అదే విజయరామగణపతిరాజు తరువాత గ్రాంథిక భాష నిలబడ్డాడని అప్పట్లో గురజాడకు ఉత్తరం రాసిన దివాన్ యనమండ్ర నారాయణమూర్తి మాటలు కన్యాశుల్కం ఇంట్రొడక్షన్‌లో కనిపిస్తాయి. అంటే కొంచెం between the lines read చేయాలనుకోండి. మళ్ళీ మా తాతగారు దగ్గరకు వస్తే ఆయన వెస్ట్రన్ మ్యూజిక్ నేర్చుకుని, దానితోపాటు కర్నాటక సంగీతం కూడా నేర్చుకుని ఆరోజుల్లో మిడిల్ క్లాస్‌లో వ్యాప్తి చేసేందుకు కృషి చేశారు.. మీకెందుకు అంత పేరు రాలేదని అడుగుతారు. చిన్న పాకెట్స్ ఆఫ్ లిజనర్ షిప్ ఉన్నచోట వీలుకాదనిపిస్తుంది. మీరు టీచింగ్‌లో ఉండిపోవటం కారణమా అంటారు.. నిజానికి టీచింగ్‌కు మించిన వృత్తేముంది

**మిసిమి :** **మీకు ఎక్కువ ఆదరణ ఎక్కడుందో, ఎక్కువ పేరు ఎక్కడొస్తుందో అక్కడికి వెళ్ళొచ్చు కదా .. మీకు పేరు మీద ఇంట్రెస్ట్ లేదా?**

**ద్వారం :** కరెక్ట్‌గా చెప్పారు. నాకు పేరు మీద ఇంట్రెస్ట్ లేదు. 1919 నాటికి మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపల్ అయ్యారు నాయుడు గారు. అప్పటికే ఆయన మంచి ఆర్టిస్ట్, పెద్ద పెద్ద వాళ్ళకి ఆయన పక్క వాయిద్యం వాయించారు. చాలామంది ఆయన విజయనగరం చదువు కోసం వచ్చాడు అని చెప్పి రాశారు కానీ అది కరెక్ట్ కాదు

**మిసిమి :** **మీ తాతగారు వెంకట కృష్ణయ్య గారు ఆయన తాను ప్రతిభావంతులైనా, తమ్ముణ్ణి ప్రోత్సహించడానికి కారణం ఏమిటి తనని పక్కన పెట్టేసుకుని?**

**ద్వారం :** మీరన్నది నిజమే మా తాతగారు వెంకటస్వామి నాయుడు గారిని తన వెంట పెట్టుకుని తీసుకుని సభలకు వెళ్లారు. ఎందుకంటే నాయుడు గారు ఒంటరిగా, ఆయన ప్రయాణాలు చేయలేరు కదా అదొక కారణం.

**మిసిమి :** **అప్పటికి సభలు వచ్చేశాయా?**

**ద్వారం :** 1900 నాటికే సభలొచ్చేశాయి. అప్పటికి కాకినాడ, విజయవాడ, గుంటూరు, తెనాలి ఇలాంటి పట్టణాల్లో సభలు జరుగుతూ ఉండేవి. అయితే ఎంత మాత్రం ఆడియన్స్ వచ్చేవారు అంటే అక్కడ ఆడియెన్స్ ఇంట్రెస్ట్‌ని బట్టి ఉండేది. మా చిన్న తాతగారు అంటే వెంకటస్వామి నాయుడు గారికి సంగీత కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు ఆయనకి 50 రూపాయల జీతం ఉండేది. దానికి కారణం మహారాజా వారు ఈ సంగీత కళాశాల వారందరినీ బాగా చూసుకునేవారు. అదే సమయంలో మా తాతగారు టెలిగ్రాఫిస్టు అని చెప్పా కదా. ఆయన జీతం 19 రూపాయలు. మహారాజా వారు కల్పించిన మరొక సౌకర్యం ఏమిటంటే ఎండాకాలం సెలవులు మూడు నెలలు ఉండేవి. ఆ మూడు నెలలు కూడా విద్యార్థులకు మూడు పూటల భోజనం పెట్టారు.. అలాగే ఈ ఫ్యాకల్టీ ఉంటారు కదా అంటే! సంగీతం టీచర్లకి ఆ మూడు నెలలపాటు జీతం ఇచ్చేవారు.. ఇది కాకుండా సంగీత కళాశాలలో బోధించే వారికి కచేరీలు చేసుకునేందుకు బయట ఎక్కడన్నా , మరో మూడు నెలలు వెసులుబాటు ఇచ్చేవారు.. అంటే గురువులకి విశ్రాంతి ఉండాలి, దాని తగ్గట్టుగా ప్రాక్టీస్ ఉండాలని మహారాజావారు భావించేవారు.. దానితోపాటు బయటకు కచేరిలు చేయడం వలన సంస్థానానికి కూడా పేరు వస్తుందని ఆయన భావించేవారు. ఆ రోజుల్లో మిగిలిన కళాశాలలో ఎండాకాలం సెలవుల్లో భోజనం పెట్టేవారు కాదు. అప్పుడు పిల్లలు బ్రైట్‌గా ఉంటే గురువులే పిలిచేవారు .. కొంచెం వీక్ ఉండేవారు ఏంచేస్తారంటే, వీళ్ళే గురువుల ఇళ్ళకు వెళ్లి సేవ చేసుకుంటూ అక్కడే ఆశ్రయం పొందేవారు..ఇది ఆనాటి పద్ధతి. మీరు మీకెందుకు పేరు రాలేదు అని అడిగారు. పేరు రావటం అనేది అది కోరి రాదండి..అంటే మనం కావాలనుకుంటే రావడం.. వద్దు అనుకుంటే రాకపోవటం అంటూ ఉండదు. నిజానికి ఇంకో పది మంది వింటే కలిగేటువంటి ఒక ఆనందం చూశారా అది నేను కోరుకున్నాను.

నేను 1960లో బీఎస్సీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా మా నాన్నగారు క్యాన్సర్ వచ్చి మరణించారు. ఆయన అప్పటికి సర్వీస్‌లో ఉన్నారు. అప్పటికి క్యాన్సర్‌కి సరైన పరీక్షలు లేవు, మందులు లేవు, ఎక్స్ప్లోరేటరీ సర్జరీ అని చెప్పి చేసేవారు. అప్పుడు నాకు కంపాషనేట్ గ్రౌండ్స్ కింద అంటే కారుణ్య నియామకాల కింద విజయవాడలో మ్యూజిక్ కాలేజీలో నాకు పోస్ట్ ఇచ్చారు, అప్పట్లో బాలమురళి గారు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. అప్పటికే నేను రేడియోలో ప్రోగ్రామ్స్ ఇస్తూ ఉండేవాడిని కాబట్టి నాకు పోస్ట్ ఇచ్చినా ఎవరికీ అభ్యంతరం లేదు. అంటే ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ ఉంది నాకు. కానీ అకాడమిక్ క్వాలిఫికేషన్ లేదు. నాయుడుగారి టైంలో వయొలిన్ పాపులారిటీ అంటే బేస్ పెరిగిపోయింది. ఆ బేస్‌లో నేనెక్కడ ఉన్నానో నాకు తెలియదు

**మిసిమి : ఇక్కడొక ప్రశ్న. నాయుడుగారొచ్చి వయొలిన్ బేస్ పెంచారంటున్నారు. ఆ తర్వాత ఎవరూ రాలేదేంటి, ఇంత బేస్ ఉండికూడా?**

**ద్వారం :** ఆ స్థాయిలో లేకపోవచ్చు.. కానీ మంచి ఆర్టిస్ట్‌లు వచ్చారు.. మరి మహాత్మా గాంధీజీ స్థాయిలో మరొకరొచ్చారా?

**మిసిమి :** వద్దు వద్దు రాజకీయాలు జోలికి వద్దండీ.

**ద్వారం :** మీరు వద్దంటే ఎలాగండీ

**మిసిమి : ఎవరన్నా ఆ స్థాయికి వెళ్ళినా కూడా పోల్చి చూస్తారనా?**

**ద్వారం :** పోల్చి చూసినప్పుడు కూడా ఆ పోలిక అకడమిక్ అండ్ ఈస్టటిక్ లెవెల్ ఆఫ్ ఆడియన్స్ చేయాలి. అలాగే సహ విద్వాంసులు కూడా.. ఇందులో చాలా రకమైన రాజకీయాలు కూడా ఉంటాయి.. ఇప్పుడు కంపారిటివ్‌గా అంతకంటే ఫేమస్ అయిన వాళ్ళు ఉన్నారు. మళ్లీ ఫేమస్ అంటే ఏమిటి డబ్బా, ఆదాయమా, వరల్డ్ టూర్



**మిసిమి** గ్రంథాలయంలో **ద్వారం**

చేయడమా.. ఇక్కడ ఆల్బర్ట్ హాల్లో వాయించాడు, లేదంటే కార్నిగి హాయల్లో కాన్సర్ట్ ఇచ్చాడు ఇది కూడా చెప్తారు. అప్పటి కాలంలో అంటే నాయుడు గారి కాలంలో ఇన్పుట్ ఏమిటి అంటే టాలెంట్ లేదా ప్రైడ్.. ఇప్పుడు ఇన్పుట్స్ చాలా వచ్చేసాయి.. ఆ రోజుల్లో పైకి రావడానికి కొన్ని సామాజిక కారణాలు కూడా ఉంటాయి. ఆ సామాజిక కారణాలు దాటుకుని ఆయన పైకి రాగలిగాడు.. ఇప్పుడు లేదా వివక్ష అంటే ఇప్పుడూ వివక్ష ఉంది.. అది ఎవరి నుంచి అంటే నేను చెప్పలేను.. ఎవరికైనా పేరు, డబ్బు ఉంటే బ్రాహ్మణులను అనుకరిస్తారు.. లేదంటే పవర్ఫుల్ సెక్షన్ ఆఫ్ ది సొసైటీని ఇమిటేట్ చేస్తారు. చాలామంది బ్రాహ్మణేతరుల్లో బ్రాహ్మిణ్ స్ట్రీవర్స్ ఉన్నారు.

మిసిమి : **మీకు సంగీత ప్రతిభతో పాటు, సాహిత్యం పట్ల ఆసక్తి ఉంది. సాహిత్యంతో పాటు చిత్రకళ కూడా ఉంది మీ చేతిలో.. సినిమా, చరిత్ర.. వీటిలో మీరు నిష్ణాతులనను కానీ ప్రవేశం ఉంది. వీటికి సంబంధించిన విషయాలు స్థానికం కావొచ్చు.. వెనుక కథనాలు మీరు రాస్తున్నారు.. ఇన్ని విషయాలు మిమ్మల్ని చూస్తే తెలీదు..మీ పుస్తకం చదివితే తెలుస్తుంది.**

ద్వారం : అందరూ చూస్తారండీ.. చూసి అడాప్ట్ చేసుకోవటం అనే ప్రక్రియ ఉంటుంది కదా..

మిసిమి : **నాకు రెండు విషయాలు బాగా చెప్పారు. ఒకటి విద్వత్తు అంటే ఏమిటి? కీర్తి అంటే ఏమిటో తెలిసింది.. రెండవది వయొలిన్ ఎలా సంగీతంలోకి వచ్చిందో తెలిసింది. నిజానికి మీతో మాట్లాడితే మీ పుస్తకం కన్నా ఎక్కువ విషయాలు తెలిశాయి.**

ద్వారం : మీరు చెప్పిన దాంట్లో నుంచి ఇంకో యాంగిల్ నేను చెప్పేసేయాలి అది బేసిక్ అన్నమాట మా ఫ్యామిలీలో. ఏ సబ్జెక్టు తీసుకున్నా ఒక ప్రక్రియ అనేది ఉంటుంది. కథో, కవితో, వ్యాసమో.. ఒక అభిప్రాయం మనం చెప్పినప్పుడు దానికి ఈస్థటిక్ సెన్స్ ఉంటుంది.. పత్రికలన్నీ ఒకలాగా ఉండవు కదా.. కొన్ని రాజకీయాల చుట్టూ తిరుగుతాయి, కొన్ని సాహిత్యాన్ని తీసుకుంటాయి, కొన్ని వ్యాపార ధోరణిలోనో సాగుతాయి... ఇలా అన్నమాట. మీలాగా అన్ని పత్రికలు సాహిత్యాన్ని ట్రీట్ చేయలేవు.. ఇలాగే సంగీతంలో కూడా .. సంగీతంలో ఒక ధోరణి అని ఉంటే అది చాలా బలంగా ఉంటుంది.. ఒక్కొక్కసారి అలా బలంగా ఉండటం కూడా ఒక పరిమితిగా మారిపోతుంది.

మిసిమి : బలహీనత అవుతుందన్నమాట

ద్వారం : అది బలహీనత కాదు బలహీనతైతే వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. ద్వారం గారి దగ్గర నేర్చుకున్న వాళ్లు, విజయనగరంలో నేర్చుకున్న వాళ్ళు వీళ్ళకి అభిరుచిలో తేడా ఉంటుంది.. కానీ మార్కెట్ ఎక్కడుంది? మార్కెట్ ఎంత సౌత్‌లో ఉంది.. ఇదే మీరు ఉత్తరాదిని తీసుకున్నారు అనుకోండి.. చాలాకాలం ఆ ప్రాంతం అంతా కూడా మొగలాయిల పరిపాలనలో ఉంది.. వాళ్ళు పర్షియా నుంచి వచ్చారు. దాంతోటి వారి పర్షియన్ సంప్రదాయాలు వచ్చి చేరాయి..సూఫీ మతం వచ్చింది. దానివల్ల ఏం జరిగిందంటే ఇంత తేడాలు కనిపించవు అంటే మీకు ఈస్టటిక్స్‌లో తేడాలుండవు.. అలాగే సోషల్ స్ట్రక్చర్‌లో కూడా కనిపించవు. వీళ్ళు ముస్లింలా, ఫలానా కులం వారైనా అని తేడాలు లేకపోవడానికి కారణం ఏమిటంటే బహుశా ఆర్థిక కారణాలు కావచ్చు, అలాగే ఈ పవర్ స్ట్రక్చర్ నిర్మాణం కావచ్చు. ఇది చాలా కాలం సాగింది. అందువలన ఏం జరిగిందంటే ఈస్టటిక్స్ అక్కడ చాలా పటిష్టంగా ఉంటాయి అందుకని అక్కడ ఉస్తాద్‌లు ఉంటారు పండిట్‌లు ఉంటారు. పేర్లు కూడా అలాగే ఎంచుకుంటారు. పండిట్ లంటే ఇంటలెక్చువల్ అనే భావన చొప్పించారు. ఏదైనా బలముండాలండి.. ప్రభువులు వాళ్ళే కాబట్టి ఉస్తాద్ అని పిలుస్తారు. అందుకని ఈస్టటిక్స్ ఒక ప్రాంతంలో ఒక్కోలా ఉంటాయి. మన దగ్గర కూడా కొన్ని స్టైల్స్ ఉన్నాయి. తంజావూర్ స్టైల్ .. తంజావూర్ స్టైల్ వాళ్లని తంజావూరు వాళ్ళు చాలా గొప్పగా చెప్పుకుంటారు.. మరొకటి మైసూర్ స్టైల్ దానిని కొంచెం పక్కన పెడతారు.. ఇంకొకటి కేరళ స్టైల్ దానిని అసలు లెక్కచేయరు.. విజయనగరాన్ని వాళ్ళు అసలు కౌంట్ చేయరు..వాళ్ళ లెక్కలో తంజావూరు అంటే మద్రాస్ కూడా అందులో కలిసి ఉంటుంది .. అది ఒకటే గొప్ప.. కావేరి ప్రాంతం వాళ్లు మద్రాసులో పవర్‌గా అవతరించారు. కచేరీ సాంప్రదాయాన్ని పాపులర్ చేసినవాడు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ ..ఆయనది తంజావూర్... తంజావూరులో డబ్బు సంపాదించాక పట్నం చేరాడు

**మిసిమి :** **తంజావూరులో ఉన్నంతకాలం వీరంతా తెలుగే.. కీర్తనలు తెలుగే.. పరిపాలన తెలుగు..**

**ద్వారం :** అందరూ తెలుగువారు కాదే .. పరిపాలన తెలుగు మహారాష్ట్ర రాజులు చేశారు. కానీ అక్కడ తెలుగు విద్వాంసులు లేరు. మొన్న మొన్నటిదాకా పాపా వెంకటరామయ్యర్ అని నాయుడు గారి సమకాలీకుడు. అతను గోవిందస్వామి పిళ్ళై అని గొప్ప వయొలనిస్ట్ అతని శిష్యుడు. ఈ వెంకటరామయ్యర్ అనే అతను తెలుగువాడే ఇంట్లో తెలుగే మాట్లాడుతాడు, కానీ అయ్యర్ అని పెట్టుకున్నాడు.. ఎందుకు పెట్టుకున్నాడు అంటే డిమాండ్ ఉంటుంది కదా అందుకు.. ఇక విజయనగరం ఎవరి వలన ఫేమస్ అయ్యింది అంటే ఒకటి ఆదిభట్ల నారాయణదాసు గారి పేరు, రెండవ పేరు వెంకటస్వామి నాయుడు గారిది వినిపిస్తుంది.. కానీ దాని వెనక చాలా కష్టం ఉంది.. చాలామంది కష్టం ఉంది. అలా అక్కడ పేరు తెచ్చుకున్న వారిలో దాసుగారు ఉన్నారు, నాయుడు గారు ఉన్నారు.. దాసుగారు వారెక్కడుంటే అక్కడ ఎండ ఎలా పరుచుకుంటుందో అలా పరుచుకుంటారు

**మిసిమి :** **నాయుడు గారు వెస్ట్రన్ ట్యూన్స్ ఎలా నేర్చుకున్నారో మీరు చెప్పారు కదా.. అలాగే నాయుడు గారు షియా ముస్లిం ఇళ్లల్లో కచేరీలు చేసినప్పుడు మార్షియా, నాతియా కలాంలు ఎలా వాయించారో చెప్పారు అలాగే మొజార్ట్, బీతోవెన్‌లను స్టడీ చేసి ఇంప్రొవైజ్ చేసి వాయించేవారని చెప్పారు.**

**ద్వారం :** ఇది ముఖ్యమైన పాయింట్.. ఆయన మొజార్ట్  బీతోవెన్ థీమ్స్ తీసుకున్నారు ..వారిలా వాయించలేదు. మొజార్ట్ బాగా విన్నారు.. అంతే.. నాయుడు గారికి ఆ ఫౌండేషన్ వేసింది వెంకటకృష్ణ గారు.. ఆయన దగ్గరే వెస్ట్రన్ మ్యూజిక్ నేర్చుకున్నారు నాయుడు గారు.. మా తాత గారి దగ్గర నేను కూడా నేర్చుకున్నాను.. ఆయన నొటేషన్ చదవగలరు. చాలా మంది నొటేషన్ చదవలేరు. వెంకట కృష్ణయ్య గారికి నాలుగు లిపులొచ్చు. అందులో మ్యూజిక్ నొటేషన్ చదవటం కూడా ఉంది. ఇవన్నీ నాయుడు గారు చూడలేరు కదా. అందుకని వెంకట కృష్ణయ్య గారేం చేశారంటే  పెద్ద పేపర్ మీద పెద్ద పెద్ద అక్షరాలతో మన సరిగమలలో రాసి ఆయనకు ఇచ్చేవారు. నాయుడు గారు ఏకసంధాగ్రాహి. ఆయన స్టడీ చేసి ప్రాక్టీస్ చేసి వాయించే వారు. చిన్న చిన్న ఐటమ్సే అవన్నీ. అవి అడ్వాన్స్డ్ సింఫనీ కాదు. ఆ ఇస్తటిక్స్, ఆ గ్రామర్ నాయుడు గారికి బాగా తెలుసు.. అప్పుడే గ్రామ ఫోన్ రికార్డ్స్ వచ్చాయి. బీబీసీ నుంచి కాన్సెర్ట్స్ వచ్చాయి. ఆలిండియా రేడియో .. ఇలా ఇవన్నీ ఆయన వినేవారు. దానికితోడు నాయుడు గారు ఎక్కడికి వెళ్ళినా ఆ వూరి పెద్దవారింట్లో వసతి ఏర్పాటు చేసేవారు. హొటళ్ళు తక్కువ కదా అప్పట్లో.. వాళ్ళిళ్ళలో రికార్డులు ఉండేవి. ఫలానా బీతోవెన్ రికార్డు ఉందా అని అడిగేవారు. ఈయనకు బుకిష్ నాలెడ్జ్ ఎక్కువ.. ఉంది అని అవతలివారు అంటే నా దగ్గర లేదే అనేవారు.. ఆ ఇంటివారు, అయ్యో నాయుడుగారి దగ్గర ఈ రికార్డు లేదే అని ఇచ్చేసేవారు.. ఈ లక్షణం అందరికీ ఉంటుంది .. ఆయన ఆ రికార్డును వినగానే గ్రహించేసేవారు. ఒక లైన్ పొయిట్రీ, ఓవర్ లే చూపిస్తుంది కదా.. అలా అన్నమాట. ఈ విధంగా బాగా వినటం అన్న అలవాటు ద్వారా ఆయన ఏ కాంపొజిషన్‌కి సంబంధం లేకుండా తన సొంత ట్యూన్ రూపొందించేవారు.



పద్మశ్రీ, సంగీత కళానిధి ద్వారం

**మిసిమి :** **ఈయనకి సంగీత కళానిధి బిరుదు ఇచ్చినప్పుడు జానపద గేయం శుద్ధంగా వాయించడం అనే మాట వాడారు అంటే ఏమిటి?**

**ద్వారం :** శుద్ధంగా వాయించటం అంటే చెప్పాను కదా.. ఇవన్నీ స్వరాలు. వాటి వెనక శ్రుతులుంటాయి.. ఇది ఎలా ఉంటుందంటే ఓన్ ఎక్స్ప్రెషన్లో ఆ టెక్స్ట్‌కి కొంచెం యాడ్ చేయటం జరుగుతుంది. ఒకే పాటను లతా మంగేష్కర్, ఆశాభోంశ్లే కలిపి పాడారనుకోండి ..ఇద్దరు గొంతులోనూ కొంచెం ఒక వేరియేషన్ కనిపిస్తుంది కదా, అలాంటిది అన్నమాట..

*(రెండవ భాగం వచ్చే నెలలో)*

---

**సంభాషణ : అశ్వినీకుమార్**

ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

# బుచ్చిబాబు కథలు – భాష

**– భమిడిపాటి గౌరీ శంకర్**

‘కథ’ను రసవత్తరంగా ఎలా రాయాలి? మంచి కథ అంటే ఏమిటి? ఈ అంశాలు కథా రచన ప్రారంభంలో బహుశా ఏ రచయిత తనను తాను చర్చించుకోడు. క్రమేపి కథా రచనలో అనుభవం, అనుభూతి, గాఢత వంటివి ఏర్పరుచుకొని వస్తువు, నేపథ్యం, పాత్రలు, అనుభవాలు, అనుభూతి వంటి వాటిని అర్థం చేసుకుంటాడు. ఓ గొప్ప ఆలోచనలో కథను ప్రారంభించాలని అనుకొన్నా, చివరకు అది పేలవంగా తయారవచ్చు కారణం – ఆలోచనలోని బలం, సాంద్రత కథా గమనంకు ఉపయోగపడే పాత్రలు, నేపథ్యం, వస్తువు, భాష వంటి వాటి వద్ద తేలిపోతాయి. ఎందరో ప్రసిద్ధులు ఒక ఆలోచనకు సంవత్సరాల తరబడి ‘చిత్రిక’ పట్టి కథారూపంగా తీర్చిదిద్దిన సంఘటనలున్నాయి. కథగా ప్రారంభమయినది నవలగా మారిన సందర్భాలు ఉన్నాయి. రా.వి. శాస్త్రి గారి మూడు కథల *బంగారం* ఇల్లు వంటివి ఇందుకు ఉదాహరణ. పూర్వ కవులు, పాశ్చాత్యులు కూడా కథలను కావ్యాలుగా తీర్చిదిద్దే కృషి చేసారు. చెకోవ్, ఓహెన్రీ, మొపాసా వంటి వారి కథలు ఇందుకు ఓ గొప్ప ఉదాహరణ. వారి కథల్లో ‘మెరుపులు’ ఎలా సాధ్యమయాయి? కాఫ్కా కథల్లోని గాఢత ఎక్కువ మందికి అర్థం కాదు.‘అబ్సర్డిటీ’ గా పెర్కొనవారు ఉన్నారు. కారణం – పాత్రలు వాటి మధ్య ఓ అంతు చిక్కని లోతైన’ ఆలోచనా విధానం, భాష వంటివి ఇందుకు ప్రత్యేకంగా చెప్పకోవచ్చు. అనుభవాలు, అనుభూతులుకు తగిన భాగస్వామ్య అవసరం. మామ్, శరత్, చలం వంటి వారి పాత్రలు – వాటి భాషలను పరిశీలిస్తే ఒక స్థాయి లో ఉంటాయి. వారి కథా వస్తులు తగిన పాత్రలతోనే ఈ విశేషం సాధించారు. అసలు ఏ భాషా ఎటువంటి భాష అనేది సమస్య కాదు. ప్రాంతం, పాత్ర పరిధి, అర్హతలు, స్థాయి, రాజకీయ, సామాజిక, మతపరమైన ‘అంశాలు’ ను దృష్టిలో ఉంచుకొని భాషకు ప్రాధాన్యతనివ్వాలి. ఒక్కొక్కసారి పాత్రను మించిన భాష కూడా ఇబ్బందికరమైన అంశంగా ఉంటుంది. కనుకనే కథకునికి జాగూరుకత అవసరం చలం, శ్రీపాద వంటి వారి కథలు చదివితే భాష యొక్క ప్రాధాన్యత తెలుస్తుంది. కథ రమ్యమై రూపం ఇవ్వగలిగేది ‘భాష’. చదువరులను ఎన్నాళ్లయినా వెంటాడగలిగేది కూడా అదే.



కనుకనే కథల్లో భాషకు ప్రాధాన్యతనిచ్చారు. భాష అనేది శైలి–శిల్పం అనే వాటికి ఉపయుక్తంగా ఉంటుంది. ప్రతీ రచయితకు తనదంటూ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. దానికనుగుణమైన శైలి అలవర్చుకుంటాడు. శైలికి తగిన భాషను ఎన్నుకుంటాడు. చలం, శరత్, బుచ్చిబాబు, శ్రీపాద ఇలా చెప్పకుంటూ పోతుంటే ఆయా రచయితల శైలి–భాష అనేవి చదువరుల మనస్సులో ముద్ర వేస్తాయి. వెనువెంటనే ఒక చిత్రం వారికి తడుతుంది. వీరి కథలు చూడండి (చదవండి) విభిన్నత అర్థమవుతుంది. అదేవిధంగా సతీష్‌చంద్ర, పతంజలి, మల్లాది, తదితరుల కథలను గమనిస్తే వారి శైలి–భాష–వ్యక్తిత్వాలు స్పష్టం. ఏతావాతా చెప్పేదేమిటంటే ‘మంచి రచనకు మంచి భాష’ అవసరం. ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటుంది. మన దేశం, రాష్ట్రం, ప్రాంతం తదితరాలను ‘కథల్లోని వస్తువుగా స్వీకరిస్తే ఆ ప్రాంతపు వాతావరణం, ప్రాంతీయత, వ్యవసాయం, ప్రకృతి, వ్యక్తులుకు దగ్గరగా పాత్రలు, భాష అవసరం చిత్తూరు (మధురాంతకం) శ్రీకాకుళం (కా.రా, అట్టాడ, భూషణం) తెలంగాణా, రాయలసీమ (బి.ఎస్‌రాయులు, కేశవరెడ్డి, సన్నపురెడ్డి) ఇలా ఒక్కొక్క ప్రాంతానికి ప్రత్యేక భాష, యాస ఉన్నాయి. కాని బుచ్చిబాబు వంటి రచయితలు మాత్రం మానవ సమస్తత్వ విశ్లేషకు ప్రాధాన్యతనిచ్చి చివరివరకు ఆ దిశగానే తమ రచనలు కొనసాగించారు. చలం, పాలగుమ్మి, భానుమతి, బుచ్చిబాబు ఇంకా ఎందరో తమదైన ‘ముద్ర’ను ఏర్పరుచుకున్నారు. రచనకనువైన ‘భాషను ఏర్పరుచుకున్నారు.

బుచ్చిబాబు గారు కథా రచయితగానే సుప్రసిద్దులు ‘చివరకు మిగిలేది’ ఒక్కటే ఆయన నవల, దాదాపుగా 50 వరకు ఆయన కథలున్నాయి. అన్నింటిని పరామర్శించే సమయం, స్థలం లేదు కనుక కొన్నింటిని మాత్రం స్పృశించుకుంటున్నాను. కథా నేపథ్యంను వివరించే క్రమంలో ఓ ప్రధానమైన ఆయుధం భాష. కథలోని వాస్తవికతను తెలియజేసేది భాషతో పాత్రలు తమ భావాలన వ్యక్తం చేసే వారధి. పాత్రలు చెప్పకోని వాటిని

రచయిత చెబుతాడు (బుచ్చిబాబు రచనల్లో ఇది ఎక్కువ). పాత్ర మాట్లాడే భాష ఆ పాత్ర పైన నమ్మకంను కలిగిస్తాయి. 1910లో గురజాడ 'దిద్దుబాటు'ను మొదటిలో గ్రాంధిక భాషలో రాసి, తరువాత వ్యవహారిక భాష లోనికి మార్చారు. శ్రీపాద వారు కధకు సాధారణమైన భాషకు శ్రీకారం చుట్టారనే చెప్పాలి. నేపథ్యానికి, పాత్రలకు, కథాంశానికి మధ్య ఉన్న సజీవ సంబంధాన్ని చిత్రించే ప్రయత్నం చేసిన తొలి కథా రచయిత శ్రీపాద వారనవచ్చు. ఇటువంటి భాషా కథనాలు బుచ్చిబాబు రచనల్లో కనిపిస్తాయి ఈయన కథ *పొగలేని నిప్పు* శీర్షికలోనే ఓ విచిత్రం ఉంది. ఇది కథలో కూడా కనిపిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్రలు నాగయ్య, భార్య సీతారత్నం, భాస్కరం అతని భార్య పార్వతి. ఈ నాలుగు పాత్రలనడుమనే కడప, చిత్తూరు, బళ్ళారి ప్రాంతాల నడుమనున్న సంభాషణలోని విరుపులు క్రొత్త క్రొత్త పదాలును తెలియజేస్తారు. 'నువ్వుశానా మంచి మొగుడువేగా, నాగయ్యలాగా పీకులాట మనిషి కావులే' అని అనటంలోని ఓ రహస్యంతో కూడిన సరసం ఉంటుంది. సీతారత్నమంటే భాస్కరానికి ఇష్టం. ఇది ఏ రకం ఇష్టం అనేది చివరి వరకు 'సస్పెన్స్' – ఎవరికి తోచిన నిర్వచనాలు వారివి. నాగయ్యకు, పార్వతికి కూడా ఈ 'చనువు' తెలుసు. అందరూ కలిసే ఉంటారు. 'మరి చాశ్మరత్నం' 'మీది మీది కొస్తావేం, పాడు పిల్లడ' 'మజుబూతిగా (అనగా–గట్టిగా అన్నమాట) *ఆయుత్తు* పరుస్తాలే *తలంటుపోసుకుంటే జులాయిస్తుందిలే* (మైకంగా ఉంటుందనుకో) యెండగొట్టబడినట్లుండావు – ఇలా ఆ సోదా వేసుకో ఇలా ఎన్నెన్నో సంభాషణల్లో ఓ చిత్రమయిన భాష ఉంది. మరో కథ *నేటి పావురం రేపటి నెమలి* ఇందులో కామేశం, కుమారి, రామ్మూర్తి వంటి పాత్రలున్నాయి. పాత్రల వ్యక్తిత్వాన్ని భాషకు అనుగుణంగా వాడుకోవటం బుచ్చిబాబు రచనా చమత్కృతి. ఆయన సంభాషణల్లోనే కాదు వర్ణన లోను ఓ ప్రత్యేకమైన పదబంధాలను ఉపయోగిస్తారు. కామేశం గురించి చెబుతూ నడివయిస్సు స్థబ్దత దిగవిడిచి, వెనక్కి యవ్వనం లోకి ప్రయాణం సాగిస్తున్నామా అన్న అనుమానం అతనిది' అంటారు. చెడ్డ వాళ్ళ మంచితనం అంతటి ప్రమాదం మరో కథ *నిరంతరత్రయం* కరుణాకరం, కామేశం, సుగుణ, రచయిత ఇందులోని పాత్రలు ముగింపులో కరుణాకరం ఆత్మహత్య చేసుకుంటాడు. ఎందుకు అనేది పాఠకులు (రకరకాలుగా) ఊహించుకోవచ్చు. ఇక్కడ రచయిత మాట చటుక్కున నా మనస్సుకి ఓ భావం స్పురించింది. అదేమిటో చెప్పేసి, తర్కించి, పాఠకుల కాలం వృథాపరచటం అన్యాయం అంటారు. ఈయన ఉపయోగించే భాష ఓ రహస్య మార్మికత ఉంటుందనిపిస్తుంది. కథా ప్రారంభంలో ప్రపంచంలో నేటి అరిష్టాలకి కారణం తెలివిహీనులు నిస్సంకోచంగా ప్రవర్తించడం, తెలివి గలవారు శంకలతో, సందేహాలతో బాధపడి అసహాయులవడం అని మొత్తం కథను సంకేత భాషలోనే చెప్పేస్తారు. ఈ విషయం కథ చివర్లో తెలుస్తుంది. కరుణాకరం ఏ కోవలోకి వస్తాడు అనేది. ఎందుకు ముగింపు వాక్యాలు ఆ విధంగా ఉన్నాయి అని కూడా తెలుస్తుంది. కథలో మరో సందర్భంలో మనస్సు శరీరాన్ని కలవర పెడుతుంది.

శరీరం మనస్సును చిరాకు పరుస్తుంది. ఆ రెంటి సమన్వయం సంపూర్ణ ఆరోగ్యం. సుగుణ, కరుణాకరం, కామేశంలు అనారోగ్యం వెనుక ఈ చిన్న సూత్రం వారికి తెలియకపోవటమే అనుకుంటారు చదువరులు. ఓ ప్రహేళికయుతమైన భాషను ఉపయోగిస్తూ, సంభాషణలతో ముందుకు వెలుతున్న కొద్ది గాఢతను పెంచుతూ చిరవకు 'పజిల్'న తెలియనట్టు అమాయకంగా గడుసుతనంతో విడదీయటం ఆయన శైలికి ఒన్నెలద్దిన భాషా నిపుణత. సుగుణను గూర్చి ఒక వర్ణనలో తీక్షణమైన ప్రాచీన మానవత్వాన్ని , పురుషత్వాన్ని సూచిస్తున్నాయి అంటారు. నిండైన అందమైన ప్రేమలో విషాదం ఉంది కాబోలు సుగుణ గురించి చెబుతూ, ఆమె అనారోగ్యానికి ముందు 'నర్సింగ్ టోమ్ కాదు. రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం అంటారు. ఆమె బహిరంగంగా పది మందిలో ఉన్నప్పుడే తీక్షణంగా జీవించగలుగుతుంది(ట) మరో కథ *అరుకు లోయలో కూలీన శిఖరం ఎల్లోరాలో ఏకాంత సేవ* అనే కథల్లో కూడా ఈ విధమైన వర్ణణాయుత ప్రయోగాత్మక ప్రణాళికయుతమైన ఓ రహస్య సందేశాత్మకమైన భాష ముమ్మరంగా కనిపిస్తుంది. ఈ కారణం చేతనే ఆయన కథలను తొలిసారికన్నా రెండు, మూడు సార్లు చదివిన తరువాతనే వాటిలోని వాస్తవిక దృక్పథం జీవనతాత్త్వికత జీవనసారం అవగతమవుతాయి. నేపథ్య చిత్రణలో, పాత్రలను పరిచయం చేస్తూ వాటి వ్యక్తిత్వాలోని గాఢతను వివరించడంలో భాష ప్రాముఖ్యతను తూకం వేసి చిత్రించ గల నేర్పరి – బుచ్చిబాబు గారు.

**భమిడిపాటి గౌరీ శంకర్**
**ఫోన్ : 9492858395**

# వానపిల్ల మిషన్ అనువాదం

– ఆచార్య కొలకలూరి మధు జ్యోతి,
– డా. కె. రేవతి

AI (కృత్రిమ మేధ)లో భాగమైన (MT) నేటి అవసరాలను తీరుస్తూ ఉంది. సాహిత్యానువాదంలో MT సమర్థతను మెరుగుపరచుకొంటున్న కాలమిది. వసీరా రాసిన లోహనది కవితా సంపుటిలోనిది 'వానపిల్ల' (1987) కవిత. ఈ వచన కవితను Microsoft Translate ద్వారా అనువాదం చేశాం. Google Translate ద్వారా కొన్ని రచనలు అనువాదం చేశాక, ఈ కవితను Microsoft ద్వారా అనువాదం చేశాం. ఈ యంత్రానువాదంలోఉన్న సమర్థత, పరిమితులు స్పష్టంగా వ్యక్తం అవుతూ ఉన్నాయి. ఇబ్బందులు అధిగమించవలసిన అవసరం ఉంది.

**1. కవిత్వం అనువాదం:** ఇది 15 పాదాలు కవిత మూలంలోనూ అనువాదంలోనూ. ఈ క్రమంలో ఎన్నో సందిగ్ధతలు. ఎన్నో ఇబ్బందులు.

| **తెలుగు కవిత** | **యంత్రానువాద ఆంగ్ల కవిత** |
|---|---|
| **వానపిల్ల** | Rainbow |
| మేఘ శిరోజాల వానపిల్ల | Cloud-haired rainbow |
| నా మనసు మీద వాలి | on my mind |
| కలల్ని తాకుతుంది | Touches dreams |
| చినుకుల మధ్య | among the drizzles |
| నీరెండ నవ్వినట్టు | As if you were laughing |
| నాలో నవ్వుతుంది | Laghs in me |
| నాలోనే ఉండి | stay witin me |
| చినుకుల మునివేళ్ళతో | with the forefingers of the drizzles |
| కితకితలు పెట్టి | |
| ఏడిపిస్తుంది | It cries and cries |
| తీరా తనివితీరా | |
| ఏడుద్దామంటే | If you want to cry |
| గలగలా పారిపోతుంది | Galagala runs away |
| అలసిసొలసిన వేళ | When you're tired |

వెచ్చని మాటతో సేదతీరుస్తుంది వెన్నెల వాన – The moonlight rain relaxes with a warm word

మట్టి మనసును కన్నీళ్ళతో ముద్దచేసి – The mind of the soil is covered with tears

ఆశా శిశువుకు ప్రాణం పోస్తుంది వానపిల్ల – Asha gives life to the baby

ఆశ చిన్నారి పెదవుల మీద–Hope on the child's lips ఆకాశమంత చిరునవ్వు ఈ వానపిల్లదేనా!–' The smile of the sky is that of this rainbow!'

ఇందులోని కొన్ని పాదాలు అనువాదంలోకి రాలేదు. 'నా మనసు మీద వాలి' (2) ('on my mind') అనే పాదంలోని 'వాలి' అనే పదం అనువాదం కాలేదు. భావమూ అనువాదంలో నిలవలేదు. అలాగే 'తీరా తనివి తీరా ఏడుద్దామంటే' (10) If you want to cry అని అనువాదం అయింది. తీరా, తనివి తీరా పదాలు యంత్రానువాదంలో భాగం కాలేకపోయాయి. కొన్ని, అనువాదంలో అర్థ మార్పును పొందాయి. అటువంటప్పుడు అది మూలానికి అనుగుణమైన అనువాదంగా నిలవలేదు. 'వానపిల్ల' శీర్షికకు Rainbow యంత్రానువాద రూపం. పిల్లకు bow తగిన అనువాదం కాదు. 'మేఘ శిరోజాల వానపిల్ల' Cloud haired rainbow గా అనువాదం అయింది. వాన అనే పిల్లకు మేఘాలను శిరోజాలుగా చెప్తున్నాడు కవి. Cloud haired rainbow అనేది మూలంలో భావానికి అర్థానికి కూడా పొసగని అనువాదం. 'నీరెండనవ్వినట్టు' (5) అనే పాదం 'As if you were laughing' అని అనువాదం అయింది. నీరెండ పదానికి అనువాద పదం సమానార్థకంగా లేదు. పైగా యంత్రం 'నీరెండ'ని 'నీ, రెండ' అని రెండు పదాలుగా గుర్తించి, 'నీ' అంటే 'You' అని గ్రహించింది. 'రెండ' పదాన్ని వదిలేసింది. పద విభజనలో పొరపాటు ఉంది. 'నీరు, ఎండ' అనే తెలుగు భాషా పదవిభజన స్వరూపం తెలియని యంత్రం తనకు తెలిసిన విధంగా విభజించి అనువాదం చేసింది.

'నాలోనే ఉంది' (7) అనే పాదం 'Stay within me' అని జరిగిన అనువాదం కూడా సరైన భావాన్ని అందించే అనువాదం కాదు. 'కితకితలు' (9) అనువాదమే కాలేదు. 'గలగలా' (11) అనే పదబంధం Galagala అని లిప్యంతరీకరణ జరిగింది. 'ఆశాశిశువుకు ప్రాణం పోస్తుంది వానపిల్ల' (15) అనే పాదం 'Asha gives life to the baby' అనే అనువాదంలో 'ఆశా' పదం లిప్యంతరీకరణం జరిగింది. వానపిల్ల పదానికి అనువాదం జరగలేదు. 'ఆశ'ను Hope గా మరో పాదంలో తీసుకొన్నా ఇక్కడ నామవాచకంగా యంత్రం పరిగణించి 'Asha' అని అనువాదంలో అందించింది. భావమూ అర్థమూ రెండూ ఇక్కడ, అసమంజసంగా నిల్చాయి. తెలుగు కవిత్వ సౌందర్యాన్ని యంత్రానువాదం అందుకోలేకపోయింది.

**2. ధ్వన్యనుకరణ (Onomatopoeia)**: Onomatopoeia అంటే The foundation from a sound associated with what is named. దీనినే తెలుగులో ధ్వన్యనుకరణ అంటారు. ఒక వస్తువు లేదా పని చేసేటప్పుడు వచ్చే ధ్వనులను అనుకరిస్తూ ఉండే పదాలు. ఈ కవితలో 'కితకితలు' (9), గలగల (11) పదాలు కవితాంతర్భాగంగా ఉన్నాయి. 'కితకితలు పెట్టి ఏడిపిస్తుంది' (It cries and cries) అనే అనువాదంలో కితకితలు పదానికి యంత్రం సమాన పదాన్ని తీసుకోలేదు, భావాన్ని అందించలేదు, నిరనువాదంగా నిలిచింది. 'గలగలా పారిపోతుంది' అనే పదం 'galagala ran away'గా యంత్రానువాదం నిలిచింది. గలగలకు సమాన పదం అనువాదంలోకి రాలేదు. పైగా లిప్యంతరీకరణతో 'galagala' గా మారింది. వాక్యార్థం సుబోధకంగా లేదు.

**3. కవితాత్మక సౌందర్యం :** మూల భాషలోని కవిత మొత్తం భావుకతతో సాగి పాఠకుడి మనసును సుతిమెత్తగా స్పృశిస్తూ ఉంది. ఆ భావుకత భావనాత్మక సౌందర్యం అనువాదం లోనికి రావటం కష్టం. MTలో మరీ కష్టం.

'చినుకుల మధ్య (4) Among the drizzles (4) నీరెండ నవ్వినట్టు' (5) As if you were laughing (5) ఈ రెండు పాదాల సౌందర్యం యంత్రానువాదం అందుకోలేదు. మొదటి పాదం బాగా ఉంది కానీ రెండో పాద అనువాదం కుదరలేదు. భావనాత్మక సౌందర్యం చేకూరలేదు. 'చినుకుల మునివేళ్ళతో (8) With the fore fingers of the drizzle (8) కితకితలు పెట్టి ఏడిపిస్తుంది' (9) It cries and cries (9) ఇక్కడ మొదటి పాదం బాగుంది. రెండో పాదం ఏ మాత్రమూ తెలుగు కవిత్వ సౌందర్యాన్ని అందుకోలేకపోయింది. 'మట్టి మనసును కన్నీళ్ళతో ముద్దచేసి (14) The mind of soil is covered with tears (14) ఆశా శిశువుకు ప్రాణం పోస్తుంది వాన పిల్ల' (15) Asha gives life to the baby (15) యంత్రానువాదాన్ని గమనిస్తే మూలంతో ఏ విధంగానూ భావార్థాలలో తూగటం లేదని తెలుస్తూ ఉంది. వానపిల్ల మట్టి మనసును ముద్దచేసి ఆశ అనే బిడ్డకు ప్రాణం పోస్తూ ఉంది. ఈ హృద్యత ఆంగ్లాను వాదంలో లోపించింది. ఆశ/కోరిక అనే శిశువుకు ప్రాణాన్ని ఇస్తూ ఉంది వానపిల్ల. వాన, (హృదయంలో) ఆశలు మొలకెత్తటానికి కారణం అవుతూ ఉంది. ఈ భావం ఆంగ్లంలోకి రావాలంటే ఎంతో సమయం పట్టుతుంది. కవిత్వానికి దానిలోని పాదాలకు పూర్వపర సంబంధం ఉంటుంది. ఏ పాదానికి ఆ పాదం వేరువేరుగా ఉండవు. రెండో మూడో పాదాలకు ఒక భావం, అంతటికీ కలిపి ఒక అర్థం/ భావం ఉంటుంది. తెలుగు కవితలో రెండు/ మూడు వాక్యాలను కలిపి ఉంచుతున్న భావం, ఆ సౌందర్యం, MT లో కనిపించడం లేదు. అటువంటి శిక్షణ Traslation tools కు లేకపోవడం వల్ల పొడిపొడి అనువాదం పాక్షిక అనువాదం మాత్రమే లభిస్తూ ఉంది.

**4. శబ్దాలంకారాలు** : ఇవి శబ్ద ప్రాధాన్యంతో ఉండే అలంకారాలు. ఈ కవితలో శబ్దాలంకారాలు తక్కువగా ఉన్నాయి.

**యమకం (Punning)**: ఒక పదం లేదా అనేక అక్షరాలు అర్థం భేదంతో ఉపయోగించబడితే దానిని యమకాలంకారం అంటారు. దానిని ఆంగ్లంలో Punning అంటారు. 'Punning is a figure of speech using words with similar sounds but different meaning, to create a sense of playfulness and eachance the beauty of the verse'.

ఈ కవితలో 'తీరా తనివి తీరా ఏడుద్దామంటే' (10) అనే పాదంలో తీరా తనివి తీరాలో తీరా అనే పదాలు భిన్నార్థబోధకాలు. వ్యవధానంతో ఉపయోగించబడ్డాయి. ఇది యమకాలంకారం తీరా అంటే మొత్తానికి/ చివరికి అని వ్యవహారార్థం, తనివి తీరేలా/ తృప్తి కలిగేలా/ మనసారా ఏడుద్దామంటే అని ఆ పాదానికి అర్థం. ఆ పాదానికి 'తీరా' పదానికి రెండు చోట్ల భిన్నార్థాలు ఉన్నాయి. యంత్రానువాదంలో ఈ వాక్యం 'If you want to cry' అని జరిగింది. 'తీరా, తనివి తీరా' పదాలు అనువాదంలోకి రాలేదు. యమకం ఇస్తున్న సౌందర్యం ఆంగ్లంలో లేదు. ఇక 'Punning' ప్రసక్తికి అవకాశం లేకుండా పోయింది.

**5. అర్థాలంకారాలు :** అర్థ ప్రాధాన్యాన్ని తెలిపే అలంకారాలు అర్థాలంకారాలు. తెలుగు కవితలో రూపక (Metaphor) అలంకారం ఉపమ (Simile) అలంకారం కనిపిస్తున్నాయి.

**రూపకం (Metaphor)** : Metaphor is a direct comparison, when two unlike objects are compared by without the use of 'like' or 'as'. Unlike simile, in metaphors comparisons are made without showing any difference. ఉపమానోపమేయాలకు అభేదాన్ని కలిగి ఉండడం. 'వానపిల్ల' శీర్షికే ఒక రూపకం. 'వాన పిల్ల' 'వాన'

ఉపమేయం 'పిల్ల' ఉపమానం. ఈ ఉపమాన ఉపమేయాలకు అభేదంగా పేర్కోనబడినది. 'మేఘ శిరోజాలు' మరో రూపకం. 'మట్టి మనసు' మరొకటి ఇవన్నీ రూపకాలు. వాన పిల్లకు Rainbow అని మేఘ శిరోజాలు అంటే Cloud haired అని మట్టిమనసు The mind of soil అని యంత్రానువాదం జరిగింది. తెలుగు కవితలోని రూపకాలు అనువాదంలో Metaphorsగా రూపు దాల్చలేదు. ఒక్క Cloud haired అనే పదం తప్ప. రూపకం ఇస్తున్న భావం, అర్థం కూడా ఒక్కోసారి యంత్రం అందుకోలేకపోయింది. దాని వల్ల ఆ పదాలు భిన్నార్థ ద్యోతకాలుగా నిల్చాయి.

**ఉపమ (Simile) అలంకారం :** Simile is more prominently using literary figure in the literature chiefly in the poetry. A direct comparison of unlike objects using the words 'like' or 'as'. ఉపమానో పమేయాలకు సామ్యమైన సాదృశ్యం చెప్తే అది ఉపమాలంకారం. 'వాన పిల్ల' కవితలో 'నీరెండ నవ్వినట్టు' (5) నవ్వుతుంది. నీరెండ ఎలా అయితే నవ్వుతుందో వాన పిల్ల అలాగే నవ్వుతూ ఉంది. ఇది ఉపమాలంకారం. ఇదే యంత్రానువాదంలో 'As if you are laughing' అని ఉంది. As if తెలుగులోని నవ్వి'నట్టు'కు సమానంగా నిలిచి Simileకి దగ్గరగా ఉన్నా 'నీరెండ' అనే ఉపమానం యంత్రానువాదం కాలేదు. తెలుగులో ఉపమాలంకారం ఆంగ్లంలో Simile గా సంపూర్ణంగా రూపుదిద్దుకోలేదు. 'ఆకాశమంత చిరునవ్వు' (17) కలిగినది వానపిల్ల. చిరునవ్వు ఉపమానం, ఆకాశం ఉపమేయం, అంత అనే పదం సామ్యం కలిగిస్తూ ఉంది. ఇది ఉపమాలంకారం. The smile of the sky (17) గా యంత్రానువాద రూపం నిలిచింది. తెలుగులో ఉన్నది ఆకాశపు చిరునవ్వు కాదు ఆకాశమంత చిరునవ్వు. తెలుగు కవితలోని భావం, అలంకార సౌందర్యం యంత్రానువాదం అందుకోలేక పోయింది.

**6. భావచిత్రం (Imagery)** : కవిత్వపు ఝురి పాఠకుడిలో ఒక చిత్రాన్ని రూపుదిద్దటమే Imagery. ఇలాంటి భావ చిత్రాలు కవిత్వంలో సాధారణం. ఇది అందాన్ని అనుభూతిని రూప సాక్షాత్కారాన్ని ఆలోచనను ఇస్తుంది. 'చినుకుల మధ్య/ నీరెండ నవ్వినట్టు' (4,5) 'Among the drizzles/ as if you were laughing'(4,5) వర్షపు చినుకుల మధ్య నీరెండ ఆహ్లాదాన్నిస్తుంది. అది జడివాన కాదు. అది ఎండ కాదు. హాయి గొలిపే వర్షపు చినుకులలో నుంచి చల్లని ఎండ లేలేత ఎండ నవ్వటం. ఈ పాదాలు ఒకే సమయంలో ఒక భావ చిత్రాన్ని, ఒక అనుభూతిని అందిస్తూ ఉన్నాయి. ఈ హృద్యమైన భావచిత్రం, అనుభూతి, laughing అనే యంత్రానువాదపు మాటలో లోపించింది. భావార్థాలు మారాయి. 'మేఘశిరోజాల వానపిల్ల' (1) అందమైన భావచిత్రం. వర్షాన్ని వానపిల్ల అన్నాడు కవి. అది జడివాన కాదు. కనుకే వాన పిల్ల. ఆ వానను కురిపిస్తున్న మేఘం నల్లనిది. దాని నుంచి పోగులు పోగులుగా దారాలు దారాలుగా కురుస్తున్న వానని శిరోజాలుగా ఉహించాడు కవి. మేఘపు శిరోజాలతో ఉన్న వానపిల్లగా తేలికపాటి వర్షాన్ని వర్ణిస్తూ ఒక భావ చిత్రాన్ని, ఊహాత్మకతను అందించాడు కవి. అది 'Cloud haired rainbow' గా అనువాదం అయింది. మేఘ శిరోజాలకు అనువాదం సరిపోతున్నా వానపిల్లకు rainbow గా అయిన అనువాదం సరిపోవటం లేదు. తెలుగులోని భావార్థాలు కొంత వరకే ఫలించి భావ చిత్రాన్ని అందించడంలో MT ప్రశ్నార్థకం అయింది.

**ముగింపు :** AI ద్వారా జరిగే అనువాదం పాక్షికంగా సమర్థవంతంగా ఉంది. ప్రతి భాషకు కొన్ని మర్యాదలు, పద్ధతులు, వ్యక్తీకరణ తీరులు, భాషా సాంప్రదాయాలు భాషలోని ఆంతర్యాలు, అలంకార ధోరణులు, ఆ ప్రాంత జీవిత సంస్కృతితో ముడిపడి ఉంటాయి. కృత్రిమ మేధతో పని చేసే యంత్రాలకు ఆయా ప్రాంతాల భాషల వైవిధ్యం, లోతులు, దేశీయ గుణాలు, సంస్కృతీ లోతులు ఈ అన్నిటి మధ్య ఉన్న అనుబంధం ఇవి అన్నీ తెలియాలి. అప్పుడే యంత్రానువాదం సమర్థవంతంగా రాగలదు. తెలుగు ప్రాంతాలు భాష నుడికారం, సంస్కృతీ వైవిధ్యం; కులాలు మతాలు; ఈ ప్రాంత నైసర్గిక స్వరూపం; కలిమి లేమి; స్త్రీ పురుష భేదం ఇలా ఎన్నో ఒక కవిని, అతడి/ఆమె రచనని ప్రభావితం చేస్తాయి. ఈ వైవిధ్యం, ఇతర ప్రాంత అనువాదకుడికే సవాలు. ఇక యంత్రానికి మరింత సవాలుగా నిలుస్తుంది. ఇంతటి వైవిధ్యమూ యంత్రానికి, AI కి ఆవగతమైతేనే అనువాదం కొంతైనా సజావుగా రూపు దాలుస్తుంది. లేకపోతే పదానువాదం మాత్రమే జరుగుతుంది. అది కూడా పదవిభజన సామర్థ్యం AI కి ఉంటే. అర్థభావ అనువాదం జరగాలంటే AI కి ఇంకా కొంత సమయం పడుతుంది. దాని కొరకు మరింత corpora శిక్షణ అవసరమని స్పష్టం అవుతూ ఉంది.

**ఆచార్య కొలకలూరి మధు జ్యోతి,**
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
**డా.కె.రేవతి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంగ్ల అధ్యయన శాఖ,
***శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి.***

# ఇళయరస నేందల్ సంస్థానం రావెళ్ళ వారి నివాసం



గతకాలంలో రావెళ్ళ వంశస్థుల రాజరిక వైభవానికి ప్రస్తుత భవనం అద్దం పడుతోంది.

– డా. సగిలి సుధారాణి

**ఒ**కప్పటి తెలుగు వైభవ చరిత్రకు దర్పణం పట్టి వెలుగులీనిన ఇళయరస నేందల్ సంస్థాన పురాతన భవంతిపై కారు మబ్బులు కమ్ముకొంటున్నాయి. తెలుగు ప్రభువులు ఏలిన నేల నేడు ఒక మౌనసాక్ష్యంగా నిలుస్తోంది. దానికి మరోప్రక్క ప్రస్తుతం తెలుగు వెలుగులీనుతూ గత వైభవానికి చిహ్నంగా రాజదర్పంతో రాజభవనం కనిపిస్తుంది. రావెళ్ళ వంశస్థులు అందులో నివసిస్తున్నారు. ఇళయరస నేందల్ ప్రస్తుత సంస్థానధీశులు రావెళ్ళ కస్తూరి రంగస్వామి నాయుడు మాట్లాడుతూ "కృష్ణదేవరాయల కాలాన ఆంధ్రలో మా పూర్వీకం వారు ఆ నేలను విడచి మధురకు వచ్చినారు. 'అప్పస్వామి నాయుడు' అనేది అందరి పేర్లలో సామాన్యంగావస్తుంది" అన్నారు. ఉదా. రావెళ్ళ కస్తూరి రంగ అప్పస్వామి నాయుడు, రావెళ్ళ వెంకట రంగ అప్పస్వామి నాయుడు (సెల్వరాజ్) 'రావెళ్ళ' అనేది పరంపర పేరని (ఇంటిపేరు), ఈ పేరుతోనేమా వ్యాపార సంస్థలు, విద్యాసంస్థల పేర్లు ఉన్నాయని సెల్వరాజ్‌గారి భార్య వసుంధరాదేవి చెప్పారు. వారి పాఠశాల 'రావెళ్ళ విద్యాలయం' కోవిలపట్టులో ఉంది.

**ఇళయరస నేందల్ సంస్థానాధీశులైన రావెళ్ళవారి నేపథ్యం:** 'దుర్జయ వంశానికి' చెందిన ఒక రావెళ్ళ నాయకుని ప్రస్తావన క్రీ. శ. 1257 నాటి చాళుక్య చక్రవర్తి మూడవ రాజరాజు శాసనంలో మొదటగా చేయబడింది. రావెళ్ళవారు ప్రసిద్ధులైన శూరవంశీకులుగా పేరొందారు. సేనానాయకులుగా పనిచేసిన రావెళ్ళ వారిలో హంపి విజయనగర పాలకుడైన సాళువ నరసింహరాయల సేనాని వీర మల్ల భూపతి ప్రసిద్ధుడు. ఈయన గుడిపాటి కోట యుద్ధంలో వీరోచిత పాత్ర పోషించాడనీ, అనంతర కాలంలో గోల్కొండ నవాబు కుతుబ్ షాహీ సేనలను ఓడించాడనీ చారిత్రక ఆధారాల వలన తెలుస్తుంది. రత్నాకరం గోపాలకవి 'సౌగంధిక ప్రసవాపహరణం' అన్న తన కావ్యంలో మల్ల భూపతి శౌర్యప్రతాపాలను వర్ణించాడు. తరువాత శ్రీ కృష్ణదేవరాయల పాలనా కాలంలోనూ రావెళ్ళ మల్లభూపతి సామంత నాయంకరునిగా సేవలందించాడు. ఇతడు ప్రస్తుత ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలోని పెద ఆరికట్లను రాజధానిగా చేసుకుని పాలించిన సామంతరాజు. రావెళ్ళ లింగ నృపాలుడు ఆదివెన్న (కర్నూలు జిల్లాలోని ఆదివెన్న ఆదోనిగా మార్పు చెందింది) దుర్గం యుద్ధంలో ఆ కోటను పట్టుకొనడానికి శ్రీకృష్ణదేవరాయలు అల్లుడైన అళియ రామరాయలుకు సహకరించినందున ఆ కోట పాలకునిగా నియమితుడయ్యాడు. ఇక నాటినుంచి ఆదోనిపై రావెళ్ళ వంశీకుల పాలన మొదలైంది.

5 శతాబ్దాల క్రిందట చిన్న చిన్న రాజ్యాలు పరాయి పాలకుల వశం అయినాయి. ఈ సమయంలో ఆదోని ప్రాంతం నుండి విజయనగర సామంతులైన రావెళ్ళ వంశీకులు కొందరు మొదటగా దక్షిణాపథంలోని ఉత్తర ఆర్కాటు జిల్లాలోని వెల్లూరుకు, తరువాత తిరుచిరాప్పల్లికీ, ఆ తరువాత అక్కడనుండి మధురకు చేరుకొన్నారు. చివరికి మధుర పాలకుల తరపున కోవిల్పట్టుకు (గుడిపల్లె) పది కిలోమీటర్ల దూరంలో ఉన్న 'ఇళయరసనేందల్' సంస్థానాధిపతులుగా స్థిరపడ్డారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు ఈ సంస్థానం రావెళ్ళవారి పాలనలోనే ఉండేది.

**తెలుగువారి సంస్థానం వెలుగులు విరజిమ్ముతోంది!:** అందమైన ఇళయరస నేందల్ రాజప్రాసాదం ధవళకాంతులతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. కోట లోపలి గోడలమీదున్న విఖ్యాత కేరళ చిత్రకారుడు రాజారవివర్మ చిత్రించిన అద్భుత వర్ణచిత్రాలు, ఇతర కళాకృతులు ఇక్కడి



నాటి సంస్థానాధీశులు ప్రతిరూపమైన రాజసాన్ని ప్రతిబింబించే కళాకృతులు - రాజ పల్లకి

ప్రత్యేక ఆకర్షణ. వారి పెళ్ళిళ్ళు ఆ భవంతిలోని మండపంలోనే నిర్వహిస్తారు. నాటి సంస్థానాధీశులు ప్రతిరూపమైన రాజసాన్ని ప్రతిబింబించే కళాకృతులు, రాజ పల్లకీలు, రవివర్మ తైల చిత్రాలు మొదలైనవి రాజభవనంలో మనకు కనువిందు చేస్తాయి. గతకాలంలో రావెళ్ళ వంశస్థుల రాజరిక వైభవానికి ప్రస్తుత భవనం అద్దం పడుతోంది.

**ఇతరభాషలకు ఇచ్చే ప్రాధాన్యత మన తల్లిభాషకు ఇవ్వడం లేదు! :** రావెళ్ళ వసుంధరా దేవిగారు మాట్లాడుతూ "నాకు పెండ్లైన తరువాత నేను తెలుగులో మాట్లాడితే మా ఆయన తమిళంలో సమాధానం చెప్పేవారు. కొందరైతే మమ్మల్ని చూసి మీది భాషాంతర వివాహమా? అని అడిగేవారు. మనకు బిడ్డలు పుడితే, కండిప్పా (ఖచ్చితంగా) తెలుగులోనే మాట్లాడాల"ని అప్పుడు మా ఆయనకు చెప్పాను. నేటి ఆధునిక కాలంలో ఇంగ్లీషు ప్రభావం మన బిడ్డలపై ఎక్కువై పోయింది. వారికి పుట్టిన బిడ్డలుకూడా అదే అనుసరిస్తున్నారు. "మన తల్లి భాషను మనందా మాట్లాడాలని చిన్న బిడ్డలకు చెప్పాలి! హిందీ, ఫ్రెంచ్ భాషలకు ఇచ్చిన ప్రాధాన్యత మనం మన తల్లిభాషకు ఇవ్వడంలేదు!" అని వసుంధరాదేవి బాధ పడుతూ చెప్పారు. తరాలు మారినా తల్లిభాషలో సంస్థానాదీశులు మాట్లాడుతూనే ఉన్నారు. తమ తల్లిభాషను కాపాడుకొంటూ సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొన్నారు.

**గుప్తదానాలకు పెట్టింది పేరు! :** "అప్పటి కాలంలో పాలనాధికారం మా ఆధీనంలో ఉండేది. మా పూర్వీకులు చాలమందికి నిండా ఉదవి (చాలా సహాయం) చేసేవారు. ఎంత పెద్దకార్యం చేసినా కుడిచేతిలో ఇచ్చింది ఎడమ చేతికి తెలవకూడాదని మా మామగారు చెబుతారు. అది మా మనస్సుల్లో ఉండిపోయింది. దీనిని ఒక బాధ్యతగా స్వీకరించి మేము జీవించినంత కాలం వారి అడుగు జాడల్లోనే నడవాలని నిర్ణయించుకొన్నాం" అని అంటారు వసుంధరాదేవి గారు.

రాజప్రాసాదంలో ఒకప్పుడు 37 మంది పిల్లలతో ప్రారంభించిన పాఠశాల ప్రస్తుతం కోవిల్ పట్టికి మార్చబడి 1630 మంది విద్యార్థులతో నడపబడుతూ ఉండడం విశేషం. రెండుకోట్ల నిధులతో ట్రస్టును నడుపుతూ ఎటువంటి లాభాపేక్షలేకుండా పేదపిల్లలకు విద్యను బోధిస్తున్నారు. విద్యావ్యాప్తికి వారు చేస్తున్నసేవ మనకు ఎంతో స్ఫూర్తినిస్తుంది.

**కోట ప్రాంగణంలో...:** రావెళ్ళ సంస్థానాధీశుల కోట ప్రశాంత వాతావరణంలో పక్షుల కిలకిల రావాలు మనలను అలరిస్తాయి. పచ్చని పచ్చికల్లో తిరగాడుతున్న గిన్నెకోళ్ళు శబ్దాలు చేస్తూ పలకరిస్తాయి. కోట పరిసరాల్లోని పెంపుడు కుక్కలు స్వేచ్ఛగా తిరగాడుతుంటాయి.

**మరోపక్కలో రాళ్ళ గుండ్లు కొలువుదీరాయి! :** ఆ కాలాన పెళ్ళిల్ల సమయంలో బుద్ధిబలంతోపాటు కండబలానికి పెద్దపీట వేసేవారు. అందుకు నిదర్శనం అలనాటి సాంస్కృతిక బలప్రదర్శనకు ఆలవాలంగా రాతి బండలు కొలువుదీరాయి. ఆ బండరాళ్ళను ఎవరైతై అలవోకగా ఎత్తి అవతల పడవేస్తారో వాళ్ళకు పిల్లను ఇచ్చి పెళ్ళి చేసేవారట. అలనాడు ప్రయాణాలకు సంస్థానాధీశులు ఉపయోగించిన బగ్గీలు మొదలు ఆధునికకాలంలో ఉపయోగించే విలాసవంతమైన కార్లు వారి భవంతి ఆవరణలో కనిపిస్తూ కాలం మార్పును మనకు కళ్ళకు కడ్తాయి.

– – –

ఇళయరస నేందల్ సంస్థానం తదుపరి వారసుడు సెల్వరాజ్, వసుంధరాదేవిగార్ల తనయుడు రావెళ్ళ అరుణ్ రావెళ్ళ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్. కోయంబత్తూరులో ప్రస్తుతం నివసిస్తున్నారు. వారిని వెళ్ళి కలిసినపుడు, తమ పూర్వీకుల గురించి చెబుతూ 1780 ప్రాంతాలలో వచ్చి ఇక్కడ స్థిరపడిన ఒక వ్యవసాయ కుటుంబమని తెలిపారు. తమ కుటుంబీకులలో పూర్వులు వెంకట రంగ అప్పాస్వామి, తరువాత కస్తూరి రంగ అప్పాస్వామి ఈ పేర్లే మారి మారి తరువాత తరాలకు వస్తాయని ఆయన తెలిపారు. తరాల క్రిందట తల్లినేలను

విడచి వచ్చినా వారి ఆహారపు అలవాట్లలో ఆధునిక కాల ప్రభావం లేదు. నేటికీ వారి ఆహారపట్టికలో తృణధాన్యాలతో కూడిన సాంప్రదాయక వంటలే ఉంటాయి. ఉదా. కంబుకూడు (సజ్జ బువ్వ), జొన్నకూడు, రాగి సంకటి వంటి తెలుగు వంటకాలను కూర, పులుసు వంటి వాటితో కలిపి ఉదయపు అల్పాహారంగా అందరం తింటామని అరుణ్ గారు తెలిపారు.

**మనం తినేది కూడు కాదా!** "తెలుగులోకూడు, బువ్వ అనే పదాలు వాడడం సరైన మాటలు కాదా?" అరుణ్‌గారు నన్ను ప్రశ్నించారు. అందుకు సమాధానంగా' అన్నమ్', 'భోజనమ్' అనేవి సంస్కృత పదాలనీ, 'కూడు' 'బువ్వ' అనేవి అచ్చ తెలుగు పదాలనీ, వాటిని వాడడమే సరైనదనీ చెప్పాను. ఎందుకు అలా అడుగుతున్నారని అడిగాను. తన జీవితంలో ఎదురైన ఒక సంఘటనను వివరించారు. "ఒకసారి పని మీద అనంతపురం వెళ్ళినపుడు పొద్దున ఒక కార్యాలయంలో సమావేశం మొదలైంది. మధ్యాహ్నాం "కూడు తిన్నాక మళ్లీ కలుద్దామని" నేను తోటివారితో అనగానే అదివిన్న అక్కడివారికి చాలా కోపం వచ్చింది. **ఆమాట ఎలా అంటారని" మేము ఏమన్నా కూలీలమా?" అని వారు ఇంత ఎత్తున ఎగిరారు. అప్పటినుండి అక్కడి** తెలుగు వారితో మాట్లాడేటప్పుడు ఆలోచించి, ఆచితూచి మాటాడుతున్నాని అరుణ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

ఒక ప్రాంతపు మాండలికాన్ని మరొక ప్రాంతంవారు కించపరచడం ఎంతవరకు సమంజసం? తెలుగునుడిపై మమకారం ఉండేవాళ్ళు చెయ్యవలసిన పనేనా ఇది? మన పరభాషా దాస్యానికి అంతేలేదా? ఇంతకీ మనం రోజు తినేది కూడు కాక మరి ఏమిటి? "కూడు-గూడు-గుడ్డ ప్రజలకు కనీస అవసరాలని!" రాజకీయనాయకులు ఘోషిస్తుంటారు కదా!

**అదీ ఇదీ..... అనిగాక అన్నిరంగాలలో మనవారున్నారు!** రావెళ్ళ అరుణ్ అత్తగారు నంబూరి ధనలక్ష్మిగారు ఒక విశాలమైన ప్రాంగణంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఆధునిక దేవాలయం వంటి సర్వజన విద్యాలయం ఆమె ఆధ్వర్యంలో నడుపుతున్నారు. 'విజ్ఞానం' అనేది పదిమందికి పంచినపుడే ప్రయోజనం ఉంటుందని ధనలక్ష్మిగారు అంటారు. ఆ కాలంలో పనిచేసేవారికి ఆడబిడ్డలు పుడితే గొంతులో ఒడ్ల గింజలు వేసి చంపేసేవారట! వారికి జ్ఞానం లేని కారణంగా ఇటువంటి పనులు చేస్తున్నారని గ్రహించి, అటువంటి వారిని విద్యావంతులను చెయ్యాలనే సంకల్పంతో సువిశాల ప్రాంగణంలో విద్యా సంస్థను ప్రారంభించామని చెప్పారు. ఒక ఇంటిలో ఆడబిడ్డ, మగబిడ్డ ఉంటే, మగబిడ్డను మాత్రం మంచిబడికి, ఆడబిడ్డను సాధారణబడికి పంపేవారు. అటువంటి వారిని గుర్తించి **వారికి రాయితీలు ఇచ్చి తమబడిలో చేర్చుకొంటామని చెప్పారు. గురుకులాన్ని తలపించే ఈ విద్యాలయంలో** నేడు వందలాదిమంది విద్యార్థులు విద్యను నేర్చుకొంటున్నారు.

నేటి కార్పరేట్ సంస్కృతిలో కాసులు ఆర్జంచడమే ధ్యేయంగా విద్యాసంస్థలు పని చేస్తున్నాయి. ఆస్థులు కూడబెట్టుకోవడానికి, పలుకుబడి పెంచుకోవడానికి చదువు'కొంటున్న' వారికి ఒక లక్ష్యం కోసం లక్షలు వెచ్చించి ఇటువంటి సంస్థను నడపడం ఆదర్శనీయం! ప్రశంసనీయం!

తరగని సంపద ఉన్నా, రావెళ్ళ వారు నిరాడంబరంగా ఎలా జీవిస్తున్నారనే విషయం మనకు బోధపడుతుంది. అంతేకాదు! వారికి తల్లిభాష అయినట్టి తెలుగు మీద నేటికీ మమకారం తగ్గలేదు. వారియాసలో తెలుగు పదాలు అత్యంత సహజంగా వినిపిస్తాయి. ఉదా. సాములు, జలపుష్పాలు (చేపలు), రూకలు, మొ.

శతాబ్దాల క్రిందట ఇక్కడ స్థిరపడిన వీరు కూడా తమిళ పద్ధతిలో తమ పేర్లకు ముందు తండ్రి పేరును కాక అచ్చ తెలుగు పద్ధతిలో రావెళ్ళ, తిరువీధుల, మొదలైన తమ ఇంటిపేర్లనే పెట్టుకుంటూ ఉండడం మరో విశేషం. వసుంధరా దేవిగారు మాకు చక్కటి ఆతిథ్యాన్ని ఇవ్వడమే గాక, నన్ను వారి ఇంటి ఆడపడచుగానే తలచి, ఎర్రటిరంగుచీర,రవిక, పండ్లు పసుపుకుంకుమలతో సాగనంపారు. వీరేకాదు, నా పరిశోధన నిమిత్తం తమిళనాట తెలుగువారిళ్ళకు పోయినప్పుడు చాలాచోట్ల ఇటువంటి మర్యాదలనే నేను పొందాను. అది నా గొప్పతనం కాదు! తమిళనాట తెలుగువారు సంస్కృతీ సంప్రదాయాలకు ఇస్తున్న ప్రాధాన్యతగా నేను భావిస్తున్నాను.

**డా. సగిలి సుధారాణి**
ఫోన్ : 9490428825

# బుద్ధుని తాత్త్వికత

– హిందీ మూలం : రాహుల్ సాంకృత్యాయన్
– అనువాదం : ఆలూరి ఉషారాణి

**బు**ద్ధునిది సమంతభద్ర, సర్వతోభద్ర వ్యక్తిత్వం (సమస్త నాగరికతల, సంపూర్ణ శ్రేష్ఠుడు). చరిత్రలో ఇటువంటి వ్యక్తులు దొరకటం దుర్లభమే. ప్రతిభలో, ఆత్మీయ వ్యవహారంలో, దీనుల–హీనుల పట్ల, కార్యరూపంలో ఉన్నత అనుభూతిని చూపించటంలో ఉన్నతుడు, భారత సర్వశ్రేష్ఠ పుత్రుడు మరియు మానవత్వానికి సర్వోత్తమ మార్గదర్శకుడు బుద్ధుడు. రెండున్నర వేల సంవత్సరాలుగా తన వాళ్ళ – పరాయివాళ్ళ చేతుల్లో పట్టిన మురికి, తుప్పు పోగుపడి ఈ పురుషోత్తముడి అసలు రూపాన్ని మరుగున పెట్టే ప్రయత్నం జరిగింది కానీ వాళ్ళ ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన అత్యున్నతుడు. ఆయన బోధించిన విషయాలలో ఏదో ఒక్క అంశాన్ని పట్టుకొని అదే సర్వస్వం అనటం సరైంది కాదు. నడవడిక, సంఘ నియమాలనే బుద్ధుడు బలంగా చెప్పాడనీ, అంతకంటే ఇంకేమీ లేదని తెలిసో–తెలియకో ఎందరో భారతీయ విద్వాంసులు అనేస్తున్నారు. మంచి నడవడిక, ఉత్తమ స్వభావము మీద కూడా బుద్ధుడు బలంగా చెప్పాడనటంలో ఏ సందేహమూ లేదు కానీ ఆచరణ లేని వాగాడంబరానికి బుద్ధుడు ఏ ప్రాధాన్యతా ఇవ్వలేదు. కేవలం నడవడికకి సంబంధించిన విద్య గరుపు పద్ధతిని తీసుకుంటే కూడా బుద్ధుడు మానవత్వానికి సంబంధించిన గొప్ప వైచారికుడిగా నిరూపించబడతాడు. కానీ మన సమంతభద్రుడి సర్వతోభద్రత ఈ ఒక్క అంశానికి మాత్రమే పరిమితమై లేదు. బుద్ధుడిని ఆత్మజ్ఞానుల రారాజు (చక్రవర్తి) గా శంకరాచార్యుడు ప్రకటించాడు.

బుద్ధుడు శీలస్కంద మాదిరిగానే సమాధి స్కంద మీద కూడా బలంగా నొక్కి చెప్పాడు. సమాధి లేదా మనుష్యుని మనోశక్తులను అభ్యాసం ద్వారా అభివృద్ధి చేయటం అనేది ఎటువంటి విషయమంటే, దీంట్లో సత్యాన్ని ఎంతగా ఆశ్రయిస్తామో అంతకంటే ఎన్నో రెట్లు అసత్యాలు ప్రచారం చేయబడతాయి. మనుషుల మనోశక్తులు అనేది వాస్తవిక దృష్టిలో ఒక లోతైన అధ్యయన, మరియు పరిశోధనాంశము. అటువైపుగా కృషి జరగాల్సిన అవసరం వుంది. సాధించామని చెప్పుకుంటున్న మనోశక్తులపై వైజ్ఞానిక ప్రయోగశాలల్లో కఠిన పరిశోధనలు జరిగి నిగ్గు తేల్చబడనంత కాలం సమాధి మరియు యోగసిద్ధుల గురించి ప్రస్తుత పరిస్థితుల్లో మనమేమీ చెప్పలేము. ప్రత్యర్థుల చేత కూడా యోగుల చక్రవర్తిగా కీర్తించబడిన ఆయన ఈ విషయంలో కూడా తనని తాను సంపూర్ణ శ్రేష్ఠుడిగా నిరూపించుకున్నాడనేది స్పష్టం.

తత్త్వంతో పరిచయం లేనివాళ్ళే కాదు, తత్త్వం గురించి తెలిసినవాళ్ళు కూడా ఎందరో బుద్ధుని తత్త్వజ్ఞానాన్ని ఉపేక్షిస్తూ, తిరస్కరిస్తూ తత్త్వజ్ఞానంతో బుద్ధుడికి ఏమీ సంబంధం లేదు, ఆయన కేవలం నడవడికకి సంబంధించిన విషయాలనే ప్రచారం చేశాడని చెప్పాలనుకుంటారు. నేను చెప్పేది ఏమిటంటే బుద్ధుడు తత్త్వశాస్త్రానికి దోహదం చేసినంతగా మరే ఇతర రంగంలోనూ చేయలేదు. అంటే ప్రప్రథమంగా బుద్ధుడు తత్త్వవేత్త, ఆ తరువాతనే మరేదయినా. రెండవ శతాబ్దానికి చెందిన గొప్ప వైచారికుడు నాగార్జునుడు తన పుస్తకం 'విగ్రహవ్యావర్తిని' ముగింపులో అత్యానందంతో ఏమన్నాడంటే, బుద్ధుని తత్త్వంలోని మధ్యమ మార్గము మరియు ప్రతీత్య సముత్పాదము అనే రెండు మూలతత్త్వాలను తీసుకొని వీటిని ప్రతిపాదించిన బుద్ధుడిని అద్వితీయుడు అని నాగార్జునుడు అన్నాడు. నిజంగానే ఈ రెండు సూత్రాల నుంచీ బుద్ధుని తత్త్వం మొత్తాన్నీ వ్యాఖ్యానించవచ్చు. దీనితోపాటుగా ఈ సూత్రాలు ఏ ఒక్క దేశానికీ, ఏ ఒక్క కాలానికీ మాత్రమే పరిమితమైనవి కావు. సమస్త దేశాలకూ, సమస్త కాలాలకూ వర్తించే పరమార్థ సత్యాలు. ఈ రెండిటితో పాటుగా సర్వం అనిత్యం (సర్వం క్షణికం) అనేదాన్ని కూడా తీసుకుంటే బుద్ధుని సంపూర్ణ తాత్త్వికత మన ముందుంటుంది.

అన్ని పదార్థాలు అనిత్యం (క్షణికం). క్షణక్షణము పరివర్తన చెందుతుంటాయి. కేవలం బాహ్యరూపంలోనే కాదు, పునాది నుండి నశిస్తుంటాయి. ప్రపంచానికి, ఈ నియమాన్ని ప్రకటిస్తూ ఈ విశ్వంలోని చిన్న చిన్న కణాలతో సహా (పరమాణువులు) అన్నీ క్షణభంగురమని బుద్ధుడు చెప్పాడు. వేదాంతులు లేదా బ్రహ్మవాద అద్వైతులు ప్రపంచానికి బాహ్యంగా ఒక శాశ్వత, అన్నిటికీ అతీతమైన బ్రహ్మపదార్థము ఉన్నదని నమ్ముతారు. భౌతిక ప్రపంచం వారికి మిథ్య మాత్రమే. వైశేషికులు లేదా పురాణ గ్రీకు కణవాద దార్శనికులు బాహ్య ప్రపంచాన్ని క్షణభంగురంగా అంగీకరిస్తూనే పరమాణువుని వారు అచ్ఛేద్య అంటే శాశ్వతము, అతీతమైనదిగా చెప్పారు. బుద్ధుడు మరియు

అతని అనుయాయులు అన్నీ అశాశ్వతాలే అనే నియమంలో ఏ ఒక్కదాన్నీ మినహాయింపుగా భావించ లేదు. బాహ్య ప్రపంచం ప్రతి క్షణం నశిస్తుంటుంది. దాని స్థానంలో కొత్తగా ఉద్భవించినది కూడా పూర్వపుదానిలాగే క్షణభరితమే. అది కూడా నశిస్తుంది. బౌద్ధ దార్శనికులు దీన్ని ఇంకా స్పష్టంగా చెబుతూ భౌతిక అస్థిత్వం గల ప్రతీదీ క్షణికమే అని ప్రకటించారు. అది క్షణక్షణము నశిస్తుంటుంది. క్షణికం కానిదేదీ కూడా అస్థిత్వం లేనిదే. అది గొడ్రాలి కొడుకులాగా, ఆకాశ పుష్పంలాగా వాగాడంబరం మాత్రమే. క్షణక్షణం నశించటం అనేది ఈ విశ్వం యొక్క శాశ్వత నియమం అయినప్పుడు అది ప్రతి పదార్థానికీ సంబంధించిన సహజ ధర్మం అవుతుంది. అందుకే బౌద్ధ దార్శనికులు నశించటాన్ని నిర్హేతుకమన్నారు. అంటే పుట్టిన మరుక్షణం నుంచి స్వభావ సిద్ధంగా నశించటం ఆరంభమవుతుంటే దానికి ఎవరో వినాశకర్తలు అవసరం లేదు. ఒకవేళ అవసరం ఉందనుకుంటే పుట్టించటంలో ఉండాలి. "కట్టెను నిప్పు నష్టపరచటాన్ని" బౌద్ధ దార్శనికులు "నిప్పు బొగ్గును పుట్టించిందని" చెబుతారు.

బాహ్య మరియు అంతర్‌జగత్తులో ఉన్న మొత్తం అనిత్యమైనది మరియు క్షణికము అని నిరూపించటానికి చాలా ప్రయత్నం చేయాల్సిన అవసరం లేదు. అన్ని నిదర్శనాలకీ నిదర్శనం, వాస్తవికమైన ఒకే ఒక్క నిదర్శనం దృగ్గోచరం. దాని పరిధిలోకి వచ్చే సమస్త పదార్థాలూ క్షణికమనేది మనం ప్రత్యక్షంగా చూడవచ్చు. రెండవ నిదర్శనం ఊహ. ఇది కూడా దృగ్గోచర అడుగుజాడల్లో నడుస్తూ అదే విషయాన్ని నిరూపిస్తుంది. ఆఖరికి ఏమిటంటే అంతర్ జగత్తుకు బహిర్ జగత్తుకు చెందిన దృగ్గోచర అంశాలన్నీ క్షణికాలుగానే కనిపిస్తాయి. కొందరు ప్రత్యక్ష అగోచరాలను కాకుండా అప్రత్యక్ష అగోచరాలను తెచ్చి వాటిని శాశ్వతము, అతీతమైనవిగా నిరూపించటానికి ప్రయత్నిస్తారు. మతఛాందస మరియు మతపక్షపాత రూపంలో వాళ్ళు దాన్ని ఒప్పించినా కానీ వాస్తవిక అస్థిత్వ రూపంలో దాన్ని ఒప్పించటం అసంభవం. విశ్వ క్షణికత యొక్క సర్వజనీన వాస్తవంగా ధృఢమైన సిద్ధాంతాన్ని స్వీకరించినాక ఆత్మ లేక ఈశ్వర (బ్రహ్మ) లాంటివాటి అస్థిత్వానికి సంబంధించి బుద్ధుని ఆలోచనలు ఏమిటనేది చెప్పాల్సిన అవసరమే ఉండదు. ఒకవేళ ఆత్మ అనేది యదార్థమైతే ఆ విషయంపై మాట్లాడటానికి బుద్ధుడు అప్పుడే తయారై ఉండేవాడు. అనిత్య సూత్రం ఆత్మ మీద, బ్రహ్మ మీద కూడా అన్వయించబడేది అనేది అంగీకరిస్తే, బుద్ధుడు ఆనాడే మాట్లాడి వుండేవాడు. బుద్ధుని కాలంలో ఆత్మ యొక్క తత్వం అంగీకరింపబడేది. ఆత్మలో జీవాత్మ, పరమాత్మ రెండూ ఉన్నాయి. అటువంటి ఆత్మ యొక్క యదార్థాన్ని ఖండించటం లేదా నిరాకరించటం వల్ల బుద్ధుని తత్వాన్ని అనాత్మవాదం అంటున్నారు.

ఏ మినహాయింపు లేకుండా సర్వం అశాశ్వితాలే అనే సిద్ధాంతాన్ని బుద్ధుడు మరియు బౌద్ధ దార్శనికులు నిరోధరహిత వేగంతో అన్ని రంగాలకూ అన్వయించారు. వెనువెంటనే ఇతర దార్శనికులు ఏమి ప్రశ్నించారంటే "ఏ మినహాయింపూ లేకుండా అన్నీ క్షణభంగురమే అయితే కార్య-కారణానికి ఏం సంబంధం ఉంది". కార్య-కారణ సంబంధంతోనే ప్రపంచం నడుస్తున్నది. మామిడి టెంక తప్పకుండా తీయని మామిడి పండ్లని ఇస్తుందని మనకి తెలిసినందుకే మనం మామిడి టెంకల్ని భూమిలో నాటుతాము. ధాన్యం విత్తనాలు ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తాయి కనుకనే వరి విత్తనాలను ఇంటినుండి తీసుకెళ్ళి పొలంలో నాటుతాము. దీని నుంచి కార్య-కారణ సంబంధం ధృఢమైనదని నిరూపించబడుతున్నది. బుద్ధుడు కార్యకారణ సంబంధాన్ని తన ప్రతీత్య సముత్పాదన ద్వారా "అది ఉండబట్టే ఇది అవుతున్నది" అని చెబుతాడు. ఒక్క క్షణం అస్థిత్వం తరువాత సమూలంగా నష్టపోవటాన్ని కారణం అంటారు. దాని తరువాతి క్షణంలోనే విలుప్తమైన వస్తువు స్థానాన్ని గ్రహించిన నూతన వస్తువుని కార్యమంటారు. ఇటువంటి కార్యకారణ సంబంధాన్ని బుద్ధుడు నిరాకరించడు. వరి విత్తనము లేక మామిడి టెంక నుంచే ఉత్పన్నమైన నూతన ధాన్యము మరియు మామిడి పండు అస్థిత్వంలోకి రావటానికి ప్రతి క్షణం పుట్టి నాశనమయ్యే కార్యకారణాల లెక్కించలేని తరాలు లుప్తమౌతూ చెప్పేది ఏమంటే ఒక ఆకారంలో ఉత్పత్తి అవటాన దాన్ని ఒకటిగానే మనం అర్థం చేసుకుంటాము.

**కారణ-కార్యాల ప్రతీత్య సముత్పాదం :** ఒకటి గతించటం నుంచి రెండవ కార్యం ఉత్పత్తి అవుతుంది. కార్యానికి ఒకే కారణం ఉంటుంది. అది ఈశ్వరుడు కూడా కావచ్చు అని ఎవరూ అర్థం చేసుకోకూడదు. బౌద్ధ దార్శనికులు ఈ విషయాన్ని ఇంకా స్పష్టంగా చెబుతూ ప్రపంచంలో ఏదైనా కార్యానికి ఒకటే హేతువు - కారణం ఉండదు. ఎన్నో కారణాల సమాగమం ఒక కార్యాన్ని ఉత్పన్నం చేస్తుంది అని స్పష్టపరిచారు. వరి విత్తనానికీ లేదా మామిడి టెంకెకు తనకు తానుగా పగిలి మొలకను ఉత్పత్తి చేసే శక్తి లేదు. అక్కడి నీరు, ఉత్పాదకత గల మట్టి, ఉష్ణోగ్రత లాంటి ఎన్నో హేతువులు (కారణాలు) జతగూడితేనే ఈ కార్యము ఉత్పన్నమౌతుంది. అవసరమైన హేతువులలో

(కారణాలలో) ఏదైనా ఒక చిన్నది కూడా లేకపోతే ఆ కార్యము ఎప్పటికీ ఉత్పన్నం కాదు. బౌద్ధ దార్శనికులు కారణ సముదాయవాదానికి ఇచ్చిన ప్రతిపాదననే ఆధునిక గతితర్కంలో పరిమాణాత్మకం - గుణాత్మకంగా మారుతుందని చెప్పటం. ఇద్దరూ ఏ కార్యకారణ సంబంధాన్నైతే అంగీకరిస్తారో దాని ప్రకారం కార్యము కారణాలకు తప్పకుండా భిన్నంగా ఉంటుంది అనే నిశ్చయానికి వస్తారు. అంటే అసత్కార్య వాదాన్ని సమర్థిస్తారు. విశ్వం మరియు దానిలో ఉండే వస్తువులు అచంచలం కాకుండా అత్యంత చలనశీలమైనపుడు, విశాలమైన దాని అంతర్గతంలోనే స్థానాంతరం కావు. కాలంలో కూడా తరువాత క్షణంలోనే సంపూర్ణంగా నష్టమౌతున్నటువంటి అత్యంత చలనశీల పదార్థాలు ఎల్లప్పుడూ వేగవంతమవటం కారణంగా స్వయంగా వాటిలో సంయోగ-వియోగాలు జరుగుతుంటాయి. (కలయిక - విడిపోవటం). అవి స్వతహాగా విశ్వాన్ని సృష్టి మరియు అంతం చేయగలగటానికి సరిపోతాయి. సర్వమూ అశాశ్వతం అనే నియమం విశ్వంలోని ఏదన్నా ఘటనకి తనకంటే బయటి నుంచీ నడిపే మరేదో శక్తిని ఆశించదు. అనిత్యత, ప్రతీత్య సముత్పాదన సిద్ధాంతాలు ఎంతటి స్పష్టమైనవో దీని నుండి తెలుస్తున్నది. వీటిముందు మన దేశ శాశ్వతవాదులు తలలు బద్దలు కొట్టుకున్నారు. వారి ఆటలు సాగలేదు.

సర్వమూ అశాశ్వతము, ప్రతీత్య సముత్పాదము తరువాత విశ్వ ప్రవాహాన్ని (ప్రవృత్తిని) స్వీకరిస్తూనే ప్రవాహం ఉంది కానీ అది విచ్ఛిన్న ప్రవాహము అని అంగీకరించాల్సి వచ్చింది. అంతర్ మరియు బాహ్య విశ్వం వాస్తవ ఘటనల ప్రవాహమే. ఈ ఘటనలే వస్తురూపంలో ఒక్కొక్క బిందువులు. విశ్వ ప్రవాహము ఒక అఖండ-నిర్దిష్ట ఆకృతి కాదు. ఒకదానికి ఇంకొకటి అత్యంత దగ్గరగా ఉంచబడిన బిందువుల పంక్తి. అది దూరం నుండి చేస్తేనే ఒక ఆకృతిలాగా (రేఖ) అర్థమవుతుంది. దగ్గరగా చూస్తే అది విడివిడి బిందువులు. ఈ బిందు ప్రవాహ ఉపమానము మనుష్య శరీరం మీద కూడా సంభవిస్తుంది. అంటే అతని చేతన (జ్ఞానం) మీద కూడా. దీన్నే అతీతమైన ఆత్మగా తప్పుగా చెప్పబడుతున్నది.

మధ్యమ ప్రతిపాదం (మధ్యమ మార్గం) కూడా ఆచారము, తత్వము మొదలైన అన్ని రంగాలలో ఒకేలా అన్వయించబడే బుద్ధుని మరొక సిద్ధాంతము. బుద్ధుడు జీవనశైలికి సంబంధించి అతికిపోకుండా మధ్యమ మార్గాన్ని పట్టుకోమని చెప్పినందువలన తత్వంలో కూడా మధ్యమ మార్గాన్నే స్వీకరించాడు. శరీరాన్ని శుష్కింప చేయటం, అత్యంత కష్టపెట్టడం కూడా ఒక రకమైన అతి మరియు చెడ్డది అని ఆయన చెప్పాడు. అదేవిధంగా అన్నిటినీ వదిలి కేవలం శరీరాన్ని పోషించటలో లీనమవటం కూడా రెండవ అతి అందువలన చెడ్డది కూడా. రెంటికి మధ్య మార్గాన్ని మనిషి స్వీకరించాలి. తత్వంలో ఆయన స్కందాల అస్థిత్వాన్ని క్షణరూపంలో మాత్రమే అంగీకరించాడు. క్షణికంగా ఉండటాన ఏ వస్తువూ తుచ్ఛమైనది కాదు. క్షణకాలం స్థిరంగా ఉండటం అనేదే ఆ వస్తువు యొక్క వర్తమానం. అందువలననే అది బహుమూల్యం. అదే భాగ్యం.

పదార్థమనేది యదార్థమైనదీ, భౌతికమైనదీ. కానీ క్షణక్షణం నాశనమవుతూ - పరివర్తన చెందుతూ పరస్పర విరుద్ధ అంశాల సమాగమనంతో ఏ అభివృద్ధి పరంపర అస్థిత్వంలో ఉంటుందో వాటి పరిణామక్రమంలో వస్తువుల నుండి చైతన్యము (జ్ఞానం) ఉద్భవించటాన్ని భౌతికవాద క్షణికవాద తత్వం కూడా స్వీకరిస్తుంది. కార్యమనేది కారణానికి పూర్తిగా భిన్నమైనది. ఒకవేళ చైతన్యం (జ్ఞానం) యొక్క కారణం భౌతిక అంశాలకంటే విలక్షణంగా ఉంటే దీంట్లో ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. గతితార్కిక భౌతికవాదం చైతన్యాన్ని (జ్ఞానాన్ని) భౌతిక అంశాల (స్కందాల) నుంచి ఉద్భవిస్తుందని అంగీకరిస్తుంది. దీనితోపాటుగా చైతన్యాన్ని వస్తువుగా (స్కందంగా) అంగీకరించదు. బౌద్ధ దర్శనం తనకు తాను భౌతికవాదంగా ప్రకటించుకోదు. కానీ దీంతోపాటుగా ఆత్మవాదంగా కూడా ప్రకటించుకోదు. ఇక్కడ కూడా అది మధ్యమ మార్గాన్ని అనుసరిస్తుంది. చైతన్యాన్ని ఆత్మ అని చెప్పి దాన్ని అలౌకికమైనదిగా చేయటానికి సిద్ధపడదు. దీంతోపాటుగా చైతన్యాన్ని కేవలం భౌతికమైనదిగా అంగీకరించటానికి కూడా సిద్ధంగా లేదు. నేటి ప్రపంచంలోని అన్నిటికంటే ఉన్నతమైన తత్వశాస్త్రం గతితార్కిక భౌతికవాదం - బుద్ధుని తాత్విక చింతనకు ఎంత దగ్గరగా వస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. దార్శనికులుగా చెప్పబడుతున్న మనవాళ్ళు తాత్విక రంగానికి బుద్ధుని దోహదాన్ని లెక్కకు రానిదిగా, తుచ్ఛమైనదిగా భావిస్తూ ఎంతటి భ్రమలో ఉన్నారో అనేది కూడా బాగా అర్థం చేయించవచ్చు. అన్ని కోణాల నుంచీ చూస్తే బుద్ధుడు సమంతభద్ర, సర్వతోభద్రుడని చెప్పాల్సిన అవసరం లేదు. మానవత్వం తన చరిత్రలో ఇటువంటి ఒకే ఒక్క సమంతభద్ర పురుషోత్తముడికి జన్మనిచ్చింది.

ఆలూరి ఉషారాణి
ఫోన్ : 7207775713

# జంగాల శాస్త్రి - అల్గారిథమ్ములు

– డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల

మధుర : నమస్కారం సార్

**మిసిమి :** మధురవాణీ, ఎచ్చటి నుండి రాక? ఎవరినో అతిథిని తీసుకొచ్చినావు.

మధుర : అవును సార్, జంగాల శాస్త్రి వీరి పేరు. పానుగంటి లక్ష్మీనరసింహా రావు గారు పూర్వకాలంలో **సాక్షి** వ్యాసాలు వ్రాసారు కదా సార్. అందులో ఉపన్యాసాలు చెప్పే వక్త పేరు జంఘాల శాస్త్రి కదా సార్. ఆ పేరే వీరిది కూడాను.

**మిసిమి :** అదేమిటి, పానుగంటి వారి ఉపన్యాసకుని పేరు జంఘాల శాస్త్రి కదా, వత్తుఘా.

మధుర : అవును సార్. ఆ పానుగంటి వారి జంఘాల శాస్త్రి గ్రాంథిక భాషలో మాట్లాడుతాడు సార్. పైగా అరసున్నాలు బిగిస్తాడు కూడాను. మా శాస్త్రికి అంత సీన్ లేదు సార్. అందుకే వత్తులేని జంగాలశాస్త్రిగా చెలామణి అవుతున్నారు.

**మిసిమి :** సరిసరి. శాస్త్రిగారూ త్వరలో మీకు వత్తుఘా వచ్చుగాక.

మధుర : శాస్త్రిగారు నాలాగా కబుర్లు చెప్పరు సార్. పానుగంటి వారి జంఘాలశాస్త్రి వలెనే సభలో ప్రసంగిస్తారు.

**మిసిమి :** రాంబాబూ. మన ఆఫీసు స్టాఫ్‌ను, పక్క ఆఫీసు వాళ్లను ఆహ్వానించి, మన లైబ్రరీలో సభ ఏర్పాటు చేయుము. ఆ మైకూ గీకూ సంగతి కూడా చూడుము.

జంగాల : మీ మైకూ గీకూ ప్రయోగం బాగున్నది. అది వ్యాకరణ శాస్త్రమునకు ఆమోదకరం కూడాను.
**నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వదీర్ఘంబులకు గిగీలగు.**
**చిన్నయ సూరి బాలవ్యాకరణం, ప్రకీర్ణక పరిచ్ఛేదం, సూత్రం 22.** మీరు ఆసూత్రాన్ని ఉపయోగించారు.

**మిసిమి :** శాస్త్రిగారూ, మంచి పట్టు పట్టినారు. మధురవాణీ – మీ శాస్త్రిగారు ఘట్టివాడే.

మధుర : అవును సార్, మా జంగాల శాస్త్రి గట్టివాడే కాని ఇంకా ఘట్టివాడు కావటానికి కొంత సమయం పడుతుంది.

**మిసిమి :** బాగు బాగు.

రాంబాబు : (స్వగతం) ఇంకా నయం. బాఘు బాఘు అనలేదు.
*జంగాల శాస్త్రి గ్రంథాలయ నిండు సభలో ఇటుల ప్రసంగించెను.*

జంగాల : సభాసదులారా, ఈరోజు నేను ఇన్ఫర్మేషన్ థియరీ గురించి మాట్లాడుతాను. తెలుగులో దీనిని విషయ సిద్ధాంతం అనవచ్చును. ఈ సిద్ధాంతం 1920 ప్రాంతంలో అమెరికాలో మొదలయినది. ఒక సందేశం ప్రేషకుడు (sender) నుండి గ్రహీత (receiver) కు చేరటానికి తంత్రి (wired) విధానం కాని, నిస్తంత్రి (wireless) విధానం కాని ఉపయోగిస్తాము. మీరు మీ అబ్బాయి, అమ్మాయిలతో ఫోనులో మాట్లాడేటప్పుడు కాని,ఈమెయిలు పంపేటప్పుడు కాని, ఈ విషయ సిద్ధాంతం వాడబడుతుంది. వారు అమలాపురంలో ఉన్నా, అమెరికాలో ఉన్నా క్షణంలో ఆ సందేశం వెళ్ళిపోతుంది గదా, ఏమీ దోషం లేకుండా. సముద్రగర్భంలోనూ, భూగర్భంలోనూ వేలమైళ్ళకొద్దీ ఉండే కేబుళ్ళ (cables) ద్వారా, లేక ఆకాశమార్గంలో నిస్తంత్రి విధానంపై శాటిలైట్ల ద్వారాను సందేశాలు ప్రయాణిస్తాయి. ఆ ప్రయాణంలో ప్రకృతి వల్ల గాని, వేరే కారణాల వల్ల గాని సందేశంలో తప్పులు దొర్లవచ్చు. ఆ దోషాలను గుర్తించడం, అప్పటికప్పుడు నివృత్తి చేయటం ఈ విషయ సిద్ధాంతంలో ఒక ముఖ్యభాగం. దోషపరిశోధన,

దోషనివారణ, దోషసవరణలకు వివిధ క్రమసూత్ర పద్ధతులు (algorithms) ఉన్నాయి. ఉదాహరణకు parity checks, checksum, cyclic redundancy checks ఇలాంటి పేర్లతో ఎన్నో ఉన్నాయి. మీ ఫోన్లలోనూ, కంప్యూటర్లలోనూ ఇవన్నీ ఉంటాయి. అందువల్లనే మీరు ఫోన్లో మాట్లాడేటప్పుడు గాని, ఈ మెయిలు వ్రాసినప్పుడు గాని సందేశం గమ్యం చేరేటప్పుడు ఏమీ దోషాలు ఉండవు.

ఇదీ స్థూలంగా ఇన్ఫర్మేషన్ థియరీ, లేక కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ప్రయోజనం. ఈ సిద్ధాంతం ఇరువది శతాబ్దంకి ముందు ఎక్కడా లేదా? ఉన్నది సభాసదులారా, ఉన్నది. మన వేదకాలంలో ఉన్నది. వేదకాలంలో వేదాలు, ఉపనిషత్తులు భద్రపరచటానికి లిపి లేదు, వ్రాతపరికరాలు లేవు. కేవలం మౌఖిక పద్ధతి (oral tradition) తోనే ఆ పవిత్ర గ్రంథాలను నిల్వ చేసారు, సురక్షితంగా కాపాడారు, తరువాతి తరాలకు అందచేసారు. వేదకాలం క్రీ.పూ. 1500 నుండి ఉజ్జాయింపుగా క్రీ. పూ. 500 వరకూ విస్తరించినది. అనగా వేయి సంవత్సరాలు, అంటే శతాబ్దానికి మూడు తరాల (generations) చొప్పున ముప్పది తరాలు. అన్నితరాలు ఎక్కడా దోషాలు కలవకుండా, తూ.చా.లు తప్పకుండా, కేవలం జ్ఞాపకశక్తితో, మౌఖిక సంస్కృతితో ఆ గ్రంథాలను పదిలపరిచారు. ఊహాతీతం, అనితరసాధ్యం. ఇదికదా నిజమైన ఇన్ఫర్మేషన్ థియరీ అంటే, సిసలైన కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అంటే.

*(సభాసదులందరూ లేచి నించొని చప్పట్లు.)*

జంగాల : ధన్యవాదములు. ఇప్పుడు ఆ వేదకాలంలో దోషనివారణకు ఆ వేదపండితులు అవలంబించిన కొన్ని క్రమపద్ధతుల (algorithms) గురించి ప్రస్తావిస్తాను. వారు ప్రధానంగా ఎంచుకున్న పద్ధతి పద పునరుక్తి (word redundancy). కాని అది కేవలం ద్విగుణనం (duplication) కాదు, పునరుక్తి పదాలను జల్లెడ లాగా, గణితశాస్త్ర (mathematical) పద్ధతిలో అల్లారు, ఏ మాత్రం దోషాలు చొప్పించకుండా. అందులోనూ మెట్టు వరసగా సులభమైన పద్ధతి నుండి క్లిష్టతరమైన పద్ధతి వరకూ తరగతులుగా విభజించారు. అన్నిటికన్నా సులభమైన పద్ధతి పద పఠనము. ఇందులో మంత్రంలో, శ్లోకంలో పదాలు ఎలావుంటే అలాగా చదవటం. పునరుక్తి ఉండదు. కాని ఈ పద్ధతిలో దోషాలు వచ్చే ప్రమాదం ఉన్నది కదా. తరువాతి పద్ధతి క్రమపాఠం. పదాలను వరుసక్రమంలో 1,2,3 లాగా ఉన్నప్పుడు, ఈ పద్ధతిలో 1-2, 2-3, 3-4, 4-5. ఈ క్రమంలో ఉంటుంది. ఈ క్రమపద్ధతిలో ప్రతి పదం ఒకసారి రిపీట్ అవుతున్నదని గమనించారు కదా. తరువాతి పద్ధతి జటా పాఠం. ఇందులో క్రమం 1-2-2-1-1-2, ఇలా ఉంటుంది. ఘనపాఠం అన్నింటికంటే క్లిష్టతరమైనది. ఇందులో క్రమం ఇలా ఉంటుంది. 1-2-2-1-1-2-3-3-2-1-1-2-3; 2-3-3-2-2-3-4-4-3-2-2-4 ఇత్యాది. ఘనపాఠంలో ప్రతి పదం పదిసార్లకు పైగా రిపీట్ అవుతుంది. కాబట్టి ఎట్టి దోషము ప్రవేశించుటకు వీలు పడదు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఈ వేదకాలపు సూత్రాలు నేటి ఇన్ఫర్మేషన్ థియరీలో పాఠ్యాంశం కాదు. పాశ్చాత్యులకు ఈ విషయాలు తెలియవు. తెలిసినను అలక్ష్యం చేయుదురు. మన ఇండియన్ సైంటిస్టులు దీనిపై మరింత పరిశోధన చేసి, ఈ విషయాలను వెలుగులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. ఇంతటితో ముగిస్తాను. నమస్తే.

*కరతాళధ్వనుల మధ్య ఒక అతిథి ఇటుల పలికెను.*

అతిథి : శాస్త్రి గారూ. జీవితము క్షణికము, బుద్బుద ప్రాయము, వాయు దీపము, తృణ తుల్యము. కాని విజ్ఞానము అపారము, అగాధ భాండము. కాలప్రవాహం ఆద్యంత రహితము. కాలంపు ముందు, వెనుకలు మనకు అంతుబట్టవు. విజ్ఞాన సర్వస్వాన్ని, కాలప్రవాహముతో జోడించినచో అది శాశ్వతము, కళంకిత రహితము, పవిత్రము. అదిగదా వేదాల సారం?


జంగాలు: పరమ సత్యం. కృతజ్ఞతలు.

# అలవాటైపోతున్న

కథా రచయిత వి.రాజా రామమోహన రావు గారి మూడో కథల సంపుటి వెలువడింది. ఈసారి ”అలవాటై పోతున్న” శీర్షికతో తీసుకొచ్చారు.ఈ సంపుటిలో 1981-99 వరకు వచ్చిన కొన్ని కథలు చేర్చారు.

వి.రాజా రామమోహన రావు కథలకో సిగ్నేచర్ ట్యూన్ ఆయన అనుసరించిన శిల్పం. సాధారణంగా కథలో వాతావారణం, నేపథ్యం గురించి ఎక్కువగా మాట్లాడుతుంటారు విమర్శకులు.అయితే వాతావరణం, పాత్రలు వాటి స్వభావాన్ని బలంగా చెప్పే కథకుల్లో ఈ రచయిత ఒకరు. ఆయన పాత్రలు నేలవిడిచి సాము చేయవు.. కానీ గ్రే షేడ్స్ కలిగివుంటాయి. మనం తరచూ చూసే మనుషులను, సన్నివేశాలను కొంచెం లోతుగా చూసి కథగా మలుస్తారాయన. స్త్రీ పురుష సంబంధాల్లో ఉండే అవసరాలు, మోసగించటాల మీద ఆయన కథలు ఎక్కువ ఫోకస్ పెడతాయి. కథలో సందేశం, బలమైన ముగింపు కన్నా, మనుషులు క్రూరంగానో, స్వార్థంతోనో ప్రవర్తించడానికి మనకున్న సామాజిక పరిస్థితులే కారణమని ఆయన నమ్ముతారు. చాలామంది జీవితాల్లో ఉండే ఇరుకును ఆయన కథలు పట్టుకుంటాయి.. ఆయన కథలేవీ పేదలు మోసపోయేవారు. డబ్బున్న వారు మోసగించేవారు అన్న తరహాలో ఉండవు. ఆయన పాత్రల్లో ప్రధానంగా నిర్లిప్తంగా ఉండే వ్యక్తులు, మోసం చేస్తున్నామని తెలిసి కాస్త గిల్టీగా ఫీలయ్యేవారు, సమర్థించుకునే వారు ఉంటారు. ఎక్కువమంది దిగువ మధ్యతరగతికి చెందిన వారే ఈ కథల్లో తారసపడతారు. ప్రతి పాత్రా ఒక జస్టిఫికేషన్‌తో సాగుతుంది.. కష్టాలకు కుంగిపోవు ఆయన పాత్రలు. తమకు నచ్చింది చేయటంలో ఉన్న అవసరాన్ని సమర్థిస్తాయి. కథారచన ఊహల్లోంచి కాకుండా జీవితంలోంచి వచ్చినప్పుడు ఉండే ఓ నిసర్గ సౌందర్యాన్ని పరిచయం చేస్తాయి రామమోహనరావు గారి కథలు. నాటి-నేటి సీనియర్ కథకుల్లో ఆయన ఒకరు. కథెప్పుడూ స్థల కాలాల్ని పరిచయం చేయాలంటారు. ఆయనవి అధోజగత్‌కు చెందిన కథలు కావు, ఆ అధోజగత్‌ను రిప్రజెంట్ చేస్తాయి. నిజానికి ముందు విడుదలైన “చేరువ” కథల సంపుటి కన్నా ఈ కథల సంపుటి లోని కథలు మనిషిలోని లోపల పొరలను విప్పి చూపుతాయి. మానవ మనస్తత్వాలు ఎంత జటిలంగా ఉంటాయో మరింత లోతుల్లోకి తీసుకెళ్ళి చూపుతాయి.

మానవ జీవితంలో ఉండే సంక్లిష్టతలు, సెక్సువల్ రిలేషన్స్ మధ్య ఉండే సంబంధాన్ని తన కథల ద్వారా శోధించే ప్రయత్నం చాలా కథల్లో మనకు కనిపిస్తుంది. ఈ కథలన్నీ చిన్న చిన్న వాక్యాలతో కూడి తక్కువ నిడివితో ఉంటాయి.. వ్యక్తుల్లో ఉండే అనేక పొరలు ఈ కథల్లో మనం చూడొచ్చు.. గొప్ప తాత్వికతతో కూడిన వాక్యాలు ఈ కథల్లో అనేకం మనలను పలకరిస్తాయి.. రెండు నెలలు కూడబెట్టుకున్న డబ్బు, తన సుఖం, తన శరీరం అన్నింటిని పణంగా పెట్టినా పక్కన కొడుకుని, కొడుకు చేరువని సాధించుకున్నందుకు చిత్రమైన గర్వం అనిపించింది మల్లమ్మకి. (మనిషిగా నిరసన) అన్ని రకాలుగా అలిసిన ఆ స్త్రీ సముద్రం మీద అధికారం చెలాయించ డానికి పెద్ద శక్తి అక్కర్లేదు. ఓ పది రూపాయలు చాలు మర్యాద ముసుగు మాటు చాలు. (అలసిన సముద్రం) “నేను మంచివాణ్ణా.. మామూలు మనిషినా.. వెధవనా? అని చాలా సార్లు తనని తాను ప్రశ్నించుకున్నాడు గోపాలకృష్ణ.. అన్నీ అనిపించింది (నిన్ను -నువ్వే)”. ఈ తరహా కథలు ఇప్పుడు రావటం లేదు.. ఒకవేళ వచ్చినా కథకో క్రాఫ్ట్ ఉంటుంది కదా.. అది మిస్సవుతోంది ఆ కథల్లో. ఈ రకమైన కథలు రాసే వారు ఓ నిశ్చితాభిప్రాయంతో రాస్తారు. దానికి కారణం వారనుసరించే భావజాలం.. ఆ రకంగా ఈ కథలన్నీ ఎలాంటి భావజాలం ప్రభావం లేకుండా మన చుట్టూ మసిలే వ్యక్తులను పరిచయం చేస్తాయి!




*అలవాటై పోతున్న- వి.రాజారామమోహనరావు కథలు-3, వెల: 280రు. పుటలు: 248,*
*ప్రతులకు : అనల్ప బుక్ కంపెనీ, ఫోన్ : 917093800303*

*- సి.యస్.రాంబాబు*


# పల్లవించిన తెనుగు పాట

కొన్ని సందర్భాలు కొన్ని కొత్త ఆలోచనలకు పురుడు పోస్తాయి. అలాంటి సందర్భం ఒకటి చెప్పుకుందాం.

**మిసిమి** పత్రికలో ధారావాహికగా వెలువడిన డా. ఎమ్. పురుషోత్తమాచార్య వ్యాస సంపుటి "సినిమాలలో శాస్త్రీయసంగీతం" జాతీయ చలనచిత్ర పురస్కారం పొందిన వేళ రచయితను సన్మానించారు సత్కళాభారతి సంస్థ వారు కొంత కాలం క్రితం. అప్పుడు **మిసిమి** పత్రిక సంపాదకులు అశ్వినీకుమార్ గారికి వచ్చిన ఆలోచనేమిటంటే తెలుగులో రేడియో మాధ్యమంగా లలిత గీతాలు ఎంతో ప్రసిద్ధి నొందాయి కదా. వాటిని కూడా పాఠకులకు పరిచయం చేస్తే ఈ వ్యాసాలకు కొనసాగింపుగా ఉంటుంది కదా అని. అదిగో అలా ఆ ఆలోచన ఆరోజున సభాముఖంగా ప్రకటితమయ్యింది. మరో ధారావాహికకు నాంది ప్రస్తావన అయింది. అదే **లలితసంగీత పరిమళం.** ఈసారి తెలుగునాట ప్రాచుర్యం పొందిన అరవై నాలుగు లలిత గీతాలనెంచుకుని వాటి పుట్టుపూర్వోత్తరాలు సేకరించి తీయ తేనియ రుచులను పంచారు పురుషోత్తమాచార్యుల వారు.

తెలుగునాట ఇప్పటికీ మారుమోగే ప్రైవేటు గీతాలలో చెప్పుకోవలసిన పాటలు కొన్ని ఉన్నాయి. భక్తిగీతాలలో ఏడుకొండల సామి ఎక్కడున్నావయ్యా, నమో వెంకటేశ.. నమో తిరుమలేశ.., నీ కొండకు నీవే రప్పించుకో కానీ, తలనిండ పూదండ, పాడకే నారాణి.. వంటి రొమాంటిక్ గీతాలు కానీ, ఓహో యాత్రికుడా, బహుదూరపు బాటసారి వంటి తాత్విక గీతాలు కానీ, కరుణశ్రీ పుష్ప విలాపం కానీ, మా తెలుగు తల్లికి మల్లెపూదండ వంటి స్ఫూర్తి గీతం కానీ, ఇవన్నీ తెలుగు వారి ఉమ్మడి ఆస్తిగా మారాయి. అయితే వీటి రచనా నేపథ్యం, ఆ పాటల్లోని సంగీత సౌరభాన్ని వివరించిన ప్రయత్నాలు జరిగినట్లు లేదు. ఇలాంటి అరవై నాలుగు పాటలను తనదైనశైలిలో విశ్లేషించి, ఎన్నో ఆసక్తికరమైన అంశాలు మనముందుంచారు గ్రంథకర్త పురుషోత్తమాచార్యులు..

**మిసిమి** పత్రికలో వ్యాస పరంపరగా వస్తున్న ఈ వ్యాసాలన్నీ ఇప్పుడు పుస్తకమై రాగా, ఆ పుస్తకం జూన్ 23 సోమవారం రోజున పుస్తకమై భాసిల్లుతూ నన్ను ఆవిష్కరణ చేయండని లలిత గీతమంత మృదువుగా కోరింది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి గారు ఎప్పటిలా తన సహకారమందించారు. నిజానికి సోమవారం పదకొండు గంటలకు ఎక్కువ మంది వస్తారని ఆశించలేం. వచ్చిన పదిమంది అతిథులలో ముగ్గురు లలిత సంగీత ప్రముఖులు హాజరవటంతో ఆరోజుకి, ఆ పుస్తకానికి సార్థకత లభించింది. వారెవరంటే లలిత సంగీతంలో టాప్ గ్రేడ్ కంపోజర్ కలగ కృష్ణమోహన్ ఒకరైతే, మరొకరు లలిత గీతాల రచయిత వోలేటి పార్వతీశం. ఇంకొకరు గాయకులు పాలగుమ్మి రాజగోపాల్. సాహిత్య అకాడమీ ఆ హాలులో తెలంగాణ సాహిత్యమూర్తులు చిత్తరువులై మౌనంగా మన చిత్తాన్ని కొల్లగొడుతూ ఉంటారు తమ ప్రతిభా పాటవాలతో. ఆనాటి కార్యక్రమాన్ని వారంతా వీక్షిస్తున్న భావన కలిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి గారు పుస్తకాన్ని ఆవిష్కరించి, ఈ పుస్తకం ఆవిష్కరణకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాటల సేకరణ, వాటి విశ్లేషణకు చాలా కష్టపడాల్సి వచ్చిందని రచయిత పురుషోత్తమాచార్య వెల్లడించారు. ఆయన పాట నేపథ్యం, పాటలోని భావాన్ని, ఏ రాగంలో బాణీ కట్టారో పుస్తకంలో చెప్పినంత స్పష్టంగా వివరించారు.




పుస్తకం సమీక్ష చేస్తూ సి. యస్. రాంబాబు ఆరోజుల్లో రేడియోలో ప్రసారమయ్యే లలిత సంగీతం ఎలా ప్రజలపై ప్రభావం చూపిందో వివరించారు. ముఖ్యంగా ఘంటసాల పాడిన ప్రైవేటు రికార్డులకు ఆకాశవాణి వేదికై, శ్రోతలకు వీనులవిందు చేసిందన్నారు. ముందుమాటలో ప్రముఖ లైట్ మ్యూజిక్ కంపోజర్ కలగ కృష్ణమోహన్ పేర్కొన్నట్లు

ఆకాశవాణిలో లలిత సంగీతం లైట్ మ్యూజిక్‌గా పేరొందింది. నిజానికి భావ, స్వరమాధుర్యాలపై కాంతిని ప్రసరించేదే లైట్ మ్యూజిక్ అన్న కృష్ణమోహన్ మాట అక్షరసత్యం అన్నారు. ఆకాశవాణిలో సంగీత రూపకాలకు జాతీయ పురస్కారాలు పొందిన కలగ కృష్ణమోహన్ మాటల్లో చెప్పాలంటే, లలిత సంగీతం ఆరోజుల్లో ప్రజల అభిరుచిని తీర్చిదిద్దినదిగా పేర్కొన్నారు..

అనేక లలిత గీతాలు రచించిన దూరదర్శన్ విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి వోలేటి పార్వతీశం మాట్లాడుతూ, లలిత గీతాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్ళటంలో వింజమూరి సీత, అనసూయలు చేసిన కృషిని ప్రశంసిస్తూ, భావకవిత్వాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళిన దేవులపల్లి కృష్ణశాస్త్రి కృషితో పోల్చారు.

**మిసిమి** సంపాదకులు అశ్వినీకుమార్ మాట్లాడుతూ సినిమాపాటల హోరులో కొట్టుకుపోతున్న ప్రజల దృష్టిని మనకున్న మంచి సంగీతం వైపు మరల్చటానికి ఇది **మిసిమి** చేసిన ప్రయత్నమని, అందులో పురుషోత్తమాచార్య మరోమారు విజయం సాధించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు పురుషోత్తమాచార్య గారిని లలిత గీతాలకు, శాస్త్రీయ సంగీతానికి తల్లివేరులైన తెలుగునాట గ్రామీణుల గుండెల్లో నిలిచిపోయిన జానపద గీతాలను కూడా **మిసిమి** ద్వారా పరిచయం చేయమని కోరారు..


ఇంగ్లీష్ పుస్తకాల ధరలతో పోటీపడుతున్న తెలుగు పుస్తకాల ధరలకు భిన్నంగా కేవలం 99రూపాయల వెలను ప్రకటించి, పురుషోత్తమాచార్యులు తన అభిమానాన్ని చాటుకున్నారు. సభకు హాజరైనవారందరికీ “లలిత సంగీత పరిమళం” పుస్తకం కానుకగా తన తరఫున అందచేశారు కలగ కృష్ణమోహన్..

అద్భుతమైన లలిత గీతాలు తమకలం నుంచి జాలువార్చి అమరులైన ఆనాటి రచయితలు శంకరంబాడి సుందరాచారి, అడవి బాపిరాజు, రావులపర్తి భద్రిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, దాశరథి, బాపురెడ్డి, మల్లవరపు విశ్వేశ్వరరావులతోపాటు, ఆ పాటలను స్వరపరిచిన ఘంటసాల, రజని, పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్, బాలమురళిలు కూడా ఈ పుస్తకం చూస్తే కన్నీటి భాష్పాలు రాల్చక మానరని తెలంగాణ సాహిత్య అకాడమీ హాలులో కొలువైన సాహిత్య మూర్తులు నిశ్శబ్దంగా ముచ్చటించుకుంటున్న వైనం ఆరోజు హాజరైన వారి మనసుల్ని తాకిందంటే అతిశయోక్తి కాదు.

*- సి.యస్. ఆర్.*


---

**యద్భావం తద్భవతి - ఆధ్యాత్మిక కథలు - ఆర్.సి. కృష్ణస్వామి రాజు :** జీవన తాత్త్వికత, సత్యాలను మనిషి జరిపే సత్యశోధనను ఎంత సంపద ఉన్నా హారతి కర్పూరంలా కరిగిపోవడంలాంటి పచ్చినిజాలను, నీతి నియమాలను, మనిషి యోగక్షేమాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు ఈ కథల ద్వారా కృష్ణస్వామి తెలియజేస్తారు. ఈ కథలను చిన్నా, పెద్దలను ఒకేలా అలరిస్తాయి. చదివేటప్పుడు మనం చిన్నతనంలో చదువుకున్న, చందమామ, బొమ్మరిల్లు, బాలమిత్ర వంటి కథలు గుర్తుకు వస్తాయి.




*పుటలు: 136, వెల: 160/- ప్రతులకు : ఫోన్ : 9393662821*

**చిట్టి కథలు - చోడా సాంబశివరావు :** కథలు చెప్పుకోవటం నలుగురు స్నేహితులు కూర్చుని నవ్వుకోవటానికి, అదే పంతులు గారు చెబితే ఏదో నీతిని బోధించటానికి, అదే పెద్దలు చెబితే రామాయణ భాగవతాల్లోని నైతికతను, అదే గురువులు చెబితే అర్థ, కామ, మోక్షాల గురించి వివరించటం ఉంటుంది. మనకు నీతికథలు మిత్రలాభం, మిత్రభేదం పేరుతో జంతువులు, పిట్టలు పాత్రలుగా ఎప్పట్నుంచో ఉన్నాయి. ఏవిషయమైనా కథ రూపంలో చెబితే వింటారు, ఎంతోకొంత వంటపట్టించుకుంటారు. ఈ చిట్టికథలు కూడా పెరిగే పిల్లల కోసం, పెరగని పెద్దల కోసం చెప్పినవే.




*పుటలు: 88, వెల: 140/-. ప్రతులకు : ఫోన్ : 9848021382*

# శనిదేవత పద ధ్వనులు

**– పెద్దిభొట్ల సుబ్బరామయ్య**

పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి కథారచనకి ఆయువుపట్టు ఆయన లోతైన పరిశీలన. విజయవాడ వేసవి మండుటెండల్లో రోడ్డుమీద చెప్పులు కుట్టేవాడి పనితనాన్ని నిలబడి పరిశీలించేవాడాయన. ముసురుపట్టి వాతావరణం చీదర చీదరగా ఉన్న రోజుల్లో, మనుషుల మనస్థత్వం, ఆలోచనల తీరు పసిగట్టేవాడాయన. ఈ పరిశీలనతో, తనదైన లోచూపుతో ఎన్నో మంచి కథలు రాశారు. అలాంటి చాలా కథల్లో తన పరిశీలనా ప్రభావం పాఠకులకి అందాలని దీర్ఘ వర్ణనలు, బలమైన పదాలు ప్రయోగించారు. కానీ, ఈ శనిదేవత పద ధ్వనులు కథ వాటికి పూర్తిగా భిన్నం. ప్రత్యక్ష ప్రభావం కనపడకుండా, అతి నేర్పుగా, అత్యంత సరళంగా సుబ్బరామయ్యగారి నుంచి వెలువడ్డ కథ ఇది. వాలుకి నీరు పారినంత సరళసుందరత ఈ కథలో ఉంది. కథా వస్తువు కూడా చాలామంది దృష్టికి రానిది. ఆయన గాయకుడు. గాయకుడిగానే జీవితంలో స్థిరపడాలని పలు ప్రయత్నాలు చేసి విసిగిపోయాడు. ఆయన గానం ఓ గ్రామఫోను రికార్డుగా వచ్చింది. అది ఆయన దగ్గరలేదు. ఆయనకి బేంక్ ఉద్యోగి రవి పరిచయం. ఆ రికార్డు తన దగ్గర ఉంది, ఆయనకి ఇస్తాను, తనింటికి రమ్మనమన్నాడు రవి. ఆరోజు ఉదయం రవి ఇంటికి బైలుదేరాడాయాన.

ఆయనకి నలుగురు సంతానం. భార్యలేని ఒంటరితనం. పెద్దకూతురు లలిత. తన గుమాస్తా ఉద్యోగంతో చాలీ, చాలని సంపాదనతో తండ్రి బాధ్యతనే కాక, ఇంటి మొత్తం బరువుని మోస్తూ, తప్పనిసరిగా తన పెళ్ళి మానేసింది. ఆమె తర్వాతవాడు శ్రీరామచంద్రమూర్తి. రెండేళ్ళ క్రితం ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. ఎక్కడున్నాడో, అసలు ఉన్నాడో లేడో కూడా తెలియని విషాదం. మూడోవాడు చిరంజీవి. డిగ్రీ పూర్తి చేసి ఏ పనీ కుదరక, రికామీగా తిరుగుతున్నాడు. ఆఖరిది జానకి, పెళ్ళయి భర్తతో ఎక్కడో ఒరిస్సాలో దూరంగా ఉంది. నిరంతరం ఆయనని శని పట్టుకున్నదని భావన. డెబ్భైఏళ్ళు దాటిన వయసులో అంతా నిరుత్సాహం. చూపు ఇబ్బంది. దానికన్నా వినికిడి మరీ మందగింఇ పెద్ద సమస్యగా ఉంది. వినికిడి మిషన్ సాయం లేకపోతే అసలేం వినపడదు. దానికి తోడు ఈమధ్య దాని బేటరీలు బజార్లో అంతగా దొరకటం లేదు. అవి అయిపోయినప్పుడల్లా లలితకి సమస్య. వాటికోసం వెతకటమేకాదు, కొనటానికి డబ్బూ ఉండాలి. ఉదయం ఇంట్లో బైలుదేరిన ఆయన వెతికీ వెతికి, శ్రమపడితేనేగాని, రవి దొరకలేదు. అతను ఆయన్ని చాలా మర్యాద చేశాడు. భోజనం పెట్టి, విశ్రాంతిగా ఉంచాడు. ఆ రికార్డుని భద్రంగా ఆయనకి అందచెయ్యటమే కాదు, ఇంక ఈ రికార్డు మీదే, నాకు తిరిగి ఇవ్వక్ఖర్లేదు అన్నాడు. ఇదంతా జరుగుతుండగానే రవి ఎవరో, రవి తల్లి ఎవరో ఆయనకి తెలిసింది. రవితల్లి చాలా ఏళ్ళకిందట మోసపోయి ఒకతనితో ఆ నగరానికి వచ్చింది. అతను దూరమయ్యాక ఆమెకి, ఈయనకి సంబంధం కుదిరింది. కొన్నాళ్ళు అది సాగింది. అప్పటికే ఆయన వివాహితుడు, సంతానం, సంసారం ఉన్నాయి. ఆవిడ భారాన్ని భరించలేని ఆర్థిక ఒత్తిడి. ఆవిణ్ణి ఓ పెద్దాయన చేరదీసి, బాగోగులన్నీ చూస్తానంటే, ఈయన అనుమతితోనే వెళ్ళింది. ఆమె ఎంతో ఇష్టంగా జాగ్రత్త పెట్టిన రికార్డు అది. ఆమె ఇప్పుడు లేదు. గతించింది. ఆ రికార్డుని భద్రంగా ఇంటికి తెచ్చుకున్నాడు. ఎప్పటిదో తనపాట. ఇన్నాళ్టికి దొరికింది. అర్జెంటుగా వినేయాలన్న ఆతృత. పక్కింటి వాళ్ళ దగ్గర రికార్డు ప్లేయర్ ఉంది. లలితని వెళ్ళి వాళ్ళింట్లో వినటం కుదురుతుందేమో అడిగి రమ్మన్నాడు. వాళ్ళు రమ్మన్నారు. వీళ్ళు వెంటనే వెళ్ళారు. రికార్డ్ పెట్టారు. అందరూ ఆ పాట విని ఆనందంగా తలూపుతున్నారు. కానీ ఆయనకే ఏం వినపడలేదు. చెమిటి మిషన్‌లో బేటరీ పూర్తిగా అయిపోయిన నీరవ నిరుత్సాహం.


దిగులుగా ఇంటికి తిరిగొచ్చాక ఎంతో సందేహంగానే విషయం అంతా లలితకి చెప్పి, వెంటనే బేటరీ కొనమన్నాడు. బేటరీ వస్తేనే కానీ పాట వినలేడు. జీవితంలో చివరి కోరికలాంటి ఆ కోరిక తీరదు. అప్పటికే బాగా అలసిన లలిత 'చూద్దాంలే నాన్నా! బేటరీలు దొరకటం లేదు. అయినా చూస్తా రెండు మూడు రోజుల్లో. ఇప్పుడు పడుకో' అంది. కూతరి ఆ మాటలు ఉపశమనం కలిగించలేదు ఆయనకి. గుండెల్లో ఇబ్బంది అనిపించింది. ఈమధ్య తరచుగా అదో బాధ ఆయనకి. రెండు మూడు రోజులు ఈ గుండె పనిచేస్తుందో లేదో అన్న దిగులు. అసలు తెల్లారాక లేస్తానా? అనుకున్నాడు ఆయన. మగత నిద్రలో ఆయనకి శనిదేవత పద ధ్వనులు వినిపించాయి అన్న మాటలతో కథ ముగుస్తుంది. అంతటి విషాదం ఆయన కథల్లో. ఈ కథలో బేటరీ దొరకాలని, ఆ రికార్డు విని తృప్తిపడాలని ప్రతీ పాఠకుడూ కోరుకుంటాడు. లలిత అలసట వెనక మంచి మనసులాగే సుబ్బరామయ్య ఈ ముగింపు వెనకాల ఆశావాదం ఉంది.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

# చదవండి...


**– మూసీ**

📖 **చంద్రభాగ - అనువాద సంకలనం - రూప్‌కుమార్ డబ్బీకార్ :** తెలంగాణ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఈ చంద్రభాగ కథా సంపుటి ఒక విలక్షణమైనది. ఈ కథలన్నీ వివిధ భాషలలో జ్ఞానపీఠ పురస్కారం పొందిన రచయితలు రాసినవే. అదే ఉద్వేగంతో మనం ఈ కథలు చదువుతూ పోతే కొంత నిరాశకు లోనవుతాం. ఎందుకంటే ఇందులో ఎక్కువ భాగం మనదేశంలో దరిద్రాన్ని, దు:ఖాన్ని నిర్వచిస్తూ పోయినవే. కొన్ని కథలు మనకు అర్థంకాని అయోమయ మ్యాజిక్ రియలిజమ్ తరహాలో ఉన్నవి. రూప్‌కుమార్ ఈ కథలు ఎంపిక చేసుకోవటంలో వారి ఉద్దేశం ఇవి జ్ఞానపీఠ గ్రహీతలు రాసినవే అని కావచ్చు. మనం ఒక కథ చదివితే ఒక ఆనందాన్ని పొందాలి. ఆ ఆనందం ఆ కథలోని విషాదంలోంచి వచ్చినా పరవాలేదు. మనల్ని భయభ్రాంతుల్ని చేయకూడదు, జుగుప్స కలిగించ కూడదు. చంద్రభాగ కథా సంపుటి అనువాదం ప్రచురణ అన్నీ కూడా ఎంతో ఉన్నతంగా ఉన్నాయి.





*పేజీలు : 178, వెల : 200, ప్రతులకు : ఫోన్ : 040-29703142*

📖 **రేపటి స్వప్నం కథలు - జన్నాభట్ల నరసింహ ప్రసాద్ :** 'మంచి కథల్లో మానవత్వం ఉంటుంది. నేడు సంఘంలో, చట్టం ముసుగులో జరుగుతున్న అరాచకాలకు చలించి రాబోయే కాలంలో జరగబోయే అనర్థాలకు ఒక రూపం ఇచ్చి రాసిన కథలివి.' అదే రేపటి స్వప్నం. ఇవి ఎక్కడా ప్రచురితం కాలేదు. దానికి కారణం కూడా చెబుతారు రచయిత. కొన్ని వర్గాల కథలే ప్రచురిస్తామని, కొన్ని భావజాల కథలే అచ్చువేస్తామని అంటుంటే అలాంటి పరిస్థితిలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, నిజాయితీ, మానవత్వం ఇలాంటి లక్షణాలన్నీ మరుగున పడిపోతాయి అంటారు రచయిత. ఈనాడు సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత ప్రాతిపదికలపై కుప్పలుతెప్పలుగా రచనలను కుమ్మరిస్తూ దేశ సమగ్రతను భంగపరుస్తున్నారని కూడా రచయిత వాపోతారు. వీటన్నింటినీ ఎదుర్కొనటమే ఈ 'రేపటి స్వప్నం.'





*పేజీలు : 86, వెల : 150/-, ప్రతులకు : జన్నాభట్ల నరసింహ ప్రసాద్, ఫోన్ : 8297263741*

📖 **ఉద్యమజీవి పుస్తకప్రాణి - జయంతి పెరుమాళ్ళు అనే మువ్వల పెరుమాళ్ళు :** ఆయన శతజయంతి, జయంతి పబ్లికేషన్స్‌కు డబ్బై వసంతాలు. ఈ సందర్భంగా ప్రచురించిన పుస్తకం 'ఉద్యమజీవి పుస్తకప్రాణి'. ఇందులో పెరుమాళ్ళు గారు వ్యక్తిగతంగా తెలిసి, వారితో కలిసి మెలిసిన వై.హెచ్.కె. మోహన్‌రావు, డా. రెంటాల జయదేవ, డా. వి. బ్రహ్మారెడ్డి, తెలగపల్లి రవి, రంగావఝుల భరద్వాజ్, శ్రీ భారతి, కొత్తపల్లి రవిబాబు, గుమ్మా సాంబశివరావు మొదలైన ఎందరో రాసిన జ్ఞాపకాలు ఈ పుస్తకం. 'కాలం క్రూరమైంది. భౌతికంగా మనుషులనే కాదు, చిరకాలపు చిహ్నాలను కనుమరుగు చేస్తుంది. మనసునిండా మిగిలిపోయిన, మాయని జ్ఞాపకాలను మాత్రం ఏమీ చెయ్యలేకపోతుంది. అందుకే బెజవాడ ఓ ఎమోషన్. ఊరుపేరు ఎత్తినా, ఏ మనిషి మాట ఎత్తినా జ్ఞాపకాల వరద మనసును ముంచెత్తుతుంది'. అలాంటి వరదే ఈ పుస్తకం.




*పేజీలు : 144, ప్రతులకు : ఫోన్ : 8978261496*

📖 **భువన విజయం - డా. జి.వి. పూర్ణచందు :** 'తెలుగువారి చరిత్రలో స్వర్ణయుగం రాయలపాలనా కాలం. కృష్ణదేవరాయలు గురించి మనం చర్చించుకునేటప్పుడు చాలా ప్రశ్నలకు సమాధానాలను మనకు దొరకవు. నిజం చెప్పాలంటే రాయల వారి నిజాలు మనకు తెలిసింది తక్కువ, కల్పిత గాథలే ఎక్కువనిపిస్తుంది' అంటారు డా. మండలి బుద్ధప్రసాద్. ఇలా ఎందుకన్నారో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలి.




'తెలుగు జాతిని భాష పరంగా ఏకం చేయగల శక్తి రాయలవారికి మాత్రమే ఉన్నదనేది నిర్వివాదం. కృష్ణదేవరాయల విగ్రహాన్ని శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో 2007లో ప్రతిష్ఠించిన తరువాత తెలుగు భాషోద్యమం పరంగా వచ్చిన తరంగాన్ని గమనించాక ఈ విషయం అనుభవ పూర్వకంగా తెలిసింది' అని కూడా అంటారు బుద్ధప్రసాద్. ఎడతెగని దండయాత్రలో భారతీయ ఏకాత్మత అనేది ఎంత విధ్వంసానికి గురయ్యిందో తెలుసుకోవాలంటే ఇలాంటి పుస్తకాలు కొన్ని చదవాలి.

పేజీలు : 184, వెల : 200/-, ప్రతులకు : ఫోన్ : 94401 72642

# మిసిమి

మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),


**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**